
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 328

శనివారం 18-2-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



విశాఖపట్నంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ కు ప్రతి ఒక్కరిని సాదరంగా ఆహ్వానిస్తున్నాను.
మా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, వ్యాపార నిర్వహణ ఎంత సులభతరమో, సరళతరమో స్వయంగా వచ్చి చూడండి..

- మీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి
శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023

మార్చి 3-4, విశాఖపట్నం..

www.advantageap.in

ఎడ్వాంటేజ్ ఆంధ్రప్రదేశ్

వనరులు విస్తారం.. అవకాశాలు అపారం...

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నెంబర్ వన్ ర్యాంక్

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరుసగా గత మూడేళ్లు దేశంలోనే మొదటి స్థానం.. స్టేక్ హోల్డర్స్ ఫీడ్ బ్యాక్ ఆధారంగా నిర్వహించిన సర్వే ద్వారా ఇది సాధించడం గమనార్హం..

రెండంకెల వృద్ధి రేటు

రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో 2021-22లో దేశంలోనే అత్యధికంగా 11.43 % వృద్ధిరేటు నమోదు..

పటిష్టమైన మారిటైమ్ మౌలిక సదుపాయాలు

974 కి.మీల తీరంతో దేశంలోనే 2వ అతిపెద్ద సముద్ర తీరం గల రాష్ట్రం.. ఇప్పటికే ఉన్న 6 పోర్టులు, రాబోయే 4 పోర్టులతో ఆగ్నేయాసియాకు ముఖ ద్వారంగా మన రాష్ట్రం..

పారిశ్రామిక అనుకూల వాతావరణం

పరిశ్రమ అనుకూల విధానాలు.. సమర్థ నాయకత్వంతో కూడిన ప్రభుత్వం.. దేశంలో రాబోతున్న 11 ఇండస్ట్రియల్ కారిడార్లలో 3 ఆంధ్రప్రదేశ్ లోనే..

అవార్డులు

- లీడ్స్ (లాజిస్టిక్స్) అవార్డు 2022
- ఎనర్షియా (విద్యుత్) అవార్డు 2022
- పోర్టులెడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్స్‌లో ఈటీ అవార్డు 2022

ఇవీ మా బలాలు

- విస్తారంగా భూమి లభ్యత
- అపారమైన ఖనిజ సంపద
- పుష్కలంగా నీటి వనరులు
- నిరంతర విద్యుత్ సరఫరా
- నైపుణ్యం కలిగిన యువత
- ఆరు విమానాశ్రయాలు
- రాబోయే 4 పోర్టులతో కలిపి మొత్తం 10 పోర్టులు..



ఏరోస్పేస్ & డిఫెన్స్	అగ్రి & ఫుడ్ ప్రాసెసింగ్	ఆటోమోటివ్ & ఎలక్ట్రికల్ వాహనాలు	ఎలక్ట్రానిక్స్ & ఐటీ	ఆరోగ్య భద్రత & వైద్య పరికరాలు	పరిశ్రమలు & లాజిస్టిక్స్ మౌలిక వసతులు	MSME లు, స్టార్టప్‌లు & నూతన ఆవిష్కరణలు	పెట్రోలియం & పెట్రో కెమికల్స్	ఫార్మాస్యూటికల్స్ & లైఫ్ సైన్సెస్	పునరుత్పాదక శక్తి	విద్య & నైపుణ్యాభివృద్ధి	వస్త్రాలు & దుస్తులు	పర్యాటకం & ఆతిథ్యం

శ్రీ గుడివాడ అమర్‌నాథ్, పరిశ్రమలు, మౌలిక వసతులు, పెట్టుబడులు, వాణిజ్యం మరియు ఐటీ శాఖా మాత్యులు

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



మహా శివరాత్రి – స్వర్ణోదయానికి శుభ సంకేతం





శివ పరమాత్ముని సత్యమైన పరిచయం

* సత్యం-శివం-సుందరం... సత్యమైన వాడు శివుడు, శివుడే సుందరుడు * జ్యోతిర్లింగ రూపంలో పూజలందుకునే పరమశివుడు నిరాకారుడు *లింగమనగా చిహ్నము. జ్యోతిర్లింగమనగా జ్యోతిబిందు స్వరూపుడైన శివపరమాత్మకు ప్రతిరూపము * సూక్ష్మాతి సూక్ష్మమైన వాడు, సర్వోన్నతుడు, సర్వశక్తి వంతుడు, దివ్య గుణ సాగరుడు, జనన మరణ రహితుడు * బ్రహ్మాది దేవతలు ఆరాధించే దేవాది దేవుడు, సృష్టి- స్థితి- లయ కారకుడయిన పరమశివుణ్ణి బ్రహ్మ మురారి సురార్చిత లింగం ... అని లింగాష్టకం లో స్తుతిస్తారు

మహా శివరాత్రి ప్రాముఖ్యత

కలియుగంలోని అజ్ఞానాంధకారాన్ని పారద్రోలి జ్ఞాన ప్రకాశాన్ని ప్రసాదించేందుకు జ్ఞాన సూర్యుడైన పరమ శివుడు ఉద్భవించడమే మహాశివరాత్రి. ఈ తరుణంలో అజ్ఞానమనే నిద్రనుండి మేల్కొనడమే జాగరణ. ఎల్లప్పుడు మనసును పరమ శివుని సాన్నిధ్యంలో నిలుపుతూ అరిషడ్వర్గాలకు దూరంగా ఉండటమే ఉపవాసం. పూజకు పనికిరాని దుర్గుణాలనే పుష్పాలను ఈశ్వరార్పణం చేస్తూ మహా శివుణ్ణి ప్రసన్నం చేసుకోవడమే స్వచ్ఛమైన అభిషేకం. ఇదే శివరాత్రిని జరుపుకోవడంలోని అంతరార్థం.





పరమశివుని దివ్యావతరణ

ఈ సృష్టి నాటకంలో వర్తమాన కలియుగాంతంలో ధర్మగ్లాని సంభవించినప్పుడు అనగా మానవులు ధర్మ భ్రష్టులు, కర్మ భ్రష్టులు అయినపుడు పతిత పావనుడు, సర్వుల సద్గతిదాత, ముక్తి-జీవన్ముక్తి ప్రదాత, దుఃఖహర్త-సుఖకర్త, నిరాకార జ్యోతిబిందు స్వరూపుడైన పరమపిత శివపరమాత్మ ఒక సాధారణ వృద్ధ మానవ తనువు మాధ్యమంగా అవతరించారు. (గీత : 9.11) పాపప్రక్షాళనకై జ్ఞానయోగముల ద్వారా పునః ధర్మస్థాపన చేస్తున్నారు. కనుక పరమాత్మ దివ్య అవతరణను గుర్తించి వారు సూచించే సన్మార్గం లో నడుచుకొని పాపప్రక్షాళన చేసుకోవడం మానవాళి తక్షణ కర్తవ్యం.



రాజయోగము - విశిష్టత

" ఓంకార బిందు సంయుక్తం నిత్యం ధ్యాయంతి యోగినః" * మనసు, బుద్ధి ద్వారా పరమాత్మతో అనుసంధానం కావడమే రాజయోగం * నిత్యజీవితంలో ఈ యోగసాధనతో దుఃఖం, అశాంతి తొలగిపోయి కర్మేంద్రియాలపై, మనసు బుద్ధిపై నియంత్రణ సాధించవచ్చు. ఫలితంగా బలహీనతలను, వ్యసనాలను, వికారాలను అధిగమించగలరు * ఏకాగ్రత, మనోబలంతో ప్రశాంత జీవితం ప్రాప్తిస్తుంది * మానసిక ఒత్తిడి, శారీరక రుగ్మతల నుండి ఉపశమనం కలుగుతుంది.



అంతర్జాతీయ ముఖ్యాలయం - మౌంట్ ఆబూ, రాజస్థాన్


ప్రపంచ వ్యాప్త శాఖలు
మరియు ఇతర వివరాల కొరకు
www.brahmakumaris.com

ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయము

ఇది ఒక విశ్వవ్యాప్త ఆధ్యాత్మికసంస్థ. 140 దేశాలలో 5000కు పైగా శాఖలతో జ్ఞానయోగములలో ఉచిత శిక్షణనిస్తుంది. ఈ శిక్షణ ద్వారా దైనందిన జీవితంలోని వివిధ సమస్యలకు సహజమైన పరిష్కారాలు గోచరిస్తాయి. అందరు ఒకే పరమాత్మ సంతానమనీ, విశ్వమానవ సోదరభావనతో వసుధైక కుటుంబ స్థాపనకై, సనాతన ధర్మ పునః స్థాపనకై కృషి చేస్తోంది.

మీ దగ్గరలోని సేవా కేంద్రాల కొరకు మరియు ఇతర వివరాలకు క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు

గచ్చిబౌలి-9396503335; వెస్ట్ మారేడ్‌పల్లి-7207066700; మోండా మార్కెట్-9000690279; ఏ.ఎస్.రావు నగర్-7981701416; హిమాయత్ నగర్-8000895895; మోహిదీపట్నం-9396523507; మలక్ పేట-9396523404; ఎస్.ఆర్.నగర్-040-23706937


'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 328

శనివారం 18-2-2023


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



చేతన్ శర్మ రాజీనామా
బీసీసీఐకి విరుద్ధంగా వ్యవహరించి మూల్యం చెల్లించుకున్న చీఫ్ సెలక్టర్. -15లో



యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్
వీడియో షేరింగ్ ప్లాట్‌ఫాంకు సీఈవోగా నీల్ మోహన్ నియమితులయ్యారు. -15లో



'స్టాక్ మార్కెట్ల'పై సుప్రీం కమిటీ
స్టాక్ మార్కెట్లపై నిపుణుల కమిటీ ఏర్పాటుపై కేంద్రం చేసిన సూచనలను సీల్డ్ కవర్‌లో స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.
- వివరాలు 6లో▶



450 మందికి గూగుల్ ఉద్వాసన
టెక్ దిగ్గజం గూగుల్‌లో కూడా లే ఆఫ్‌ల పర్వం మొదలైంది. భారత్‌లో ఒకేసారి 450 మందిని ఇంటికి పంపించింది.
- వివరాలు 6లో▶


బీబీసీలో అవకతవకలు జరిగాయ్
బీబీసీ గ్రూప్‌లో ఆదాయ పన్ను శాఖ జరిపిన సర్వేలో కీలకమైన ఆధారాలు లభించాయని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు వెల్లడించింది.
- వివరాలు 6లో▶



'నామినేటెడ్'కు ఓటు హక్కు లేదు
ఎంసీడీ మేయర్ ఎన్నికలో నామినేటెడ్ సభ్యులకు ఓటు వేసే హక్కు లేదని సుప్రీం కోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది.
- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

ఏరోస్పేస్ రంగంలో స్టార్టప్‌లకు ఊతం
ఏరోస్పేస్ రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు హెచ్ఏఎల్‌తో కలిసి టీ–హబ్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ మేరకు ఇరు సంస్థల మధ్య శుక్రవారం పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది.
- వివరాలు 16లో▶

కృష్ణా జలాల వినియోగం లెక్కలు తేల్చాల్సిందే!

ప్రస్తుత సంవత్సరం ఏపీ, తెలంగాణ వినియోగించిన కృష్ణా జలాల లెక్కలను పక్కాగా తేల్చాలని తెలంగాణ ఈఎన్‌సీ సి.మురళీధర్ స్పష్టం చేశారు. వచ్చే నెల మొదటి వారంలో మళ్లీ కమిటీ సమావేశం నిర్వహించనున్నారు.
- వివరాలు 2లో▶

పోలీసు ఉద్యోగాల భర్తీలో గర్భిణులకు మరో అవకాశం

పోలీసు ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా దేహదారుఢ్య పరీక్షల నుంచి మినహాయింపు కోసం గర్భిణులు, బాలింతలు రాతపూర్వక అండర్ టేకింగ్ పత్రాన్ని సమర్పించే గడువును ఈనెల 28 వరకు పెంచారు.
- వివరాలు 16లో▶

ఇంటరాగేషన్‌లో గాయాలు.. వ్యక్తి మృతి

చైన్ స్నాచింగ్ అనుమానంతో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఇంటరాగేషన్‌లో చిత్రహింసలు పెట్టారు. దెబ్బల ధాటికి ఆ వ్యక్తి కిడ్నీలు దెబ్బతిని, తీవ్రంగా అనారోగ్యానికి గురై.. ఆస్పత్రిలో మృతిచెందాడు.
- వివరాలు 10లో▶

ఆ కరెంటుతో షాకే..
దిగుమతి చేసిన బొగ్గు, గ్యాస్ ఆధారిత విద్యుత్ కొంటే డిస్కంలపై భారం

- యూనిట్‌కు గరిష్ట ధర రూ.12 నుంచి రూ.50 పెంపు
- ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజీకి కేంద్ర ఈఆర్సీ అనుమతి
- పునరుత్పాదక, థర్మల్ తర్వాత మూడో ఆప్షన్‌గా 'దిగుమతి' విద్యుత్ విక్రయాలు.. దీని కోసం హైప్రైస్ సెగ్మెంట్ ఏర్పాటు
- వేసవి డిమాండ్‌తో ఇప్పటికే మొదలైన విద్యుత్ కొరత
- ఎక్స్ఛేంజీల నుంచి కొనుగోళ్లకు డిస్కంల పోటీతో కరెంటు ధరలు గరిష్టాలకు చేరే చాన్స్



సాక్షి, హైదరాబాద్: ఎండాకాలం మొదలవుతూనే విద్యుత్ డిస్కంలకు మరో షాక్ తగిలింది. ఇప్పటికే పెరుగుతున్న డిమాండ్ ఓవైపు, అవసరానికి తగినంత సరఫరా చేయలేక మరోవైపు కిందా మీదా పడుతున్న డిస్కంలపై విద్యుత్ కొనుగోళ్ల భారం మీద పడుతోంది. 'దిగుమతి చేసిన బొగ్గు, గ్యాస్ ఆధారిత ప్లాంట్ల' విద్యుత్‌ను గరిష్టంగా యూనిట్‌కు రూ.50 ధరతో అమ్ముకోడానికి ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజీ (ఐఈఎక్స్)కు కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సీఈఆర్సీ) అనుమతి ఇవ్వడమే దీనికి కారణం. ఈ అంశంలో ఐఈఎక్స్ వేసిన పిటిషన్‌పై సీఈఆర్సీ శుక్రవారం తీర్పు ఇచ్చింది. దీని ప్రభావంతో ఈ వేసవిలో విద్యుత్ ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని.. ఎక్కువగా విద్యుత్ కొనుగోలు చేసే రాష్ట్రాలపై భారం పడుతుందని విద్యుత్ రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిమితితో నష్టాల పేరిట..

గతేడాది వేసవిలో దేశవ్యాప్తంగా విద్యుత్‌కు డిమాండ్ భారీగా పెరిగింది. సరిపడా అందుబాటులో లేక తీవ్ర కొరత ఏర్పడింది. ఎనర్జీ ఎక్స్ఛేంజీల్లో విద్యుత్ ధర యూనిట్‌కు రూ.20కు మించి పోయాయి. అత్యధిక ధరతో కొనుగోళ్లతో విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. దీంతో రంగంలోకి దిగిన సీఈఆర్సీ.. విద్యుత్ ధర యూనిట్‌కు రూ.12 మించరాదని పరిమితి విధిస్తూ 2022 మే 6న సుమోటోగా ఆదేశాలు జారీ చేసింది. అయితే దిగుమతి చేసుకున్న బొగ్గు, గ్యాస్ ఆధారిత ప్లాంట్ల విద్యుత్ ధరలు సాధారణంగానే ఇంతకన్నా అధికంగా ఉంటాయి. పరిమితి కారణంగా అవి ఎనర్జీ ఎక్స్ఛేంజీల్లో విద్యుత్ విక్రయించలేక నష్టపోతున్నట్టు కేంద్రం

మిగతా 2వ పేజీలో ▶

గత ఏడాది వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరిగిఎక్స్ఛేంజీల్లో విద్యుత్ ధరలు భారీగా పెరిగిపోయాయి. అయినా యాసంగి కోసం రైతులకు, ఇతర వినియోగదారులకు సరఫరా సాగించడానికి తెలంగాణ డిస్కంలు రోజుకు రూ.100 కోట్ల నుంచి రూ.165 కోట్లు ఖర్చుచేసి ఎనర్జీ ఎక్స్ఛేంజీల నుంచి విద్యుత్ కొనుగోలు

'కొనే' రాష్ట్రాలకు భారమే

చేశాయి. పలు ఇతర రాష్ట్రాలూ అత్యధిక ధరతో విద్యుత్ కొన్నాయి. ఇప్పుడు 'దిగుమతి' ప్లాంట్ల విద్యుత్‌ను యూనిట్‌కు రూ.50 వరకు అమ్ముకునే అవకాశం రావడంతో.. ప్రస్తుత వేసవిలో విద్యుత్ కొనుగోళ్ల భారం పెరిగిపోతుందని నిపుణులు చెప్తున్నారు. దేశంలో 17,600 మెగావాట్ల మేర 'దిగుమతి' ఆధారిత ప్లాంట్లు ఉన్నాయని.. వాటి విద్యుత్ ధరలు అమాంతం పెరిగిపోనున్నాయని చెప్తున్నారు. విద్యుత్‌ను ఎక్కువగా కొనే రాష్ట్రాలపై భారం పడుతుందని వివరిస్తున్నారు.



శివోహం శివోహం
విద్యుత్ దీపాల వెలుగులో తళుకులీనుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం. శుక్రవారం మహాశివరాత్రి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. -3లో

కాంగ్రెస్‌లో మరో 'యాత్ర'!



- మార్చి తొలివారంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రకు సిద్ధమవుతున్న సీఎల్పీ నేత భట్టి
- బాసరలో ప్రారంభం.. ఖమ్మంలో ముగింపు.. 35 నియోజకవర్గాల్లో కొనసాగింపు!
- షెడ్యూల్‌పై సీఎల్పీ కార్యాలయంలో భట్టి, ఏలేటి, ప్రేమ్‌సాగర్‌రావు కసరత్తు
- రాయ్‌పూర్ ప్లీనరీ తర్వాత ప్రారంభించే యోచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్‌లో మరో పాదయాత్రకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో హాథ్‌సే హాథ్‌జోడో యాత్ర సాగుతుండగా.. వచ్చే నెల తొలివారంలో అదే పేరుతో యాత్ర చేపట్టేందుకు కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) నేత మల్లు భట్టి విక్రమార్క ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర నుంచి మొదలుపెట్టి.. రోజుకో నియోజకవర్గం చొప్పున మొత్తం 35 నియోజకవర్గాల మీదుగా పాదయాత్ర కొనసాగేలా రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. ఈ మేరకు శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో భట్టి, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు తదితరులు భేటీ అయి యాత్ర షెడ్యూల్‌పై కసరత్తు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలతోపాటు కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల మీదుగా యాత్ర కొనసాగించి ఖమ్మంలో ముగింపు సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ షెడ్యూల్ మేరకు నియోజకవర్గాల నేతలకు సమాచారం అందించారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని

మిగతా 12వ పేజీలో ▶

ఎన్జీటీ విధించిన జరిమానాపై స్టే
'పాలమూరు–రంగారెడ్డి'పై సుప్రీంకోర్టు ఆదేశం..
తాగునీటి అవసరాలకే అనుమతిస్తున్నట్లు వెల్లడి..

- 90 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మిస్తోందంటూ ఏపీ అభ్యంతరం
- వాస్తవాల్లోకి వెళ్లాలని కోరిన ఏపీ తరఫు న్యాయవాది
- విచారణను ఆగస్టుకి వాయిదా వేసిన ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వానికి ఎన్జీటీ విధించిన జరిమానాపై సుప్రీంకోర్టు స్టే విధించింది. తాగునీటికి సంబంధించి 7.15 టీఎంసీల పనులకు అనుమతిస్తున్నట్లు స్పష్టం చేసింది. ధర్మాసనం ఆదేశాలకు ఏపీ ప్రభుత్వం అభ్యంతరం తెలుపుతూ తెలంగాణ ప్రభుత్వం 90 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మిస్తోందని పర్యావరణ అనుమతుల్లేవని ఆరోపించింది. అనంతరం ధర్మాసనం తదుపరి విచారణ ఆగస్టుకు వాయిదా వేసింది.

→ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో ఎన్జీటీ విధించిన భారీ జరిమానాను

మిగతా 2వ పేజీలో ▶


శుక్రవారం హైదరాబాద్‌లోని పీవీ మార్గ్‌లోని థ్రిల్ సిటీలో సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న కేకే, గంగుల కమలాకర్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మహమూద్ అలీ - 12లో


గజ్వేల్‌లో కేసీఆర్ సైకత శిల్పం వద్ద కొత్త ప్రభాకర్‌రెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డిలతో కలిసి సెల్ఫీ దిగుతున్న మంత్రి హరీశ్‌రావు

సీబీఐ ఎలా దర్యాప్తు చేస్తుంది?

- బీజేపీపై ఆరోపణలుంటే అది సాధ్యమేనా?
- తెలంగాణ ఎమ్మెల్యేలకు ఎర కేసులో పోలీసుల తరఫు సీనియర్ న్యాయవాది దవే ప్రశ్న
- సీబీఐను కేంద్రం నియంత్రిస్తోందన్న దవే
- ఈ కేసులో సీఎంనూ నిందించాల్సిన అవసరం ఉందన్న బీజేపీ తరఫు న్యాయవాది జెఠ్మలానీ
- తదుపరి విచారణ ఈ నెల 27కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ఎమ్మెల్యేలకు ఎర కేసులో బీజేపీపై ఆరోపణలు ఉన్న నేపథ్యంలో సీబీఐ దర్యాప్తు ఎలా చేస్తుందని రాష్ట్ర పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే ప్రశ్నించారు. సీబీఐకి కేసు బదిలీ చేయడం వల్ల న్యాయం లభించదని పేర్కొన్నారు. సీబీఐను కేంద్రం నియంత్రిస్తోందని దవే ఆరోపించారు. తెలంగాణ ఎమ్మెల్యేలకు ఎర కేసులో రాష్ట్ర పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. తొలుత దుష్యంత్ దవే వాదనలు వినిపిస్తూ.. గురువారం రాత్రి 9 గంటల సమయంలో జాబితాలో కేసు చేర్చారని, న్యాయమూర్తులు చదివారో లేదోనని గుర్తుచేశారు. పిటిషన్ చదవలేకపోయామని ధర్మాసనం పేర్కొనగా... విచారణ శుక్రవారానికి వాయిదా వేయాలని కోరిన దవే పది రోజుల క్రితమే జాబితాలో చేర్చాలని సీజేఐ చెప్పినప్పటికీ రిజిస్ట్రీ రాత్రి వరకూ జాబితాలో చేర్చకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుని గతంలో నమోదు చేసిన పిటిషన్లపై

మిగతా 3వ పేజీలో ▶

కేంద్రం అనుమతికి లోబడే అప్పులు..


- సంపద పెంచేందుకే ఈ రుణాలు వినియోగించాం
- మీలాగా రోజువారీ ఖర్చులకు వాడట్లేదు
- ఫైవ్ ట్రిలియన్ ఎకానమీపై కేసీఆర్ వ్యాఖ్యల్లో తప్పేముంది?
- నిర్మలాసీతారామన్‌పై రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్ ఆగ్రహం - 2లో

షిండే వర్గానిదే శివసేన



- మహారాష్ట్రలో అధికార శివసేన పార్టీలో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి పెద్ద షాక్ తగిలింది. శివసేన పేరు, పార్టీ ఎన్నికల గుర్తు 'విల్లు, బాణం' మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గానికే చెందుతాయని ఎన్నికల సంఘం శుక్రవారం తేల్చి చెప్పింది. ఈ మేరకు త్రిసభ్య కమిషన్ ఏకగ్రీవంగా 78 పేజీల ఉత్తర్వు జారీ చేసింది. శివసేనను షిండే వర్గానికి కట్టబెడుతూ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటికలు మోగిస్తుందని ఉద్ధవ్ ఠాక్రే ఆందోళన వ్యక్తం చేశారు. తమ విల్లు, బాణం గుర్తును షిండే వర్గం కాజేసిందని, దీనిపై ప్రజలు కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటారని అన్నారు. - 6లో

ఇదండీ సంగతి



మీకు సరిగ్గా సరిపోయే ఫోన్ తప్పకుండా తీసుకోవాలి సార్!

క్లుప్తంగా...

హర్షవర్ధన్‌రెడ్డికి కాంగ్రెస్ మద్దతు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని టీపీసీసీ పిలుపు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గానికి జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ సంఘం నాయకుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. పార్టీ సీనియర్ నేతలతో చర్చించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని, మూడు జిల్లాల్లోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షవర్ధన్‌రెడ్డి విజయం కోసం సమష్టిగా కృషి చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ శుక్రవారం ప్రకటించారు. గత 20 ఏళ్లుగా ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డికి ఉపాధ్యాయులందరూ ఓటేసి గెలిపించాలని కోరారు. కాగా, తనకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించడం పట్ల హర్షవర్ధన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్న టీపీసీసీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రెండో రోజు 2 నామినేషన్లు

టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి..

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి రెండో రోజైన శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులుగా డి.మల్లారెడ్డి, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం నామినేషన్ వేసిన గుర్రం చెన్నకేశవరెడ్డి శుక్రవారం మరో నామినేషన్ దాఖలు చేశారు. హైదరాబాద్ స్థానిక సంస్థలకు రెండో రోజు కూడా ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రియాంక తెలిపారు.

నేడు, రేపు నామినేషన్లు స్వీకరించరు

శని, ఆదివారాలు ప్రభుత్వ సెలవు దినాలైనందున మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి, హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గానికి ఎన్నికల నామినేషన్లు స్వీకరించరని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచన మేరకు సెలవు దినాల్లో వాటిని స్వీకరించడం లేదని పేర్కొన్నారు.

వామపక్షాలు కలిస్తే నిర్ణయాధికారం వాటిదే

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సాక్షి, హైదరాబాద్: సీపీఐ, సీపీఎంలు కలిస్తే.. రాష్ట్రంలో ఎవరు అధికారంలోకి రావాలో, ఎవరు రాకూడదో తమ రెండు పార్టీలు నిర్ణయించగలవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చెప్పారు. ఎన్నికల్లో పొత్తుపై ఇప్పటివరకు బీఆర్‌ఎస్‌తో ఎలాంటి చర్చలూ జరగలేదని స్పష్టం చేశారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. అనంతరం పార్టీ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, పశ్యపద్మ తదితరులతో కలిసి కూనంనేని విలేకరులతో మాట్లాడారు. తమ అవసరం ఉంటే బీఆర్‌ఎస్ వస్తుందని, లేదంటే ఎవరి దారి వారిదేనని ఆయన స్పష్టం చేశారు. పార్టీ ప్రభావం సింగరేణి ప్రాంతంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పూర్తిగా, కరీంనగర్, నల్లగొండలో సగం నియోజకవర్గాల్లో, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో కూడా ఉందన్నారు. సీపీఐ, సీపీఎంలు రెండూ కలిసే ప్రజా సమస్యలపై పోరాడాలని నిర్ణయించుకున్నామన్నారు. పోడుభూముల అంశంలో నాలుగు జెండాలు వేసుకుని వస్తారని సీఎం వ్యాఖ్యానించడాన్ని ప్రస్తావిస్తూ.. ఆ జెండాల వల్లే విషయం బయటికి వచ్చిందని కూనంనేని స్పష్టం చేశారు.

మార్గదర్శి కేసు త్వరగా విచారించండి

సుప్రీంకోర్టును కోరిన రామోజీరావు తరఫు న్యాయవాది

సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి కేసు త్వరగా విచారించాలని ఈనాడు మీడియా గ్రూప్ అధినేత రామోజీరావు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా సుప్రీంకోర్టును కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ అరవింద కుమార్ ధర్మాసనం ముందు ప్రస్తావించారు. అనంతరం, ఏప్రిల్ 11న జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

ఎస్టీ రిజర్వేషన్లపై హైకోర్టును ఆశ్రయించండి

పిటిషనర్లకు సూచించిన సుప్రీంకోర్టు


సాక్షి, న్యూఢిల్లీ: ఎస్టీ రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవోపై రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సుప్రీం సూచించింది. ఎస్టీ రిజర్వేషన్ల పెంపు జీవో వల్ల ఆదివాసీలకు నష్టంకలుగుతుందంటూ కోడెపాక రోహిత్, ఆధార్ సొసైటీలు దాఖలు చేసిన పిటిషన్లను శుక్రవారం జస్టిస్ విక్రమ్‌నాథ్ జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు రంజిత్‌కుమార్, ఎంఎస్ రావు, న్యాయవాది అల్లంకి రమేశ్‌లు వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో రాజ్యాంగ విరుద్ధమని, ఆ జీవోను కొట్టివేయాలని కోరారు. ఈ అంశంపై తెలంగాణ హైకోర్టునే ఆశ్రయించాలని ధర్మాసనం సూచించింది. ధర్మాసనం సూచన మేరకు పిటిషనర్లు వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు.

బాంబులను పసిగట్టి.. నేరగాళ్ల పనిపట్టి...

చిటికెలో జాడ పట్టేయగల నేర్పు పోలీసు జాగిలాల సొంతం

సాక్షి, హైదరాబాద్

పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలు, నేరగాళ్ల జాడలను చిటికెలో పట్టేస్తాయి... కదులుతున్న వాహనాల్లోంచి సైతం దూకి 'టార్గెట్'ను అడ్డుకుంటాయి... శిక్షకుడి కమాండ్స్‌ను స్పష్టంగా అర్థం చేసుకోవడంతోపాటు తూ.చ. తప్పకుండా పాటిస్తాయి... ఎన్నిసార్లు మొరగమంటే అన్నిసార్లే మొరుగుతాయి... ఇదీ మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ (ఐఐటీఏ)లో శిక్షణ పొందిన పోలీసు జాగిలాల సామర్థ్యం. ఎనిమిది నెలల సుదీర్ఘ శిక్షణ అనంతరం ఐదు జాతులకు చెందిన 48 జాగిలాలు, 64 మంది శిక్షకుల 22వ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్ తాజాగా ఐఐటీఏలో జరిగింది. వీటిలో 36 జాగిలాలు రాష్ట్ర పోలీసు విభాగానికి చెందినవి కాగా మిగిలిన 12 అరుణాచల్‌ప్రదేశ్‌వి. ఈ నేపథ్యంలో పోలీసు జాగిలాలపై ప్రత్యేక కథనం.



శిక్షకుడి మాటే వేదవాక్కు.. అపరిచితులు ఆహారం పెట్టినా ముట్టవు

ఐఐటీఏలో తాజాగా 8 నెలల శిక్షణ ముగించుకున్న 48 జాగిలాలు



సగం సమయం మచ్చిక కోసమే...

ప్రతి పోలీసు జాగిలానికీ ఇద్దరు వరకు హ్యాండ్లర్స్ ఉంటారు. జాగిలాన్ని ఎంపిక చేసుకున్నప్పుడే వీరినీ ఎంపిక చేస్తారు. జాగిలంతో కలిపే వీరికి సైతం శిక్షణ ఉంటుంది. మొత్తం 8 నెలల శిక్షణా కాలంలో 2 నెలలు హ్యాండ్లర్‌కు జాగిలానికీ మధ్య సఖ్యత కలిపించడానికి, మరో 2 నెలలు జాగిలాన్ని హ్యాండ్లర్ మచ్చిక చేసుకోవడానికి కేటాయిస్తారు. మిగిలిన నాలుగు నెలల్లోనే వివిధ రకాల శిక్షణ ఇస్తారు.

శిక్షణలో 4 రకాలు..

లాబ్రడార్, జర్మన్ షెపర్డ్, బెల్జియం మలినాయిస్, బీగల్, గోల్డెన్ రిట్రీవర్, డాబర్‌మ్యాన్, కోకోర్ స్పానియల్ జాతి శునకాల్లోని సహజ లక్షణాలు, పనితీరు, సమకాలీన అవసరాలను పరిగణనలోకి తీసుకొని నాలుగు విభాగాల్లో శిక్షణ ఇస్తుంటారు. ఒక రకమైన సేవలకు తర్ఫీదు పొందిన జాగిలం మరో పనికి ఉపకరించదు. పేలుడు పదార్థాలు/అనుమానిత వస్తువుల గుర్తింపు, నేర పరిశోధన, మాదకద్రవ్యాల గుర్తింపు, ముష్కరులపై దాడి చేసే సామర్థ్యంలో 4 నెలలపాటు శిక్షణ 48 జాగిలాలకు సాగింది.

జాతీయ భాషలోనే కమాండ్స్...

జాగిలాలకు ఇచ్చే కమాండ్స్‌లో 95 శాతం హిందీలోనే ఉంటాయి. కేవలం రెండు మాత్రం ఆంగ్లంలో ఉంటాయి. ఎదుటి వారికి నమస్కరించడానికి 'సెల్యూట్', పడుకొని గుండ్రంగా దొర్లడానికి 'రోల్' పదాలు వినియోగిస్తారు. వీటితోపాటు అరుదుగా మాత్రమే సిట్, కమ్, స్టాండ్ వంటి ఆంగ్ల పదాలు వాడుతున్నారు.

3 అక్షరాలకు మించవు...

ఈ జాగిలాలకు పెట్టే పేర్లు, హ్యాండ్లర్లు ఇచ్చే ఆదేశాలు (కమాండ్స్/కాషన్స్) గరిష్ఠంగా మూడు అక్షరాలకు మించకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. వీటిలో అత్యధికం రెండు అక్షరాలతో కూడినవే ఉంటాయి. జాగిలం గందరగోళానికి గురికాకుండా ఉండేందుకు, తక్కువ సమయంలో ఆదేశం పూర్తి చేయడానికి ఈ ప్రమాణాలను నిర్దేశించుకున్నారు.

మరికొన్ని ప్రత్యేకతలు...

- ఈ జాగిలాలు నిత్యం ఇష్టంగా తినే ఆహారాన్ని సైతం ఎవరు పడితే వాళ్లు పెడితే ముట్టవు. కేవలం హ్యాండ్లర్ లేదా మాస్టర్ ఇస్తేనే స్వీకరిస్తాయి. విషప్రయోగాలకు ఆస్కారం లేకుండా ఈ శిక్షణ ఇస్తారు.
- చైనా, పాకిస్తాన్ తదితర దేశాల పటాల మధ్య ఉన్న ఇండియా మ్యాప్‌ను స్పష్టంగా గుర్తించడంతోపాటు రెండు కాళ్లు పైకెత్తి నమస్కరిస్తాయి. వాటి జ్ఞాపక, సంగ్రహణ శక్తులకు ఉదాహరణ ఇది.
- పాకిస్తాన్ లోని అబోటాబాద్‌లో అల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ ఆచూకీ కనుగొనడంలో అమెరికా నేవీ సీల్స్‌కు దోహదపడ్డ బెల్జియం మలినాయిస్ జాతి జాగిలాలు రాష్ట్ర పోలీసు విభాగంలోనూ ఉన్నాయి. 2015 నుంచి అందుబాటులోకి వచ్చిన వీటిని మాదకద్రవ్యాలను గుర్తించేందుకు శిక్షణ ఇచ్చి, వినియోగిస్తున్నారు.
- మాదకద్రవ్యాలను పసిగట్టేందుకు బీగల్ జాతి జాగిలాలను అందుబాటులోకి తీసుకువచ్చిన తొలి పోలీసు విభాగంగా తెలంగాణ రికార్డులకెక్కింది.
- ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపా విభాగమైన ఆక్టోపస్‌లో 2015 నుంచి బెల్జియం మలినాయిస్ జాగిలాలను వాడుతున్నారు.



కేంద్రం అనుమతికి లోబడే అప్పులు

- సంపద పెంచేందుకే ఈ రుణాలు వినియోగించాం
- మీలాగా రోజువారీ ఖర్చులకు వాడటం లేదు
- ఫైవ్ ట్రిలియన్ ఎకానమీపై కేసీఆర్ వ్యాఖ్యల్లో తప్పేముంది?
- నిర్మలాసీతారామన్‌పై రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్ ఆగ్రహం



గజ్వేల్: కేంద్రం అనుమతులకు లోబడి మాత్రమే తెలంగాణ అప్పులు తీసుకుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఆ రుణాలతో రాష్ట్రంలో సంపదను పెంచేందుకు ఉపయోగించామని కేంద్రం మాదిరిగా రోజువారీ ఖర్చులకు వాడటం లేదని ఆయన వ్యాఖ్యానించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగిన ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మంత్రి హరీశ్ విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ తెలంగాణ అప్పులపై చేసిన వ్యాఖ్యల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకుంటున్న అప్పుల్లో 48.7శాతం రెవెన్యూ ఎక్స్‌పెండేచర్ కోసం ఖర్చు పెడుతోందని, తెలంగాణ మాత్రం కాపిటల్ ఎక్స్‌పెండేచర్ చేస్తూ భారీ ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతోందని వివరించారు. దీని ద్వారా భావితరాలకు అద్భుతమైన సంపద సృష్టించగలిగామని చెప్పారు.

మీ రూ.100 లక్షల కోట్ల అప్పుల మాటేమిటి?

తెలంగాణ చేసిన అప్పుల గురించి మాట్లాడిన నిర్మలా సీతారామన్ కేంద్రం చేసిన రూ.100 లక్షల కోట్ల రుణాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అతి తక్కువ అప్పులు చేసిన రాష్ట్రాల్లో కింది నుంచి తెలంగాణ ఆరోస్థానంలో ఉందన్నారు. ఫైవ్ ట్రిలియన్ ఎకానమీ మీద కేసీఆర్ జోకులు వేశారని వ్యంగ్యంగా మాట్లాడటం సరికాదన్నారు. 2024–25నాటికి ఫైవ్ ట్రిలియన్ ఎకానమీ సాధిస్తామని ప్రధాని చెప్పగా, ఇప్పటివరకు సాధించింది.. కేవలం 3.3 మాత్రమేనని, మిగిలిన ఏడాదిలో ఈ లక్ష్యాన్ని ఎలా చేరుకోగలుగుతారని అడగటం కామెడీ ఎలా అవుతుందని ప్రశ్నించారు. నిర్మలాసీతారామన్‌కు తెలంగాణపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన రూ.1.25లక్షల కోట్ల నిధులను ఇప్పించాలని, వివిధ కారణాలను సాకుగా చూపి బడ్జెట్‌లో కోత పెట్టిన రూ. 38వేల కోట్లు కూడా వచ్చేలా చూడాలని హరీశ్ డిమాండ్ చేశారు. సమావేశంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, సిద్దిపేట జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు పాల్గొన్నారు.

మోదీ గారూ.. అబద్ధాలపై.. మీ మంత్రులకు శిక్షణ ఇవ్వండి

- మంత్రి కేటీఆర్ ఎద్దేవా
- మెడికల్ కాలేజీలపై తలోమాట అని విమర్శలు



సాక్షి, హైదరాబాద్: కేంద్రం తెలంగాణకు కొత్తగా తొమ్మిది మెడికల్ కాలేజీలు మంజూరు చేసిందంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేసిన ప్రకటనపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'తెలంగాణలోని మెడికల్ కాలేజీలపై ముగ్గురు కేంద్ర మంత్రులు మూడు రకాలుగా మాట్లాడుతున్నారు. తొమ్మిది మెడికల్ కాలేజీలు మంజూరు చేశామని కిషన్‌రెడ్డి, అసలు ప్రతిపాదనలే రాలేదని మన్సుఖ్ మాండవీయ, రెండు ప్రతిపాదనలు అందాయని నిర్మలా సీతారామన్ చెప్తున్నారు. అబద్ధాలు చెపుతున్న వజ్రాల్లో మన తెలంగాణ నుంచి కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి కూడా ఉన్నారు. మోదీ గారూ.. మీ మంత్రులకు ఒకేరకమైన అబద్ధాలు చెప్పడం, ఒకే విధంగా పక్కదారి పట్టించేలా శిక్షణ ఇవ్వండి' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'కిషన్‌రెడ్డి తెలంగాణలో అసలు లేనటువంటి 9 మెడికల్ కాలేజీలను, హైదరాబాద్‌లో గ్లోబల్ సెంటర్ ఆఫ్ ట్రెడిషనల్ మెడిసిన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కల్పితాలు చెప్తున్నారు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

నా కొడుకు సూపర్.. హిమాన్షుపై కేటీఆర్ ప్రశంసలు

మంత్రి కేటీఆర్ తనయుడు హిమాన్షు 'గోల్డెన్ అవర్' పేరిట పాడిన ఓ కవర్ సాంగ్‌ను ట్విట్టర్‌లో షేర్ చేశారు. 2.40 నిముషాల నిడివితో ఉన్న ఈ వీడియో సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. 'ఈ పాటను నేను చాలా ఇష్టపడుతున్నా.. మీరు కూడా చూస్తారని ఆశిస్తున్నా' అని హిమాన్షు సాంగ్ వీడియో లింక్‌ను కేటీఆర్ షేర్ చేశారు.

తన తాతయ్య కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ట్విట్టర్లో తన అనుబంధాన్ని పంచుకున్నారు హిమాన్షు. తనకు అత్యంత ప్రియమిత్రుడు, స్ఫూర్తిప్రదాత అని చెబుతూ.. సామాజిక, నైతిక విలువలను నేర్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు.



ఎన్జీటీ విధించిన జరిమానాపై స్టే

విభేదించిన ఏపీ తరఫు న్యాయవాది

▶ మొదటి పేజీ తరువాయి

సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ.. ఎన్జీటీ ఆదేశాలతో రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతోందన్నారు. కేవలం తాగునీటి కోసమే ప్రాజెక్టు అని ఎలా చెబుతారు..? ఉత్తర్వుల్లో రెండు రకాల ప్రయోజనాలు అని ఉందిగా అని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రాజెక్టు తాగు, సాగునీటి విభాగాలకనీ, రెండింటికీ వేర్వేరుగా నిధులు కేటాయింపులు ఉన్నాయని రోహత్గి తెలిపారు. 2050 నాటి అవసరాల మేరకు ప్రాజెక్టు చేపడుతున్నామన్నారు. తాగునీటి నిమిత్తం ఐదు రిజర్వాయర్లు నిర్మిస్తున్నామని దీంట్లో మొదటి రిజర్వాయరు 24వేల ఎకరాలని ఇది రాష్ట్రపతి భవనం కన్నా వెయ్యి రెట్లు పెద్దదని రోహత్గి తెలిపారు. వంద నుంచి రెండు వందల అడుగుల లోతుగా నిర్మిస్తున్న నిర్మాణాలు హఠాత్తుగా నిలిపివేయాలని ఎన్జీటీ ఆదేశించిందన్నారు. ప్రాజెక్టు పనులు సురక్షిత స్థాయికి తీసుకొచ్చి నిలిపివేయడానికే రూ.కోట్లలో ఖర్చయిందన్నారు. ఈలోగా ఆదేశాలు ఉల్లంఘించారంటూ ఎన్జీటీ భారీగా జరిమానా విధించిందని రోహత్గి తెలిపారు. తెలంగాణలో నిర్మిస్తున్న ప్రాజెక్టు వల్ల ఏపీలోని రాయలసీమ పర్యావరణంపై ప్రభావం ఎలా పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం తరఫు మరో సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ ప్రశ్నించారు. తెలంగాణ వారెవరూ ప్రాజెక్టును వ్యతిరేకించలేదని, ఏపీ వారే వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు, పర్యావరణ అనుమతుల్లేవంటూ ఏపీ ప్రభుత్వం అంతర్రాష్ట్ర జల వివాదాలు లేపాలని యోచిస్తోందన్నారు.

న్యాయస్థానం వాస్తవాల్లోకి వెళ్లాలని వినతి

తెలంగాణ న్యాయవాదుల వాదనలతో ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా విభేదించారు. రెండు రాష్ట్రాల అధికారులతో సంయుక్త కమిటీకి తెలంగాణ ఒప్పుకోలేదని తెలిపారు. ప్రాజెక్టు మొత్తంగా చూస్తే తాగునీరు అనేది చాలా చిన్న విషయమని తెలిపారు. తాగునీటి ప్రాజెక్టుకు మినహాయింపు ఇస్తున్నారా అని ధర్మాసనం ప్రశ్నించింది. తాగునీటి అవసరాలకు 7.15 టీఎంసీలు సరిపోతాయని సంయుక్త కమిటీ నివేదిక చెప్పిందని, అయితే సాగు, పారిశ్రామిక అవసరాలకు సరిపోయేలా 90 టీఎంసీలతో ప్రాజెక్టు రూపొందించారని జయదీప్ గుప్తా తెలిపారు. న్యాయస్థానం వాస్తవాల్లోకి వెళ్లాలని కోరారు. 7.15 టీఎంసీల పనులే చేపడుతున్నామని తెలంగాణ చెబుతోందిగా అని ధర్మాసనం పేర్కొనగా.. రిజర్వాయర్లకు అనుమతులు లేవని, ప్రాజెక్టు నిలిపివేయాలని గుప్తా కోరారు. ఎన్జీటీ ఎంత మొత్తం జరిమానా విధించిందని ధర్మాసనం ప్రశ్నించింది. ఎన్జీటీ పాలమూరు–రంగారెడ్డి , డిండి ప్రాజెక్టులకు జరిమానాగా విధించిందని రోహత్గి తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు మొత్తం వ్యయంరూ.35,200 కోట్లలో 1.5 శాతం రూ.528 కోట్లు ఆదేశాలు ఉల్లంఘించామంటూ మరో రూ.300 కోట్లు జరిమానా వేసిందన్నారు. అనంతరం ధర్మాసనం స్పందిస్తూ.. 7.15 టీఎంసీల తాగునీటి పనులకు మాత్రమే అనుమతిస్తున్నామని పేర్కొంది. తాగునీటి ఎద్దటితో ప్రజలు ఇబ్బందులు పడకూడదనే అనుమతి ఇస్తున్నామని స్పష్టం చేసింది. అనంతరం, ఎన్జీటీ విధించిన భారీ జరిమానాపై స్టే విధించాలని రోహత్గి కోరారు. ఎన్జీటీ విధించిన పరిహారం మొత్తంపైనా స్టే విధిస్తున్నట్లు పేర్కొన్న ధర్మాసనం తదుపరి విచారణ ఆగస్టుకు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. ఆరు వారాల్లోగా ప్రతివాదులు, ఏపీ ప్రభుత్వం, కేంద్రం కౌంటరు దాఖలు చేయాలని, తర్వాత ఆరు వారాల్లోగా తెలంగాణ రిజాయిండర్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది.

పర్యావరణ అనమతులు లేకుండా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం చేపడుతోందంటూ ఏపీ ప్రభుత్వంతో పాటు ఏపీలోని వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన చంద్రమౌళీశ్వరరెడ్డి, తదితరులు ఎన్జీటీని ఆశ్రయించారు. పిటిషన్లు విచారించిన ఎన్జీటీ ప్రాజెక్టు పనులు నిలిపి వేయాలని 2021లో ఆదేశాలిచ్చింది. ఎన్జీటీ ఆదేశాలు ఉల్లంఘించి తెలంగాణ ప్రభుత్వం పనులు చేపడుతోందంటూ పిటిషనర్లు మరోసారి ఎన్జీటీని ఆశ్రయించగా ఎన్జీటీ జరిమానా విధించింది.

ఇక 'పాలమూరు' పనుల పునరుద్ధరణ

- డిస్ట్రిబ్యూటరీలు మినహా ఇతర పనులు కొనసాగింపు
- ఆగిపోయిన రుణాలకూ లభించనున్న మోక్షం
- ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీల నుంచి కొత్త రుణాలకు అవకాశం



సాక్షి, హైదరాబాద్: తాగునీటి అవసరాలకు చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తొలి దశ పనులను మళ్లీ పూర్తి స్థాయిలో పునరుద్ధరించేందుకు సుప్రీం కోర్టు తాజాగా ఇచ్చిన అనుమతులతో వెసులుబాటు కలగనుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికార వర్గాలు తెలిపాయి. డిస్ట్రిబ్యూటరీలు వంటి పనులను రెండో దశ కింద ప్రతిపాదించామని, అన్ని రకాల అనుమతులు వచ్చిన తర్వాతే వాటిని చేపడతామని పేర్కొన్నాయి. న్యాయ వివాదాలతో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు నిలిచిపోయినా, అప్పటికే రోజుకు 1 టీఎంసీ సామర్థ్యంతో కృష్ణా జలాల తరలింపునకు వీలుగా పనులు జరిగినట్టు నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది చివరి లోగా ప్రాజెక్టు పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రాజెక్టులో భాగంగా మొత్తం 67 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో ఆరు రిజర్వాయర్లను నిర్మిస్తుండగా, తొలి నాలుగు రిజర్వాయరైన నార్లపూర్, ఏదుల, వట్టెం, కరివేన రిజర్వాయర్లకు శ్రీశైలం జలాశయం నుంచి నీళ్లను ఎత్తిపోసేందుకు వీలుగా పంపులు, మోటార్ల బిగింపు పనులు పూర్తయ్యాయి. చివరి రెండు రిజర్వాయర్లు అయిన ఉదండపూర్, లక్ష్మీదేవిపల్లిలలో నీళ్లను పంపింగ్ చేసే పంపులు, మోటార్లతో పాటు సొరంగం పనులు అసంతృప్తిగా ఉన్నాయి. ఉదండపూర్ జలాశయం నుంచి లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు నీళ్లను పంపింగ్ చేసేందుకు మధ్యలో 14కి.మీల సొరంగాన్ని నిర్మించాల్సి ఉంది. సొరంగానికి ప్రత్యామ్నాయంగా ఉదండపూర్ నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు నీళ్లను ఎత్తిపోయాలి అన్న ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం పరిశీలన చేస్తోంది. దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఇప్పటివరకు రూ.22 వేల కోట్ల పనులు పూర్తి

కాళేశ్వరం ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.10వేల కోట్ల రుణాలను పీఎఫ్‌సీ నుంచి సమీకరించేందుకు గతంలో ఒప్పందం జరగగా, ఇప్పటి వరకు దాదాపు రూ.7వేల కోట్ల రుణాలను పీఎఫ్‌సీ విడుదల చేసింది. ప్రాజెక్టు పనులపై ఎన్జీటీ విధించిన స్టేతో మిగిలిన రూ.3వేల కోట్లను విడుదల చేయడం లేదు. ఇప్పటి వరకు జరిగిన చర్చల్లో ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీలు చెరో రూ.6750 కోట్లు చొప్పున రుణాలను ఇచ్చేందుకు అంగీకరించాయి. పనులు కొనసాగించేందుకు అనుమతి రావడంతో రుణాల విడుదలకు మార్గం సుగమమైంది. రూ.35,200 కోట్లతో ప్రాజెక్టు తొలి దశ పనులు చేపట్టగా, ఇప్పటి వరకు రూ.22వేల కోట్లు విలువ చేసే పనులు పూర్తయ్యాయి. ఇందులో పీఎఫ్‌సీ నుంచి వచ్చిన రూ.7వేల కోట్లు పోగా, మిగిలిన రూ.15వేల కోట్లను వ్యయాన్ని రాష్ట్ర బడ్జెట్ నిధుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం భరించింది.

ఆ కరెంటుతో షాకే..

▶ మొదటి పేజీ తరువాయి

గుర్తించింది. అలాంటి ప్లాంట్లు ఎనర్జీ ఎక్స్ఛేంజీల్లో అధిక ధరతో విద్యుత్ విక్రయించుకోవడానికి వీలుగా కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ గతేడాది అక్టోబర్ 11న 'హై ప్రైస్ డే అహెడ్ మార్కెట్ సెగ్మెంట్' పేరుతో కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది.

'ఎన్రాన్' విద్యుత్ ధర ఆధారంగా..

కొత్త విధానానికి అనుగుణంగా.. దిగుమతి చేసిన బొగ్గు, గ్యాస్ ఆధారిత ప్లాంట్ల విద్యుత్‌ను గరిష్ఠంగా యూనిట్‌కు రూ.50 ధరతో విక్రయించేందుకు అనుమతి కోరుతూ ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజీ గతేడాది చివరిలో సీఈఆర్సీలో పిటిషన్ వేసింది. తర్వాత ఈ ధరను రూ.99 వరకు పెంచాలని అనుబంధ అఫిడవిట్ దాఖలు చేసింది. మహారాష్ట్రలోని రత్నగిరి గ్యాస్ అండ్ పవర్ ప్రైవేటు లిమిటెడ్ (పూర్వపు ఎన్రాన్ సంస్థ)కు చెందిన విద్యుత్‌ను ఇటీవల యూనిట్‌కు రూ.58.98 భారీ ధరతో విక్రయించినట్టు వివరించింది. ఆ ప్లాంట్ విద్యుత్ వేరియబుల్ కాస్ట్(గ్యాస్/ఇంధన వ్యయం) యూనిట్ రూ.58.48గా ఉందని.. దానికి అనుగుణంగా అధిక ధరను నిర్ణయించాలని కోరింది. దీనిపై సీఈఆర్సీ వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలను సేకరించగా.. నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ) అధిక ధరను సమర్థించింది. సీఈఆర్సీ దీనిని పరిగణనలోకి తీసుకుంది. మొత్తం 100 శాతం దిగుమతి చేసిన బొగ్గు, గ్యాస్‌తో ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను మాత్రమే 'హైప్రైస్ డే అహెడ్ మార్కెట్' సెగ్మెంట్ కింద, అదీ యూనిట్‌కు గరిష్ఠంగా రూ.50 ధరతో విక్రయించడానికి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధానంపై కొంత కాలం పరిశీలన జరిపిన తర్వాత పునః సమీక్షిస్తామని తెలిపింది. అయితే రెండు దశాబ్దాల కింద ఎన్రాన్ విద్యుత్ కుంభకోణం తీవ్ర సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఆ ప్లాంటు విద్యుత్ ధరను పరిగణనలోకి తీసుకుని గరిష్ఠ ధరను ఖరారు చేయడం చర్చనీయాంశంగా మారింది.



మూడో ఆప్షన్‌గానే.. అధిక ధర విద్యుత్!

ఎనర్జీ ఎక్స్ఛేంజీలో ఈ అధిక ధర (హైప్రైస్ సెగ్మెంట్) విద్యుత్ విక్రయాన్ని మూడో ఆప్షన్‌గా చేర్చారు. 'డే అహెడ్ మార్కెట్ సెగ్మెంట్' విధానం కింద ఎనర్జీ ఎక్స్ఛేంజీల్లో తొలుత సౌర, పవన విద్యుత్ వంటి గ్రీన్ విద్యుత్‌ను అమ్మకానికి పెడతారు. వాటి విక్రయాలు పూర్తయ్యాక థర్మల్ విద్యుత్‌ను విక్రయిస్తారు. ఈ రెండు సందర్భాల్లో బిడ్డింగ్‌లో పాల్గొని విద్యుత్‌ను పొందలేకపోయిన డిస్కంలు.. 'హైప్రైస్' విద్యుత్ కోసం బిడ్డింగ్ చేయాల్సి ఉంటుంది. దీనిలో కనీస ధర సున్నా నుంచి గరిష్ఠ ధర రూ.50కి మధ్య కోట్ చేయవచ్చు. ఎక్కువ ధరను కోట్ చేసిన డిస్కంలకు విద్యుత్‌ను విక్రయిస్తారు.

ఎనర్జీ ఎక్స్ఛేంజీల్లో కొనుగోళ్లు ఎందుకు?

రాష్ట్రాల విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) సాధారణంగా దీర్ఘ, మధ్య, స్వల్పకాలిక ఒప్పందాల ద్వారా ప్లాంట్ల నుంచి నేరుగా విద్యుత్ కొనుగోళ్లు చేస్తుంటాయి. వీటి విద్యుత్ ధర ఒప్పందాలను బట్టి యూనిట్‌కు రూ.4.5 నుంచి రూ.6 వరకు ఉంటుంది. ఇలాంటి ఒప్పందాలు కాకుండా వివిధ ప్లాంట్లు, విద్యుత్ సంస్థల నుంచి బహిరంగ మార్కెట్లో 'ఎనర్జీ ఎక్స్ఛేంజీ'ల ద్వారా విద్యుత్ విక్రయాలు కూడా జరుగుతుంటాయి. డిస్కంలు విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగిపోయినప్పుడు 'డే ఎహెడ్ మార్కెట్ (డీఏఎం)' సెగ్మెంట్ కింద ఎనర్జీ ఎక్స్ఛేంజీల ద్వారా అవసరమైన మేర కరెంటు కొని వినియోగదారులకు సరఫరా చేస్తుంటాయి. ఈ కొనుగోళ్ల కోసం ఆన్‌లైన్‌లో బిడ్లు వేయాల్సి ఉంటుంది. ఎక్కువ ధర కోట్ చేసిన డిస్కంలకు విద్యుత్ లభిస్తుంది. డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు రాష్ట్రాల డిస్కంలు పోటాపోటీగా బిడ్డింగ్‌లో పాల్గొంటుండటంతో విద్యుత్ ధరలు భారీగా పెరిగిపోతుంటాయి.

కృష్ణా జలాల వినియోగం లెక్కలు తేల్చాల్సిందే!

- కృష్ణా బోర్డుకు తెలంగాణ ఈఎన్‌సీ సూచన
- ఏపీ ఈఎన్‌సీ గైర్హాజరుతో వాయిదా పడిన త్రిసభ్య కమిటీ సమావేశం

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత సంవత్సరం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు వినియోగించిన కృష్ణా జలాల లెక్కలను పక్కాగా తేల్చాలని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ స్పష్టం చేశారు. ఏపీ రాష్ట్ర జలవనరుల శాఖ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి గైర్హాజరు కావడంతో శుక్రవారం జలసౌధలో జరగాల్సిన త్రిసభ్య కమిటీ సమావేశం వాయిదా పడింది. రబీ ఆయకట్టు, తాగునీటి అవసరాలకు మిగులు నిల్వల పంపకాలపై ఈ సమావేశం జరగాల్సి ఉంది. సమావేశం వాయిదా కావడంతో తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ కృష్ణా బోర్డు సభ్యకార్యదర్శి రాయ్‌పురేతో భేటీ అయి చర్చించారు. ఈ ఏడాది ఏపీ ఇప్పటికే వాటాకు మించి కృష్ణా జలాలను వాడుకుందని తెలిపారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో మిగిలి ఉన్న 141 టీఎంసీల నిల్వలన్నీ తెలంగాణ వాటా జలాలేనని అన్నారు. కృష్ణా బోర్డు చైర్మన్‌గా శివ్‌నందన్ కుమార్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో త్వరలోబోర్డు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. వచ్చే నెల మొదటి వారంలో మళ్లీ త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.

ఎంపీ అర్వింద్‌కు హైకోర్టులో ఊరట.. తదుపరి చర్యలపై స్టే

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్‌ను కించపరిచేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌లు చేశారన్న కేసులో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై తదుపరి చర్యలు తీసుకోవద్దంటూ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 21కి వాయిదా వేసింది. సీఎం కేసీఆర్‌ను కించపరిచేలా కార్టూన్ పోస్టు చేశారని అర్వింద్‌పై 2022 జనవరిలో వనస్థలిపురం, బంజారాహిల్స్‌లో పీఎస్‌లలో కేసులు నమోదయ్యాయి. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ అర్వింద్ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఫిర్యాదు చేసిన వారు బీఆర్‌ఎస్ నేతలని పిటిషన్‌లో పేర్కొన్నారు.



సోమేశ్వరునికి శివరాత్రి శోభ
శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి విద్యుత్ కాంతుల్లో వెలిగిపోతున్న నల్లగొండ పానగల్లు ఛాయా సోమేశ్వరాలయం

మహాశివరాత్రి ప్రజల జీవితాలకు మేల్కొలుపు : గవర్నర్



సాక్షి, హైదరాబాద్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుభాకాంక్షలు తెలిపారు. జాగారం రూపంలో మేల్కొని ఉంచే మహాశివరాత్రి ప్రజల జీవితాలకు మేల్కొలుపు అని పేర్కొన్నారు. మహాశివరాత్రి కోట్లాది మంది శివుడి భక్తులకు ఆరాధ్యమైన పర్వదినమని తెలిపారు. ఈ పర్వదినం సందర్భంగా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సోదరభావాన్ని పెంపొందించాలని గవర్నర్ ప్రార్థించారు. కాగా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా రెండేళ్ల పదవీకాలం పూర్తిచేసుకున్న తమిళిసైని పుదుచ్చేరి సీఎం రంగస్వామి సత్కరించారు.

వెలిగిపోతున్న వేములవాడ రాజన్న

- ఘనంగా శివరాత్రి జాతర ప్రారంభం
- టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణ



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం మహాశివరాత్రి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానాచార్యుడు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని శనివారం ఉదయం 7 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం తరపున జేఈవో బృందం, అనంతరం 8 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. రూ.3.7 కోట్ల వ్యయంతో మహాశివరాత్రి జాతరకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉత్సవాలకు 3 లక్ష ల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. 2 వేల మందితో ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హెలికాప్టర్ సౌకర్యం కల్పించారు. జాతర ఉత్సవాల చైర్మన్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు. రాజన్న భక్తుల కోసం గుడి చెరువులోకి గోదావరి జలాలను శుక్రవారం విడుదల చేశారు.

శివోహం..

ఏపీలో శైవ క్షేత్రాలు ముస్తాబు

సాక్షి, అమరావతి: మహాశివరాత్రి పర్వదినానికి ఏపీలోని శైవ క్షేత్రాలు ముస్తాబైయ్యాయి. చలువ పందిళ్లు, విద్యుత్ దీపాల అలంకరణతో శుక్రవారం రాత్రే పండుగ వాతావరణం ఏర్పడింది. భారీగా తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవదాయ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. శ్రీశైలం, శ్రీకాళహస్తి, కోటప్పకొండ, మహానంది వంటి వాటి వద్ద ప్రత్యేక ఏర్పాట్ల పర్యవేక్షణకు నలుగురు అధికారులను ప్రభుత్వం ఇప్పటికే నియమించింది.



సైకత 'నీలకంఠుడు'
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లా రంగంపేటలోని శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నీలకంఠుని సైకత శిల్పాన్ని శిల్పి దేవిన శ్రీనివాస్ తీర్చిదిద్దాడు. -రంగంపేట

సీబీఐ ఎలా దర్యాప్తు చేస్తుంది?

▶ మొదటి పేజీ తరువాయి

ప్రశ్నించింది. ''తెలంగాణలో ఎమ్మెల్యేల ఎర కేసు చాలా తీవ్రమైనది. వరసగా స్టే ఉత్తర్వులు, బెయిలు ఉత్తర్వులు వల్ల విచారణ కొంచెం కూడా ముందుకు సాగడం లేదు. ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే ఈ కేసులో తెలంగాణ హైకోర్టులోనూ వాదనలు వినిపించా. బీజేపీ పిటిషన్‌ను సింగిల్ బెంచ్ తొలుత విచారించగా.. విచారణార్హత లేదని డివిజన్ బెంచ్ పేర్కొంది''అని దవే తెలిపారు. ఈ కేసు దర్యాప్తు చేయడానికి సిట్ వేశారు కదా అని ధర్మాసనం ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను సింగిల్ బెంచ్ రద్దు చేసిందని దవే తెలిపారు. సిట్ ఏర్పాటు చేసింది సింగిల్ బెంచ్ కాదా అని ధర్మాసనం ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిందని, సింగిల్ బెంచ్ పర్యవేక్షిస్తుందని డివిజన్ బెంచ్ పేర్కొందని ఇరుపక్షాల న్యాయవాదులు ధర్మాసనానికి వివరించారు.

సీఎంను తొలుత నిందించాలి.. మహేశ్ జెత్మలానీ

బీజేపీ తరఫు సీనియర్ న్యాయవాది మహేశ్ జెత్మలానీ వాదనలు వినిపిస్తూ.. సిట్ రాష్ట్ర ప్రభుత్వం అధీనంలో ఉందన్నారు. కేసు దర్యాప్తు రికార్డులు మీడియాకు విడుదల చేసినందుకు తెలంగాణ సీఎంను తొలుత నిందించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర పోలీసుల స్వతంత్రత పై అనుమానం వస్తోందని తెలిపారు. మీడియాకే కాదు న్యాయమూర్తులకు పంపారని ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ప్రతిపక్ష నేతలకు వ్యతిరేకంగా సీబీఐ, ఈడీ దర్యాప్తు వివరాలన్నీ మీడియాకు లీక్ అవుతున్నాయని దవే ఆరోపించారు. ఇలా చేయడం ఎవరికీ తగదని జెత్మలానీ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా ఉందని, ప్రజాస్వామ్యాన్ని కోర్టులు మాత్రమే కాపాడగలవని దవే పేర్కొన్నారు. ''బీజేపీకి వ్యతిరేకంగా ఆరోపణలుండగా సీబీఐ చేతికి దర్యాప్తు ఎలా ఇస్తారు?. ఇది ట్రాప్ కేసు. పలు సాక్ష్యాలున్నాయి. అవినీతి నిరోధక కేసుల్లో ట్రాప్ పద్ధతి సరైందని సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చింది. ఎమ్మెల్యేలతో ఏం చర్చించారో ఐదు గంటల రికార్డింగు ఉంది. ఫోన్, వాట్సాప్ సంభాషణలూ ఉన్నాయి. సీబీఐకి దర్యాప్తు అప్పగించాల్సిన అవసరం లేదు. కేసులో వాదనలకు ఎక్కువ సమయం కావాలి''అని దుష్యంత్ దవే వాదన ముగించారు. ధర్మాసనం సమాలోచనల్లో ఉండగా.. ''వేధించొద్దని సీబీఐకి సూచించండి''అని జెత్మలానీని ఉద్దేశించి దవే చమత్కరించారు. సీబీఐని బీజేపీ ఏమీ నియంత్రించడం లేదని జెత్మలానీ స్పష్టం చేశారు. అనంతరం, ఈ నెల 27కు విచారణ వాయిదా వేస్తున్నామని, ఆరోజు అన్ని కేసుల విచారణ తర్వాత చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సమయంలో సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు మాట్లాడుతుండగా... ఎవరి తరఫున హాజరయ్యారని ధర్మాసనం ప్రశ్నించింది. ఫిర్యాదు చేసి ఇరుపక్షాల మధ్య చిక్కుకున్న ఎమ్మెల్యే తరఫు అని సమాధానమిచ్చారు. ఏమైందని ధర్మాసనం ప్రశ్నించగా.. తన క్లయింటును ఈడీ వేధిస్తోందని శేషాద్రి నాయుడు తెలిపారు.

అర్జునా! నీ స్వభావ సిద్ధమైన కర్మలకు నువ్వు బద్ధుడివి. భ్రాంతి వలన కర్మ చేయడానికి ఇష్టపడకపోయినా తప్పనిసరిగా చేసి తీరుతావు.

– భగవద్గీత

సాక్షి

శనివారం, ఫిబ్రవరి, 18

ఎట్టకేలకు ఢిల్లీకి మేయర్!

ఎన్నికలు జరిగి మూడు నెలలవుతున్నా మేయర్ సంగతి తేలక అయోమయంలో పడిన ఢిల్లీ ఓటర్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం మంచి కబురందించింది. ఢిల్లీ కార్పొరేషన్ తొలి సమావేశానికీ, మేయర్ ఎన్నికకూ 24 గంటల్లో ప్రకటన విడుదల చేయాలని లెఫ్టినెంట్ గవర్నర్‌కు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఆదేశాలిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించటానికి అవకాశాలు తక్కువగా ఉంటాయి గనుక, పౌరుల్లో ప్రజాస్వామిక స్ఫూర్తిని నింపటం అవసరం గనుక స్థానిక స్వపరిపాలనను ప్రోత్సహించాలని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. పంచాయతీల మొదలుకొని నగర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వరకూ ఎన్నికలు నిర్వహించేది అందుకే. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రస్తావనకొచ్చే అంశాలు, వాటి అవసరాలు వేరు గనుక ఆ ఎన్నికల స్వరూపమే భిన్నంగా ఉంటుంది. కనుక రాష్ట్రాన్ని పాలించే పార్టీ కాకుండా మరో పార్టీ స్థానిక సంస్థల్లో పాగా వేయొచ్చు. దీన్ని వమ్ము చేసి, బలాబలాలను తారుమారు చేయటానికి అధికారపక్షం తమ ఎమ్మెల్యేలనూ, ఎంపీలనూ ఆ సంస్థల్లో సభ్యులుగా చేర్చే ధోరణి చాన్నాళ్లుగా కొనసాగుతోంది. ఢిల్లీలో జరిగింది అదే. అక్కడ మూడు పురపాలక సంస్థలనూ విలీనం చేసి ఒకే కార్పొరేషన్‌గా మార్చాక జరిగిన ఎన్నికల్లో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఘన విజయం సాధించింది. పదిహేనేళ్లుగా మూడు పురపాలక సంఘాల ద్వారా ఆ నగరాన్ని అవిచ్ఛిన్నంగా ఏలిన బీజేపీ ఓటమి చవిచూసింది. 250 స్థానాలుండే కార్పొరేషన్‌లో ఆప్‌కు 134 వచ్చాయి. బీజేపీ బలం 104. ఢిల్లీ కార్పొరేషన్ ఎన్నికలు నువ్వా నేనా అన్నట్టు జరిగాయి. బీజేపీకి మద్దతుగా 15 మంది కేంద్ర మంత్రులు, ఆరుగురు ముఖ్యమంత్రులు ఢిల్లీ వీధుల్లో నెల్లాళ్లపాటు అలుపెరగకుండా ప్రచారం చేశారు. కానీ ఫలితం దక్కలేదు. అప్పటినుంచి కేంద్రంలో ఎన్‌డీఏ సర్కారుకు నాయకత్వం వహిస్తున్న బీజేపీ చేయనిదంటూ లేదు. మొదట ఆప్ సభ్యులను లోబరుచుకునేందుకు ప్రయత్నించిందన్న ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత నగరపాలక సంస్థ తొలి సమావేశంలోనే తమ నామినేటెడ్ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించే ఎత్తుగడకు దిగింది. ఇందుకు అనుగుణంగా ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఉత్తర్వులిచ్చారు. కానీ 74వ రాజ్యాంగ సవరణ ప్రకారం ముందు ఎన్నికైన సభ్యులు ప్రమాణస్వీకారం, ఆ తర్వాత మేయర్, డిప్యూటీ మేయర్, స్థాయి సంఘం సభ్యుల ఎన్నిక పూర్తయ్యాకే నామినేటెడ్ సభ్యుల ప్రమాణస్వీకారం ఉండాలి. ఈ నిబంధనలు తొలి సమావేశానికి మాత్రమే వర్తిస్తాయి. లెఫ్టినెంట్ గవర్నర్ అప్రజాస్వామిక ఉత్తర్వులు పాటించబోమంటూ ఆప్... వాటిని తలదాల్చాల్సిందేనని బీజేపీ వాగ్యుద్ధాలకు దిగటంతో గత నెల 6న, ఆ తర్వాత 24న జరిగిన సమావేశాలు రసాభాసగా ముగిశాయి. ఫిబ్రవరి 6న సైతం ఇదే పునరావృతమైంది. తాజాగా సుప్రీంకోర్టు ఉత్తర్వులతో ఆప్ మాటే నెగ్గినట్టయింది.

దేశవ్యాప్తంగా తిరుగులేని మెజారిటీ సాధించి కేంద్రంలో రెండో దఫా పరిపాలన సాగిస్తూ కూడా ఢిల్లీ కోసం అర్రులు చాచటం బీజేపీ మానుకోలేదు. అయితే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో వరసగా రెండు దఫాలు అధికారం అందుకున్న ఆప్ మొన్నటి నగర పాలక ఎన్నికల్లో సైతం విజయం సాధించటం సహజంగానే బీజేపీకి కంటగింపుగా ఉంది. రాష్ట్రాల్లో గవర్నర్ల ద్వారా నచ్చని ప్రభుత్వాలను నియంత్రిస్తున్నట్టే, లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా ఢిల్లీలో ఆప్ సర్కార్‌కు చికాకులు తీసుకురావటం, న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు కొనసాగటం తరచు కనబడుతూనే ఉంది. ఢిల్లీ మహానగరంలోనే కేంద్ర ప్రభుత్వ అధికార పీఠానికి సంబంధించిన సమస్త యంత్రాంగమూ ఉంటుంది గనుక అక్కడి అసెంబ్లీ, అక్కడి నగర పాలక సంస్థ కూడా తన అధీనంలోనే ఉండాలని బీజేపీ కోరుకోవటంలో విపరీతమేమీ లేదు. ఉన్న అధికారాన్ని పదిలపరుచుకోవటానికి, దాన్ని మరింత విస్తృతపరుచుకోవటానికి ప్రజాస్వామ్యంలో ప్రతి పార్టీకీ హక్కుంటుంది. అయితే అదంతా నిబంధనలకు అనుగుణంగా జరగాలి. అడ్డదారుల్లో అధికారాన్ని అందుకోవాలని ఎవరూ తాపత్రయపడకూడదు. 2014 ఎన్నికల తర్వాత తనకొచ్చిన బలంతో సరిపెట్టుకోక వైఎస్సార్ కాంగ్రెస్ నుంచి 23 మంది ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి చేర్చుకున్న చంద్రబాబునాయుడుకు ఆంధ్రప్రదేశ్‌లో జనం ఏ గతి పట్టించారో కళ్లముందుంది. నిజానికి ఢిల్లీలో కొత్తగా నామినేట్ అయ్యే పదిమందితో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఆప్‌ను అధిగమించటం ఇప్పటికప్పుడు బీజేపీకి అసాధ్యం. అయితే ఈ చర్యవల్ల ఇద్దరి బలాబలాల్లోని వ్యత్యాసం తగ్గిపోతుంది. అనంతరకాలంలో సభ్యులను ప్రలోభపెట్టడం ద్వారా దాన్ని మరింత పెంచుకుని అధికారం దక్కించుకునే ఆస్కారం ఉంటుంది.

నిజానికి అన్ని పార్టీలూ హుందాగా, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించటం నేర్చుకుంటే దాదాపు మూడు నెలలపాటు ఎన్నికైన పాలకవర్గం లేకుండా ఢిల్లీ నగర పాలక సంస్థ అనాథగా మిగిలేది కాదు. అందరికీ సహజంగా తెలియాల్సిన నిబంధనల గురించి సుప్రీంకోర్టుతో చెప్పించుకోవాల్సిన అగత్యం ఏర్పడేది కాదు. పెండింగ్ కేసుల సంఖ్య అపారంగా పెరిగిపోతున్న నేపథ్యంలో ఇలా విలువైన కోర్టు సమయాన్ని వృథా చేయటం పార్టీలకు తగునా? అన్ని పార్టీలూ ఆలోచించాలి. ఇకనుంచైనా తన విధులు తాను నిర్వర్తించే వెసులుబాటు ఢిల్లీ నగర పాలక సంస్థకు కలుగుతుందని ఆశించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు
మాఘ మాసం, తిథి: బ.త్రయోదశి సా.6.20 వరకు
తదుపరి చతుర్దశి, నక్షత్రం: ఉత్తరాషాఢ సా.4.11 వరకు, తదుపరి శ్రవణం, వర్జ్యం: రా.7.54 నుండి 9.23 వరకు
దుర్ముహూర్తం: ఉ.6.28 నుండి 8.01 వరకు
అమృతఘడియలు: ఉ.10.05 నుండి 11.40 వరకు, మహాశివరాత్రి

సూర్యోదయం : 6.29
సూర్యాస్తమయం: 5.58
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

చైనా దూకుడుకు కారణాలెన్నో!

విశ్లేషణ



డాక్టర్ గద్దె ఓంప్రసాద్

చైనాకు లదాఖ్ ఎందుకంత ముఖ్యం అన్న ప్రశ్నకు సమాధానం వెతకగలిగితే సరిహద్దు సమస్యలకు సమాధానం దొరుకుతుంది. టిబెట్ అటానమస్ రీజియన్‌ను క్సిన్జియాంగ్ అటానమస్ రీజియన్‌తో అనుసంధానించే ప్రాంతంలో లదాఖ్‌లోని అక్సాయ్ చిన్ ఉంది. చైనా తన పశ్చిమ, ఉత్తర, నైరుతి దిక్కుల్లో ఉన్న సరిహద్దులకు సైన్యాన్ని తరలించడానికి ఉన్న మార్గాలు ఇవి మాత్రమే. చైనా ఉత్పత్తి చేసే 157 రకాల ఖనిజాల్లో దాదాపు 138 రకాల ఖనిజాలు ఈ ప్రాంతంలో దొరుకుతాయి. ఈ పరిస్థితుల్లో భారత్‌తో ఉన్న సరిహద్దులపై చైనా ఇంకా దృష్టి పెడుతుంది. అతి నిర్ణయాత్మకమైన ధోరణిని అవలంబించే బలమైన ప్రభుత్వం మాత్రమే చైనా దూకుడును ఎదుర్కోగలదు.

ఈ సంవత్సరం జనవరి 20–22 తేదీల్లో ఢిల్లీలో 'కంచె లేని భూసరిహద్దుకు సంబంధించిన భద్రతా సమస్యలు' అనే అంశంపై ఇంటలిజెన్స్ బ్యూరో నిర్వహించిన సమావేశంలో లదాఖ్‌లో చైనాతో ఉన్న సరిహద్దుకు సంబంధించిన విషయాలు చర్చకు వచ్చి, అవి మీడియాలో కూడా అనేక చర్చలకు దారితీశాయి. ప్రధాని, హోంమంత్రి, జాతీయ భద్రతా సలహాదారు పాల్గొన్న ఈ సమావేశంలో ముందుకు వచ్చిన ఒక నివేదిక ప్రకారం– ఈ ప్రాంతంలో కారకోరం పాస్ నుండి చుమూర్ గ్రామం వరకు ప్రస్తుతం ఉన్న 65 పాట్రోలింగ్ పాయింట్స్‌లో 26 పాయింట్స్ అంటే పాయింట్ నంబర్ 5 నుండి 17, 24 నుండి 32, 37, 51, 52, 62 అనే పాయింట్స్ ఇండియా కోల్పోయిందనీ, చైనా పాటించే సలామి స్లైస్ వ్యూహంలో(చిన్న దాడులతో పెద్ద ఫలితం రాబట్టడం) ఇవి చిక్కుకున్నాయనీ వెల్లడయిన విషయాలు ఆందోళన కలిగించేవే! అయినప్పటికీ ఈ ప్రాంతంపై చైనాకు ఉన్న ఆర్థిక రాజకీయ వ్యూహాత్మక భద్రతా ప్రయోజనాల దృష్ట్యా ఇది ఊహించదగ్గదే.

ఇండియా, చైనా మధ్య 2020 ఏప్రిల్ నుండి ఇప్పటివరకూ సుమారు 17 రౌండ్ల చర్చలు జరిగినప్పటికీ, వాటి ఫలితాలు ఏమాత్రం అనుకూలంగా రాలేదు. రెండు దేశాల సైన్యాలు బాహాబాహీకి దిగుతున్న సంఘటనలు, నిర్మిస్తున్న మౌలిక సదుపాయాలు, రహదారులు, మిలిటరీ స్టేషన్స్, జనావాసాలు... ఎన్ని రౌండ్ల చర్చలు జరిగినప్పటికీ 2020 సంవత్సరానికి పూర్వం ఉన్న పరిస్థితులు పునరుద్ధరించడం కష్టమేనన్న భావన కలిగిస్తున్నాయి. దానికి తోడు జనవరి 20వ తేదీన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ లదాఖ్ ప్రాంతంలోని చైనా సైనికులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిపిన సమావేశంలో ఎల్లవేళలా యుద్ధానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చాడు. చైనాకు ఈ ప్రాంతం ఎందుకంత ముఖ్యం అన్న ప్రశ్నకు సమాధానం వెతకగలిగితే ఈ సరిహద్దు సమస్యలకు సమాధానం దొరుకుతుంది.

గత మూడు దశాబ్దాల్లో చైనా విదేశీ విధానంలో, దాని రూపకల్పనలో సైన్యం పోషించే పాత్రలో చాలా మార్పులు వచ్చాయి. తొంభయ్యో దశకంలో ప్రపంచ దృష్టిని ఆకర్షించకుండా అతిగోప్యతను పాటించడం, ఇతర దేశాల్లో ఎలాంటి జోక్యం చేసుకోకపోవడం ముఖ్యమైన విధానంగా ఉంటే, కొత్త సహస్రాబ్దిలో చైనా సాధించిన ఆర్థిక విజయాలు ఈ విధానంలో సమూల మార్పులకు దోహద పడ్డాయి. అందులో భాగంగా తన ఆర్థిక ప్రయోజనాలు కాపాడుకోవడానికి సైన్యం కీలక పాత్ర పోషించవలసిన అవసరం ఉందని గుర్తించింది. దూకుడైన విధానాలు, బలమైన, టెక్నాలజీ సపోర్ట్‌తో కూడిన రక్షణ వ్యవస్థలను నిర్మించడంపై దృష్టి పెట్టింది. జిన్‌పింగ్ కాలంలో విదేశీ విధానాల రూపకల్పనలో



గస్తీలో భారత సైనికుడు

సైన్యం పాత్ర మరింత పెరగటం గమనించవచ్చు. జిన్‌పింగ్ అధికారంలోకి వచ్చాక 2013లో చేపట్టిన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో భాగంగా చైనా వాణిజ్యం పెంచే ఎగుమతులు దిగుమతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా కొనసాగించడానికి రక్షణ చర్యలు తీసుకొనవలసిన అవసరం ఏర్పడింది. 2016 నుండి తన పశ్చిమ సరిహద్దుల్లో ముఖ్యంగా సెంట్రల్ ఆసియా, అఫ్గానిస్తాన్‌లో పెరుగుతున్న తీవ్రవాదం ప్రభావం తన ఉగెర్, క్సిన్జియాంగ్ ప్రాంతాల్లో పడకుండా ఉండడానికి ఆ ప్రాంతాల్లో మిలిటరీ ఉనికిని పెంచడమే కాకుండా, తన వెస్ట్రన్ కమాండ్‌ను మొత్తంగా పునరుద్ధరించింది. ఈ చర్యలు అటు క్సిన్జియాంగ్ ప్రోవిన్సుతో పాటు, టిబెట్ ప్రావిన్స్‌లలో సైన్యం కదలికలు పెరిగి ఎన్నడూ లేని విధంగా ఆ ప్రాంతాల్లోని సరిహద్దులపై దృష్టి పెట్టేందుకు దోహదపడ్డాయి.

గత రెండు దశాబ్దాల్లో చైనా విధానాల్లో వచ్చిన మరొక ముఖ్యమైన మార్పు, తాను నిర్దేశించుకున్న 'మూల ప్రయోజనాలు'. తొంభయ్యో దశకం వరకు ఆర్థిక అభివృద్ధి, దేశ సమగ్రత ముఖ్య లక్ష్యాలయితే, అది కొత్త మిలీనియంలో విదేశాల్లో ఆర్థిక ప్రయోజనాలతో పాటు, ఆయా దేశాల్లో ఉన్న సహజ వనరులను ఉపయోగించుకునేందుకు, అందుకు అవసరమైతే మిలిటరీ తదితర శక్తుల ప్రదర్శన చేయడంగా రూపాంతరం చెందింది.

అయితే ఢిల్లీలో జరిగిన సమీక్ష సమావేశంలో చైనాకు లదాఖ్ ప్రాంతంలో ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలు ఉన్నట్టు పేర్కొన్నప్పటికీ, అవి ఏమిటన్నది వెల్లడించలేదు. ఈ ప్రాంత భౌగోళిక స్వరూపాన్ని పరిశీలిస్తే చైనాకు ఇది అత్యంత కీలకమైన ప్రాంతమని గోచరిస్తుంది. చైనాకు ఈ ప్రాంతంతో మూడు రకాల ప్రయోజనాలున్నాయి. ఒకటి: చైనాలో ఉన్న టిబెట్ అటానమస్ రీజియన్‌ను క్సిన్జియాంగ్ అటానమస్ రీజియన్‌తో అనుసంధానించే ప్రాంతంలో లదాఖ్‌లోని అక్సాయ్ చిన్ ఉంది. ఈ ప్రాంతంలో చైనా నిర్మిస్తున్న నగరి డ్యామ్ ద్వారా సింధు నదీ జలాల ప్రవాహాన్ని నియంత్రించడమే కాకుండా, వాటిని తన రక్షణ దళాల అవసరాలకు మళ్ళించుకోవడానికీ, ఆప్రాంతానికి కావలసిన విద్యుత్ ఉత్పత్తి చేయడానికీ అక్సాయ్ చిన్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలపై చైనాకు పూర్తి నియంత్రణ అవసరం.

రెండు: క్సిన్జియాంగ్ ప్రావిన్స్‌ను టిబెట్ ప్రావిన్స్‌తో కలిపే ఎ219 హైవే, కషగర్ నగరాన్ని సెంట్రల్ చైనా నుండి బీజింగ్‌తో కలిపే ఎ314 హైవే... ఈ రెండింటి భద్రతకు అక్సాయ్ చిన్, లదాఖ్ ప్రాంతాలు చైనాకు అతి ముఖ్యమైనవి. చైనా తన పశ్చిమ, ఉత్తర, నైరుతి దిక్కుల్లో ఉన్న సరిహద్దులకు సైన్యాన్ని తరలించడానికి ఉన్న మార్గాలు ఇవి మాత్రమే. ఈ ప్రాంతంలో ఇండియా నిర్మిస్తున్న మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా రహదారులు, దౌలత్ ఓల్డ్ బేగ్ లాంటి వైమానిక స్థావరాలతో చైనా భద్రతకు, అందునా చైనా– పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్‌ను కషగర్ సిటీతో కలిపే కారకోరం హైవేకు ప్రమాదం ఏర్పడుతుందని చైనా అంచనా.

మూడు: ఈ ప్రాంతంలో 1913లో జరిగిన డి ఫిలిపె ఎక్స్‌పెడీషన్, ఆ తర్వాత సోవియెట్ యూనియన్ జరిపిన భౌగోళిక సర్వేలో అత్యంత విలువైన థోరియం, యురేనియం, బోరోక్స్, సల్ఫర్, నికెల్, పాదరసం, ఇనుము, బంగారం, బొగ్గు నిక్షేపాలు ఉన్నట్టు గుర్తించారు. 2019లో చైనా సహజ వనరుల మంత్రిత్వ శాఖ ప్రచురించిన నివేదికలో చైనా ఉత్పత్తి చేసే 157 రకాల ఖనిజాల్లో దాదాపు 138 రకాల ఖనిజాలు ఈ ప్రాంతంలో దొరుకుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే వీటి వెలికితీత కార్యక్రమాలు, శుద్ధిచేసే ప్లాంట్ల నిర్మాణాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈ ఖనిజ సంపదతో తన తూర్పు ప్రాంతానికి సమానంగా పశ్చిమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయవచ్చనీ, ఉగెర్ ప్రాంతంలో నెలకొని ఉన్న పేదరికాన్ని, వేర్పాటువాదాన్ని ఎదుర్కొనవచ్చనీ చైనా వ్యూహం.

ఈ పరిస్థితుల మధ్య భారత్‌తో ఉన్న సరిహద్దులపై చైనా ఇంకా దృష్టి పెడుతుందనీ, భవిష్యత్తులో మరింత దూకుడుగా ఉంటుందనీ అంచనా వేయవచ్చు. ఇంతకు ముందులా కాకుండా భారత్ కూడా లదాఖ్ నుండి అరుణాచల్ వరకు ఉన్న తన సరిహద్దుల వెంబడి అనేక మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, సైనిక దళాలకు కావలసిన వసతులను వేగంగా అభివృద్ధి చేసుకుంటున్నది. చైనాకు ఉన్న ప్రయోజనాల దృష్ట్యా, అది వ్యవహరిస్తున్న తీరును బట్టి, భవిష్యత్తులో మరిన్ని ఘర్షణలు తలెత్తవచ్చని చెప్పవచ్చు. అతి నిర్ణయాత్మకమైన ధోరణిని అవలంబించే బలమైన ప్రభుత్వం మాత్రమే చైనా దూకుడును ఎదుర్కోగలదు.

వ్యాసకర్త సహాయ ఆచార్యులు, సిక్కిం సెంట్రల్ యూనివర్సిటీ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఈ ముగ్గురు



కమలా హారిస్, నిక్కీ హేలీ, వివేక్ రామస్వామి... 2024 అమెరికా అధ్యక్ష స్థానం కోసం బహుశా ముగ్గురు భారత సంతతివాళ్లు పోటీపడబోతున్నారు.

– బాలాజీ శ్రీనివాసన్, ఆంట్రప్రెన్యూర్

రాశానొక కవిత



కుచ్ పల్ కే లియే పూరా ఆవూ/ యా హర్ పల్ మే అధూరా ఆవూ (కొన్ని క్షణాల కోసం మొత్తంగా రానా/లేదా ప్రతి క్షణంలో సగమే రానా)

– ఆయుష్మాన్ ఖురానా, సినిమా నటుడు

చెల్లని పెళ్లి



ఒకవేళ స్వర భాస్కర్ ముస్లిం కాకపోయి, ఆమె 'భర్త' ముస్లిం అయితే, ఇస్లాం ప్రకారం ఈ వివాహం చెల్లదు. బహుదేవతారాధకురాలయిన మహిళను విశ్వాసి కానంతవరకూ వివాహం చేసుకోకూడదని చెప్తాడు అల్లా (2:221). కేవలం వివాహం కోసమే ఆమె ఇస్లాంను అంగీకరించినా కూడా దానికి అల్లా అంగీకరించడు.

– యాసిర్ నదీమ్ అల్ వజీదీ, స్కాలర్

తీర్పరిగా ఉండొద్దు



మీరెవరు(యాసిర్ నదీమ్ అల్ వజీదీ)? ఇతరుల మీద తీర్పులు చెప్పడానికి అల్లా నియమించినవారా? మేము అల్లాకు, అల్లాకు మాత్రమే జవాబుదారీ. మిమ్మల్ని ఎవరైనా అభిప్రాయం అడిగేవరకూ దాన్ని మీవద్దే ఉంచుకోండి. మంచి ముస్లింగా ఉండండి. (నటి స్వర భాస్కర్, ఎస్పీ నాయకుడు ఫహద్ అహ్మద్ రిజిస్టర్ మ్యారేజీ చేసుకున్నారు.)

– సయేమా, రేడియో జాకీ

బాధితుడే!



వీడియోను బట్టి స్పష్టంగా అర్థమయ్యేది ఏమంటే, క్రికెటర్ పృథ్వీ షా తనను తాను రక్షించుకోవడానికే నటి సప్నా గిల్ నుంచి బ్యాట్ లాక్కున్నారు. ఇంకో రకంగా జరగలేదు. ఒకవేళ పృథ్వీ సాధారణ మనిషి అయివుంటే హింసించాడన్న కేసు మీద ఇప్పటికే జైల్లో ఉండేవాడు. ఇది ఎలా ముగుస్తుందో చూడాలి.

– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ మేకర్

పదేళ్ల అద్భుతం



ఈ పదేళ్లలో ఏ భాషలోనైనా వచ్చిన అత్యుత్తమ నవల 'ద సెవెన్ మూన్స్ ఆఫ్ మాలీ అల్మీదా'. క్లాసికల్, ఆధునిక నవలల రెండు ధోరణులనూ సమాంతరంగా అనుకరించిన పనితనం ఇందులో కనబడుతుంది. నవలా రచయిత శేహన్ కరుణతిలక నమ్మలేనంత బాగా రాశారు. (2022 బుకర్ ప్రైజ్ గెలుచుకుంది.)

– ఖాలిద్ జావేద్, ఉర్దూ నవలా రచయిత

పడిపోయిన ప్రమాణాలు



బెంగళూరులో ఉబర్, ఓలా డ్రైవర్లు అత్యంత దారుణంగా ఉన్నారు. నా రైడ్‌లో ఏసీ కోరినందుకు డ్రైవర్ పరుషంగా మాట్లాడాడు. పైగా ఈ రైడ్ దొరకడానికి 20 నిమిషాలు పట్టింది. ఒకప్పుడు ఈ రెండు అద్భుతాలు సాంకేతికతకూ, తెగువకూ పేరొందాయి. కానీ ఇప్పుడు వినియోగదారుడు వాటిని అభినందించడం కష్టం. అసలు అవి ఇంతదూరం ఎలా వచ్చాయి?

– రాజేశ్ సాహ్నీ, ఇన్వెస్టర్

అవధాన సరస్వతీ దీప్తి

నివాళి



మా శర్మ

సుప్రసిద్ధ అవధాని, బహువిద్యా విద్వన్మణులు, సరస్వతీ ఉపాసనా విశిష్టులు అష్టకాల నరసింహరామశర్మ ఇటీవలే అనంతలోకాల్లో కలిసిపోయారు. తెలంగాణ మాగాణంలో విరిసి మెరిసిన ఈ ప్రతిభామూర్తి తెలుగు ఎల్లలు దాటి తేజః సంపన్నులయ్యారు. ఈ మూర్తిని కీర్తిమంతుని చేసిన ప్రధాన అంగాలు రెండు. ఒకటి అవధానం. మరొకటి సరస్వతీ ఆలయం స్థాపన. తన శ్రావ్య కావ్యకన్యను, తన కోమల శ్యామల అవధానపు ముద్దుగుమ్మను ఎవ్వరికీ ఎన్నడూ అమ్మకుండా త్రిశుద్ధిగా 'భారతి'ని నమ్మి జీవించారు. చిలుకతోడై నిలిచిన పలుకులమ్మకు గుండె గుడిగా చేసుకొని గుడి కట్టించారు.

భారతదేశంలో సరస్వతికి మూడే మూడు దేవాలయాలు ప్రధానంగా ఉన్నాయి. ప్రాచీన కాలం నుంచి వెలసిన కశ్మీర్ ఆలయం ఒకటి కాగా, రెండోది బాసర. మూడో దేవాలయం అష్టకాల నరసింహరామశర్మ స్థాపించినది కావడం విశేషం. ఈ దేవాలయ స్థాపనకు తన జన్మభూమిని ఎంచుకోవడం అష్టకాలవారి పూర్వపుణ్య విశేషం. ఈరోజు తెలుగునాట రెండు శారదా నిలయాలు ఉన్నాయంటే ఆ కీర్తిదీప్తిలో సగభాగం వారికే చెందుతుంది. నరసింహరామశర్మ నిర్మించిన ఈ సరస్వతీమూర్తి ప్రత్యేకమైనది. ఆ దేవళంలో అమ్మవారు నిల్చొని ఉన్న నిలువెత్తు వీణాపాణి. ఆ అమ్మవారిని నిండార కొలుచుకొనే సౌభాగ్యం, నిలువెల్లా తిలకించి పులకించే అదృష్టం కలిగించిన అష్టకాలవారు కీర్తినీయ చరితులు.

ఈ గుడి కట్టించడానికి దశాబ్దాలు పట్టింది. ఏ ఒక్కరినీ యాచించకుండా, ఎవ్వరి దగ్గర తలవంచకుండా అవధాన ప్రదర్శనల ద్వారా వచ్చిన సొమ్ముతో, ఎవరైనా భక్తితో, అనురక్తితో సమర్పించినవాటితోనే ఈ నిర్మాణం ఆద్యంతం జరిగింది. మెదక్ జిల్లా అనంతసాగర్‌లో నెలకొని వున్న ఈ అమ్మవారు నేడు కోటి ప్రభలతో కోట్లాదిమందికి అనంత విద్యా విభూతిని అందిస్తోంది. కొండల్లో నిండుగా నిలుచున్న ఆ పలుకులమ్మ పరమ ఆకర్షణాశోభితంగా ఉంటుంది.

ఈ ప్రయాణంలో అష్టకాలవారు ఆసేతు సీతాచలం తిరిగారు. ఊరికే తిరగడం కాదు, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ వేలకొలది సరస్వతీ యజ్ఞాలు నిర్వహించారు. శారదాదేవి మూర్తిమత్వాన్నీ, సరస్వతీదేవి తత్త్వాన్నీ వాడవాడలా చాటిచెప్పారు.



కవిగా వాసికెక్కారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎందరికో ఉన్నత విద్యను అందించారు. ఉత్తమోత్తమైన రచనలు చేశారు. జ్యోతిష్యం, వాస్తు, భూగర్భ జలశాస్త్రంలో అనిర్వచనీయమైన ప్రతిభను సొత్తుగా చేసుకొని ఎందరో ఉన్నతికీ, ఎంతో ప్రగతికీ మెట్లు కట్టారు. పదునారేళ్ల ప్రాయంలోనే పద్యాల పంటల సిరులు పండించారు. ఇరవైఏళ్ళు రాక మునుపే కావ్యకర్తగా రాణకెక్కారు. తెలంగాణ, కోస్తా, రాయలసీమతో పాటు కాశీక్షేత్రంలోనూ వందలాదిగా అవధాన ప్రదర్శనలు చేశారు. అష్టకాలవారి అవధాన పద్యాలు సరసరమణీ లలామలు. కృతులు ఆకృతి దాల్చిన పండువెన్నెలలు. తన అవధాన ప్రస్థానానికి అయలావఝుల వెంకటరమణయ్య కారకులు, ప్రేరకులుగా నిలిచారు. కార్యంపూడి రాజమన్నార్, గడియారం వేంకటశేషశాస్త్రి, వానమామలై వరదాచార్యులు వంటి దిగ్గంతుల పేరున పురస్కారాలు అందుకున్నారు. ఎన్నో బిరుద భూషణములు కలికితురాయిగా చేరాయి.


మనోహరమ్మ, లక్ష్మయ్య దంపతులకు 1943లో వరంగల్లులో జన్మించిన నరసింహరామశర్మ ఎనిమిది పదుల జీవితాన్ని పరిపూర్ణంగా పండించుకున్నారు. విద్యాభ్యాసం సిద్దిపేట, వరంగల్లులో సాగించి ఎంఏ తెలుగులో పట్టభద్రులు అయ్యారు. అష్టకాలవారి జీవితం, రచనపై ఒకరు పరిశోధన చేసి పీహెచ్‌డీ కూడా పొందారు. 'తుకారామస్వామి చరిత్ర' గ్రంథంపై ఒకరు ఎం.ఫిల్ తీసుకున్నారు. గజారోహణాది గౌరవాలు పొందిన ఘనులు అష్టకాల.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

(ఫిబ్రవరి 9న అష్టకాల నరసింహ రామశర్మ తుదిశ్వాస విడిచారు.)

హరప్పా అవశేషాలలో శివావతారాలు

సందర్భం



డా॥ చిఱ్ఱావూరి శివరామకృష్ణశర్మ

భారతదేశంలో హరప్పా వంటి గ్రామాలలో నిర్వహించిన త్రవ్వకాలలో లభించిన అవశేషాలలో శివుని అవతార చిత్రాలు (ముద్రికలు) కొన్ని లభించాయి. ఇవి భారతదేశంలో ఐదు వేల సంవత్సరాల వెనుక శివారాధన ఉందనడానికి ఆధారాలు.

హరప్పా అనే పదబంధంలో 'హర' పదం శివునికి పర్యాయనామం. హృ ఇన్ హరణే అనే ధాతువు నుండి హరపదం ఏర్పడింది. హారతి ప్రళయే సర్వమితి హారం– ప్రళయకాలంలో సర్వము హరించువాడు అని ఒక అర్థం. భక్తుల పీడను హరించువాడు అని మరియొక అర్థం.

మొహంజొదారో తవ్వకాలలో పశుపతి దేవుని ముద్రిక దొరికింది. పక్కన పశువులుండడం వలన దీనికి పశుపతి అని పేరు పెట్టి ఉంటారు. పశుపతి శివుని పర్యాయపదం (అమరకోశం 1–30). ఈ ముద్రికలో రుద్రుని తలపై పాము, దానికి అయిదు తలలు, దానికి తలపై మణి, మధ్యలో గంగా ప్రవాహం పైకి చిమ్ముతున్న స్థితి, రుద్రుని తలపై మరొక పక్క అర్ధ చంద్రుడు కనబడుతున్నాడు.

చిత్రంలో కుడివైపున దేవనాగరి ప్రణవం ఉంది. ముద్రికలో ఏనుగు బొమ్మ, మనిషి బొమ్మ, దానికింద ఆయుధం ఉన్నాయి. రుద్రునికి అలంకారాలు, కవచం కనబడుతున్నాయి. దీనికి మూడు తలలు గల పశుపతి దేవుని ముద్రిక అని పేరు పెట్టారు చరిత్రకారులు. కాని మూడు తలలు లేవు. జుట్టు లేని ఒకే శిరస్సు ఉంది (తరతరాల భారత చరిత్ర, పుట 21). కొందరు రెండు కొమ్ముల దేవుడు అన్నారు (చరిత్రలో మతాలు, పుట 2). అవి కొమ్ములు కావు. ఒకటి సర్పము, రెండవది అర్ధ చంద్రుడు. ఇది వేదం మొదలైన గ్రంథాలలో వర్ణించిన రుద్ర రూపమని 'శ్రుతి సౌరభం' గ్రంథంలోనూ, సింధు సంస్కృతి– నమకంలోని 'రుద్రుడు' అనే వ్యాసంలోనూ నిరూపించడం జరిగింది (వేద పరిషత్ వార్షిక సంచిక 2002–2003, 64, 65 పుటలు).

ప్రణవానికి పరమున గలవాడు పరమేశ్వరుడని తైత్తిరేయారణ్యకము అనే వేదభాగం చెప్పింది(10 ప్ర. 12 అ. 3 ప.). శివధ్యానాల్లో తలపై చంద్రుడు, గంగ ఉండడం ప్రసిద్ధమే. రుద్రునికి గంగాధరుడని పేరు. గంగని తలపై ధరించిన వాడని అర్థం. శివాష్టోత్తర శతనామ స్తోత్రంలో కూడా ఈ నామముంది (అమరం– 1–54). భయః అని మరొక పేరు (అమరం 1–35). వీరి వలన భయపడతారు అని అర్థం. నమకంలో 'ఉగ్రాయ' అనే నామం ఉంది. తీవ్రమైన వాడు అని అర్థం. హరప్పా రుద్రుని చూస్తే భయం కలుగుతుంది.



పశుపతి ముద్రిక

శివ సహస్ర నామ స్తోత్రంలో గణేశ్వర, నరర్షభ అనే నామాలున్నాయి (148 శ్లో.). పశుపతి దేవుని ప్రక్కన ఎడమవైపు ఏనుగునూ, మనుష్యునీ చిత్రించారు. శివ సహస్ర నామ స్తోత్రంలో ముండః= తలపై జుట్టు లేనివాడు అనే నామముంది. పశుపతి దేవునికి జుట్టు లేదు. నమకంలో వ్యుప్తకేశ నామముంది. దీనికి కూడా అదే అర్థం. నమకంలో తారాయ అనే నామముంది. ప్రణవ స్వరూపుడని అర్థం. పశుపతి దేవుని ప్రక్కన ప్రణవముంది.

నమకంలో 'కవచినే' అనే నామముంది. కవచం కలవాడు శివుడు. పశుపతి దేవునికి కవచం ఉంది. నమకంలో 'పశుపతయే' అనే నామం ఉంది. పశుపతి దేవుని ముద్రిక అని పేరులోనే ఉంది కదా!

'ఆయుధినే' అని నమకంలో ఉంది. ఆయుధం కలవాడు అని అర్థం. పశుపతి పక్క బాణాయుధం ఉంది కదా! నమకంలో కూడా ఇషువు కలవాడని తెలిపే నామం ఉంది (కృష్ణయజుర్వేదం 4 అ. 5ప.). రుద్రునికి నందీశ్వరావతారం ఉంది(శివపురాణం శత రుద్ర సం. 6 అ.). శివునికి వృషభావతారం ఉంది (శివపు. శతరుద్ర సం. 23 అ.). హరప్పా అవశేషాలలో వృషభ చిత్రముంది.

రుద్రునికి ద్విజేశ్వరావతారం, ద్విజావతారం ఉన్నాయి (శివపు. శతరుద్ర– 27, 35 అ.). హరప్పా అవశేషాలలో యజ్ఞోపవీతం వలె వస్త్రాన్ని ధరించిన ద్విజ చిత్రం ఉంది. యజ్ఞోపవీతం ఉత్తరీయం వలె ధరించమని వేదంలో ఉంది (తైత్తిరీయ అరణ్యకం. 2ప.).

కొమ్ములుంటాయి. తలపై సర్పముండదు. హరప్పా అవశేషాలలో నందీశ్వర రూపముంది. రుద్రునికి కిరాతేశ్వరావతారముంది. (శివపు. శతరుద్ర. 37 అ.). హరప్పా అవశేషాలలో కిరాత చిత్రముంది.

ఇలా పేరు, వేదం, శివ పురాణాల్లో, శివాష్టోత్తర శత నామ స్తోత్రం, శివ సహస్ర నామ స్తోత్రం అనే గ్రంథాల ద్వారా పరిశీలిస్తే హరప్పా సంస్కృతిలో శివారాధన ఉందని తెలుస్తోంది. ఆసక్తి కలవారు కోరితే ఈ అవతార కథలను కూడా తెల్పవచ్చు.

వ్యాసకర్త రచయిత, వేద పండితులు

(నేడు మహాశివరాత్రి పర్వదినం)

ఖమ్మం మిర్చి.. విదేశాల్లో క్రేజీ!

నాణ్యత, రంగు, ఘాటుతో డిమాండ్

ఇక్కడి పంటలో 70 శాతం చైనాతోపాటు ఇతర దేశాలకు సరఫరా | ఏటా రూ.2వేల కోట్లకుపైనే ఎగుమతులు | కాస్మొటిక్స్ నుంచి టియర్ గ్యాస్ దాకా వివిధ అవసరాల్లో వినియోగం

సాక్షి ప్రతినిధి, ఖమ్మం

మిర్చి అంటేనే హాట్.. కానీ ఖమ్మం మిర్చి మరింత హాట్.. ఎందుకంటే విదేశాల్లో ఈ మిర్చికి హాట్ హాట్‌గా డిమాండ్ పెరిగిపోతోంది. ఖమ్మం రైతులు పండిస్తున్న మిర్చిలో 70శాతం మేర చైనా, థాయిలాండ్, మలేషియా, ఇండోనేషియా, బంగ్లాదేశ్, శ్రీలంక తదితర దేశాలకు ఎగుమతి అవుతోంది. ఘాటు ఎక్కువగా ఉండే తేజ రకం మిర్చి ఎక్కువగా సాగు చేయడం, తెగుళ్ల వంటివి పెద్దగా లేకుండా నాణ్యమైన దిగుబడులు రావడంతో డిమాండ్ మరింత పెరిగిందని రైతులు, వ్యాపారులు చెప్తున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నుంచి ఏటా రూ.2 వేల కోట్లకుపైగా మిర్చి ఎగుమతి అవుతుండటం గమనార్హం.



ఖమ్మంలో మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న మహిళా కూలీలు

ఖమ్మం టు చైనా.. వయా చెన్నై



తామర పురుగు బెడదతో రైతులు ఈసారి ముందుగానే మిర్చిని సాగు చేయగా జనవరి నుంచే ఎగుమతులు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షకుపైగా ఎకరాల్లో మిర్చి సాగవుతోంది. సమీపంలోని సూర్యాపేట, నల్లగొండ, మహబూబాబాద్, హనుమకొండ, ఏపీలోని కృష్ణా, గుంటూరు రైతులు కూడా ఖమ్మం మార్కెట్‌లో మిర్చి విక్రయిస్తారు. వ్యాపారులు విదేశాల నుంచి ఆర్డర్లు తీసుకుని ఇక్కడ మిర్చిని కొనుగోలు చేస్తున్నారు. ఆ మిర్చిని వాహనాల్లో చెన్నైతోపాటు తమిళనాడులోని కాట్‌పల్లి, ఆంధ్రాలోని కృష్ణపట్నం, విశాఖపట్నం, ముంబై పోర్టులకు తరలించి నౌకల్లో విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రధానంగా చైనాలో ఎక్కువ కారం ఉండే మిర్చి దొరకకపోవడంతో.. ఖమ్మం మిర్చిని దిగుమతి చేసుకుంటారని వ్యాపారులు చెప్తున్నారు.

3 రూపాల్లో ఎగుమతి..

మన దేశంలో ఎక్కువగా పొడి కారం వినియోగిస్తారు. విదేశాల్లో నేరుగా ఎక్కువగా వాడుతారు. ఈ క్రమంలోనే మూడు రకాలుగా.. ఫుల్ మిర్చి (పూర్తిస్థాయి మిరప), స్టెమ్‌కట్ (తొడిమ కత్తిరించి), స్టెమ్‌లెస్ (తొడిమ పూర్తిగా తొలగించి) మిర్చిగా ఎగుమతులు జరుగుతాయి. స్టెమ్‌కట్ కోసం యంత్రాలను ఉపయోగిస్తారు. స్టెమ్‌లెస్ విధానంలో పంపే వ్యాపారులు మహారాష్ట్ర, నాగ్‌పూర్, మధ్యప్రదేశ్ నుంచి వచ్చి ఖమ్మంలో కొనుగోలు చేసి తీసుకెళ్లారు.



మిర్చి ఆయిల్ రూపంలోనూ..

చైనా వంటి దేశాల్లో మిర్చిని కాయల రూపంలో వాడితే.. ఉత్తర అమెరికా, యూరప్ దేశాల్లో మిర్చి నుంచి తీసిన ఆయిల్‌ను ఉపయోగిస్తారు. ఇందుకోసం మిర్చి నుంచి నూనె తీసే కంపెనీలు ఖమ్మం జిల్లా ముదిగొండ, మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మన్నెగూడం, మరిపెడ బంగ్లా, హైదరాబాద్‌లోని శ్రీశైలం రోడ్డులో ఉన్న కందుకూరు తదితర ప్రాంతాల్లో ఏర్పాటయ్యాయి. 100 కేజీల మిర్చిని ప్రాసెస్ చేస్తే 8.50 కేజీల పొడి, కేజీన్నర ఆయిల్, మిగతా పిప్పి వస్తుందని చెప్తున్నారు. మిర్చి ఆయిల్‌ను ఆహార పదార్థాల్లో వినియోగించడంతోపాటు సుగంధ ద్రవ్యాలు, ఔషధాలు, టియర్ గ్యాస్, కాస్మొటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తారు.

చైనా రెస్టారెంట్లలో మన మిర్చే..

చైనాలో హాట్ పాట్ రెస్టారెంట్లు ఎక్కువగా ఉన్నాయి. అంటే సిద్ధం చేసిన ఆహారం కాకుండా.. దినుసులు అందజేస్తారు. వాటితో సిద్ధం చేసుకుని తింటుంటారు. ఈ క్రమంలో వినియోగదారులకు 10 నుంచి 15 వరకు స్టెమ్‌లెస్ మిర్చి ఇస్తారు. ఇందుకోసం ఖమ్మం నుంచి దిగుమతి చేసుకునే మిర్చినే వినియోగిస్తారని వ్యాపారులు చెప్తున్నారు.



విదేశాల్లో ఖమ్మం మార్కెట్‌కు గుర్తింపు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పండే మిర్చి నాణ్యత బాగుండటంతో ఎగుమతులు ఎక్కువగా ఉంటున్నాయి. ప్రభుత్వం కూడా వ్యాపారులను ప్రోత్సహిస్తోంది. దీంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది.
- దోరేపల్లి శ్వేత, చైర్‌పర్సన్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్

ఎనిమిదేళ్లుగా ఎగుమతి చేస్తున్నా..

మా నాన్న మిర్చి రైతు. నేను ఎనిమిదేళ్లుగా విదేశాలకు ఎగుమతి చేస్తున్నాను. తేజ రకానికి విదేశాల్లో డిమాండ్ ఉంది.
- బొప్పన జగన్‌మోహన్‌రావు, మిర్చి ఎగుమతిదారు, ఖమ్మం



దిగుబడి బాగుంది

ఐదెకరాల్లో తేజ రకం సాగు చేస్తున్నా. ఈసారి మూడెకరాల్లో సాగు చేశా. మొదటి తతలో 30 క్వింటాళ్ల దిగుబడి రాగా.. మరో 30 క్వింటాళ్లు వస్తుంది. క్వింటాల్‌కు రూ.18,200 ధర వచ్చింది.
- బానోత్ శంకర్, రైతు, మహబూబాబాద్ జిల్లా

దేశ సంపదను మోదీ దోచిపెట్టేస్తున్నారు

- ఒడిశా కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక

సాక్షి, హైదరాబాద్: తన స్నేహితులకు దేశ ఖజానాను దోచిపెట్టే పనిలో మోదీ ఉన్నారని ఒడిశా రాష్ట్ర కోరాపుట్ కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి ఉలక వ్యాఖ్యానించారు. దేశ సంపదపై కొందరే గుత్తాధిపత్యం చలాయిస్తున్నారని, వారికి ప్రధాని మోదీ వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. గాంధీభవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో టీపీసీసీ నేతలు అంజన్‌కుమార్‌యాదవ్, బొల్లు కిషన్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నిజాముద్దీన్‌లతో కలసి ఆయన మాట్లాడారు. ప్రపంచ ధనికుల జాబితాలో 609వ స్థానంలో ఉన్న అదానీ 2వ స్థానానికి ఎలా ఎగబాకారో దేశ ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారని అన్నారు. మోదీ, అదానీల కుంభకోణంపై, కేంద్ర వైఫల్యాలపై ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నాయని ధ్వజమెత్తారు.

రేవంత్, షర్మిల మాటలన్నీ అబద్ధాలే!

- ఆరోపణలు రుజువుచేస్తే నేను రాజీనామా చేస్తా
- లేదంటే వారు రాజకీయ సన్యాసం తీసుకోవాలి
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సవాల్



జనగామ: పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేని రేవంత్‌రెడ్డి, వైఎస్ షర్మిల తనపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నిరూపిస్తే తన మంత్రి పదవికి రాజీనామా చేస్తానని.. లేకుంటే ఆ ఇద్దరూ రాజకీయ సన్యాసం తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సవాల్ విసిరారు. శుక్రవారం ఆయన జనగామ జిల్లా యశ్వంతాపూర్‌లోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజల కోసం జైలుకు వెళ్లానే తప్ప.. అవినీతి, అక్రమాలు చేసికాదు'అని ఆయన అన్నారు. రేవంత్ మాత్రమే కాదు, ఆయన చుట్టూ ఉన్న చాలామందిపైన భూ దందా, కబ్జా కేసులు ఉన్నాయన్నారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన రేవంత్.. ఇప్పటికీ చంద్రబాబు ఏజెంట్‌గా పనిచేస్తున్నారన్నారు. రేవంత్, షర్మిలకు తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేదని, స్వరాష్ట్ర ఆకాంక్ష కోసం తాను పట్టుబట్టి చంద్రబాబుకు ఇష్టం లేకున్నా, తెలంగాణకు అనుకూలంగా ఆయనతో లెటర్ ఇప్పించానన్నారు. 'ఇంటర్ వరకే చదువుకున్నా.. ప్రజల మనోభావాలను వందశాతం చదివినా.. వారి అవసరాలను తీరుస్తూ అభివృద్ధి చేస్తున్నా'అని చెప్పారు. 'నేను ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచాను.. ఒకేచోట రెండోసారి గెలుస్తాననే నమ్మకం లేని రేవంత్‌రెడ్డి తనతోపాటు సీఎం, ఎమ్మెల్యేలను చులకన చేసి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రేవంత్‌రెడ్డి ఏ పార్టీలో ఉన్నా.. ఐరన్‌లెగ్‌గా మారిపోతున్నారని సొంత పార్టీ నేతలే గుర్రుగా ఉన్నారని ఆరోపించారు. గత ఎన్నికల్లో 15 సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో 5 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. తమ తాత, ముత్తాలకు 16 వందల ఎకరాల భూములు ఉండేవని.. ప్రజా సేవ కోసం అమ్ముకుంటూపోగా, ఇప్పుడు తమకు వంద ఎకరాలు కూడా లేవన్నారు. 500 మంది కిరాయి గూండాలతో కారులో తిరుగుతూ పాదయాత్ర పదాన్ని అపహాస్యం చేస్తున్నారని రేవంత్‌పై ఆయన ఫైర్ అయ్యారు.

బహిరంగ చర్చకు సిద్ధమేనా

- మంత్రి ఎర్రబెల్లి, బీఆర్ఎస్ నాయకులకు షర్మిల సవాల్

సాక్షి, మహబూబాబాద్: 'నేను మీపై చేసిన ఆరోపణలను అన్ని ఆధారాలతో సహా నిరూపిస్తా.. మీ నిజాయితీని నిరూపించుకునేందుకు బహిరంగ చర్చకు సిద్ధమేనా'? అని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు, బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. షర్మిల పాదయాత్ర శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మడిపెల్లి గ్రామ శివారునుంచి సాగింది. ఈ సందర్భంగా నెల్లికుదురు, మడిపెల్లిలో ఆమె మాట్లాడారు. వందల ఎకరాల భూమి ఎలా వచ్చిందని మంత్రిని ప్రశ్నించారు. ఆడదానివి కాబట్టి ఉపేక్షిస్తున్నారని మంత్రి అనడం విడ్డూరంగా ఉందన్నారు. అవుతాపురంలో వైఎస్ విగ్రహం ఏర్పాటుకు సహకరించిన వారిపై మంత్రి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని బెదిరించినట్లు తన దృష్టికి వచ్చిందని షర్మిల పేర్కొన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తనయాత్రను అడ్డుకునేందుకు చేయని ప్రయత్నం లేదని, ఆయన తనను అడ్డుకుంటే వైఎస్ఆర్ అభిమానులు తడాకా చూపిస్తారని అన్నారు.



ఆటో ప్రయాణికులతో మాట్లాడుతున్న షర్మిల

మార్చి 5న షర్మిల పాదయాత్ర ముగింపు

సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేపట్టిన ప్రజాప్రస్థానం మహా పాదయాత్ర మార్చి 5వ తేదీన ముగియనున్నదని ఆ పార్టీ ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ వాడుక రాజగోపాల్ తెలిపారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి నిత్యం జనం మధ్యలోనే ఉంటూ అనేక పోరాటాలు చేశారన్నారు. ఈ నెల 20న డోర్నకల్ నియోజకవర్గం మీదుగా షర్మిల పాదయాత్ర పాలేరులో అడుగుపెడుతుందన్నారు. ఆ నియోజకవర్గంలోని కూసుమంచిలో జరిగే సభతో పాదయాత్ర ముగుస్తుందని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

భైంసాలో ఆర్ఎస్ఎస్ ర్యాలీ వాయిదా

సాక్షి, హైదరాబాద్: నిర్మల్ జిల్లా భైంసాలో ఆర్ఎస్ఎస్ నిర్వహించ తలపెట్టిన ర్యాలీ వాయిదా పడింది. ఈ నెల 19న మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 వరకు గంటపాటు ఈ ర్యాలీ నిర్వహణకు అనుమతి కోరుతూ ఆర్ఎస్ఎస్ స్థానిక పోలీసులకు దర ఖాస్తు చేసింది. అయితే పోలీసులు మౌఖికంగా అనుమతి నిరాకరించారని, ర్యాలీకి అనుమతి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఆర్ఎస్ఎస్ భైంసా సంఘ చాలక్ సాదుల కృష్ణదాస్ హైకోర్టును ఆశ్రయించారు. న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించారు.

'బీడీ వర్కర్స్ నేతలను విడుదల చేయాలి'

సాక్షి, హైదరాబాద్: దశాబ్దాలుగా బీడీ కార్మికోద్యమంలో పనిచేస్తున్న శ్రామిక శక్తి తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సామ అనసూయ, రాష్ట్ర నాయకురాలు వెంకటలక్ష్మిలను కామారెడ్డి పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. బేషరతుగా వీరిని విడుదల చేయాలని, విమలక్కతో సహా మిగతా వాళ్లపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశాయి. వృద్ధాప్యం, అనారోగ్యంతో బాధపడుతున్న అనసూయ, వెంకటలక్ష్మిలపై బెదిరింపులు, ట్రెస్ పాస్‌లతో పాటు ఆయుధాల కేసును మోపి అక్రమంగా నిర్బంధించడం దారుణమని అన్నాయి.

క్లుప్తంగా...

'గువ్వల, రేగాలది గుప్తనిధుల దందా'

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, రేగా కాంతారావు అడవుల్లోని గుళ్లలో గుప్తనిధుల కోసం తవ్వకాలు సాగించి అక్రమదందా చేస్తున్నారని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా ఆరోపించారు. గ్రామాల్లో పాతకాలం గుడులను గుప్తనిధుల కోసే తవ్వే మాఫియాకు వీరిద్దరూ రాష్ట్ర అధ్యక్షులని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. గుప్తనిధుల తవ్వకాల కోసమే స్వామీజీలను తీసుకొచ్చి మొయినాబాద్ ఫామ్‌హౌజ్‌లో నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దొరికిపోవడంతో బీజేపీ తమను కొనుగోలు చేస్తోందనే నాటకానికి తెరలేపారని ఆరోపించారు. శుక్రవారం ఆయన మాజీ మంత్రి ఎం.రవీంద్ర నాయక్ మరికొందరు నేతలతో కలసి మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కార్, సీఎం కేసీఆర్ అరాచకాలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బయటపెడుతుండడంతో ఎదురు సమాధానం చెప్పలేక ఆయనపై పనికి మాలిన విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. నల్లమల అడవుల్లో గువ్వల బాలరాజు చేస్తున్న అరాచకాలు, శివాలయాలు, అమ్మవారి దేవాలయాలను అభివృద్ధి పేరిట దోచుకోవడం, దళితబంధు లబ్ధిదారుల నుంచి రూ.2, 3 లక్షల కమీషన్లు తీసుకోడం వంటివి అక్కడి ప్రజలందరికీ తెలుసునన్నారు. సీఎం హోదాలో కేసీఆర్‌కు ఇవే చివరి పుట్టినరోజు వేడుకలని, వచ్చే ఏడాది అధికారాన్ని కోల్పోయి ఆయన జైలుకు వెళ్లాల్సి వస్తుందని రవీంద్ర నాయక్ హెచ్చరించారు.

ఆర్ఎస్ఎస్ పత్రికలను నిషేధించాలి



నిజాంసాగర్(జుక్కల్): ఆర్ఎస్ఎస్ సంస్థకు చెందిన పాంచజన్య వార్తా పత్రిక సుప్రీంకోర్టుమీద దాడి చేయడం గర్హనీయమని ఆర్ఎస్ఎస్ పత్రికల్ని నిషేధించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బీజేపీకి అనుకూలంగా తీర్పు ఇస్తే న్యాయం, ధర్మం నాలుగు పాదాల మీద నడుస్తుందని రాస్తుందని, ఆ పార్టీకి వ్యతిరేకంగా తీర్పులిస్తూ రాజ్యాంగాన్ని రక్షించే ప్రయత్నం చేస్తే మాత్రం ఇలా దాడులకు తెగబడతారా అని మండిపడ్డారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్ మండలంలో శుక్రవారం ఆయన బహుజన రాజ్యాధికార యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ...బీబీసీ మీద ఆదాయ పన్ను శాఖ (ఐటీ) దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వానికి తొమ్మిదేళ్లుగా గుర్తుకు రాని ఐటీ ఎగవేత, ఇవాళ ప్రధాని నరేంద్ర మోదీపై బీబీసీ డాక్యుమెంటరీ తీయడంతోనే ఐటీ దాడులు చేయించడం హేయమైన చర్యగా అభివర్ణించారు.

ప్రజాదరణ తట్టుకోలేక దాడులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజాగోస-బీజేపీ భరోసా'స్ట్రీట్ కార్నర్ సమావేశాలకు వస్తున్న ప్రజాదరణను తట్టుకోలేక పలుచోట్ల బీఆర్ఎస్, ఎంఐఎం దాడుల సంస్కృతికి తెర లేపాయని బీజేపీ ఉపాధ్యక్షుడు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు ఆరోపించారు. జనగామ, బాన్సువాడ, పాతబస్తీ, తదితర ప్రాంతాల్లో బీజేపీ నేతలపై ఈ పార్టీల కార్యకర్తలు దాడులు చేస్తున్నా పోలీసులు చేష్టలుడిగి చూస్తున్నారని మండిపడ్డారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ బాన్సువాడలోని లక్ష్మీనగర్, దుర్గిలలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి తన అనుచరులను దాడులకు పురిగొలిపారని ఆరోపించారు. బహదూర్‌పురాలో ఎంఐఎం కార్పొరేటర్ బాబర్, అనుచర గూండాలు జరిపిన దాడిని ఖండిస్తున్నామన్నారు. ఈ నెల 25 వరకు 11వేల స్ట్రీట్ కార్నర్ సమావేశాలకు.. ఇప్పటికి 2,400 సమావేశాలు జరిగాయని, 19వ తేదీ నుంచి మరింత ఉధృతంగా నిర్వహిస్తామని చెప్పారు.

లంచం ఇవ్వలేను... కనికరించండి!

- నాగలి ఎత్తుకొని అర్ధనగ్నంగా డీజీపీ కార్యాలయానికి అన్నదాత

దుగ్గొండి/ఖైరతాబాద్: తనకు రావాల్సిన ఆస్తి విషయమై న్యాయం చేయాలని కోరుతూ ఓ రైతు వినూత్నంగా నిరసన బాటపట్టాడు. లంచాలు ఇవ్వకపోవడంతో తనకెవరూ న్యాయం చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తన మొర వినిపించేందుకు నాగలి ఎత్తుకొని అర్ధనగ్నంగా డీజీపీ కార్యాలయానికి వెళ్లాడు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం పొనకల్‌కి చెందిన గట్ల సురేందర్ అన్నదమ్ముల మధ్య కొన్నేళ్లుగా ఆస్తి గొడవలు ఉన్నాయి. ఊరి పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ కూడా జరిగింది. అయితే పెద్ద మనుషులు లంచాలు తీసుకుని ఫోర్జరీ పత్రాలు సృష్టించి తనకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఈ మేరకు రాసి ఉన్న ఫ్లెక్సీని నాగలికి కట్టాడు. ఆ నాగలిని ఎత్తుకుని హైదరాబాద్ ఇందిరాపార్కు నుంచి డీజీపీ కార్యాలయం వరకు నడుచుకుంటూ బయలుదేరాడు. డీజీపీ కార్యాలయం వద్ద పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. జిల్లా కార్యాలయాల్లో మూడేళ్లుగా తన సమస్య పరిష్కారం కాకపోవడంతో హైదరాబాద్ వచ్చానని సురేందర్ అన్నారు.



నాగలికి ఫ్లెక్సీ కట్టుకుని డీజీపీ కార్యాలయానికి వెళుతున్న రైతు సురేందర్

నకిలీ పోచంపల్లి చీరలతో దేశప్రతిష్టకు భంగం

- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్

సాక్షి, న్యూఢిల్లీ: నకిలీ పోచంపల్లి ఇక్కత్ చీరలతో దేశ ప్రతిష్టను పలు వెడ్డింగ్‌మాల్స్ నిర్వాహకులు మంటగలుపుతున్నారని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ ఆరోపించారు. దీని ద్వారా ప్రభుత్వాలకు పన్నుల ఎగవేతతో పాటు, చేనేత మిల్లు వస్త్రాలకు ఒకే పన్ను ఉండటంతో ప్రజలను నమ్మించి షాపింగ్‌మాల్స్ మోసం చేస్తున్నాయని తెలిపారు. ఒకే వ్యక్తి 30కి పైగా షాపులను నిర్వహిస్తూ, మనీ ల్యాండరింగ్, ఇన్‌సైడ్ ట్రేడింగ్‌కు పాల్పడుతున్నారని మండపడ్డారు. ఈ అంశంపై ఇప్పటికే ఈడీ, సీబీఐకు ఫిర్యాదు చేశామని సురేశ్ తెలిపారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టుబడిన నకిలీ పోచంపల్లి ఇక్కత్ చీరలను ప్రదర్శించారు. కార్పొరేట్ షాపింగ్‌మాల్స్ కులవృత్తులను నమ్ముకున్న బీసీ వర్గాల శ్రమను దోచుకుంటున్నారని, ఈ విషయాలను ఆధారాలతో సహా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, సీబీఐ డైరెక్టర్, జాతీయ బీసీ కమిషన్ చైర్మన్, హ్యాండ్లూమ్ బోర్డు కమిషనర్‌కు తెలియజేశామని వివరించారు. ఈ అంశంలో వీలైనంత త్వరగా విచారణ చేపట్టాలని కోరుతూ ప్రధానమంత్రి కార్యాలయం, జౌళి శాఖ మంత్రి కార్యాలయం, కేంద్ర ఆర్థిక శాఖమంత్రి కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

క్లుప్తంగా...

75 ఏళ్లు దాటితే యోగ్యతా పరీక్షలు పెట్టాలి: నిక్కీ హేలీ



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష అభ్యర్థిగా పోటీ పడుతున్న వారిలో 75 ఏళ్ల వయసుకు పైబడి ఉంటే వారికి ఎంత వరకు ఆ పదవికి యోగ్యత ఉందో అమెరికన్లు తప్పనిసరిగా చూడాలని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీపడుతున్న భారతీయ సంతతికి చెందిన నిక్కీ హేలీ అభిప్రాయపడ్డారు. దేశ రాజకీయాల్లోకి కొత్త తరం నాయకత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. ఫాక్స్ న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ వాషింగ్టన్‌లో ఎందరో రాజకీయ నాయకులకు వయసు మీదపడిందన్నారు. కాంగ్రెస్‌కి ఎన్నికవాలంటే వయసు పరిమితి విధించాల్సిన అవశ్యకత ఉందని హేలీ అన్నారు. అధ్యక్ష అభ్యర్థిగా ఎన్నికైన 75 ఏళ్లకు పైబడిన వారికి యోగ్యతా పరీక్షలు నిర్వహించాలని కొత్త ప్రతిపాదన చేశారు. మరోవైపు హేలీ అభిప్రాయాలను వైట్ హౌస్ కొట్టిపారేసింది. ఇప్పటికే అధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడుతూ ఉండడం, వారి వయసు 75 దాటిపోవడంతో హేలీ చేసిన ప్రతిపాదనపై విమర్శలు మొదలయ్యాయి. ఇలాంటి వ్యాఖ్యలు, విమర్శలు, దాడులు గతంలో కూడా చూశామని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరీనా జీన్ పియరే అన్నారు.

కారు కింద పడి.. 3 కి.మీ. ఈడ్చుకెళ్లి

యూపీ గ్రామంలో ఢిల్లీ తరహా ఘటన
22 ఏళ్ల యువకుడి బలి

బుదాన్ (యూపీ): దేశ రాజధాని ఢిల్లీలో కారు కింద పడ్డ యువతిని ఈడ్చుకొని కొన్ని కిలోమీటర్లు వెళ్లిన తరహా ఘటనలు తరచూ జరగడం ఆందోళన కలిగిస్తోంది. ఉత్తరప్రదేశ్‌లో శుక్రవారం ఉదయం మార్నింగ్ వాక్‌కి వెళ్లిన ఒక యువకుడి నిండు ప్రాణాలు ఇలాగే బలయ్యాయి. యూపీ పోలీసులు అందించిన వివరాల ప్రకారం సిరసోలా గ్రామానికి చెందిన 22 ఏళ్ల వయసున్న ఉమేష్ కుమార్ శుక్రవారం ఉదయం మార్నింగ్ వాక్‌కు బయల్దేరగా వెనుక నుంచి వచ్చిన కారు అతనిని ఢీకొట్టింది. కారు బోనెట్‌పైకి ఎగిరి మళ్లీ కిందపడిన కుమార్ ముందువైపునున్న ఎడమ చక్రంలో ఇరుక్కుపోయారు. అయినా కూడా కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా 3 కి.మీ. ప్రయాణించాడు. దీనిని చూసిన స్థానికులు ఆ కారుని వెంబడించి అతనిని పట్టుకున్నారు. తీవ్రంగా గాయపడ్డ కుమార్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. పోలీసులు డ్రైవర్‌ని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

గ్లోబల్ వార్మింగ్‌కు... చంద్రధూళితో చెక్

భూమిపైకి వచ్చే సూర్యరశ్మిని తగ్గించడమే లక్ష్యం

- అందుకోసం అంతరిక్షంలో భారీగా ధూళిమేఘాలు
- భూమికి, సూర్యునికి మధ్య పరచాలంటున్న సైంటిస్టులు
- సాధ్యాసాధ్యాలపై జోరుగా చర్చ



చంద్రుడంటేనే చల్లదనానికి చక్కని ప్రతీక. అందుకే చల్లని రాజా అంటూ చందమామపై సినీ కవులు ఎన్నో పాటలు కూడా కట్టారు. గ్లోబల్ వార్మింగ్ దెబ్బకు నానాటికీ ప్రమాదకరంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు అడ్డుకట్ట వేసి భూమిని చల్లబరిచేందుకు కూడా చంద్రుడు ఎంతో సాయపడగలడట. అమెరికా సైంటిస్టుల బృందమొకటి ఈ దిశగా వినూత్నమైన ప్రతిపాదనతో ముందుకొచ్చింది. చంద్రధూళిని అంతరిక్షంలోకి వెదజల్లడం! తద్వారా భూమిపై పడే సూర్యరశ్మిని కొద్దిగా మళ్లించడం!! ఆ మేరకు భూమిని చల్లబరచడం..!!!

- సాక్షి, నేషనల్ డెస్క్

ఏమిటీ ప్రతిపాదన...?

చంద్రునిపై ఉన్న ధూళిని భారీ పరిమాణంలో తవ్వి తీయాలి. దాన్ని సూర్యునికేసి వెదజల్లాలి. అది భారీ ధూళి మేఘాల రూపంలో కనీసం ఓ వారం పాటు సూర్యునికి, భూమికి మధ్యలో నిలిచి ఉండేలా చూడాలి. అది చెదిరిపోయాక చంద్రునిపై మరో దఫా తవ్వకం. మరో వారం పాటు సూర్యునికి, భూమికి మధ్యలో మరిన్ని ధూళి మేఘాలు. ఇలా మొత్తమ్మీద ఏటా ఏకంగా కోటి టన్నుల చంద్ర ధూళిని భూమికి, సూర్యునికి మధ్య మేఘాల రూపంలో వెదజల్లాలన్నది ప్రతిపాదన.

ఏమిటి సమస్య?

- చంద్ర ధూళిని అంతరిక్షంలో వెదజల్లడం వినడానికి బానే ఉన్నా అందుకు చాలా సాంకేతికత అవసరం. అంతేగాక సాంకేతిత, రాజకీయ సవాళ్లతోనూ, అంతకుమించి భారీ వ్యయ ప్రయాసలతోనూ కూడిన పని కూడా. ఎందుకంటే...
- అన్నింటికంటే ముందుగా చంద్రునిపై భారీ సైజులో ఓ శాశ్వత స్థావరం ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. తర్వాత ధూళిని తవ్వి పోసే పరికరాలు తదితరాలను అక్కడికి చేరేసుకోవాలి.
- గత 50 ఏళ్లలో మనిషి చంద్రునిపై కాలు పెట్టలేదన్న వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఇదంతా ఎంత కష్టమో అర్థమవుతుంది.
- రాజకీయంగా చూస్తే ఈ మొత్తం ప్రయోగానికి ఎవరు సారథ్యం వహించాలి, ఇందులో ఏ దేశం పాత్ర ఎంతమేరకు, ఎలా ఉండాలన్నది మరో పెద్ద ప్రశ్న. అంతరిక్షంపై ఆధిపత్యం కోసం ఇప్పటికే పెద్ద దేశాల మధ్య పోటీ ఉద్రిక్తతలకు దారితీస్తున్న వేళ కేవలం ఓ పర్యావరణ లక్ష్యసాధన కోసం ఆభిజాత్యాలను పక్కన పెట్టి అవన్నీ ఏ మేరకు కలిసొస్తాయన్నది అనుమానమే.
- అంతరిక్షంలో భూమికి, సూర్యునికి మధ్య ప్రాంతమంతా పలు దేశాలు ప్రయోగించిన కృత్రిమ ఉపగ్రహాలతో నిండిపోయి ఉంది!
- ఇన్ని కష్టాలూ పడి ఒకవేళ విజయవంతమైనా ధూళిని వెదజల్లే ఉపాయం తాత్కాలిక ఫలితాలే ఇస్తుంది తప్ప గ్లోబల్ వార్మింగ్‌కు శాశ్వతంగా అడ్డుకట్టు వేసే స్థాయిలో దీర్ఘకాలికంగా పెద్దగా ప్రయోజనం కన్పించకపోవచ్చని కొందరు సైంటిస్టులు పెదవి విరుస్తున్నారు

చంద్రధూళే ఎందుకు?

- భూమిపై పడే సూర్యరశ్మి పరిమాణాన్ని కొంత మేరకు తగ్గించడం ద్వారా భూమిని చల్లబరచాలన్న ప్రతిపాదనలు ఎంతోకాలంగా ఉన్నవే. దీన్ని సోలార్ జియో ఇంజనీరింగ్, సోలార్ రేడియేషన్ మేనేజ్‌మెంట్‌గా పిలుస్తున్నారు.
- భూ వాతావరణపు పై పొరలోకి వాయు కణాలతో కూడిన సన్నని లేయర్‌ను పంపి భూమిపైకి వచ్చే సూర్యరశ్మిని కొద్దిమేరకు అడ్డుకోవాలన్న ప్రతిపాదనపై విస్తృతంగా చర్చ జరిగింది. కానీ ఇది ఆచరణ సాధ్యం కాదని, ఇలా వాతావరణపు పొరలతో చెలగాటమాడితే భూమిపై పలు ప్రాంతాల్లో వర్షపాతం తదితరాలు తీవ్రంగా ప్రభావితం కావచ్చన్న భయాల నేపథ్యంలో దానిపై ముందడుగు పడలేదు.
- మరికొందరు అంతరిక్షంలో భారీ అద్దాలు, లేదా ఫిల్టర్లను ఉంచాలని సూచించినా అవేవీ పెద్దగా ఆకట్టుకోలేదు.
- అదే చంద్రధూళిని వాడుకోగలిగితే ఇలాంటి సమస్యలేవీ లేకుండానే దిగ్విజయంగా పని పూర్తవుతుందన్నది తాజా యోచన.
- ఎందుకంటే చంద్రుని ఉపరితలంపై అది అపారంగా అందుబాటులో ఉంది.
- గురుత్వాకర్షణ శక్తి తక్కువగా ఉండే చంద్రుని పై నుంచి ధూళి మేఘాలను అంతేగాక భూమి పై నుంచి జరిపే ఏ ప్రయోగంతో పోల్చినా అత్యంత తక్కువ వ్యయ ప్రయాసలతో సులువుగా అంతరిక్షంలోకి తరలించవచ్చు.

బీబీసీలో ఆర్థిక అవకతవకలు జరిగాయ్

కీలక ఆధారాలు లభించాయన్న సీబీడీటీ

న్యూఢిల్లీ: బీబీసీ గ్రూప్‌లో ఆదాయ పన్ను శాఖ జరిపిన సర్వేలో కీలకమైన ఆధారాలు లభించాయని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) వెల్లడించింది. కొన్ని సంస్థలు చూపిస్తున్న ఆదాయం, లాభాలు భారత్‌లో వారి కార్యకలాపాలకు అనుగుణంగా లేవని, దాని విదేశీ సంస్థల చెల్లింపులపై కట్టాల్సిన పన్నుల్ని ఎగవేసిందని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉద్యోగులిచ్చిన వాంగ్మూలాలు, డిజిటల్ ప్రూఫ్‌లు, సేకరించిన డాక్యుమెంట్ల ద్వారా ఆ గ్రూప్‌లో భారీగా ఆర్థిక అవకతవకలు, పన్ను ఎగవేతలు చేసినట్టుగా ఆదాయ పన్ను శాఖ అధికారులు గుర్తించారని తెలిపింది. ప్రైసింగ్ డాక్యుమెంటేషన్ బదిలీకి సంబంధించి ఎన్నో వ్యత్యాసాలు, అవకతవకలు జరిగినట్టుగా ఐటీ సర్వేలో తేలిందని ఆ ప్రకటన వివరించింది. పన్ను చెల్లింపులో అవకతవకలు జరిగాయని ఆరోపించిన ఐటీ శాఖ సర్వే సమయంలో మందకొడిగా వ్యవహరిస్తూ ప్రతీది ఆలస్యం చేసే వ్యూహాలు రచించిందని ఆరోపించింది. ఢిల్లీ, ముంబై కార్యాలయాల్లో ఫిబ్రవరి 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు దాదాపు 60 గంటలు ఐటీ శాఖ సర్వే నిర్వహించింది. 2002 గుజరాత్ మతఘర్షణలకు సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని బాధ్యుడిగా ఆరోపిస్తూ ''ఇండియా ది మోదీ క్వశ్చన్'' పేరిట బీబీసీ డాక్యుమెంటరీని ప్రసారం చేసిన కొద్ది రోజుల్లోనే ఐటీ శాఖ సర్వే జరపడం చర్చనీయాంశంగా మారింది.

భారత్‌లో 450 మందికి గూగుల్ ఉద్వాసన !

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం గూగుల్‌లో కూడా లే ఆఫ్‌ల పర్వం మొదలైంది. భారత్‌లో ఒకేసారి 450 మందిని ఇంటికి పంపించింది. వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్టుగా గురువారం అర్ధరాత్రి దాటాక ఈ మెయిల్ ద్వారా సమాచారం అందించింది. గూగుల్ ఇండియా చీఫ్ సంజయ్ గుప్తా 450 మంది ఉద్యోగులకి ఉద్వాసన పలుకుతూ ఈ మెయిల్స్ పంపించారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ గత నెలలో 12 వేల ఉద్యోగుల్ని తొలగిస్తున్నట్టుగా ప్రకటించింది. అందులో భాగంగానే భారత్‌లో ఉద్యోగుల్ని తొలగించారా లేదంటే ఈ ఉద్యోగుల తొలగింపు అదనంగా చేశారా అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. మారుతున్న ఆర్థిక పరిస్థితులతో సంస్థ నష్టాలు చవిచూడాల్సి వస్తూ ఉండడంతో 12 వేల మందిని తొలగించడానికి నిర్ణయించుకున్నట్టు గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ వెల్లడించారు. మరోవైపు గూగుల్‌లో ఉద్యోగాలు కోల్పోయిన వారు లింక్డిన్ వేదికగా ఈ విషయంపై పోస్టులు ఉంచుతున్నారు. రాత్రికి రాత్రి ఉద్యోగం కోల్పోవడంతో కొత్త ఉద్యోగాలు వెతుక్కోవాల్సి వస్తోందన్నారు.

ట్విటర్ ఢిల్లీ ముంబై కార్యాలయాలు మూసివేత

సామాజిక మాధ్యమం ట్విటర్‌ను బిలియనీర్ ఎలన్‌మస్క్ కొనుగోలు చేసిన దగ్గర్నుంచి ఆ కంపెనీకి కష్టాలు తీరడం లేదు. కాస్ట్ కటింగ్ చర్యల్లో భాగంగా భారత్‌లోని మూడు కార్యాలయాల్లో రెంటింటిని మూసివేసింది. ఢిల్లీ, ముంబైలో కార్యాలయాలను మూసివేస్తున్నట్టుగా ప్రకటించిన ట్విటర్ ఉద్యోగుల్ని వర్క్ ఫ్రమ్ హోమ్ చేయాలని ఆదేశాలిచ్చింది. బెంగళూరులో కార్యాలయాన్ని మాత్రం కొనసాగిస్తుంది. 2023 చివరి నాటికి ట్విటర్‌ను ఆర్థికంగా గాడిలో పెట్టాలన్న లక్ష్యంతో ఉన్న మస్క్ ప్రపంచ వ్యాప్తంగా పలు కార్యాలయాలను మూసివేస్తున్నారు. గత ఏడాది చివర్లో భారత్‌లో ఉన్న ఉద్యోగుల్లో 90% మందిని ట్విటర్ తొలగించిన విషయం తెలిసిందే.

ఇప్పటికే మైక్రోసాఫ్ట్ 10 వేలు, అమెజాన్ 18 వేలు,, ఫేస్‌బుక్‌కు చెందిన మెటా 11 వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించిన విషయం తెలిసిందే.

"రైజినా డైలాగ్"కు ఇరాన్ దూరం

న్యూఢిల్లీ: భారత్‌లో వచ్చే నెలలో జరిగే ''రైజినా డైలాగ్'' సదస్సుకు ఇరాన్ హాజరు కావడం లేదు. ఈ సదస్సుకి హాజరుకావాల్సిన ఇరాన్ విదేశాంగ మంత్రి హొస్సేన్ అమీర్ అబ్దుల్లా భారత పర్యటనను రద్దు చేసుకున్నారు. విదేశాంగ శాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించనున్న రైజినా డైలాగ్‌పై ప్రచార వీడియోలో ఇరాన్‌లో హిజాబ్‌కు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో ఒక మహిళ జుట్టు కట్ చేసుకుంటున్న విజువల్స్ ఉన్నాయి. ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైజీ ఫొటో పక్కనే, మహిళ జుట్టు కత్తిరించుకుంటున్న దృశ్యం ఆ వీడియోలో ఉండడంపై ఇరాన్ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అధ్యక్షుడితో పాటు నిరసనకారుల్ని చూపించడాన్ని ఆక్షేపించిన భారత్‌లో ఇరాన్ రాయబార కార్యాలయం ప్రచార వీడియోలో ఆ భాగాన్ని తొలగించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అయితే ప్రభుత్వం దానిని తొలగించకపోవడంతో మనస్తాపానికి గురైన ఇరాన్ ఈ సదస్సుకి హాజరుకాబోవడం లేదని తేల్చి చెప్పింది. అంతర్జాతీయ వ్యవహారాలపై లోతైన చర్చ జరపడానికి 2016 నుంచి కేంద్ర ప్రభుత్వం రైజినా డైలాగ్స్‌ను నిర్వహిస్తోంది.

షిండే వర్గానిదే శివసేన



పార్టీ పేరు.. విల్లు, బాణం గుర్తు ఆ వర్గానికే సొంతం

- 2019లో 76 శాతం ఓట్లు షిండే వర్గం ఎమ్మెల్యేలకే దక్కాయి
- పార్టీ రాజ్యాంగ సవరణ గురించి మాకు సమాచారం లేదు
- 78 పేజీల ఉత్తర్వు జారీ చేసిన ఎన్నికల సంఘం
- ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో అధికార శివసేన పార్టీలో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి పెద్ద షాక్ తగిలింది. శివసేన పేరు, పార్టీ ఎన్నికల గుర్తు 'విల్లు, బాణం' మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గానికే చెందుతాయని ఎన్నికల సంఘం శుక్రవారం తేల్చిచెప్పింది. ఈ మేరకు త్రిసభ్య కమిషన్ ఏకగ్రీవంగా 78 పేజీల ఉత్తర్వు జారీ చేసింది. గత ఏడాది మధ్యంతర ఉత్తర్వులో ఇచ్చిన శివసేన(ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) పేరును, కాగడా గుర్తును ప్రస్తుతం జరుగుతున్న ఉప ఎన్నికలు పూర్తయ్యేదాకా ఉద్ధవ్ ఠాక్రే వర్గం వాడుకోవచ్చని సూచించింది. పార్టీ పేరును, ఎన్నికల గుర్తును తమకే కేటాయించాలని కోరుతూ షిండే వర్గం ఆరు నెలల క్రితం ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. పిటిషన్ సమర్పించింది. దీనిపై విచారణ జరిపిన త్రిసభ్య కమిషన్ షిండే వర్గానికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంది.

పార్టీ రాజ్యాంగ సవరణ అప్రజాస్వామికం

'పార్టీ రాజ్యాంగ పరీక్ష, మెజారిటీ పరీక్ష' సూత్రాల ఆధారంగా ఉత్తర్వును ఖరారు చేశామని ఎన్నికల సంఘం వెల్లడించింది. 2019లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన తరఫున 55 మంది నెగ్గారని, వీరందరికీ పడిన ఓట్లలో 76 శాతం ఓట్లు షిండే వర్గంలో ఉన్న ఎమ్మెల్యేలకు దక్కాయని గుర్తుచేసింది. ఠాక్రే వర్గం ఎమ్మెల్యేలకు కేవలం 23.5 శాతం ఓట్లు పడ్డాయని వివరించింది. పార్టీ పేరు, గుర్తు తమదేనని చెప్పుకోవడానికి ఠాక్రే వర్గం 2018 నాటి 'పార్టీ రాజ్యాంగం'పై ఆధారపడుతోందని, కానీ, రాజ్యాంగ సవరణ గురించి తమకు తెలియజేయలేదని ఆక్షేపించింది. 2018లో చేసిన సవరణ తమ వద్ద రికార్డు కాలేదని తెలిపింది. ఠాక్రే వర్గం బలంగా నమ్ముతున్న శివసేన పార్టీ రాజ్యాంగాన్ని అప్రజాస్వామికం అని తాము భావిస్తున్నట్లు వెల్లడించింది. తనను అధ్యక్షుడిగా ఎన్నుకోవడానికి ఎలక్టోరల్ కాలేజీని తానే నామినేట్ చేసేలా రాజ్యాంగంలో మార్పులు చేశారని, ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఇది విరుద్ధమని ఎన్నికల సంఘం తెలియజేసింది. షిండే వర్గానికి గత ఏడాది అక్టోబర్‌లో కేటాయించిన 'బాలాసాహెబంచీ శివసేన' పేరును, 'రెండు కత్తులు, డాలు' గుర్తును స్తంభింపజేస్తున్నామని, ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని, ఇకపై వాడుకోవానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం తాజా నిర్ణయంతో శివసేనపై ఠాక్రే కుటుంబం పూర్తిగా పట్టు కోల్పోయినట్లయ్యింది.

సత్యానికి దక్కిన విజయం: షిండే

ఎన్నికల సంఘం ఉత్తర్వు పట్ల ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే హర్షం వ్యక్తం చేశారు. ఇది సత్యానికి దక్కిన విజయం, ప్రజల గెలుపు అని అభివర్ణించారు. బాలాసాహెబ్ బాల్ ఠాక్రే ఆశీస్సులతో శివసేన పేరు, ఎన్నికల గుర్తు తమకు లభించాయని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నెంబర్లే కీలకమని అన్నారు. ఆ నంబర్లు తమవద్ద ఉన్నాయని ఉద్ఘాటించారు. ప్రజాస్వామ్యంలో మెజార్టీని పరిగణనలోకి తీసుకుంటారని చెప్పారు. ఎన్నికల సంఘానికి షిండే కృతజ్ఞతలు తెలిపారు. బాలాసాహెబ్ ఆలోచనలను దృష్టిలో పెట్టుకొని గత ఏడాది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామన్నారు. అసలైన శివసేనకు షిండే సారథ్యం వహిస్తున్నట్లు నిరూపితమైందని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వివరించారు.

సుప్రీంకోర్టులో సవాలు చేస్తాం: ఉద్ధవ్ ఠాక్రే

శివసేనను షిండే వర్గానికి కట్టబెడుతూ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటికలు మోగిస్తుందని ఉద్ధవ్ ఠాక్రే ఆందోళన వ్యక్తం చేశారు. తమ విల్లు, బాణం గుర్తును షిండే వర్గం కాజేసిందని, దీనిపై ప్రజలు కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటారని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ఇక మిగల్లేదని, నిరంకుశత్వం మొదలైనట్లు ప్రకటించాలని ప్రధాని నరేంద్ర మోదీకి ఉద్ధవ్ ఠాక్రే సూచించారు. ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేస్తామన్నారు.

ప్రజాస్వామ్యాన్ని హత్య చేశారు: సంజయ్ రౌత్

షిండే వర్గానిదే అసలైన శివసేన అంటూ ఎన్నికల సంఘం తేల్చిచెప్పడం పట్ల ఉద్ధవ్ ఠాక్రే వర్గంలోని కీలక నేత, ఎంపీ సంజయ్ రౌత్ తీవ్రంగా స్పందించారు. ప్రజాస్వామ్యాన్ని హత్య చేశారని మండిపడ్డారు. ఎన్నికల సంఘం ఉత్తర్వుపై ప్రజల్లోకి వెళ్లి న్యాయం కోరుతామని చెప్పారు. పై నుంచి వచ్చిన ఒత్తిళ్లతోనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘంపై తనకు నమ్మకం లేదన్నారు. ఇది 'డబ్బు సంచుల విజయం' అంటూ షిండే వర్గం ఎమ్మెల్యేలపై పరోక్షంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

అసలేం జరిగింది!

- భూమి పుత్రుల నినాదంతో శివసేనను 1966లో దివంగత బాల్ ఠాక్రే స్థాపించారు.
- ప్రధానంగా హిందూత్వ నినాదంతో శివసేన ప్రస్థానం సాగింది. 2019 వరకూ బీజేపీతో స్నేహం చేసింది.
- బాల్ ఠాక్రే కుమారుడు ఉద్ధవ్ ఠాక్రే 2019లో బీజేపీ కూటమి నుంచి విడిపోయారు. ఎన్సీపీ, కాంగ్రెస్ మద్దతుతో 'మహా వికాస్ అఘాడీ' కూటమి పేరిట మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రిగా కుర్చీ ఎక్కారు.
- 2022 జూన్‌లో శివసేన పార్టీ షిండే, ఠాక్రే వర్గాలుగా విడిపోయింది. మెజార్టీ ఎమ్మెల్యేలు, నేతలు షిండేకు మద్దతుగా నిలిచారు. నాటకీయ పరిణామాల మధ్య బీజేపీ మద్దతుతో షిండే అధికారంలోకి వచ్చారు. అప్పటినుంచి పార్టీ పేరు, గుర్తుపై ఇరు వర్గాల మధ్య పోరాటం మొదలైంది.
- వివాదం ఎన్నికల సంఘానికి చేరింది. విల్లు, బాణం గుర్తును ఎన్నికల సంఘం స్తంభింపజేసింది. షిండే వర్గానికి 'రెండు కత్తు, డాలు', ఠాక్రే వర్గానికి కాగడా గుర్తును, రెండు వర్గాలకు వేర్వేరు పేర్లను కేటాయించింది.
- ఎన్నికల సంఘం నిర్ణయాన్ని కొట్టివేయాలని కోరుతూ ఠాక్రే వర్గం గత ఏడాది నవంబర్‌లో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. వారి విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించింది.
- పార్టీ పేరు, ఎన్నికల గుర్తుపై తమకే పూర్తి అధికారం ఉందంటూ ఇరు వర్గాలు ఎన్నికల సంఘానికి గత నెలలో లేఖ రాశాయి. తమ వాదనను వినిపించాయి.

నామినేటెడ్ సభ్యులకు ఓటు హక్కు లేదు

ఢిల్లీ మేయర్ ఎన్నికపై సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ: మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ(ఎంసీడీ) మేయర్ ఎన్నికపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. నామినేటెడ్ సభ్యులకు ఈ ఎన్నికలో ఓటు వేసే హక్కు లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తేల్చిచెప్పింది. మేయర్, డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీల సభ్యుల ఎన్నిక తేదీని ఖరారు చేయడానికి వీలుగా ఎంసీడీ మొదటి సమావేశం నిర్వహించడానికి 24 గంటల్లోగా నోటీసు జారీ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తొలుత మేయర్‌ను ఎన్నుకోవాలని పేర్కొంది. డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకోవడానికి ప్రిసైడింగ్ అధికారిగా మేయర్ వ్యవహరిస్తారని వెల్లడించింది. ఢిల్లీ మేయర్ ఎన్నికల ఇప్పటికే మూడుసార్లు విఫలమైన సంగతి తెలిసిందే. నామినేటెడ్ సభ్యులకు ఓటు హక్కు ఉందని బీజేపీ వాదిస్తుండగా, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) వ్యతిరేకిస్తోంది. మేయర్ ఎన్నిక త్వరగా నిర్వహించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఆప్ మేయర్ అభ్యర్థి షెల్లీ ఒబెరాయ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నామినేటెడ్ సభ్యుల కూడా ఓటు హక్కు ఉందంటూ లెఫ్టినెంట్ గవర్నర్ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వాదనను ధర్మాసనం తిరస్కరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243ఆర్ కింద అందుకు అవకాశం లేదని తేల్చిచెప్పింది. రెండు నెలల క్రితం జరిగిన ఎంసీడీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ మెజారిటీ సాధించింది. మొత్తం 250 వార్డులకుగాను ఆ పార్టీ 134 వార్డులు గెలుచుకుంది. బీజేపీ 104 స్థానాలకే పరిమితమైంది. కాంగ్రెస్ పార్టీ 9 వార్డులు దక్కించుకుంది.

తైవాన్‌లో చైనా బెలూన్ కలకలం

తైపీ: తైవాన్‌లో చైనా బెలూన్ తీవ్ర కలకలం సృష్టించింది. చైనా ప్రయోగించిన బెలూన్ తమ భూభాగంలో ల్యాండ్ అయ్యిందని తైవాన్ రక్షణ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. చైనాలోని తైయువాన్ సిటీలో ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ కంపెనీకి చెందిన పరికరాలు ఇందులో ఉన్నట్లు గుర్తించామని పేర్కొంది. చైనాలో అంతర్భాగమైన ఫుజియాన్ ప్రావిన్స్ తీరానికి సమీపంలోని తమ మాత్సూ ఐలాండ్‌లో భాగమైన తూంగ్‌యిన్‌లో ఈ బెలూన్ నేలపైకి దిగినట్లు తెలియజేసింది. ఈ ఉదంతంపై చైనాలోని తైయువాన్ వైర్‌లెస్(రేడియో) ఫస్ట్ ఫ్యాక్టరీ లిమిటెడ్ అధికారి స్పందించారు. ఆ బెలూన్‌లోని ఎలక్ట్రానిక్ పరికరాలు మాత్రమే తాము అందజేశామని, బెలూన్‌ను తాము తయారు చేయలేదని పేర్కొన్నారు. ఆ కంపెనీ చైనా వాతావరణ శాఖకు అవసరమైన పరికరాలను అందిస్తున్నట్లు ప్రభుత్వ అధికారి ఒకరు చెప్పారు. తైవాన్ భూభాగంలో దిగిన బెలూన్ వాతావరణాన్ని పరిశీలించేందుకు ప్రయోగించినదేనని స్పష్టం చేశారు. ఇలాంటి బెలూన్లు తైవాన్ జలసంధిపై ఎగరడం సాధారణమేనని, ఇప్పుడు మాత్రమే దీనిపై అందరి దృష్టి పడిందని వివరించారు. చైనా బెలూన్‌ను ఇటీవల అమెరికా కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇరు దేశాల నడుమ మాటల యుద్ధం సాగుతోంది.

ఎయిరిండియాకు 6,500 మంది పైలట్లు కావాలి

ఎయిర్‌బస్, బోయింగ్ నుంచి 470 విమానాల కొనుగోలు

ముంబై: టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిరిండియా సంస్థ ఎయిర్‌బస్, బోయింగ్ నుంచి 470 విమానాలు కొనుగోలు చేయనుంది. ఈ మేరకు ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ విమానాలు నడిపించడానికి 6,500 మందికిపైగా పైలట్లు అవసరమని విమానయాన పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఎయిరిండియా వద్ద 113 విమానాలు ఉన్నాయి. దాదాపు 1,600 మంది పైలట్లు పనిచేస్తున్నారు. పైలట్ల కొరత వల్ల ఇటీవల పలు సందర్భాల్లో అల్ట్రా–లాంగ్ హాల్ విమానాలను రద్దు చేయాల్సి వచ్చింది. కొన్ని విమానాల ప్రయాణాల్లో ఆలస్యం చోటుచేసుకుంది. ఎయిరిండియా అనుబంధ సంస్థలైన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఎయిర్ ఆసియా ఇండియాలో 54 ఫ్లైట్లు ఉండగా, దాదాదాపు 850 మంది పైలట్లు సేవలందిస్తున్నారు. విస్తారా ఎయిర్‌లైన్స్‌లో 53 విమానాలు, 600 మందికిపైగా విమాన చోదకులు ఉన్నారు. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఎయిర్ ఆసియా ఇండియా, విస్తారా సంస్థల్లో కలిపి 220 విమానాలు ఉన్నాయి. 3,000 మందికిపైగా పైలట్లు పనిచేస్తున్నారు.

'స్టాక్ మార్కెట్ల'పై సుప్రీంకోర్టు కమిటీ

సీల్డ్ కవర్‌లో కేంద్రం చేసిన సూచనలను తిరస్కరించిన ధర్మాసనం

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లపై నియంత్రణ చర్యలను బలోపేతం చేయడానికి నిపుణుల కమిటీ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం చేసిన సూచనలను సీల్డ్ కవర్‌లో స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. మదుపరుల ప్రయోజనాలను కాపాడే విషయంలో పూర్తి పారదర్శకత కావాలని తాము కోరుకుంటున్నట్లు స్పష్టం చేసింది. ప్రభుత్వ ప్రతిపాదిత నిపుణుల కమిటీ కార్యకలాపాలను పర్యవేక్షించడానికి సిట్టింగ్ జడ్జిని నియమించడం సాధ్యం కాదని పేర్కొంది. అదానీ గ్రూప్ కంపెనీలపై హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత మదుపరులు భారీగా నష్టపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్టాక్ మార్కెట్లపై నియంత్రణ చర్యలను బలోపేతం చేయాలని, ఇందుకోసం సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయాలని, మదుపరుల ప్రయోజనాలను కాపాడాలని కోరుతూ న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, ఎంఎల్ శర్మతోపాటు పలువురు సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు(పిల్స్) దాఖలు చేశారు. వీటిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస జేబీ పార్దివాలాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. నియంత్రణ చర్యలను బలోపేతం చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని గత విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. కమిటీ సభ్యుల పేర్లు, విధివిధానాలను శుక్రవారం సీల్డ్ కవర్‌లో అందజేయగా, ధర్మాసనం స్వీకరించలేదు. ప్రభుత్వం సూచించిన సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తే అది పూర్తిగా ప్రభుత్వ కమిటీ అవుతుందని అభిప్రాయపడింది. పారదర్శకత కావాలి కాబట్టి తామే ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని, తద్వారా న్యాయస్థానంపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుందని వెల్లడించింది. ఇకపై సిట్టింగ్ న్యాయమూర్తులు ఈ అంశాన్ని విచారిస్తారని, కమిటీలో మాత్రం వారు సభ్యులుగా ఉండబోరని తెలిపింది.

రాజస్తాన్‌లో కిడ్నాప్.. హరియాణాలో హత్య

జైపూర్: హరియాణాలో అత్యంత దారుణమైన ఘటన జరిగింది. గో సంరక్షకులుగా అనుమానిస్తున్న కొందరు రాజస్తాన్‌కు చెందిన ఇద్దరు ముస్లింలను కిడ్నాప్ చేసి తీసుకువెళ్లినట్టు ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత వారిద్దరి కాలిన మృతదేహాలు ఒక కారులో లభించడం కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన అరడజను మందికిపైగా బజరంగ్ దళ్ కార్యకర్తల్ని రాజస్తాన్ పోలీసులు అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నారు. ఈ హత్యలను రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఖండించారు. ఈ దారుణానికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజస్తాన్‌లోని భరత్‌పూర్ జిల్లా ఘట్‌మీక గ్రామానికి చెందిన నజీర్ (25), జునైద్ అలియాస్ జునా (35)లను బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. గురువారం వారిద్దరి మృతదేహాలు హరియాణాలోని భివానిలో లోహారు ప్రాంతంలో ఒక దగ్ధమైన కారులో కనిపించాయి. బజరంగ్ దళ్ కార్యకర్తలు ఆ ఇద్దరు ముస్లిం యువకుల్ని కిడ్నాప్ చేశారని వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి ఫిర్యాదు మేరకు అరడజనుకుపైగా బజరంగ్‌దళ్ కార్యకర్తల్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ''వారికి ఈ నేరంలో ప్రమేయం ఉందో లేదో తేలాల్సి ఉంది'' అని పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ గౌరవ్ శ్రీవాస్తవ చెప్పారు. మృతి చెందిన వారిలో జునైద్‌కి నేరచరిత్ర ఉందని, ఐదుకి పైగా కేసుల్లో అతను నిందితుడని చెప్పారు. రింకూ సైనీ అనే నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

రష్యా రక్షణ శాఖ ఉద్యోగిని అనుమానాస్పద మృతి


మాస్కో: రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రభుత్వంలోని మరో ఉద్యోగిని అనుమానాస్పదంగా మృతి చెందారు. రక్షణ శాఖలో పని చేస్తున్న 58 ఏళ్ల మరీనా యాంకినా సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో అపార్ట్‌మెంట్‌లో 16వ అంతస్తులో ఉన్న తన నివాసం కిటికీ నుంచి కింద పడి ప్రాణాలు కోల్పోయారు. ఆమె ప్రమాదవశాత్తూ పడిపోయారా, ఆత్మహత్య చేసుకున్నారా అన్నది విచారణలో తేలాల్సి ఉంది. 160 అడుగుల ఎత్తు నుంచి కింద పడిపోవడంతో ఆమె వెంటనే ప్రాణాలు కోల్పోయారు. రక్తపు మడుగులో ఉన్న మరీనాను ఆ మార్గం నుంచి వెళుతున్న వారు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రష్యా అధ్యక్షుడు ఉక్రెయిన్‌పై జరిపే యుద్ధంలో నిధుల సేకరణలో మరీనా అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్నారు.

సాక్షి హైదరాబాద్

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గ్రేటర్‌తోపాటు శివార్లలోని కీసరగుట్ట, మహేశ్వరం, జీరంగూడ, ఏడుపాయల తదితర ప్రాంతాల్లోని శివాలయాలు ముస్తాబయ్యాయి. ఈ క్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం 200 బస్సులను నడిపేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. సికింద్రాబాద్, రెజిమెంటల్‌బజార్, అమ్ముగూడ, యాప్రాల్, ఈసీఐఎల్, అఫ్జల్‌గంజ్, కేపీహెచ్‌బీ, ఉప్పల్ తదితర ప్రాంతాల నుంచి కీసరకు బస్సులు నడుపుతారు.



ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పలపాలై..

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పులపాలైన ఓ యువకుడు బంధువుల ఇంట్లో నగలు చోరీ చేసి పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన రాంగోపాల్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. -8లో

నేటి రాత్రి నగరంలోని ఫ్లైఓవర్లు బంద్

సాక్షి, సిటీబ్యూరో: మహా శివరాత్రి, జగ్‌నేకీ రాత్ నేపథ్యంలో శనివారం రాత్రి నగరంలోని అన్ని ఫ్లైఓవర్లను మూసివేయనున్నట్లు ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు శుక్రవారం ప్రకటించారు. ప్రత్యామ్నాయ మార్గాలు లేని గ్రీన్‌ల్యాండ్స్ ఫ్లైఓవర్, లంగర్‌హౌస్ ఫ్లైఓవర్‌లతో పాటు పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే తప్ప మిలిగినవి శనివారం రాత్రి 10 గంటల నుంచి ఆదివారం ఉదయం వరకు మూసి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వాహన చోదకులు గమనించాలన్నారు.

న్యూస్‌రీల్

అఫ్జల్‌గంజ్ వద్ద ఐకానిక్ బ్రిడ్జి

- అంచనా వ్యయం రూ. 40 కోట్లు
- మూసీపై నిర్మాణం..త్వరలో పనులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ఎంతో కాలం క్రితమే ప్రకటించిన అఫ్జల్‌గంజ్ వద్ద పాదచారుల ఐకానిక్ బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. మూసీ, ఈసాలపై నిర్మించనున్న 15 బ్రిడ్జిల్లో ఇది పాదచారుల బ్రిడ్జి. పాదచారులకు అందమైన అనుభూతినిచ్చే ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని నిధుల లేమితోనో, ఇతరత్రా కారణాలతోనో కానీ ఇంతవరకు చేపట్టలేదు. రెండేళ్ల క్రితం వర్షాల వల్ల నగరంలోని వివిధ ప్రాంతాలు ముంపు బారిన పడ్డ నేపథ్యంలో ముంపు సమస్యల పరిష్కారానికి 15 బ్రిడ్జిలు నిర్మించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. గతంలోనే ప్రతిపాదనలున్న ఈఐకానిక్ బ్రిడ్జిని కూడా వాటిల్లో చేర్చారు. గతంలో భారీ వ్యయంతో నిర్మించాలనుకున్న బ్రిడ్జిని తక్కువ వ్యయంతో నిర్మించేందుకు సిద్ధమయ్యారు. మూసీపై నిర్మించనున్న 15 బ్రిడ్జిల్లో జీహెచ్‌ఎంసీ నాలుగు, హెచ్‌ఆర్‌డీసీఎల్ మూడు, హెచ్‌ఎండీఏ ఏడు, 'కుడా' ఒకటి నిర్మించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. 'కుడా' నిర్మించనున్న ఈ ఐకానిక్ బ్రిడ్జికి టెండర్లు పిలిచారు. అంచనా వ్యయం రూ.40 కోట్లు. టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి ఏడాదిన్నర కాలంలో పూర్తిచేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

సండే ఫన్‌డే మళ్లీ వచ్చింది..

సాక్షి, సిటీబ్యూరో: ఆదివారం సందడి మళ్లీ వచ్చేసింది. నగరవాసులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచే సండే ఫన్‌డే కార్యక్రమానికి హెచ్‌ఎండీఏ తిరిగి శ్రీకారం చుట్టింది. ఈ నెల 19వ తేదీ ఆదివారం ట్యాంక్‌బండ్‌పై ఈ సండే ఫన్‌డే నిర్వహించనున్నారు. తెలంగాణ సంస్కృతి, కళలు, ఆట, పాటలతో ట్యాంక్‌బండ్‌పై ఉత్సవ వాతావరణం నెలకొననున్నది. మరోవైపు కొత్తగా ప్రారంభించిన మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్ సందర్శకులకు కనువిందు చేయనుంది. ఒకవైపు నింగిలోకి ఎగిసే రంగురంగుల జలపాతాలు, మరోవైపు నేపథ్యంగా వినియోగించే చక్కటి సంగీతం నగరవాసులకు అద్భుతమైన అనుభూతినివ్వనుంది. అలాగే ఈసారి కొత్తగా ప్రవేశపెట్టిన డబుల్ డెక్కర్ బస్సులు కూడా ట్యాంక్‌బండ్‌పైన మరో ప్రత్యేకమైన ఆకర్షణగా కనిపిస్తాయి. అలాగే తుది మెరుగులు దిద్దుకుంటున్న తెలంగాణ అమరవీరుల స్మారకం, రాష్ట్ర సచివాలయం కూడా సందర్శకులను ఆకట్టుకోనున్నాయి. వారం పాటు వివిధ రకాల ఒత్తిళ్ల మధ్య గడిపే నగరవాసులకు ఆహ్లాదభరితమైన వాతావరణాన్ని అందజేసేవిధంగా సండే ఫన్‌డే నిర్వహించనున్నట్లు హెచ్‌ఎండీఏ కమిషనర్ అరవింద్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం నుంచి ట్యాంక్‌బండ్ మీదుగా వాహనాల రాకపోకలను నిలిపివేయనున్నారు.

ఏప్రిల్ 30న కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు

కంటోన్మెంట్ : ఏప్రిల్ 30న కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరగనున్నాయి. కంటోన్మెంట్ 2006 చట్టం ప్రకారమే ఈ ఎన్నికలు జరిపేందుకు అధికారులు మొగ్గు చూపుతున్నారు. కంటోన్మెంట్ జీహెచ్‌ఎంసీలో విలీనం, మరో పక్క పార్లమెంట్‌లో నూతన చట్టం అమలు అంశాలు పెండింగ్‌లో ఉండగా దేశంలోని వివిధ కంటోన్మెంట్లకు చెందిన బోర్డు మాజీ సభ్యులు, కంటోన్మెంట్ పౌరులు కోర్టును ఆశ్రయించడంతో రక్షణమంత్రిత్వ శాఖ అధికారులు ఎన్నికలు నిర్వహించేందుకు సమాయత్తం అవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. వార్డుల రిజర్వేషన్ల విషయంలో గతంలో నిర్వహించిన లక్కీడ్రా పద్ధతినే యథాతథంగా కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. గతంలో కంటోన్మెంట్ బోర్డు అధికారులు నిర్వహించిన లక్కీడ్రాలో 1, 3, 4, 7 వార్డులు జనరల్ వార్డులు కాగా 2, 5, 6 మహిళా వార్డులు, 8 వార్డు ఎస్సీ రిజర్వు వార్డుగా ఉన్న విషయం విదితమే. ఈ రిజర్వు వార్డుల ప్రతిపాదికన ఎన్నికలు జరగనున్నాయి.

కేసీఆర్ బర్త్‌డే సందడి



తెలంగాణ భవన్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ విజయలక్ష్మి తదితరులు



బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్సీ కవిత పూజలు

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు పుట్టిన రోజు వేడుకల్ని శుక్రవారం బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు నగరవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వివిధ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, స్థానిక నేతల ఆధ్వర్యంలో ఆనందోత్సాహాలతో కేకులు కట్ చేశారు. వివిధ ఆలయాల్లో చంద్రశేఖరరావు పేరిట ప్రత్యేక పూజలు చేయించారు.

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బల్కంపేట అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బంగారు ఆభరణాలు సమర్పించి రాజశ్యామల పూజ చేయించారు.

ఇక తెలంగాణభవన్‌లో జరిగిన కార్యక్రమంలో నగర నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో సికింద్రాబాద్ శ్రీ మహంకాళి ఆలయంలో చండీయాగం, జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయంలో అభిషేకం, చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో కేసీఆర్ గోత్రనామాలతో అర్చన, లాల్‌దర్వాజ సింహవాహిని ఆలయంలో లక్ష పుష్పార్చన, సికింద్రాబాద్, ఆబిడ్స్‌లోని వెస్లీ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నాంపల్లి దర్గా, నల్లగుట్ట మసీదుల్లో చాదర్‌లు సమర్పించారు. అమీర్‌పేట, గౌలిగూడ గురుద్వారాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. - సాక్షి, సిటీబ్యూరో

'శివ'శోభ



విద్యుత్ కాంతుల్లో కీసరగుట్ట ఆలయం



మహాశివరాత్రి పర్వదినం కోసం కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం ముస్తాబైంది. ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వెలుగులీనుతున్న ఆలయ గోపురాలు యాత్రికులకు కనువిందు చేస్తున్నాయి. శనివారం భక్తులు భారీ సంఖ్యలో రామలింగేశ్వరుడిని దర్శించుకుంటారు. ఇందుకోసం భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఇక నగరంతోపాటు శివార్లలోని ప్రముఖ శైవక్షేత్రాలు కూడా మహాశివరాత్రి శోభను సంతరించుకున్నాయి. అభిషేకాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. - కీసర

ఖతర్నాక్ ఖలీమ్!



2005 నాటి టాస్క్‌ఫోర్స్ బ్లాస్ట్ కేసులోనూ నిందితుడు

- మానవ బాంబు డాలిన్‌ను సిటీకి తీసుకువచ్చింది ఇతడే
- తాజాగా జాహెద్‌తో కలిసి పలు ప్రాంతాల్లో రెక్కీలు సైతం
- ఫర్హతుల్లా ఘోరీ పంపిన రూ.10 లక్షలు అతడికి అందజేత

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గత ఏడాది దసరా ఉత్సవాల నేపథ్యంలో హ్యాండ్ గ్రెనేడ్లతో విధ్వంసాలకు కుట్ర పన్నిన కేసులో హైదరాబాద్ సిట్ పోలీసులు గురువారం అరెస్టు చేసిన మహ్మద్ అబ్దుల్ ఖలీమ్ సామాన్యుడు కాదని అధికారులు చెబుతున్నారు. లష్కరేతోయిబా (ఎల్‌ఈటీ) ఉగ్రవాదులు అబ్దుల్ జాహెద్, మహ్మద్ సమీయుద్దీన్, మాజ్ హసన్ ఫారూఖ్‌లకు సంబంధించిన కేసులోనే సిట్ ఇతడినీ కటకటాల్లోకి పంపింది. తదుపరి విచారణ నిమిత్తం ఖలీమ్‌ను తమ కస్టడీలోకి తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు.

బిలాల్ ద్వారానే ఉగ్రబాట...

ఎల్బీనగర్ సమీపంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఖలీమ్ అక్కడే వెల్డింగ్ దుకాణం నిర్వహిస్తుంటాడు. ముసరాంబాగ్ ప్రాంతానికి చెందిన, పాకిస్థాన్‌లోని కరాచీలో ఎన్‌కౌంటర్ అయిన ఎల్‌ఈటీ ఉగ్రవాది షాహెద్ అలియాస్ బిలాల్ ద్వారా ఉగ్రవాద బాట పట్టాడు. 2004లో నగరం నుంచి పారిపోయి సౌదీ అరేబియాలో తలదాచుకున్న బిలాల్ ఆదేశాల మేరకు 2005లో అతడి సోదరుడు జాహెద్‌తో కలిసి పని చేయడానికి అంగీకరించాడు. అప్పట్లో ఈ లష్కరేతోయిబా ఉగ్రవాదులు గ్రీన్‌ల్యాండ్స్‌లో ఉండే హైదరాబాద్ పోలీసు కమిషనర్, టాస్క్‌ఫోర్స్ కార్యాలయాన్ని టార్గెట్ చేశారు. వరుసగా ఉగ్రవాదులను అరెస్టు చేస్తుండటంతో పోలీసులను నైతికంగా దెబ్బతీయడానికే దీన్ని ఎంచుకున్నారు. ఈ కుట్ర మొత్తం సౌదీ నుంచి బిలాల్ అమలుపరిచాడు.

అప్పటి నుంచి జాహెద్‌తో కలిసే...

దసరా రోజు కావడంతో పెను ముప్పు తప్పగా ఓ హోంగార్డు మాత్రం అమరుడయ్యాడు. ఈ కేసులో అదే ఏడాది అక్టోబర్ 18న అరెస్టైన ఖలీమ్ 2017 వరకు జాహెద్‌తో కలిసి జైల్లోనే ఉన్నాడు. టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై మానవబాంబు దాడి కేసు వీగిపోవడంతో విడుదలయ్యాడు. అప్పటి నుంచి జాహెద్‌తో సన్నిహితంగానే ఉంటున్నాడు. 'దసరా విధ్వంసాల' కోసం పాకిస్థాన్‌లో ఉన్న ఫర్హతుల్లా ఘోరీ జాహెద్‌కు మొత్తం రూ.40 లక్షల వరకు పంపాడు. ఈ మొత్తం వివిధ హవాలా ఆపరేటర్లతో పాటు ఖలీమ్ ద్వారానూ ఇతడికి అందింది. రూ.10 లక్షలు అందించిన ఖలీమ్ నగరంలో రెక్కీ చేయడానికి సహకరించాడు. దసరా ఉత్సవాలు జరిగే మైదానాలే వీరి టార్గెట్‌లో ఉన్నాయి. ఖలీమ్‌ను సిట్ పోలీసులు టాస్క్‌ఫోర్స్ అధికారుల సాయంతో గురువారం చంద్రాయణగుట్టలోని అతడి అత్తగారింటి వద్ద అరెస్టు చేశారు. ఆ సమయంలో అతడి బంధువులు, కుటుంబీకులు పోలీసులకు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన అధికారులు తదుపరి విచారణ నిమిత్తం తమ కస్టడీకి కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు ఇప్పటికే ఎన్‌ఐఏకు బదిలీ కావడంతో ఖలీమ్ విచారణ తర్వాత పూర్తి స్థాయిలో ఆ విభాగానికి అప్పగించనున్నారు.

ఆ ఆపరేషన్‌లోనూ కీలకపాత్ర...

శ్రీలంకకు చెందిన ఎల్‌టీటీఈకి, కాశ్మీర్‌లోని ఉగ్రవాద సంస్థలకు మాత్రమే పరిమితమైన మానవ బాంబు విధానాన్ని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై వాడాలని ఈ ఉగ్రవాదులు నిర్ణయించుకున్నారు. బంగ్లాదేశ్‌లోని ఢాకాకు చెందిన మౌతసిమ్ బిల్లా అలియాస్ డాలిన్‌ను మానవ బాంబుగా మార్చారు. ఇతడిని తీసుకురావడానికి అప్పట్లో ఖలీమ్ సరిహద్దులు దాటి అక్రమంగా బంగ్లాదేశ్ వెళ్లడంతో పాటు కొన్నాళ్లు ఉగ్రవాద శిక్షణ తీసుకున్నాడు. డాలిన్‌ను తీసుకుని నగరానికి చేరుకుని ఎన్టీఆర్ నగర్‌లోని తన ఇంట్లోనే అతడికి ఆశ్రయం ఇవ్వడం, టాస్క్‌ఫోర్స్ ఆఫీస్ వద్ద రెక్కీ చేయించడంలో కీలక పాత్ర పోషించాడు. నాటి బాంబు కూడా ఖలీమ్ ఇంట్లోనే తయారైంది. తనను తాను పేల్చుకోవడానికి సిద్ధమైన డాలిన్‌ను 2005 అక్టోబర్ 12 (దసరా రోజు) టాస్క్‌ఫోర్స్ కార్యాలయం వద్దకు తీసుకువెళ్లి వదిలాడు.

ఒక్కరోజు రూ.51లక్షలు

పంజా విసిరిన సైబర్ నేరగాళ్లు

- యూట్యూబ్ వీడియోస్ లైక్, షేర్స్ పేరుతో రూ.36లక్షలు స్వాహా
- లాటరీ ద్వారా కోటీశ్వరుడిని చేస్తానంటూ రూ.8.75లక్షలు మాయం
- గేట్‌వే కంపెనీలో జాబ్ ఇప్పిస్తానంటూ రూ.5లక్షలు బురిడీ



హిమాయత్‌నగర్: సైబర్ నేరగాళ్లు ఒక్కో రోజు ఒక్కో టైపులో రెచ్చిపోతున్నారు. అమాయకులకు మాయ మాటలతో గాలం వేస్తూ రూ.లక్షలు కాజేస్తున్నారు. ఒక్కరోజులోనే దాదాపు రూ.51లక్షలకు పైగా టోకరా వేయడంతో పలువురు బాధితులు సిటీ సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించారు. అంబర్‌పేటకు చెందిన ఓ యువకుడిని ఓ వ్యక్తి టెలిగ్రామ్ యాప్ ద్వారా సంప్రదించాడు. యూట్యూబ్ వీడియోలు లైక్, కామెంట్ చేసి షేర్ చేస్తే డబ్బు ఇస్తామని చెప్పాడు. ఒక్కో లైకుకు రూ.500, కామెంట్‌కు రూ.250, షేర్‌కు రూ.1000 ఇస్తామని చెప్పడంతో అందుకు అంగీకరించిన బాధితుడికి కొన్ని లింకులను షేర్ చేయడంతో వాటిని లైక్/కామెంట్/షేర్ చేశాడు. ఇందుకు గాను తొలుత కొంత డబ్బు చెల్లించారు. ఆ తర్వాత అతడితో క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెట్టించారు. అధిక లాభాలు వస్తాయని పలు దఫాలుగా రూ.36 లక్షలకు పైగా కాజేశారు. మొఘల్‌పురాకు చెందిన యువకుడు ఫేస్‌బుక్‌లో వచ్చే లాటరీ యాడ్స్ చూశాడు. అందులోని ఫోన్ నంబర్‌ను సంప్రదించగా రూ.10వేలు ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నాడు. రూ.10 వేలు ఇచ్చిన తర్వాత మరో రూ.4లక్షలు ఇస్తే హిట్ లిస్టులో పెడతామని చెప్పడంతో అతగాడు ఆ మొత్తాన్ని కూడా పంపాడు. ఆ తర్వాత ఎంట్రీ క్యాన్సిల్ అయ్యిందని డబ్బు తిరిగి ఇస్తానన్నాడు. మళ్లీ ఎంట్రీ ఉందని చెప్పి మరి కొంత తీసుకున్నాడు. ఇలా మూడు దఫాలుగా రూ.8.75 లక్షలు వసూలు చేశారు. ఆన్‌లైన్ ద్వారా పార్ట్‌టైం జాబ్ ఇప్పిస్తానంటూ నల్లకుంటకు చెందిన వ్యక్తికి వల వేసిన నేరగాళ్లు గేట్ వే గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కు సంబంధించి ఆన్‌లైన్ జాబ్ ఇస్తామన్నారు. ఇందుకు గాను సర్వీస్ చార్జీలు ఉంటాయని నమ్మించి బాధితుడి నుంచి రూ.5.75 లక్షలు కాజేశారు. దీంతో బాధితులు సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మెట్రోకు సమ్మర్ ఫీవర్

పగుళ్లకు కోటింగ్..పట్టాలకు లూబ్రికేషన్!

- వేసవిలో భారంగా మారిన నిర్వహణ
- మెట్రో స్టేషన్ల పగుళ్లకు ఎపాక్సీ కోటింగ్
- పట్టాలపై మలుపుల వద్ద అధిక శబ్దం రాకుండా లూబ్రికెంట్ వినియోగం

సాక్షి, సిటీబ్యూరో: వేసవిలో మెట్రో నిర్వహణ భారంగా మారింది. పలు మెట్రో స్టేషన్లకు ఏర్పడిన పగుళ్లు..పట్టాలపై రైళ్లు పరుగులు తీసినపుడు మలుపుల వద్ద రణగొణ ధ్వనులు వెలువడుతుండడంతో తరచూ ఆందోళన వ్యక్తమౌతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో నష్టనివారణ చర్యలు చేపట్టే అంశంపై ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ దృష్టి సారించింది. ప్రమాణాల మేరకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ) ప్రకారం మెట్రో ప్రాజెక్టులోని స్టేషన్లు, పిల్లర్లు తదితర సివిల్ నిర్మాణాలకు పగుళ్ల నివారణ, మన్నిక పెంచేందుకు ఇతర నిర్వహణపరమైన మరమ్మతులు చేపడుతున్నట్లు మెట్రో వర్గాలు తెలిపాయి. నగరంలో ఎల్బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోల్-రాయదుర్గం మూడు మార్గాల్లోని మొత్తం మెట్రో రైల్ నెట్‌వర్క్ పరిధిలో ఉన్న వయాడక్ట్ పారాపెట్స్ (పిట్టగోడలు)ను సైతం నిశితంగా పరిశీలిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పలు చోట్ల స్టేషన్లకు వెంట్రుకవాసి పరిమాణంలో ఏర్పడిన పగుళ్లకు ఎపాక్సీ పదార్థంతో కోటింగ్ వేసి సరిచేస్తున్నట్లు తెలిపారు. మూడు రూట్లలో నిరంతరాయంగా రైళ్లు పరుగులు తీస్తున్న నేపథ్యంలో మెట్రో మార్గం పలు కంపనాలకు గురవుతుండడం, వాతావరణ మార్పుల కారణంగా తరచూ పగుళ్లు ఏర్పడుతున్నట్లు వివరించారు. ఇది సాధారణ పరిణామమేనని స్పష్టంచేశారు.

రణగొణ ధ్వనులు వెలువడకుండా చర్యలు...

నగరంలో మెట్రో మార్గం పలు ములుపులు తిరిగి ఉంది. నగర భౌగోళిక స్థితి కారణంగా దేశంలో మరే ఇతర మెట్రో రైల్ మార్గంలో లేని విధంగా వినూత్నమైన రీతిలో మలుపులు, ఎత్తుపల్లాలతో అలైన్ మెంట్ ఉంది. ఈ నేపథ్యంలో మలుపుల వద్ద మెట్రో పట్టాలు, చక్రాల మధ్య రాపిడి కారణంగా కీచుమనే శబ్దాలు, అతిధ్వనులు అధికంగా వెలువడుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించి..రణగొణ ధ్వనులను నివారించేందుకు పట్టాలకు ట్రాక్ లూబ్రికేషన్ చేస్తున్నట్లు మెట్రో అధికారులు తెలిపారు. తద్వార కంపనాలు పెరిగిన సమయంలో శబ్ద స్థాయిలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తరచుగా శబ్ద స్థాయిని పర్యవేక్షిస్తున్నామన్నారు. పీసీబీ నిర్దేశించిన ప్రమాణాల మేరకు శబ్దకాలుష్యం ఉందని తెలిపారు. విశ్వసనీయ ఇంజినీరింగ్ సంస్థగా, ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో నిలుస్తుందని..స్వల్ప పగుళ్లు, శబ్దకాలుష్యంపై ఎవరూ ఆందోళన చెందవద్దని సంస్థ భరోసానిస్తుండడం విశేషం.



మెట్రోకు నుమాయిష్ సత్కారం

46 రోజుల్లో 1.9 కోట్ల మంది మెట్రో జర్నీ

సాక్షి, సిటీబ్యూరో: నగర మెట్రోకు నుమాయిష్ సత్కారం దక్కింది. ఈ ఏడాది జనవరి తొలి వారం నుంచి ఫిబ్రవరి 15 వరకు నాంపల్లిలో జరిగిన ఎగ్జిబిషన్‌ను సందర్శించిన వారికి అదనపు సౌకర్యాలు కల్పించినందుకు ఈ సత్కారం లభించింది. ఇటీవల రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ ప్రత్యేక జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని హైదరాబాద్ మెట్రో రైల్(హెచ్‌ఎంఆర్)కు అందజేసినట్లు సంస్థ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. వీటిని హెచ్‌ఎంఆర్ తరపున కియోలిస్ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ (స్టేషన్స్) జైపాల్ రెడ్డి అందుకున్నారు. ఎగ్జిబిషన్ సందర్భంగా మూడు మార్గాల్లో నిత్యం చివరి రైలును అర్ధరాత్రి ఒంటిగంట వరకు నడిపినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం గాంధీభవన్ వద్ద ప్రత్యేకంగా మెట్రో టిక్కెట్ కౌంటర్లను సైతం ఏర్పాటు చేశామన్నారు.

రికార్డు స్థాయిలో జర్నీ..

జనవరి ఒకటి నుంచి ఫిబ్రవరి 15 వరకు రికార్డు స్థాయిలో 1.9 కోట్ల మంది ప్రయాణికులు నగర మెట్రో రైళ్లలో ప్రయాణించినట్లు మెట్రో వర్గాలు తెలిపాయి. కాగా నాంపల్లిలో 46 రోజులపాటు జరిగిన పారిశ్రామిక ప్రదర్శనను తిలకించేందుకు సుమారు 11 లక్షల మంది ప్రయాణికులు మెట్రో రైళ్లలో రాకపోకలు సాగించారన్నారు.

బాచుపల్లి ప్లాట్లకు అనూహ్య డిమాండ్

ప్రీ బిడ్ సమావేశం విజయవంతం

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్)కు సమీపంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో ఉన్న బాచుపల్లి హెచ్‌ఎండీఏ లేఅవుట్లోని ప్లాట్లను సొంతం చేసుకోవడానికి ఔత్సాహికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. శుక్రవారం బాచుపల్లి లేఅవుట్‌లో హెచ్‌ఎండీఏ అధికారులు నిర్వహించిన ప్రీబిడ్ సమావేశానికి అనూహ్యమైన ఆదరణ లభించింది. సుమారు 250 మందికిపైగా ఔత్సాహికులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎస్టేట్ ఆఫీసర్ గంగాధర్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (సీపీఓ) గంగాధర్, మల్కాజిగిరి ఆర్డీవో మల్లయ్య, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎమ్మెస్టీసీ ప్రతినిధులు అనురాగ్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు. మియాపూర్ క్రాస్ రోడ్డుకు, ఐటి హబ్‌కు సమీపంలో ఉన్న బాచుపల్లి లేఅవుట్ పరిసరాల్లో పలు గేటెడ్ కమ్యూనిటీ విల్లాల వెంచర్ల మధ్యలో ఈ ప్లాట్‌లు ఉండడం వల్ల కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నారు. ప్రవాస భారతీయులు, బిల్డర్లు, డెవలపర్లు ముందుకు వస్తున్నారు. బాచుపల్లి లేఔట్‌లో 266 చదరపు గజాల నుంచి 487 చదరపు గజాల వరకు గల ప్లాట్లు ఉన్నాయి. గజానికి రూ.25,000 చొప్పున అప్‌సెట్ ధరను నిర్ణయించారు. బాచుపల్లిలోని 73 ప్లాట్‌లతో పాటు మేడిపల్లిలోని మరో 50 ప్లాట్‌లకు మార్చి 1, 2 తేదీల్లో ఆన్‌లైన్ వేలం నిర్వహించనున్నారు.







'హార్ట్‌ఫుల్' యోగా

ప్రతి ఒక్కరు యోగాను జీవితంలో ఓ భాగం చేసుకోవాలని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖల సహకారంతో ఎల్బీస్టేడియంలో 'హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ' ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న యోగా మహోత్సవ్ వేడుకలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచానికి యోగా నేర్పిన మనం యోగా చేయడంలో మాత్రం వెనకబడుతున్నామన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి యోగాసనాల్లో పాల్గొన్నారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులతో పాటు పలు దేశాలకు చెందిన ప్రతినిధులు యోగాసనాలు వేశారు. హార్ట్‌ఫుల్‌నెస్ గురువు కమలేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. - గన్‌ఫౌండ్రీ


గౌతం జూనియర్ కాలేజ్ జట్టు


ఎంపీఎస్ గవర్నమెంట్ ఆర్ట్స్, సైన్స్ కాలేజ్ జట్టు

హోరా హోరీగా ఫైనల్స్

- 'సాక్షి' ప్రీమియర్ లీగ్ రీజినల్ విన్నర్‌గా భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్ సైనిక్‌పురి జట్టు
- జూనియర్ విజేతగా గౌతం జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్

ఘట్‌కేసర్: మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా, ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో 'సాక్షి' మీడియా గ్రూపు ఆధర్యంలో నిర్వహిస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ మహబూబ్‌నగర్, గ్రేటర్ హైదరాబాద్ రీజినల్ సీనియర్, జూనియర్ ఫైనల్ మ్యాచ్‌లు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి.

సీనియర్ విభాగంలో ఎంపీఎస్ గవర్నమెంట్ ఆర్ట్స్, సైన్స్ కాలేజ్ మహబూబ్‌నగర్, భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్ సైనిక్‌పురి జట్లు రీజినల్ లెవల్‌లో తలపడ్డాయి.


భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్ జట్టుకు కప్ అందజేస్తున్న 'సాక్షి'ఈవెంట్స్ ఏజీఎం ఉగ్రగిరిరావు

SAKSHI PREMIER LEAGUE

SAKSHI DIGITAL MEDIA GROUP

మొదట బ్యాటింగ్ చేసిన ఎంపీఎస్ గవర్నమెంట్ ఆర్ట్స్, సైన్స్ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. డేవిడ్ 29 బంతుల్లో 56 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన భవాన్స్ డిగ్రీ కాలేజ్ జట్టు 8.3 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 105 పరుగులు చేసి మహబూబ్‌నగర్, గ్రేటర్ హైదరాబాద్ రీజినల్ సీనియర్ విభాగంలో విజేతగా నిలిచింది. జట్టులో నితీశ్ 32 బంతుల్లో 72 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించాడు.

జూనియర్ విభాగంలో గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ (బాలురు) మహబూబ్‌నగర్, గౌతం జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ జట్టు 9 ఓవర్లతో 10 వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గౌతం జూనియర్ కాలేజ్ ఈసీఐఎల్ జట్టు 5.4 ఓవర్లతో 3 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసి మహబూగర్‌నగర్, గ్రేటర్ హైదరాబాద్ రీజినల్ జూనియర్ విన్నర్స్‌గా నిలిచారు. గౌతం క్రీడాకారుడు మనీశ్ 3 వికెట్లు తీయగా, అసిలేశ్ 7 బంతుల్లో 19 పరుగులు, అన్విత్ 10 బంతుల్లో 18 పరుగులు చేశారు. రీజినల్ విన్నర్స్, రన్నర్స్, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా విజేతలకు ఈవెంట్స్ ఏజీఎం ఉగ్రగిరిరావు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు.

బీన్యూలో శాంసంగ్ ఎస్-23 సిరీస్ ప్రారంభం

మాదాపూర్: తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా విస్తరించిన మొబైల్, రిటైల్ చైన్ బీన్యూ మొబైల్స్, ఎలక్ట్రానిక్స్ అని నటి అనన్య నాగళ్ల పేర్కొన్నారు. మాదాపూర్‌లో బీన్యూ మొబైల్స్, ఎలక్ట్రానిక్స్ స్టోర్‌లో శుక్రవారం శాంసంగ్ ఎస్23 సిరీస్‌ను ప్రారంభించారు. సంస్థ సీఈఓ సాయి నిఖిలేష్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయినితేష్, సామ్‌సాంగ్ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఈ మొబైల్‌లో నైటోగ్రఫీ ప్రో గ్రేడ్ కెమెరా సెటప్, 200 మెగా పిక్సల్స్ వైడ్ యాంగిల్ కెమెరాతో ఉందన్నారు. వీటి ధరలు రూ.74,999 నుంచి 1,54,999 వరకు అందుబాటులో ఉన్నాయన్నారు. మాదాపూర్ స్టోర్‌లో మరిన్ని ఆఫర్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.


సామ్‌సాంగ్ ఎస్23 సిరీస్‌ను ప్రారంభించిన నటి అనన్య నాగళ్ల తదితరులు

'పారిజాతా'నికీ సున్నం పెట్టారు!

- రియల్ ఎస్టేట్ సంస్థను ముంచిన మార్కెటింగ్ టీమ్
- ప్లాట్లు, ఫ్లాట్లు విక్రయం పేరుతో రూ.80 కోట్లు వసూలు
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న సిటీ సీసీఎస్

హిమాయత్‌నగర్: ప్రముఖ రియల్ ఎస్టేట్. నిర్మాణ సంస్థతో మార్కెటింగ్ ఒప్పందం కుదుర్చుకున్న ఓ ముఠా భారీ మొత్తం కాజేసింది. కస్టమర్ల నుంచి వసూలు చేసిన దాదాపు రూ.80 కోట్లు దారి మళ్లించింది. వినియోగదారుల నుంచి విషయం తెలుసుకున్న సదరు సంస్థ హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ కేంద్రంగా పని చేసే పారిజాత హోమ్స్ అండ్ డెవలపర్స్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా పలు వెంచర్లు చేస్తున్నారు. ప్లాట్లతో పాటు ఫ్లాట్లు నిర్మించి విక్రయిస్తుంటారు. వీటికి సంబంధించి మార్కెటింగ్ చేసే బాధ్యతల్ని చెక్కా వెంకట సుబ్రహ్మణ్యం, అతడి అనుచరులకు అప్పగిస్తూ పారిజాత సంస్థ చైర్మన్ అంజయ్య నాలుగేళ్ల క్రితం ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీని ప్రకారం బుకింగ్స్‌కు సంబంధించి కస్టమర్ల నుంచి వసూలు చేసిన సొమ్ము కంపెనీ బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. 2020 నాటికే చెక్కా వెంకట సుబ్రహ్మణ్యం తన టీంతో కలిసి శామీర్‌పేట పరిసర ప్రాంతాల్లోని వెంచర్లకు సంబంధించి కస్టమర్ల నుంచి బుకింగ్స్‌కు సంబంధించి రూ.40 కోట్లకు పైగా వసూలు చేశాడు. ఆ మొత్తాన్ని తన వ్యక్తిగత అకౌంట్స్‌లో జమ చేసుకున్నాడు. ఈ విషయమై కస్టమర్ల నుంచి 'పారిజాత హోమ్స్ అండ్ డెవలపర్స్'కు ఫిర్యాదులు అందాయి. దీంతో అదే ఏడాది శామీర్‌పేట్ పోలీసుస్టేషన్‌లో చెక్కా వెంకట సుబ్రహ్మణ్యంతో పాటు మరో నలుగురిపై సంస్థ ఫిర్యాదు చేయడంతో చీటింగ్ కేసు నమోదైంది. దీంతో అప్పటి వరకు కస్టమర్ల నుంచి సేకరించిన రూ.40 కోట్లు చెల్లించేందుకు 'పారిజాత హోమ్స్ అండ్ డెవలపర్స్'తో చెక్కా వెంకట సుబ్రహ్మణ్యం అవగాహన ఒప్పందం రాసుకుని, కొన్ని చెక్కులు ఇచ్చాడు. ఈ చెక్కులు మొత్తం బౌన్స్ కావడంతో పాటు సుబ్రహ్మణ్యం నగదు రూపంలోనూ చెల్లింపులు చేయలేదు. ఇదిలా ఉండగా గడిచిన రెండేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా మరో రూ.40 కోట్లు పారిజాత సంస్థ పేరుతో చెక్కా వెంకట సుబ్రహ్మణ్యం సేకరించాడు. ఇలా దాదాపు రూ.80 కోట్లుకు పైగా సేకరించి కంపెనీ ఖాతాలో జమ చేయలేదు. దీంతో సంస్థ నిర్వాహకులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.



ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

బన్సీలాల్‌పేట్: మానసిక ఒత్తిడితో ఇంటర్ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. గాంధీనగర్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బొరబండ ప్రాంతానికి చెందిన నిరుడి రాజు కుమార్తె రూప(18) ఇంటర్ ఫెయిలైంది. అప్పటినుంచి మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం ఉన్నికోటలోని నానమ్మ ఇంటికి వచ్చిన రూప ఇక్కడే ఉంటోంది. శుక్రవారం ఆమె నాయనమ్మ ఇళ్లలో పని చేసేందుకు వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న రూప ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అదే సమయంలో మృతురాలి తల్లి ఆమెకు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో పక్కింటి వారికి ఫోన్ చేసి సమాచారం అందించింది. దీంతో వారు వచ్చి తలుపు కొట్టినా తీయడం లేయకపోవడంతో డోర్‌ను బలవంతంగా తెరిచి చూడగా రూప ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న గాంధీనగర్ పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చైల్డ్ పోర్నోగ్రఫీ చూస్తే కేసులే

సాక్షి, సిటీబ్యూరో: గూగుల్‌లో చైల్డ్ పోర్నోగ్రఫీ సెర్చ్ చేసి, వీక్షించిన ఐదుగురిపై సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. మలక్‌పేట, మంగళ్‌హాట్, నాంపల్లి తదితర ప్రాంతాలకు చెందిన ఐదుగురు నిందితులు చైల్డ్ పోర్నోగ్రఫీ గూగుల్‌లో సెర్చ్ చేసి వీక్షించడంతో పాటు ఆ వీడియోలను ఫోన్లలో డౌన్‌లోడ్ చేసి వాటిని తమ స్నేహితులకు పంపించారు. దీనిని గుర్తించిన సీఐడీ విభాగం అధికారులు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించారు. నిందితులపై కేసులు నమోదు చేసిన పోలీసులు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఐసీసీసీ టెక్నాలజీ అద్భుతం

కితాబిచ్చిన కెనడియన్ దౌత్య బృందం



సాక్షి, సిటీబ్యూరో: కెనడాకు చెందిన దౌత్య బృందం శుక్రవారం బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌తో (ఐసీసీసీ) పాటు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. నేరాల నియంత్రణ, కేసులు కొలిక్కి తీసుకురావడం, శాంతిభద్రతల పరిరక్షణ, నగరంపై నిఘా కోసం ఐసీసీసీలో వినియోగిస్తున్న టెక్నాలజీని కొత్వాల్ సీవీ ఆనంద్ వారికి వివరించారు. ఇక్కడ అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం అద్భుతమని, దేశంలోని ఇతర పోలీసు విభాగాలకు ఆదర్శమని దౌత్య బృందం కితాబిచ్చింది. బెంగళూరులోని కెనడా కాన్సులేట్ కార్యాలయం కాన్సుల్ డానియేల్ మొరెన్సీ, ఢిల్లీలోని కెనడా హైకమిషన్ కార్యాలయం కాన్సుల్ క్లాడీ రోచన్‌లతో పాటు సీనియర్ కాన్సులర్ ప్రోగ్రాం ఆఫీసర్ జస్వీందర్ సింగ్ ఈ బృందంలో ఉన్నారు. సీసీఎస్ డీసీపీ స్నేహ మెహ్రా షీ–టీమ్స్, భరోసా కేంద్రం పని తీరును వివరించారు.

ఇంట్లో చోరీ

- భర్తతో కలిసి పనిమనిషి నిర్వాకం
- రూ. 16 లక్షల సొత్తు అపహరణ

రసూల్‌పురా: యజమానులు ఇంట్లో లేని సమయంలో ఓ పనిమనిషి తన భర్త, మరో ఇద్దరితో కలిసి రూ.16లక్షల విలువైన బంగారం వెండి, నగదు చోరీ చేసి పరారైన సంఘటన కార్ఖాన పీఎస్ పరిధిలో 16వ తేదీ తెల్లవారుజామున చోటు చేసుకుంది. నిందితుల్లో నలుగురిని కొద్ది గంటల్లోనే అదుపులోకి తీసుకున్న పోలీసులు, మరొకరి కోసం గాలిస్తున్నారు. సీఐ రవీందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విక్రంపురి ఫ్లాట్ నంబర్ ఈ 16లో వ్యాపారవేత్త ధీరజ్‌కుమార్ అగర్వాల్ నివాసం ఉంటున్నాడు. నేపాల్‌కు చెందిన లక్ష్మి గత కొనేళ్లుగా వీరి ఇంట్లో పనిమనిషిగా ఉంటోంది. ఈనెల 16న ధీరజ్‌కుమార్ కుటుంబంతో సహా బంధువుల వివాహానికి వెళ్లారు. ఇంటి బాధ్యతను డ్రైవర్ సాయికృష్ణకు అప్పగించారు. కాగా తెల్లవారుజామున మొదటి అంతస్తులో నుంచి శబ్దాలు రావడంతో సాయికృష్ణ బయటికి వచ్చి చూడగా ఇంటి పార్కింగ్‌లో పనిమనుషి లక్ష్మి, భర్త మన్‌రాజ్‌షాహితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో అతను తన యజమానికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. ధీరజ్‌కుమార్ ఇంటికి వచ్చి చూడగా మొదటి అంతస్తు బాత్రూమ్ అద్దాలు పగలగొట్టి లోపలికి చొరబడిన దొంగలు అల్మారా బద్దలు కొట్టి 93.44 గ్రాముల బంగారు, 3240 గ్రాముల వెండి అభరణాలు, 2వ అంతస్తులోని వార్డ్‌రోబ్ తాళాలు పగుల గొట్టి అందులో ఉన్న రూ.6 లక్షలు చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. సీసీ పుటేజీ ఆధారంగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

కార్పొరేటర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

అనంతరం బెయిల్‌పై విడుదల

బహదూర్‌పురా: బీజేపీ ప్రజా గోస కార్యక్రమంపై దాడికి పాల్పడిన ఎంఐఎం కార్పొరేటర్‌పై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఆయనను అదుపులోకి తీసుకుని బెయిల్‌పై విడుదల చేశారు. పోలీసులు, స్థానికులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తాడ్‌బన్ మోచీ కాలనీలో గురువారం బీజేపీ నేతలు కార్నర్ మీటింగ్ నిర్వహిస్తుండగా ఎంఐఎం కార్పొరేటర్ ఖాదర్ తన అనుచరులతో కలిసి దాడి చేశారు. ఇందుకు నిరసనగా బీజేపీ నాయకులు కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైటాయించి ఆందోళన చేపట్టారు. పోలీసులు బీజేపీ నాయకుడు బైరి నంద్‌రాజ్ ఫిర్యాదు మేరకు రామ్నాస్‌పురా కార్పొరేటర్ మహ్మద్ ఖాదర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఉన్నతాధికారులు బాధ్యులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలపాలి

తాడ్‌బన్ మోచీ కాలనీలో రామ్నాస్‌పురా కార్పొరేటర్ తన అనుచరులతో కలిసి బీజేపీ నాయకులపై దాడి చేయడంపై హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కార్పొరేటర్ మహ్మద్ ఖాదర్‌ను మందలించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎవరైనా నిరసన తెలపవచ్చునన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పులపాలై...

- బంధువుల ఇంట్లో యువకుడి చోరీ
- నిందితుడి అరెస్ట్
- 32 తులాల నగలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బంగారు నగలు

రాంగోపాల్‌పేట: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పులపాలైన ఓ యువకుడు బంధువుల ఇంట్లో నగలు చోరీ చేసి పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన రాంగోపాల్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ రాధాకిషన్ రావు, రాంగోపాల్‌పేట్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనాథ్ రెడ్డి, లింగేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాంగోపాల్‌పేట్‌కు చెందిన సూరజ్ మలానీ శంషాబాద్ వద్ద సూరజ్ అండ్ కో పేరుతో కంపెనీ నిర్వహిస్తున్నాడు. కొంత కాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన అతను అప్పులపాలయ్యాడు. రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో అప్పులు తీర్చేందుకు సొంత బాబాయి ఇంట్లోనే చోరీకి పాల్పడ్డాడు. సూరజ్ మలానీ తండ్రి ముకుంద్ దాస్ మలానీ తన తమ్ముడు గోపాల్ దాస్ ఒకే భవనంలోని వేర్వేరు అంతస్తుల్లో నివాసం ఉంటారు. ఈ నెల 10న గోపాల్ దాస్ కుటుంబసభ్యులతో కలిసి కర్మాగారంలో పూజలకు వెళ్లి అదే రోజు ఇంటికి తిరిగొచ్చాడు. మరుసటి రోజు అతడి భార్య బీరువాను తెరిచి చూడగా అందులో 32 తులాల బంగారు నగలు కనిపించలేదు. ఈ విషయం భర్తకు చెప్పడంతో అతను ఇంటి పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించాడు. అయితే వారు ఇంట్లో లేని సమయంలో సూరజ్ మలానీ అనుమానస్పదంగా తన బైక్ డిక్కీలో ఒక బ్యాగును పెట్టుకుని వేగంగా వెళ్తున్నట్లు గుర్తించారు. 13న సూరజ్‌పై అనుమానంతో రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, రాంగోపాల్‌పేట్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించాడు. అప్పులు తీర్చుకునేందుకే చోరీకి పాల్పడినట్లు సూరజ్ చెప్పడంతో అతడి నుంచి 32 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

నుమాయిష్‌లో విజయ స్టాల్‌కు మొదటి బహుమతి


బహుమతిని చూపుతున్న విజయ డెయిరీ చైర్మన్ భరత్‌కుమార్

లాలాపేట: నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు జరిగిన నుమాయిష్‌లో విజయ డెయిరీ స్టాల్‌కు బెస్ట్ మెయింటెనెన్స్ విభాగంలో మొదటి బహుమతి లభించినట్లు విజయ డెయిరీ చైర్మన్ భరత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం లాలాపేటలోని విజయ డెయిరీలో నిర్వహించిన ముఖ్యమంత్రి జన్మదిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ విజయ డెయిరీ అభివృద్ధి పథంలో దూసుకెళుతుందన్నారు. మొట్టమొదటిసారిగా నుమాయిష్‌లో విజయ స్టాల్‌ను సొంతంగా నిర్వహించామని, దీని ద్వారా దాదాపు రూ.50 లక్షల వ్యాపారం నిర్వహించినట్లు తెలిపారు. విజయ డెయిరీ సక్రమమైన పద్ధతిలో అభివృద్ధి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని రానున్న రోజుల్లో కొనసాగించాలనీ అధికారులకు, కార్మికులకు సూచించారు.

మహా శివరాత్రికి సర్వం సిద్ధం



వేడుకలకు సిద్ధమైన శ్రీనగర్ కాలనీ శివాలయం...

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కొలువుదీరిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం మహా శివరాత్రి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున 5 గంటలకు గణపతి పూజ అనంతరం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఏక రుద్రాభిషేకాలు నిర్వహిస్తారని ఆలయ ఈఓ ఎస్. లావణ్య తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి ఏకరుద్రాభిషేకాలు, రాత్రి 8 గంటల నుంచి శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివారికి కల్యాణోత్సవం, రాత్రి 10 గంటల నుంచి 12.30 గంటల వరకు లింగోద్భవ కాల అభిషేకాలు జరుగుతాయన్నారు.

శివరాత్రి వేడుకలు జరిగే ఆలయాలివే...

- బంజారాహిల్స్ రోడ్ నం 1లోని శివాలయం
- ఫిలింనగర్ దైవసన్నిధానంలోని మల్లికార్జున స్వామి ఆలయం
- శ్రీనగర్ కాలనీలోని భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయం
- బంజారాహిల్స్ రోడ్ నం.12 ఎన్బీటీ నగర్ కమాన్‌లోని హనుమాన్ ఆలయం
- ఎన్బీటీ నగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ సముదాయం

రాజయోగా మెడిటేషన్ సెంటర్‌లో శివరాత్రి వేడుకలు షురూ

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నం. 14లోని బ్రహ్మ కుమారీస్ రాజయోగా మెడిటేషన్ సెంటర్‌లో మహా శివరాత్రి పర్వదిన వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన శివలింగాల ప్రదర్శనను వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా, మెడిటేషన్, ప్రశాంతత తదితర అంశాల్లో బ్రహ్మకుమారీస్ చేస్తున్న సేవలను కొనియాడారు.



శివలింగాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

గోరఖ్‌నాథ్ ఆలయం ముస్తాబు

- మహాశివరాత్రి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు
- పూజల్లో పాల్గొననున్న సుమారు 30 వేల కుటుంబాలు



ఎస్ఎస్‌బీనగర్‌లోని శివాలయం

రహమత్‌నగర్: వారంతా నేపాల్ దేశస్తులు.. శివభక్తులు.. సుమారు 55 నగరాల క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చిన వీరు రహమత్‌నగర్ డివిజన్ ఎస్ఎస్ బీనగర్ క్వారీలో ఉన్న గుట్టపై చిన్న శివాలయాన్ని నిర్మించారు. దీనికి పసుపతి గోరఖ్‌నాథ్ శివాలయంగా నామకరణం చేసి పూజిస్తున్నారు. ఈ ఆలయాన్ని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తులకు అపార నమ్మకం. శివరాత్రి పర్వదినాన్ని ఈ ఆలయంలో అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. అభిషేకం, రుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణం, భజన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లను నేపాల్ సేవా సమితి సభ్యులే చేసుకుంటారు. నగరంలో సుమారు 30 వేల మంది నేపాలీ కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. శివరాత్రి రోజున ప్రతి ఒక్క నేపాలీ కుటుంబం ఇక్కడికి వచ్చి పూజలు చేస్తుంటారు.

కోరికలు నెరవేరుతాయి



పసుపతి గోరఖ్‌నాథ్ శివాలయానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు.ఎంతో మహిమ గల ఈ ఆలయంలో పూజలు చేస్తే కోరికలు తప్పకుండా నెరవేరుతాయి. ఆలయంలో వసతులు కల్పించి మరింత అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే గోపీనాథ్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నాం.
–రాజన్ సాహూ ,ఆలయ కమిటీ అధ్యక్షుడు

మరింత అభివృద్ధి చేస్తాం



ఎస్ఎస్‌బీనగర్‌లోని నేపాలీలు నిర్మించిన శివాలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. శివరాత్రి ఉత్సవాలను ఇక్కడ ఘనంగా నిర్వహిస్తారు. గోరఖ్‌నాథ్ ఆలయం ఇక్కడ ఉండటం ఈ డివిజన్‌వాసులు చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నాం. ఎమ్మెల్యే గోపీనాథ్ ప్రోత్సాహంతో ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నా వంతు కృషి చేస్తా. –సీఎన్ రెడ్డి, కార్పొరేటర్

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



బోరబండలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వాసవి బిజినెస్ గ్రూప్ ఫౌండర్ మడిపడిగె రాజు



సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు జరుపుతున్న ఎర్రగడ్డ బీఆర్ఎస్ నేతలు

బంజారాహిల్స్: ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలు వాడవాడలా శుక్రవారం ఘనంగా జరిగాయి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో పెద్ద ఎత్తున నిర్వహించిన జన్మదిన వేడుకలకు నియోజకవర్గ వ్యాప్తంగా నేతలు, కార్యకర్తలు విచ్చేసి కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద వాసవి గ్రూప్ బిజినెస్ గ్రూప్, సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలాచారి, వాసవి గ్రూప్ ఫౌండర్ మడిపడిగె రాజు ప్రారంభించారు.

రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో...

రహమత్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో ఘనంగా జరిగాయి. బోరబండ బస్టాప్ వద్ద జరిగిన వేడుకల్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణమోహన్, ఇన్‌చార్జ్ సిరాజ్, కోఆర్డినేటర్ విజయసింహ, నాయకులు ధర్మ, బాబానాయక్, యూసుఫ్, సరళాదేవి పాల్గొన్నారు. రహమత్‌నగర్ ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.జగన్, కన్న, విజయ్‌కిరణ్ పాల్గొన్నారు.

ఎర్రగడ్డ డివిజన్‌లో...

శ్రీనగర్‌కాలనీ: సీఎం కేసీఆర్ జన్మదినవేడుకలను ఎర్రగడ్డ డివిజన్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి సంబురాలు చేశారు.డివిజన్ అధ్యక్షుడు డి.సంజీవ, గంట మల్లేష్, సర్దార్, నర్సింగరావు, ముస్తాక్, సదానంద్, శ్రావణ్‌పటేల్, కల్యాణి, సుధ, ప్రవీణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే బడుగులకు మేలు

ఫిలింనగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే బడుగుల బతుకులు బాగుపడతాయని ఖైరతాబాద్ కాంగ్రెస్ నాయకురాలు పి.విజయారెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా శుక్రవారం ఆమె ఫిలింనగర్ 18 బస్తీల్లో పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేదలు ఇల్లు కట్టుకుంటే కాంగ్రెస్ ఐదు లక్షల రూపాయలు ఇస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని కోరారు.



ఫిలింనగర్ బస్తీల్లో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకురాలు విజయారెడ్డి

సినీ డైరెక్టర్ అదృశ్యం

అమీర్‌పేట: సినీ డైరెక్టర్ అదృశ్యమైన ఘటన ఎస్ఆర్‌నగర్ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్ఐ స్వప్నారెడ్డి కథనం ప్రకారం.. దాసారం బస్తీ నివాసి మోహన్‌రెడ్డి(42) సినీ డైరెక్టర్‌గా పనిచేయడంతో పాటు కొన్ని సినిమాలకు రైటర్‌గా పని చేశాడు. అనారోగ్య సమస్యలు ఉండటంతో గురువారం సా యంత్రం కుటుంబ సభ్యులు సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇంటికి తిరిగి వస్తుండగా కనిపించకుండా పోయాడు. బంధు,మిత్రులను వాకబు చే సినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోహన్‌రెడ్డి మానసిక స్థితి సరిగా లేదన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

అమీర్‌పేట: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న జంగా వెంకటేశ్వర్‌రావు సనత్‌నగర్ జెక్ కాలనీ స్ట్రీట్ నెంబర్-5లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 7న వెంకటేశ్వర్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి అమలాపురం వెళ్లాడు. 14న ఇంటి తలుపులు తెరిచి ఉన్నట్లు గమనించిన స్థానికులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. 16న ఇంటికి వచ్చి చూడగా బీరువాలో ఉన్న 3.5 తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి వస్తువులు కనిపించలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జేహెచ్‌పీఎస్‌కు ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ అవార్డు

ఫిలింనగర్: ప్రారంభ అభ్యాసం, చైల్డ్ డెవలప్‌మెంట్ విభాగం ఆవిష్కరణలో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు ప్రత్యేక గుర్తింపు లభించింది. అపాక్ న్యూస్ నెట్‌వర్క్ ఐదవ గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్ కాన్‌క్లేవ్‌లో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు అపాక్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ అవార్డు లభించింది. స్కూల్ చైర్మన్ ఎ. మురళీ ముకుంద్‌కు టీజీ విజినరీ లీడర్ అవార్డు ప్రకటించగా, ఆయన తరపున స్కూల్ ఉపాధ్యాయురాలు శారద అందుకున్నారు. స్టాండ్ ఎలోన్ ప్రీ స్కూల్ ఆఫ్ ద ఇయర్ కింద మరో అవార్డు కూడా ఇదే పాఠశాలకు చెందిన టీచర్ సుధీర్ అందుకున్నారు. ఈ అవార్డుల ద్వారా పాఠశాల మరోసారి జాతీయ స్థాయిలో తన కీర్తిని చాటుకుందని ప్రిన్సిపాల్ ఎం. వరలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.



అవార్డు అందుకుంటున్న జేహెచ్‌పీఎస్ ఉపాధ్యాయురాలు శారద

ఆఫ్ఘాన్ విద్యార్థిపై దాడి: ఇద్దరి అరెస్టు

బంజారాహిల్స్: స్నేహితుడి వద్దకు వెళ్లేందుకు ర్యాపిడో బుక్ చేసుకొని రోడ్డు పక్కన వేచి ఉన్న ఆఫ్ఘాన్ విద్యార్థిపై ఇద్దరు యువకులు దాడి చేసి గాయపర్చిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే... ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన అబ్దుల్ బయాస్ బారిజ్(28) జేఎన్‌టీయూలో ఎంబీఏ చదువుతూ బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని శ్రీరాంనగర్‌లో మరో స్నేహితుడు జబియుల్లాతో కలిసి అద్దెకుంటున్నాడు. ఈ నెల 15న తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ర్యాపిడో కోసం అపార్ట్‌మెంట్ కిందకు వచ్చి వేచి చూస్తుండగా అదే ప్రాంతంలో నివసించే సమీర్(23), జఫార్ బేగ్(24) అనే బౌన్సర్ అకారణంగా వాగ్వాదానికి దిగి బారిజ్‌ను తీవ్రంగా కొట్టారు. అడ్డు వచ్చిన బారిజ్ స్నేహితుడు జబియుల్లాపై కూడా దాడి చేశారు. తమపై ఎందుకు దాడి చేస్తున్నారో కూడా చెప్పకుండానే తలపై బాదడంతో కిందపడ్డ బాధితుడిని వెంటనే ఆస్పత్రిలో చేర్చారు. నిందితులిద్దరూ అక్కడి నుంచి పరారు కాగా బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్ట్ చేశారు. వీరిపై ఐపీసీ సెక్షన్ 341, 324, 506 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కెనరా బ్యాంకులో మెగా రిటైల్ లోన్ క్యాంపు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నం. 10లోని కెనరా బ్యాంకులో శుక్రవారం మెగా రిటైల్ లోన్ క్యాంపును హైదరాబాద్ రీజినల్ డీజీఎం విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో 366 బ్రాంచీలు కలిగిన కెనరా బ్యాంకు దేశంలోని అతిపెద్ద బ్యాంకుల్లో నాల్గో స్థానంలో ఉందన్నారు. పరిశ్రమలకు, వ్యాపార సంస్థలకు, చిరు వ్యాపారులకు రుణాలు అందిస్తామన్నారు. అతి తక్కువ వడ్డీ రేట్లతో సొంతింటి కల సాకారం చేసుకోవడానికి హోంలోన్స్ కూడా ఇస్తున్నామని, ప్రాసెసింగ్ ఫీజు లేనందున మార్చి 31 వరకు ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. డివిజన్ మేనేజర్ సందీప్, గురు ప్రసాద్, సునీత, దిలీప్, మృదుల, అభిలాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రీజినల్ డీజీఎం విజయ్‌కుమార్

రేషన్ బియ్యం పట్టివేత

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం.12లోని భోలానగర్‌లో ఓ గదిలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం నిల్వ చేశారన్న సమాచారం మేరకు రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్‌తో పాటు సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎండీ ఇర్ఫాన్, ఎండీ రహీముద్దీన్ అనే ఇద్దరు నిందితులు తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేస్తూ వాటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తూ ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లుగా తేలింది. ఎనిమిదిన్నర క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్నారు. స్థానిక కార్డుదారుల నుంచి కిలో రూ. 8 కి కొనుగోలు చేసి ఆరాంఘర్‌లో కిలో రూ.11కు విక్రయిస్తున్నట్లుగా అధికారులు గుర్తించారు. దీంతో వీరిపై చర్యలు తీసుకోవాలంటూ అనిల్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఇర్ఫాన్, రహీముద్దీన్‌లపై ఐపీసీ సెక్షన్ 420 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

అమీర్‌పేట: యువతిని వేధిస్తున్న వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికంగా ఓ హాస్టల్‌లో ఉంటున్న 25 ఏళ్ల యువతి ప్రైవేట్ సంస్థలో పనిచేస్తుంది. యువతి సాఫ్ట్‌వేర్ శిక్షణ తీసుకుంటున్న సమయంలో హరిబాబు అనే వ్యక్తి పరిచయమయ్యాడు. అతడు తరుచూ ఫోన్ చేసి తన కోర్కె తీర్చాలని, లేని పక్షంలో నీతో పాటు కుటుంబ సభ్యులను చంపుతానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. హరిబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం



ప్రదర్శనలోని చీరలను తిలకిస్తున్న తారాదేవి

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్య సాయి నిగమాగమంలో శుక్రవారం గ్రామీణ హస్తకళావికాస్ సమితి ఆధ్వర్యంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో–2023 పేరిట ఏర్పాటుచేసిన చేనేత వస్త్రప్రదర్శనను నటి తారాదేవి ప్రారంభించారు. ఈ ప్రదర్శనలోని చీరలు నగర ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటుందని, చేనేతకారులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ ఆభరణాలు, పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 70 స్టాళ్లలో అందుబాటులో ఉంచారు. ఈనెల 22 వరకూ ఈ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకుడు జయేష్‌గుప్తా తెలిపారు.

బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: చింతల

ఫిలింనగర్: 'ప్రజాగోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని భగత్‌సింగ్ కాలనీ బీజేపీ శక్తి కేంద్రం నిర్వహించిన స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి పాల్గొన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు సాధనే లక్ష్యంగా బీజేపీ శ్రేణులు ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలను అసమర్థ పాలనను ఎక్కడికక్కడ ఎండగట్టాలని దిశా నిర్దేశం చేశారు. బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

'మంత్రి ప్రోద్బలంతోనే ఇష్టానుసారంగా పనులు'

సనత్‌నగర్: ఎర్రగడ్డ–సనత్‌నగర్ ప్రధాన రహదారిలో నిర్దిష్టమైన అలైన్‌మెంట్ లేకుండా సాగుతున్న పనులను వెంటనే నిలిపివేయాలంటూ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంత్రి ప్రోద్బలంతోనే అలైన్‌మెంట్‌ను ఇష్టానుసారంగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ మహంకాళి–సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్ సరళతో కలిసి డివైడర్ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని శుక్రవారం శశిధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అలైన్‌మెంట్ లేకుండా రహదారిని అడ్డదిడ్డంగా తవ్వుతూ డివైడర్ పనులు చేయడం వెనుక బీఆర్ఎస్ నేతల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఫతేనగర్ బ్రిడ్జి ల్యాండింగ్ వరకూ డివైడర్ ఏర్పాటు చేస్తున్నారని, దీంతో సనత్‌నగర్ బస్టాండ్, ఫతేనగర్ బ్రిడ్జి కిందకు వెళ్లే క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. తక్షణమే పనులు నిలిపివేసి, సరైన అలైన్‌మెంట్ రూపొందించాలని డిమాండ్ చేశారు. సనత్‌నగర్ కాలనీవాసులు, ట్రాఫిక్ నిపుణులు, విపక్ష పార్టీల అభిప్రాయాలను తీసుకోవాలని ఆయన సూచించారు.



డివైడర్ పనులను పరిశీలిస్తున్న శశిధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు

ఎఫ్ఎన్‌సీసీ మీడియా కమిటీ చైర్మన్‌గా సత్యనారాయణ



హైదరాబాద్: ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్ఎన్‌సీసీ) మీడియా కమిటీ చైర్మన్ గా కె. సత్యనారాయణ నియమితులయ్యారు. ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్ష, కార్యదర్శులు ఘట్టమనేని శేష గిరిరావు, ముళ్లపూడి మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం వెల్లడించారు. ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఉన్న సత్యనారాయణ ఫిలింనగర్ క్లబ్ మీడియా, వెబ్ సైట్, న్యూస్ లెటర్, సబ్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

క్లుప్తంగా

నేడు శివపార్వతుల కల్యాణం

సాక్షి, సిటీబ్యూరో: నేడు మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా బోరబండ స్వరాజ్‌నగర్‌లోని హరిహర క్షేత్ర దేవస్థానంలో శివపార్వతుల కల్యాణం జరగనుంది. అలాగే లింగోద్భవ కాలమహాన్యాస రుద్రాభిషేకం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. పాల్గొనే భక్తులు అభిషేకానికి అవసరమైన పూజా సామగ్రిని వెంట తీసుకురావాలని సూచించారు.

వైభవంగా కుంకుమార్చన పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

బంజారాహిల్స్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ మహాలక్ష్మి అమ్మవారి కుంకుమార్చన పూజలు టీటీడీ కల్యాణ మండపంలో వైభవంగా జరిగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి నెలా మూడో శుక్రవారం ఉదయం 10 గంటలకు కుంకుమార్చన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఆలయంలో బోర్ పనులు ప్రారంభం



దీపక్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ నాయకులు

రహమత్‌నగర్: సామాజిక సేవా కార్యక్రమాల్లో బీజేపీ ఎల్లప్పుడు ముందుంటుందని జూబ్లీహిల్స్ ఆ పార్టీ నాయకుడు లంకాల దీపక్ రెడ్డి గుర్తు చేశారు. బోరబండ డివిజన్ భరత్‌నగర్‌లోని పాండురంగనాథ ఆలయంలో శుక్రవారం ఆయన బోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా దీపక్ రెడ్డి మాట్లాడుతూ, బీజేపీ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. నాయకులు ప్రేమ్, శ్రీనివాస్‌గౌడ్, మధు, తేజ, గణేష్, కొత్త వెంకటేశ్, కృష్ణ, తివారీ తదితరులు పాల్గొన్నారు.

స్కూటర్ స్టాండ్‌ను పునరుద్ధరించాలని వినతి

ఖైరతాబాద్: తెలంగాణ పాఠ్యపుస్తక ముద్రణాలయంలో జీహెచ్ఎంసీ అధికారులు నాలా పైప్‌లైన్ పనుల్లో భాగంగా తొలగించిన స్కూటర్ స్టాండ్‌ను తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ పాఠ్యపుస్తక ముద్రణాలయం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సర్కిల్ –17 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన అధికారులు వెంటనే పనులు చేపడతామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆర్.ఈశ్వర్, మల్లికార్జున్, విశ్వసేన, శ్రీకాంత్, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్‌ఫేర్



నమూనాల గురించి వివరిస్తున్న విద్యార్థులు

రహమత్‌నగర్: ఎప్పీఆర్ హిల్స్ రెడ్‌రోజ్ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో ఆకట్టుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన సామాజిక, చైతన్యవంతమైన నమూనాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల చైర్మన్ నీల రమేశ్ కుమార్ మాట్లాడుతూ, సైన్స్‌ఫేర్ ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయొచ్చన్నారు.

ప్రేమ పేరుతో మోసం

అమీర్‌పేట: యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన శాలిని గోడి బోరబండ రాజ్‌నగర్‌లో ఉంటూ జూనియర్ ఆర్టిస్టుగా పని చేస్తుంది. 2021లో గుంటూరులో ఉండగా రోహిత్‌ఖాన్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. యువతి నగరానికి రావడంతో రోహిత్ ఖాన్ సైతం ఇక్కడకు వచ్చాడు. తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో అతడి మాటలు నమ్మింది. అయితే ఆమె గర్భం దాల్చిన విషయం తెలియగానే ముఖం చాటేశాడు. ఫోన్ చేసినా తీయకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

రైతులకు ధాన్యం వ్యాపారి టోకరా

- రూ.2 కోట్లు ఎగవేత?
- మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లో బాధితులు
- పోలీసుస్టేషన్లలో రైతుల ఫిర్యాదు

బెల్లంపల్లి/తాండూర్/రెబ్బెన(ఆసిఫాబాద్): ధాన్యం విక్రయించిన రైతులను ఓ వ్యాపారి నిలువునా ముంచాడు. మద్దతు ధరతో వరి ధాన్యం కొనుగోలు చేసి నెలలు గడిచినా డబ్బులు ఇవ్వకుండా అదృశ్యమయ్యాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లో బాధిత రైతులు శుక్రవారం పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారు. వ్యాపారి నల్ల రమేష్ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, తాండూర్, కుమురంభీం జిల్లా రెబ్బెన మండలాల్లోని గ్రామాల్లో వంద మందికిపైగా రైతుల వద్ద ఖరీఫ్‌లో సుమారు రూ.2 కోట్లకుపైగా విలువైన వరి ధాన్యం కొనుగోలు చేశాడు. సీజన్ ప్రారంభంలో ధాన్యం విక్రయించిన రైతులకు మద్దతు ధర చెల్లించాడు. దీంతో మిగతా రైతులకు అతడిపై నమ్మకం ఏర్పడటంతో ధాన్యం విక్రయించారు. డబ్బులు కొద్ది రోజుల్లోనే చెల్లిస్తానంటూ గడువు విధిస్తూ వచ్చాడు. అయితే నెలలు గడిచినా డబ్బులు చెల్లించకపోవడం, కొంతకాలంగా రమేష్ మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ రావడం, అందుబాటులో లేకపోవడంతో రైతుల్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఒక్క రెబ్బెన మండలంలోని కిష్టాపూర్‌లో ఆరుగురు, రాజారాంలో నలుగురు, తక్కళ్లపల్లిలో సుమారు 17మంది రైతులు రెండు వేల క్వింటాళ్ల వరకు ధాన్యం విక్రయించారు. ఈ మండలంలో సుమారు రూ.30లక్షల వరకు చెల్లించాల్సి ఉండగా, మంచిర్యాల జిల్లా వెంకటాపూర్‌లో రూ.20 లక్షలు, రేచినిలో రూ.10 లక్షలు, మిగతా గ్రామాల్లో రూ.40 లక్షలు చెల్లించాల్సి ఉన్నట్లు బాధిత రైతుల ద్వారా తెలుస్తోంది. మోసపోయామని గ్రహించిన రైతులు మంచిర్యాల జిల్లా తాండూర్ సీఐ జగదీష్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. రెబ్బెన, కన్నెపల్లి పోలీస్‌స్టేషన్లలోనూ ఫిర్యాదు చేశారు.

కల్తీ విత్తన విక్రేతలపై కఠిన చర్యలు: డీజీపీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నాసిరకం విత్తనాలు విక్రయిస్తున్న ముఠాలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు డీజీపీ అంజనీకుమార్ వెల్లడించారు. 2014 నుంచి 2022 వరకు మొత్తం 991 కేసులు నమోదు చేసినట్లు శుక్రవారం డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నాసిరకం విత్తనాల విక్రయానికి యత్నించిన 1,932 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 58 మందిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

టెక్ ఉద్యోగులకు ‘లే ఆఫ్స్’

ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాదిలో లక్ష మందికిపైగా టెకీలు ఇంటికి
అధిక నైపుణ్యం ఉన్న వారికీ తప్పని తొలగింపు తిప్పలు

- ఎక్కువ మందిని తీసేసిన ఐటీ కంపెనీల జాబితాలో అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్
- ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్య పరిస్థితులవల్లే..
- మరికొంతకాలం ఈ ట్రెండ్ కొనసాగుతుందంటున్న ఆర్థిక నిపుణులు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం పరిస్థితుల నేపథ్యంలో చిన్న, పెద్ద కంపెనీలన్నీ పొదుపు మంత్రం పఠిస్తూ ఉద్యోగాల్లో భారీ కోతలు పెడుతున్నాయి. గతంలో అవసరానికి మించి ఉద్యోగులను తీసుకున్న సంస్థలు.. కోవిడ్ వ్యాప్తి అనంతరం చోటుచేసుకున్న ఆర్థిక పరిణామాల నేపథ్యంలో ప్రస్తుతం వేలాది మందిని తొలగించేస్తున్నాయి. ఉద్యోగాల్లో చేరి పట్టుమని 10 రోజులు పూర్తికాని వారు మొదలు ఏళ్ల తరబడి పనిచేస్తున్న సీనియర్లను సైతం పక్కన పెట్టేస్తున్నాయి. ఈ ప్రభావం ఐటీ, ఇతర టెక్నాలజీ రంగాల ఉద్యోగులపైనే ఎక్కువగా పడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ నెలలో ఇప్పటి వరకు 17,400 మంది ఐటీ ఉద్యోగులు ఉద్వాసనకు గురవగా వారిలో భారతీయులే ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు ఐటీ వర్గాలు చెబుతున్నాయి.. మొత్తం మీద ఇప్పటివరకు 340కిపైగా సంస్థలు, కార్పొరేషన్లు, బడా కంపెనీలు లక్ష మందికిపైగా ఉద్యోగులను తొలగించాయి. ఈ ట్రెండ్‌కు ఇప్పట్లో ఫుల్‌స్టాప్ పడే పరిస్థితులు కనిపించడం లేదని ఆర్థికరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.



ముందు వరుసలో బడా కంపెనీలు...

ఉద్యోగుల తొలగింపు సంఖ్యను లెక్కిస్తున్న layoffs.fyi వెబ్‌సైట్ తాజా గణాంకాల ప్రకారం ఈ ఏడాదిలో ఇప్పటిదాకా 345 టెక్ కంపెనీలు 1,03,767 మందికి లేఆఫ్ ప్రకటించాయి. ఇది 2022 వ్యాప్తంగా జరిగిన అన్ని టెక్ బిజినెస్ లేఆఫ్‌లలో 64 శాతం కావడం గమనార్హం. గతేడాది 1,045 ఐటీ, టెక్ కంపెనీలు 1,60,097 ఉద్యోగులను తొలగించాయి. ఉద్యోగుల తొలగింపులో అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్, సేల్స్‌ఫోర్స్ మరికొన్ని దిగ్గజ సంస్థలు ముందు వరసలో ఉన్నాయి. జనవరిలోనే ప్రపంచవ్యాప్తంగా 288 సంస్థలు, పరిశ్రమలు 3,300 ఐటీ నిపుణులకు ఉద్వాసన పలికాయి. ఈ నెలలో ఉద్వాసనలపర్వం మొదలుపెట్టిన టెక్ దిగ్గజాల్లో యాహూ, బైజూస్, గోడ్యాడీ, గిట్‌హబ్, ఈబే, ఆటోడెస్క్, ఓఎల్ఎక్స్ గ్రూప్ ఉన్నాయి. మొత్తంమీద చూస్తే యాపిల్ సంస్థ మినహా పెద్ద టెక్ సంస్థలు ఉద్యోగులను తగ్గిస్తున్నాయి

ఎందుకీ పరిస్థితి?

→ ప్రముఖ ఆర్థిక, రాజకీయరంగ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ ‘సాక్షి’కి తెలిపిన వివరాల ప్రకారం ఐటీ వ్యాపారాలు అత్యధికంగా ఎగుమతుల ప్రధానమైనవి. ముఖ్యంగా భారత్‌లోని ఐటీ కంపెనీలు ప్రపంచ మార్కెట్‌కు ఎక్కువగా దోహదపడేవిగా ఉన్నాయి. అందువల్ల ప్రపంచ ఆర్థిక రంగంలో వచ్చే మార్పులకు అవి కూడా లోనవుతున్నాయి. ముఖ్యంగా కరోనా వ్యాప్తి, ఆ తర్వాత రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా–చైనాల వాణిజ్య చిక్కులు పశ్చిమ దేశాల ఆర్థిక రంగంపై సవాళ్లు విసురుతున్నాయి. అందువల్ల ఈ పరిణామాల ప్రభావం భారత ఐటీ రంగంపైనా పడుతోంది. ఆర్థిక మాంద్య పరిస్థితుల్లో కంపెనీల యాజమాన్యాలు సిబ్బందిని తగ్గించుకుంటున్నాయి. కరోనా కాలంలో ఐటీ రంగం అసహజమైన వృద్ధిని సాధించింది. గతంలో కంపెనీలు సాధారణ రిక్రూట్‌మెంట్ కంటే ఎక్కువ చేశాయి. ఇప్పుడు సిబ్బందిని తగ్గించుకోవడం మొదలుపెట్టాయి. కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటి సాంకేతికత మరింతగా అందుబాటులోకి రావడంతో అధిక నైపుణ్యం ఉన్న వారు కూడా ఉద్యోగాలు కోల్పోతున్నారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ రంగంలోనే ఉద్యోగులు, కార్మికుల వేతనాలు తగ్గుతున్నాయి.

ఇంటరాగేషన్‌లో గాయాలు.. వ్యక్తి మృతి!

- మెదక్ పట్టణంలో చైన్ స్నాచింగ్
- అనుమానంతో ఖదీర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విడిచిపెట్టాక అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిక.. చికిత్స పొందుతూ మృతి



ఖదీర్ భార్య, పిల్లలు.
చికిత్స పొందుతూ గాంధీలో మృతి చెందిన ఖదీర్

మెదక్ జోన్: చైన్ స్నాచింగ్ చేశాడనే అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యక్తి.. తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు చిత్రహింసలు పెట్టి, ఇష్టం వచ్చినట్టుగా కొట్టారని.. దానితో కిడ్నీలు దెబ్బతిని మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెదక్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి మృతుడి భార్య ఎస్పీకి ఫిర్యాదు చేసింది. భర్త చావుకు కారణమైన పోలీసులపై హత్యకేసు పెట్టి, అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది.

అసలు ఏం జరిగింది?

మెదక్ పట్టణంలోని అరబ్ గల్లీలో జనవరి 27న గుర్తు తెలియని దుండగుడు ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు తెంపుకెళ్లాడు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు.. ఆ దుండగుడు మహ్మద్ ఖదీర్ అని అనుమానించారు. మెదక్ పట్టణంలో చిన్న పాన్ షాపు నడుపుకొనే ఖదీర్.. అది సరిగా నడవకపోవడంతో కొన్నిరోజులుగా హైదరాబాద్‌లోని తన సోదరి ఇంట్లో ఉంటూ కూలిపనులు చేసుకుంటున్నాడు. అతడి గురించి ఆరా తీసిన పోలీసులు జనవరి 29న హైదరాబాద్ వెళ్లి, సోదరి ఇంట్లో ఖదీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మెదక్ ఠాణాకు తరలించి ఐదు రోజులపాటు అదుపులో ఉంచుకున్నారు. ఏమీ తేలకపోవడంతో ఫిబ్రవరి 3న మెదక్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి వదిలేశారు.

దెబ్బలకు కిడ్నీలు దెబ్బతిని..

పోలీసులు వదిలేసిన తర్వాత ఖదీర్ తీవ్రంగా అస్వస్థతకు లోనయ్యాడు. ఫిబ్రవరి 6న మెదక్ ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. పరీక్షలు చేసిన వైద్యులు బలమైన దెబ్బలు తగిలి కిడ్నీలు చెడిపోయాయని, మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. దీనితో ఖదీర్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, మూడు రోజులు చికిత్స చేయించారు. ఈ ఖర్చులను పోలీసులే భరించారని ఖదీర్ భార్య తెలిపింది. కానీ ఖదీర్ పరిస్థితి విషమించడంతో ఫిబ్రవరి 12న గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ 16న రాత్రి మృతి చెందాడు. గురువారం రాత్రే ఖదీర్ చనిపోయినా.. కేసు నమోదవకపోవడం, ఎఫ్ఐఆర్ కాకపోవడంతో మృతదేహానికి శుక్రవారం రాత్రి వరకు పోస్టుమార్టం చేయలేదు. దీనితో పోలీసులు సీఆర్‌పీసీ సెక్షన్ 174 కింద కేసు నమోదు చేశారు.

ఎస్సై, కానిస్టేబుళ్ల బదిలీ

ఖదీర్ మృతి నేపథ్యంలో మెదక్ పట్టణ ఎస్సై రాజశేఖర్‌ను డీసీఆర్బీకి అటాచ్ చేస్తూ.. కానిస్టేబుల్ పవన్ కుమార్‌ను రేగోడుకు, ప్రశాంత్‌ను పాపన్నపేటకు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

అకారణంగా నా భర్తను చంపేశారు

దొంగతనం నెపంతో తన భర్తను దారుణంగా కొట్టి చావుకు కారణమైన పోలీసులపై హత్యకేసు నమోదు చేయాలని ఖదీర్ భార్య సిద్దేశ్వరి డిమాండ్ చేశారు. దీనిపై శుక్రవారం మెదక్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన భర్తను అకారణంగా చంపి తనను, తన ముగ్గురు పిల్లలను రోడ్డున పడేసిన పోలీసులకు ఉసురు తగులుతుందంటూ ఆమె రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది. కాగా.. హైదరాబాద్‌లోని తమ ఇంట్లో ఖదీర్‌ను అదుపులోకి తీసుకునే సమయంలో పోలీసులు దారుణంగా కొట్టారని, కాళ్లు మొక్కినా వినలేదని ఖదీర్ సోదరి తపసుల్ పేర్కొన్నారు.

పాత నేరస్తుడని అదుపులోకి..

‘‘ఖదీర్ పాత నేరస్తుడు. అరబ్‌గల్లీలో ఓ మహిళ మెడలోంచి గొలుసు తెంపుకెళ్లిన వ్యక్తి సీసీ ఫుటేజీలో ఖదీర్‌లా ఉండటంతోనే అదుపులోకి తీసుకున్నాం. ప్రశ్నించిన తర్వాత ఫిబ్రవరి 3వ తేదీన తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి వదిలేశాం. 6వ తేదీన అతడు ఆస్పత్రిలో చేరాడు. మధ్య ఏం జరిగిందో మాకు తెలియదు..’’
– మెదక్ డీఎస్పీ సైదులు

జీవన్‌రెడ్డి పై మరోసారి హత్యకు కుట్ర?

- ఓ మహిళ ఇంట్లో పేలుడు పదార్థాలు స్వాధీనం
- గతేడాది ఎమ్మెల్యేపై హత్యాయత్నం కేసు నిందితుడు వాటిని తన ఇంట్లో ఉంచాడంటున్న ఆ మహిళ

ఖలీల్‌వాడి: ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై మరో మారు హత్యకు కుట్ర జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం నగరంలోని నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి కేసీఆర్ కాలనీ న్యూ హౌసింగ్ బోర్డులో బొంత సుగుణ అనే మహిళ ఇంట్లో పోలీసులు పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు రూరల్ ఎస్‌హెచ్‌వో లింబాద్రి తనిఖీలు చేపట్టారు. 95 జిలెటిన్ స్టిక్స్, 10 డిటోనేటర్లను స్వాధీనం చేసుకున్నారు. మహిళను అదుపులోకి తీసుకొని విచారించగా మాక్లూర్ మండలం కల్లెడ సర్పంచ్ భర్త ప్రసాద్ గౌడ్ తన ఇంట్లో వీటిని పెట్టినట్లు తెలిపింది. ప్రసాద్ గౌడ్ గత ఏడాది ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై హైదరాబాద్‌లో హత్యాయత్నం కేసులో చంచల్‌గూడ జైలుకు వెళ్లాడు. జనవరి 9న జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన తర్వాత జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లను కొనుగోలు చేసి మహిళ ఇంట్లో దాచిపెట్టాడని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ప్రసాద్‌గౌడ్ ఒకరిపై కత్తితో దాడిచేసిన కేసులో నిజామాబాద్ జిల్లా జైలులో ఉన్నాడు.



మార్చి 25లోగా ఉపాధి పనుల పూర్తి

పీఆర్‌శాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, జీపీ భవనాల పనులను వచ్చేనెల 25 లోగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఆదేశించారు. మంజూరైన ఉపాధి పనులు, గ్రౌండింగ్ పనుల ప్రగతిపై శుక్రవారం బీఆర్‌కేఆర్ భవన్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లోసమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గడువులోగా పనులు పూర్తిచేసి ఎఫ్‌టీపీలో అప్లోడ్ చేస్తే నిధులు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆయా జిల్లాల్లో అందుబాటులో ఉన్న మెటీరియల్ కాంపోనెంట్ నిధుల ఆధారంగా ప్రాధాన్యం ప్రకారం చేపట్టాలని స్పష్టం చేశారు. పనులను సకాలంలో పూర్తి చేసేందుకు కూలీలను పెద్ద సంఖ్యలో తరలించాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా పక్కాగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

నగర వార్తలు

కోమాలో ఉన్న తండ్రి వేలిముద్రలు తీసుకొని ఆస్తి కాజేశారు

లంగర్‌హౌస్: ఆస్పత్రిలో కోమాలో ఉండి చికిత్స పొందుతున్న తండ్రి వేలిముద్రలు దొంగతనంగా తీసుకొని ఆయన ఆస్తిని కాజేశారు. దాదాపు 6 సంవత్సరాల తరువాత కోర్టు ఆదేశాలమేరకు సబ్‌రిజిస్ట్రార్ అధికారితో పాటు మరో ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేశారు.

ఈ సంఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం....లంగర్‌హౌస్ డిఫెన్స్ కాలనీలో షేక్‌మహబూబ్ సబ్రి తన 400 గజాల స్థల ఇంటిలో నివాసముంటున్నాడు.2017 జులై 9 నుండి 18 వ తేది వరకు ఆయన తీవ్రఅనారోగ్యంతో ప్రేమియర్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందాడు.11 వ తేదిన ఆయన కుమారుడు షేక్ మొహినుద్దీన్ సబ్రి తన భార్య బావమరిదితో కలిసి ఆస్పత్రిలో తండ్రిని చూడటానికి ఐసీయూకి వెళ్లి అక్కడ కోమాలో ఉన్న తండ్రి వేలిముద్రలను అప్పటికే తెచ్చుకున్న నకిలీ డాక్యుమెంట్లపై వేలిముద్రలు పెట్టించుకున్నారు. 2019 ఫిబ్రవరి 12 తేదిన కుమారుడు మొహినుద్దీన్ సబ్రి తన బావమరుదులతో కలిసి మొదటి అంతస్తును బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు.కిరాయిదారులను కూడా బెదిరిస్తు తండ్రిని చిత్రహింసలు పెడుతున్నారు. దీంతో భాదితుడు కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాలమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



బహుమతులు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్ర స్థాయి చెస్ చాంప్ శరణ్య

సాక్షి, హైదరాబాద్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) ఆధ్వర్యంలో కేసీఆర్ కప్ మహిళల రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ఘనంగా ముగిశాయి. సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో మెరుగైన ప్రదర్శన కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో రంగారెడ్డి జిల్లాకు చెందిన గాదె శరణ్య ఓవరాల్ విజేతగా నిలిచింది. మిగతా విభాగాల్లో దీక్షిత, క్రితిక, అభిరామి, రేణుక, జ్ఞానత, విజేత, షరిష్మా ట్రోఫీలతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందుకున్నారు. మరో వైపు ఇటీవల ముగిసిన ఖేలో ఇండియా యూత్‌గేమ్స్‌లో పతకాలు సాధించిన ప్లేయర్లతో పాటు అండర్–19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు క్రికెటర్లు త్రిష, యశశ్రీని ఈ సందర్భంగా సన్మానించారు. మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ‘శాట్స్’ చైర్మన్ ఆంజనేయగౌడ్, రావుల శ్రీధర్ రెడ్డి, వేణుగోపాలచారి, జగదీశ్వర్ యాదవ్, కేఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలను కట్టడిచేసేందుకు పోరాటం

హిమాయత్‌నగర్: ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా కొందరు యూట్యూబ్ చానల్స్ వాళ్లు సెలబ్రిటీలపై తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారని సినీ నటుడు నరేష్ వ్యాఖ్యానించారు. తనపై యూట్యూబ్ చానల్స్ చేస్తున్న అసత్య ప్రచారాలపై నరేష్ గతంలో సైబర్‌క్రైంలో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈనేపథ్యంలో శుక్రవారం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సినిమా పరిశ్రమపై కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలను కట్టడి చేసేందుకు సైబర్‌క్రైం వేదికగా తాను పోరాటం చేస్తున్నానన్నారు. ప్రచారం చేసిన కొందరిపై కోర్టులో డిఫమేషన్ కేసు వేసినట్లు త్వరలో తనకు అనుకూలంగా తీర్పు వస్తుందన్నారు.

రాష్ట్ర అభ్యున్నతికి సీఎం కృషి



సాక్షి, సిటీబ్యూరో: కేసీఆర్ జన్మదినం సందర్భంగా అంబర్‌పేట్, నల్లకుంటలోని పురాతన రామాలయ మందిరంలో సీతారాముల కల్యాణాన్ని స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి దంపతులు జరిపించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ గురువు మృత్యుంజయ శర్మ, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, నాయిని శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పిట్ల విశాల్ గౌడ్, కన్నా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి దివ్యాంగులు దరఖాస్తు చేసుకోండి

చాదర్‌ఘాట్: అర్హులైన దివ్యాంగులు స్వయం ఉపాధి, పునరావాస పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ సంచాలకులు బి.శైలజ ఒక ప్రకటనలో సూచించారు. దివ్యాంగులకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టిందని ఆమె తెలిపారు. దివ్యాంగులు వ్యవసాయ, అనుబంధ పరిశ్రమలు, సేవా వ్యాపారాలను స్థాపించుకొని తద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొంది సాధారణ జీవనాన్ని గడపాలనేది ప్రభుత్వ ఉద్దేశం అని వివరించారు. పథకానికి అర్హులైన దివ్యాంగులు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తమ దరఖాస్తులను **డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్ఓ.బీఎంఎంఎస్.సీజీజీ.జీఓవీ.ఐఎస్‌లో** ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. వివరాలకు సంబంధిత జిల్లా సంక్షేమ అధికారి, వికలాంగుల శాఖ సహాయ సంచాలకులను సంప్రదించాలని తెలిపారు. వివరాలకు ఫోన్ 040 2455 9048లో కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని ఆ ప్రకటనలో సూచించారు.

పోలీసుల అదుపులో ప్రేమజంట

బంజారాహిల్స్: విజయవాడ నుంచి పారిపోయి వచ్చిన ప్రేమజంటను యువతి తల్లిదండ్రులు బలవంతంగా కారులోకి ఎక్కించుకొని తీసుకెళ్తుండగా చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడలోని సూరంపల్లి మాదలవాడీ గూడెంలో నివసించే గంగుల నవీన్ కుమార్ (23), అదే ప్రాంతానికి చెందిన బీటెక్ విద్యార్థిని (21) గత నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. యువతికి పెళ్లి సంబంధాలు చూస్తుండగా శుక్రవారం ఉదయం విజయవాడ నుంచి పారిపోయి హైదరాబాద్ యూసఫ్‌గూడలోని నవీన్ బంధువు ఇంటికి వచ్చారు. యువతి తల్లిదండ్రులు నవీన్ మొబైల్ ఫోన్ సిగ్నల్స్ ట్రేస్ చేసి శుక్రవారం రాత్రి 8.30 గంటలకు యూసుఫ్‌గూడ చేరుకున్నారు. అప్పటికే సమాచారం అందుకున్న నవీన్.. ప్రియురాలిని తీసుకుని మరో చోటకు పారిపోయేందుకు బయటకు రాగా అప్పటికే అక్కడ వేచివున్న యువతి తల్లిదండ్రులు ఆమెను బలవంతంగా కారులోకి ఎక్కించారు. నవీన్ అరుస్తూ చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయగా అక్కడ గుమిగూడిన వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని ప్రేమజంటను, తల్లిదండ్రులను స్టేషన్‌కు తీసుకొచ్చి విచారిస్తున్నారు. సోమవారం ఆర్యసమాజ్‌లో పెళ్లి చేసుకుందామని ఇక్కడకు వచ్చినట్లు నవీన్ తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీసులు విచారణ చేపట్టారు.

బ్రెయిలీలో సీఎం కేసీఆర్ జీవితచరిత్ర

చాదర్‌ఘాట్: బ్రెయిలీ లిపిలో సీఎం కేసీఆర్ జీవిత చరిత్రను పుస్తకాలుగా ముద్రించామని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన సరూర్‌నగర్‌లోని అంధ బాలికల వసతి గృహంలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. బాలికలతో కలసి కేక్ కట్ చేసిన ఆయన వారికి కేసీఆర్ జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు.

ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర ఎనలేనిది



మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు

పంజగుట్ట: ప్రజాస్వామ్య వ్యవస్థ పది కాలాలపాటు ఉండాలంటే పత్రికల పాత్ర ఎంతో ముఖ్యమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ‘ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర’ అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మాట్లాడుతూ.. సమాజాభివృద్ధి బాధ్యత ప్రభుత్వంతో పాటు పత్రికలది కూడా సమానంగా ఉంటుందన్నారు. రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ .. సోషల్ మీడియా ఎంతపెరిగి పోయినా పత్రికల ప్రాధాన్యత ఎన్నటికీ తగ్గదన్నారు. ఎవ్వరు ఎన్ని ఒత్తిడిలు పెట్టినా ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన భాధ్యత పత్రికలదే అన్నారు. కార్యక్రమంలో జాతీయ కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎ.కోదండ రెడ్డి, అంబేడ్కర్ వాది జె.బి.రాజులు పాల్గొన్నారు.

ఓయూలో విద్యార్థుల నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఆయన 9 ఏళ్ల పాలనపై ఓయూలో విద్యార్థులు నిరసన తెలిపారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బహుజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పలు సమస్యలను పరిష్కరించాలని, వర్సిటీలలో ఖాళీలను భర్తీ చేయాలని, విద్యకు నిధులు పెంచాలని నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. నల్ల బెలూన్లను గాలిలోకి ఎగురవేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకొని బహుజన్ స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్ వేల్పుల సంజయ్, ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతిని అరెస్ట్ చేశారు.

ముగిసిన ఓయూ వీసీ జపాన్ పర్యటన

ఓయూ వీసీ ప్రొ.రవిందర్ పది రోజుల జపాన్ పర్యటన ముగించుకొని నేడు నగరానికి చేరుకోనున్నట్లు శుక్రవారం అధికారులు తెలిపారు. టోక్యోలోని ఎస్ఐటీ ఆహ్వానం మేరకు ఆయన జపాన్ పర్యటనకు వెళ్లిన విషయం విధితమే.

20న ఖేలో తెలంగాణ.. జీతో తెలంగాణ క్రీడలు

- ప్రారంభించనున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఈనెల 20న నగరంలోని నిజాం కళాశాల మైదానంలో ఏబీవీ ఫౌండేషన్ సౌజన్యంతో ‘ఖేలో తెలంగాణ..జీతో తెలంగాణ’ పేరుతో నిర్వహించనున్న క్రీడా పోటీలను కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ నెల 21 నుంచి 26 వరకు పలు అంశాల్లో క్రీడాపోటీలను నిర్వహించనున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, అథ్లెటిక్స్ విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించనున్నారు. నగరంలోని 29 ప్రముఖ క్రీడామైదానాల్లో పోటీలుంటాయి. కాగా ఈ క్రీడల ముగింపు ఉత్సవాలను మార్చి 4 ,5 తేదీల్లో ఎల్బీస్టేడియంలో నిర్వహించనున్నారు.

వైభవం.. స్వామివారి కల్యాణోత్సవం

కీసర: బ్రహోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన శ్రీ భవానీ, శివదుర్గా సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివార్ల కళ్యాణం శుక్రవారం రాత్రి అశేషభక్తజనుల సమక్షంలో శోభాయమానంగా జరిగింది.

శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో కీసరలో శ్రీ స్వామివారిని మేళతాళాలతో వేద పండితులు ఎదుర్కోలు జరిపారు. నందివాహన సేవ ద్వారా రాత్రి 9.30 గంటల గంటల సమయంలో కీసరగుట్టకు స్వామివారుచేరుకోగానే అశేష భక్తులు ఎదురుచూస్తున్న కళ్యాణ మహోత్సవ ఘడియ రానే వచ్చింది. వేదపండితులు స్వామివారి కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సుమారు గంటన్నర పాటు సాగిన కళ్యాణవైభోగం ఆధ్యాత్మిక వైభవాన్ని చాటిచెప్పింది అంతకుముందు ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను అందజేశారు.







నేడు గండిపేటలో డాగ్ స్పోర్ట్స్ షో

మణికొండ: దక్షిణ భారత దేశంలోనే మొదటిసారి హైదరాబాద్ డాగ్ స్పోర్ట్స్ షోకు వేదిక కానుంది. వాటికి పలు రకాల క్రీడా పోటీలను నిర్వహించి బహుమతులను అందజేసేందుకు గండిపేటలోని ప్రొగ్రెసీవ్ కెన్నీస్ ముస్తాబైంది. హైదరాబాద్ నగరంలో క్రీడాస్ఫూర్తి ఉన్న పెంపుడు కుక్కలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పోటీలలో పాల్గొనేందుకు తరలివస్తున్నాయి. కుక్కల స్పోర్ట్స్ పోటీలను శని, ఆదివారాలలో నిర్వహించేందుకు సీబీఐటీ కళాశాల పక్కన ఉన్న ప్రొగ్రెసీవ్ కెన్నెస్ లో ఏర్పాట్లు చేశారు. పెంపుడు కుక్కల్లో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తి, దక్షితను ఈ వేదిక ద్వార అవి ప్రదర్శిస్తాయని నిర్వాహకులు చంద్రశేఖర్ తెలిపారు.

మేమింతే!

- కందుకూరు ఘటన మరవక ముందే మళ్లీ అదే వైఖరి
- అనపర్తిలో ఇరుకు రోడ్డుపై చంద్రబాబు సభ
- పోలీసు వాహనం అద్దాలు ధ్వంసం చేసిన కార్యకర్తలు



అనపర్తిలో టీడీపీ కార్యకర్తలు పోలీసు వాహనం అద్దాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

సాక్షిప్రతినిధి, కాకినాడ: ఇరుకు సందులో సభ నిర్వహించడం ద్వారా మొన్న కందుకూరులో ఎనిమిది మంది మృత్యువాత పడటానికి కారణమైన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడులో ఇసుమంతైనా మార్పు రాలేదు. ప్రజలు ఏమైపోతేనేం తనకు మాత్రం పెద్ద ఎత్తున ప్రచారం రావాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో, మైదానాల్లో సభలు నిర్వహిస్తే జనం కనిపించక.. ఖాళీ కుర్చీలు దర్శనమిస్తుండటంతో పరువు పోతోంది. దీంతో చిన్నపాటి సందులను ఎంచుకుని సభలు నిర్వహిస్తూ.. డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించడం ద్వారా ఎక్కువ మంది వచ్చినట్లు ప్రచారం చేసుకోవడం పరిపాటిగా మారింది. ఇటీవల పాదయాత్ర మొదలు పెట్టిన చంద్రబాబు తనయుడు లోకేశ్ కూడా ఇదే బాట ఎంచుకున్నారు. ఈ క్రమంలో చంద్రబాబు తాజాగా శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో 'ఈ రాష్ట్రానికి ఇదేం కర్మ' పేరుతో నిర్వహించతలపెట్టిన సభను బహిరంగ ప్రదేశంలో పెట్టుకోవాలని చెప్పిన పోలీసులపై దౌర్జన్యానికి దిగారు. 'అనపర్తిలో ప్రతిపక్ష నాయకుడు ఎన్.చంద్రబాబునాయుడు బహిరంగ సభ కోసం అనుమతికావాలని ఆ పార్టీ నేతలు కోరారు. పోలీస్‌యాక్ట్, జీవో నంబర్–1ను అనుసరించి రోడ్డుపై సభకు అనుమతి ఇవ్వలేమని చెప్పాం. వారి సభ నిర్వహణకు అనుకూలంగా ఉండేలా కళాక్షేత్రంతో పాటు, ఒక లే అవుట్‌ను సూచించాం. అక్కడ పూర్తి భద్రత కల్పిస్తామని చెప్పాం. అయినా వారు మా మాట వినిపించుకోకుండా రోడ్డుపై సభ పెట్టారు. ఇటు పోలీసులు, అటు ప్రజలకు ఇబ్బంది కలిగించారు' అని తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డి తెలిపారు. దీన్నిబట్టి ఉద్దేశ పూర్వకంగానే చంద్రబాబు అలజడి సృష్టించాలని, ఘర్షణ ధోరణి అవలంబించడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందాలనే వ్యూహంతో ఉన్నారని స్పష్టమవుతోంది. పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట నుంచి వేట్లపాలెం కెనాల్ రోడ్డు మీదుగా రోడ్‌షోతో చంద్రబాబు అనపర్తి వైపు బయలుదేరారు. పోలీసులు వాహనాలను నిలుపుదల చేసే ప్రయత్నం చేయగా.. చంద్రబాబు, టీడీపీ నాయకులను ఉసిగొల్పారు. వారు పోలీసులతో వాగ్వావాదానికి దిగి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఒక్కసారిగా రెచ్చిపోయి దౌర్జన్యంగా పోలీసులను తోసేశారు. దీంతో పలువురు పోలీసులు కిందపడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. బారికేడ్లను ఎత్తి పడేశారు. దీంతో పోలీసులు నేలపై కూర్చుని బతిమిలాడారు. అయినా చంద్రబాబు వినిపించుకోకుండా పార్టీ నేతలు, పార్టీ శ్రేణులతో కలిసి వాహనాలతో ముందుకు కదిలారు. లక్ష్మీనరసాపురంలో పోలీసు వాహనాన్ని అడ్డుపెట్టారు. కారులో ఉన్న చంద్రబాబు కిందకు దిగి.. అక్కడే ఉన్న మీడియా వాహనాన్ని ముందుకు పిలిపించి ఆ వాహనం పైకి ఎక్కి మాట్లాడారు. మాకు అనుమతి ఉంది, మమ్మల్ని ఎవరు ఆపుతారో చూస్తామని రెచ్చగొట్టడంతో పార్టీ కార్యకర్తలు పోలీసు వాహనంపై రాళ్లతో దాడి చేశారు. అద్దాలు పగులగొట్టి ధ్వంసం చేశారు. ఆ తర్వాత చంద్రబాబు అనపర్తి దేవీచౌక్ సెంటర్‌కు చేరుకుని సభ ఏర్పాటు చేసి ప్రసంగించారు.

పోలీసులు సంఘ విద్రోహ శక్తులు

అధికారంలోకి రాగానే బొక్కలో వేయిస్తా: చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'మీరు సంఘ విద్రోహ శక్తులుగా మారారు. రాబోయే రోజుల్లో మీరంతా నా దగ్గరే పని చేయాలి. ఇచ్చిన పర్మిషన్ క్యాన్సిల్ చేస్తారా? కొందరు పోలీసులైతే రౌడీలు మాదిరిగా ప్రవర్తిస్తున్నారు. నేను అధికారంలోకి రాగానే చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై సమీక్షిస్తా. ఇందుకు వ్యతిరేకంగా ప్రవర్తించిన వారిని బొక్కలో పెడతా. మీరు చేస్తున్న పనులు చూసి మీ యూనిఫారం సిగ్గు పడుతోంది' అని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పోలీసులపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. శుక్రవారం రాత్రి ఆయన తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో పోలీసులు సూచించిన ప్రాంతంలో కాకుండా, అనుమతి లేకుండా ఇరుకు రోడ్డుపై సభ నిర్వహించారు.

ఏపీ విద్యా వ్యవస్థ భేష్

జెనీవాలో 'ఎడ్యుకేషన్ ఫర్ ఫ్యూచర్' కార్యక్రమంలో స్విట్జర్లాండ్ మాజీ అధ్యక్షుడు ఇగ్నా జియో క్యాసిస్ ప్రశంసలు

- కరోనాతో చాలా దేశాల విద్యా వ్యవస్థలకు పెను సవాళ్లు
- ఏపీలో మాత్రం అందుకు విరుద్ధంగా అద్భుత ప్రగతి
- అందుకు సీఎం వైఎస్ జగన్ విధానాలే దోహదం





'నాడు నేడు' ప్లకార్డుతో స్విట్జర్లాండ్ మాజీ అధ్యక్షుడు ఇగ్నా జియో క్యాసిస్, స్విట్జర్లాండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జనరల్ పాట్రిసియా దన్జీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చాలా బాగున్నాయని, ప్రత్యేకించి విద్యా వ్యవస్థ అద్భుతమని స్విట్జర్లాండ్ మాజీ దేశాధ్యక్షుడు ఇగ్నా జియో క్యాసిస్ కొనియాడారు. జెనీవా నగరంలోని ఐక్యరాజ్య సమితి కార్యాలయంలో ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ ఫోరం ఆధ్వర్యంలో గురు వారం నిర్వహించిన 'ఎడ్యుకేషన్ ఫర్ ఫ్యూచర్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరోనా కారణంగా ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో విద్యా వ్యవస్థ పెద్ద సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. అయితే ఇండియాలోని ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రం అలాంటి పరిస్థితి లేదని తెలిపారు. ఆ రాష్ట్రంలో పేద విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకాలు, కార్యక్ర మాలు మంచి ఫలితాలిస్తున్నాయని కొనియాడారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాల ల రూపురేఖల్ని మార్చేశారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ఉన్నాయన్నారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను ప్రభుత్వమే సమకూర్చుతోందని, ఇది గర్వించదగ్గ విషయం అని అన్నారు. కొంత కాలం తర్వాత ఏపీ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభావంతులుగా నిలుస్తారని ఆకాంక్షించారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ అందరి వల్లా కాదని, విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి ఉన్న వారికి మాత్రమే సాధ్యమవుతుందని చెప్పారు.

ఆకట్టుకున్న ఏపీ స్టాల్

ఎడ్యుకేషన్ ఫర్ ఫ్యూచర్ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పథకాల స్టాల్ పలువురిని ఆకట్టుకుంది. స్వయంగా ఇగ్నా జియో క్యాసిస్ ఏపీ విద్యా విధానాలపై ప్రశంసలు వ్యక్తం చేయడంతో స్విట్జర్లాండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జనరల్ పాట్రిసియా దన్జీ స్టాల్‌ను సందర్శించారు. ప్రభుత్వ పథకాల గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఏపీలో ఎడ్యుకేషన్ కోసం నాడు–నేడులో తీసుకున్న నిర్ణయాలు, అమలవుతున్న తీరు, విద్యా ప్రమాణాలు మెరుగుదల.. తదితర విషయాలపై ఆయన ఏపీ ప్రభుత్వాన్ని అభినందించారు. డిజిటల్ లెర్నింగ్, క్వాలిటీ ఎడ్యుకేషన్‌లో భాగంగా విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌ల పంపిణీ, పాఠశాలల ఆధునీకరణ, డిజిటల్ బోర్డుల ఏర్పాటు, ఆధునిక పద్ధతుల్లో విద్యా బోధన తదితర కార్యక్రమాలన్నీ పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయని కొనియాడారు. ఇలాంటి సౌకర్యాలు కల్పించడంతో సమాజంలో అన్ని వర్గాల వారు విద్యనభ్యసిస్తారని చెప్పారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం లో న్యూట్రిషన్ ఫుడ్ అందించడం మంచి పరిణామం అన్నారు. లైబ్రరీ, ప్లేగ్రౌండ్స్, హైజెనిక్ బాత్రూమ్స్ అండ్ టాయిలెట్స్, యూనిఫాం, స్టేషనరీ కిట్స్, బుక్స్ అందిస్తున్న విధానం చాలా బాగుందన్నారు. 'ఈక్విటబుల్ ఎడ్యుకేషన్ యాక్సెస్ టు ఆల్' విధానం చాలా నచ్చిందన్నారు. ఏపీ స్టాల్‌ను ఇంటర్నేషనల్ యూనిసెఫ్ ప్రోగ్రామ్స్ స్పెషలిస్ట్ అతెనా లౌబాచెర్ సందర్శించారు. గర్ల్స్ ఎడ్యుకేషన్ విధానంతో అసమానతలను రూపుమాపవచ్చని అభినందించారు. డిజిటల్ ఎడ్యుకేషన్లో భాగంగా బైజూస్ ద్వారా అందిస్తున్న విద్యా విధానం నూతన పద్ధతుల్లో గొప్పగా ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇండియా నుండి ఐక్యరాజ్య సమితి శాశ్వత సభ్యుడు వున్నవ షకిన్ కుమార్ పాల్గొన్నారు.

రూ.8వేల లంచం తీసుకున్న ప్రభుత్వ ఉద్యోగి

రెండు దశాబ్దాల తర్వాత శిక్ష

పీసీ చట్టం కింద వేర్వేరుగా మూడేళ్ల చొప్పున జైలు శిక్ష విధించిన హైకోర్టు

సాక్షి, అమరావతి: భూమి సర్వే కోసం 2002లో రూ.8వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి 20 ఏళ్ల తర్వాత హైకోర్టు శిక్ష విధించింది. అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్)లోని సెక్షన్ 7 కింద మూడేళ్లు జైలు, రూ.10 వేల జరిమానా, సెక్షన్ 13(2) కింద మరో మూడేళ్లు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించింది. ఈ రెండు శిక్షలను ఏక కాలంలో అనుభవించాలని హైకోర్టు ఆదేశించింది. సదరు ఉద్యోగిని నిర్దోషిగా ప్రకటిస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు ఇటీవల తీర్పు వెలువరించారు. నెల్లూరు జిల్లా బోగోలు మండలం బిట్రగుంటకు చెందిన గోరంట్ల వీరయ్య చౌదరి, అతని సోదరుడు బుచ్చయ్య నాయుడు చెరో 16.66 ఎకరాల భూమి కొన్నారు. వీరయ్య చౌదరి తన భూమిలో 5 ఎకరాలను సోదరుడు బుచ్చయ్య నాయుడుకు విక్రయించారు. తమ భూములను సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని దగదర్తి ఎమ్మార్వోకు దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మార్వో ఈ దరఖాస్తును డిప్యూటీ సర్వేయర్ నిమ్మకాయల విజయ్‌కుమార్‌కు పంపారు. ఆయన సర్వే రిపోర్ట్ ఇచ్చేందుకు రూ.15వేల లంచం డిమాండ్ చేశారు. చివరకు వీరయ్య చౌదరి నుంచి రూ.8వేలు లంచం తీసుకుంటూ 2002, సెప్టెంబర్ 16న ఏసీబీ అధికారులకు చిక్కాడు. దీనిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన నెల్లూరు ఏసీబీ కోర్టు విజయ్‌కుమార్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ 2007లో తీర్పునిచ్చింది. అయితే విజయ్‌కుమార్ లంచం తీసుకున్నాడని పక్కా ఆధారాలు ఉండటంతో ఏసీబీ కోర్టు తీర్పుపై ఏసీబీ అధికారులు హైకోర్టులో 2007లో అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై ఇటీవల న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రబాబు... విజయ్‌కుమార్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. విజయ్‌కుమార్‌కు పైన పేర్కొన్న విధంగా శిక్ష విధించారు.

సాక్షి రియల్టీ

- గతేడాది విక్రయమైన ఇళ్లలో 54 శాతం వాటా రూ.25–50 లక్షల మధ్య ధర ఉన్నవే. అలాగే 70 శాతం గృహాలు 1,000 చ.అ. నుంచి 2,000 చ.అ. విస్తీర్ణం ఉన్న యూనిట్లేనని నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక పేర్కొంది.

కూలీ నంబర్ 1



కరోనా తొలి దశలో నిర్మాణ రంగ కార్మికుల వెతలు, వలసలు ఇంకా కళ్లముందే కదలాడుతున్నాయి. క్రమంగా నిర్మాణ రంగం పుంజుకోవటంతో ఇప్పుడిప్పుడే కూలీలు గాడినపడుతున్నారు. ఈ విషయంలో దేశంలోని ప్రధాన నగరాలతో పోలిస్తే హైదరాబాద్ బెటరనే చెప్పాలి. ఎందుకంటే కూలీలకు దినసరి వేతనాలు అందుతుంది ఇక్కడే కాబట్టి! నగరంలో భవన నిర్మాణ కార్మికులకు రోజుకు సగటున రూ.584 నుంచి రూ.1,035 మధ్య కూలీ గిట్టుతుంది. చిట్ట చివరి స్థానంలో నిలిచిన ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో రూ.515 నుంచి 925 మధ్య మాత్రమేనని కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ యాప్ ప్రాజెక్ట్ హీరో అధ్యయనంలో వెల్లడైంది.

హైదరాబాద్‌లో నిర్మాణ కార్మికులకు అత్యధిక వేతనం

- మన నగరంలో కూలీని బట్టి రూ.584 నుంచి రూ.1,035
- అత్యల్ప లేబర్ చార్జీ చెల్లిస్తుంది దేశ రాజధాని ఢిల్లీలోనే
- ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనం కంటే ఇవి తక్కువే
- వాణిజ్య, ఆకాశహర్మ్యాల నిర్మాణాలే ఎక్కువ కూలీకి కారణం
- కన్‌స్ట్రక్షన్ యాప్ ప్రాజెక్ట్‌హీరో అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం ప్రాజెక్ట్ హీరో యాప్‌లో 5 లక్షల మంది వర్కర్లు నమోదై ఉండగా.. ఇందులో హైదరాబాద్ నుంచి 12,285 మంది ఉన్నారు. యాప్‌లో రిజిస్టరైన 1.4 లక్షల ఉద్యోగ పోస్టింగ్‌లు, వాటి వినియోగ డేటాను విశ్లేషించి ఈ నివేదికను రూపొందించింది. కరోనా కంటే ముందుతో పోలిస్తే ప్రస్తుతం దేశవ్యాప్తంగా నిర్మాణ కూలీ 5 నుంచి 8% పెరిగితే.. హైదరాబాద్‌లో ఏకంగా 20% వృద్ధి చెందింది. నగరంలో పెద్ద ఎత్తున వాణిజ్య, ఆకాశహర్మ్యాల నిర్మాణాలు జరుగుతుండటం అత్యధిక కూలీ చెల్లింపులకు కారణం.

పీఎఫ్, ఈఎస్‌ఐలు దక్కడం లేదు..

దేశంలోని ప్రధాన నగరాలలో ప్రభుత్వం నిర్దేశించిన దినసరి కూలీ దక్కడం లేదని ప్రాజెక్ట్ హీరో ఫౌండర్ అండ్ సీఈఓ సత్యవ్యాస్ తెలిపారు. కేవలం 8.6 శాతం మంది కూలీలకు మాత్రమే ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్), 7.1% మందికి ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్‌ఐ) కవరేజీలు అందుతున్నాయని పేర్కొన్నారు.

నగరాల వారీగా దినసరి కూలీ (రూ.లలో)

	ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనం		
	హెల్పర్లు	టెక్నీషన్లు	సూపర్‌వైజర్లు
	711	788	866
హైదరాబాద్	584	862	1,035
ముంబై	536	784	1027
చెన్నై	565	782	1006
బెంగళూరు	552	794	999
పుణే	543	749	885
ఢిల్లీ–ఎన్‌సీఆర్	515	718	925

యూపీ నుంచే వలసలెక్కువ..

ప్రస్తుతం దేశంలో 5.1 కోట్ల మంది నిర్మాణ కూలీలు ఉన్నారు. అత్యధికంగా కూలీలు ఉత్తర్‌ప్రదేశ్ నుంచి వలస వస్తున్నారు. ఇక్కడి నుంచి 42% మంది దేశంలోని వివిధ నగరాల్లోని నిర్మాణ రంగంలో పనిచేసేందుకు వస్తున్నారు. బిహార్ నుంచి 16%, పశ్చిమ బెంగాల్ నుంచి 10%, ఒడిశా నుంచి 9%, మహారాష్ట్ర నుంచి 6% కూలీలు వలస వస్తున్నారు.

సమయానికి వేతనాలు చెల్లిస్తేనే..



గడువులోగా నిర్మాణాలను పూర్తి చేయడానికే నగర డెవలపర్లు ప్రాధాన్యం ఇస్తారు. అలా చేయాలంటే కూలీలకు, ఉద్యోగస్తులకు సమయానికి వేతనం చెల్లించాల్సి ఉంటుంది. కరోనా తొలి దశలో దేశ వ్యాప్తంగా నిర్మాణ పనులు నిలిచిపోవటంతో లక్షలాది నిర్మాణ కూలీలు పొట్టచేత పట్టుకొని సొంతూళ్లకు వెళ్లిపోయారు. ఆ సమయంలో మా అన్ని ప్రాజెక్ట్‌లలోని 3 వేల మంది కూలీలను సుమారు 3 నెలల పాటు ఆహారం, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, తదితర అవసరాలను సొంతంగా ఏర్పాటు చేశాం. – నరేంద్రకుమార్ కామరాజు, ఎండీ, ప్రణీత్ గ్రూప్

ప్రత్యామ్నాయ స్థిరాస్తి జోరు

సాక్షి, హైదరాబాద్: ప్రత్యామ్నాయ స్థిరాస్తి విభాగంలో సంస్థాగత పెట్టుబడులు సరికొత్త రికార్డులను సృష్టించింది. గతేడాది ప్రత్యామ్నాయ రియల్టీలోకి 867 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. అంతకు క్రితం ఏడాదితో 453 మిలియన్ డాలర్లతో పోలిస్తే ఇది 92 శాతం ఎక్కువ. ఏటా ఈ విభాగం 20 శాతం వృద్ధి రేటును నమోదు చేస్తుందని కొల్లియర్స్ నివేదిక వెల్లడించింది.

- డేటా సెంటర్లు, లైఫ్ సైన్సెస్, హాలిడే హోమ్స్, సీనియర్ హౌసింగ్, విద్యార్థి వసతి గృహాలు, ఆసుపత్రుల రంగాలను ప్రత్యామ్నాయ స్థిరాస్తి విభాగాలుగా పరిగణిస్తారు. గతేడాది దేశీయ స్థిరాస్తి రంగంలోకి 4,878 మిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా.. ఇందులో అత్యధికంగా 1,978 మిలియన్ డాలర్లు ఆఫీసు విభాగంలోకి వచ్చాయి. 2021లో దేశీయ రియల్టీలోకి 4,079 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి.



- 2022లో వచ్చిన పెట్టుబడుల్లో ప్రత్యామ్నాయ రియల్టీ ఇన్వెస్ట్‌మెంట్స్ వాటా 18 శాతంగా ఉంది. 2019తో పోలిస్తే ఇది 4 రెట్లు ఎక్కువ. 2018లో దేశీయ ప్రత్యామ్నాయ రియల్టీలోకి 20 మిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా.. 2019లో 196, 2020లో 359, 2021లో 453 మిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్స్ వచ్చాయి.
- గ్లోబల్ ఇన్వెస్టర్లు స్థిరమైన ఆదాయాన్ని సమకూర్చే ప్రత్యామ్నాయ స్థిరాస్తి విభాగాలలో పెట్టుబడులకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఫలితంగా గతేడాది దేశీయ రియల్టీ రంగంలోకి వచ్చిన పెట్టుబడులలో 41 శాతం కార్యాలయ విభాగంలోకే వచ్చాయి. 2022లో పెద్ద డీల్స్ కారణంగా ఈ విభాగం 50 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. డేటా సెంటర్లలో 52 శాతం పెట్టుబడుల వాటా ఉంది.

విభాగాల వారీగా పెట్టుబడులు (మి. డాలర్లలో)

విభాగం	2021	2022	వృద్ధి%
ఆఫీసు	1,318	1,978	50
రిటైల్	77	492	537
ప్రత్యామ్నాయ రియల్టీ	453	867	92
మిక్స్‌డ్ యూజ్	182	464	154
గిడ్డంగులు	1,130	422	-63
నివాసాలు	919	656	-29



శుక్రవారం ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో ఎన్‌ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ కేకు కట్‌చేసి సంబరాలు జరిపారు.



శుక్రవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత అరవింద్ అలిశెట్టి చిన్నకోడూరు మండలం రంగనాయకసాగర్ రిజర్వాయర్‌పై పారాగ్లైడర్‌తో చక్కర్లు కొడుతూ కేసీఆర్‌కు వినూత్నంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

- రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ సహా పలువురు శుభాకాంక్షలు
- ఏపీ సీఎం వైఎస్ జగన్ సహా పలు రాష్ట్రాల సీఎంలు, కేంద్రమంత్రులతో పాటు ప్రముఖ నేతల సందేశాలు
- రాష్ట్రమంతటా పండుగ వాతావరణం
- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వేడుకలు, సేవా కార్యక్రమాలు
- హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి అధ్యక్షులు, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 69వ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కేసీఆర్ జన్మదినం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ముఖ్య నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

ఫోన్‌లో మాట్లాడిన రాష్ట్రపతి

సీఎం కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని నరేంద్ర మోదీ 'ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షుతో ఉండాలని ప్రార్థిస్తున్నా'అని సామాజిక మాధ్యమ వేదిక ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గారికి జన్మదిన శుభాకాంక్షలు. మీపై ఎల్లప్పుడూ భగవంతుడి దీవెనలు ఉండాలని, ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో చిరకాలం కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు పినరయి విజయన్ (కేరళ), అర్వింద్ కేజ్రీవాల్ (ఢిల్లీ), హిమంత బిశ్వశర్మ (అసోమ్), ఎంకే స్టాలిన్ (తమిళనాడు)తో పాటు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, మాజీ ప్రధాన మంత్రి దేవేగౌడ, ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తదితరులు కేసీఆర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, శ్రీపాద యశో నాయక్, మాజీ కేంద్ర మంత్రి రావ్‌సాహెబ్ పాటిల్ దన్వే, సినీ నటులు చిరంజీవి తదితరులు కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. కాగా ఢిల్లీలోని సీఎం కేసీఆర్ అధికారిక నివాసంలోనూ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

రాష్ట్రమంతటా సేవా కార్యక్రమాలు

రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో పలు నియోజకవర్గాల్లో రక్తదాన శిబిరాలు, ఆసుపత్రుల్లో పళ్ల పంపిణీ, అన్నదాన శిబిరాలు, ర్యాలీలు, ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో పూజలు నిర్వహించారు. మంత్రులు ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సిద్ధిపేటలో మంత్రి హరీశ్‌రావు కేక్ కట్ చేశారు. నెక్లెస్ రోడ్డులో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో 69 కిలోల కేక్ కట్ చేశారు. ముఖ్యమంత్రి ఫామ్‌హౌస్‌లో రహదారులు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మొక్కలు నాటారు.

మెగా రక్తదాన శిబిరం

అంతర్జాతీయ వైద్య సమాఖ్య తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో తలసేమియా బాధితుల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పర్యాటక సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ ను దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్న సీఎం కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని అన్నారు.

విద్యుత్ సౌధలో...

ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా పీవీ నరసింహారావు మెమోరియల్ ట్రస్ట్, ట్రాన్స్‌కో, జెన్‌కోల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ సౌధలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా చిరంజీవి బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం చేస్తున్న బీఆర్‌ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్



సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా వైశ్య ఫెడరేషన్ తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్

మెదడుకూ కావాలి రెస్ట్

మానసిక ఒత్తిళ్లతో చాలా మందిలో పెరుగుతున్న నిద్రలేమి సమస్యలు

- ఇవి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు దారితీస్తాయంటున్న వైద్య నిపుణులు
- మెదడుకు తగిన విశ్రాంతి ఇస్తే పనితీరు, ఏకాగ్రత మెరుగుపడతాయని వెల్లడి
- ధ్యానం, పుస్తక పఠనం, సంగీతం వంటివి సైతం ఉపయోగకరమే
- సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు రోజూ కాసేపు దూరంగా ఉండాలని సూచన



సాక్షి, హైదరాబాద్: మెదడు.. మన శరీరంలోని అత్యంత సంక్లిష్టమైన నిర్మాణం. ఆలోచనలు, కళలు, జ్ఞాపకాలు, సృజనాత్మకత, తార్కిక బుద్ధి ఇలా అనేక విషయాల్లో మనిషిని ఇతర జీవజాతులకన్నా ఉన్నతంగా, విభిన్నంగా నిలుపుతున్న అవయవం. కోట్లాది న్యూరాన్ల కలబోతగా దైనందిన జీవితంలో చురుకైన పోషిస్తూ.. ఇన్ఫర్మేషన్-ప్రాసెసింగ్ పవర్‌హౌస్ పాత్ర పోషిస్తున్న ఓ మినీ సూపర్ కంప్యూటర్. అయితే నేటి ఆధునిక కాలంలో మనలో రోజురోజుకూ పెరుగుతున్న మానసిక ఒత్తిళ్లకు మెదడు సైతం ప్రభావితం అవుతోంది. ఫలితంగా నిద్రలేమి సమస్యలు ఎదుర్కొంటున్న వారి సంఖ్య అధికమవుతోంది. ఈ నేపథ్యంలో మెదడుకు విశ్రాంతి ఇవ్వాల్సిన ఆవశ్యకత, ఇవ్వకుంటే కలిగే దుష్ప్రభావాలపై వైద్య నిపుణులు కీలక సూచనలు చేస్తున్నారు. అవి ఏమిటంటే...

మెదడుకు తగిన విశ్రాంతి ఇవ్వకుండా బుర్ర బద్దలయ్యేలా పని చేసేందుకు ప్రయత్నిస్తే దాని వల్ల ఒనగూరే ప్రయోజనాలు అంతంత మాత్రమే.

మెదడు స్పాంజ్ లాంటిది. అది ఎంత వరకు సమాచారాన్ని భద్రపరచుకోగలదో అంతే చేయగలదు. అందువల్ల బ్రెయిన్‌కు నిత్యం రెస్ట్ అవసరమే.

పనిచేస్తున్న రోజుల్లో మధ్యలో విరామం తీసుకోవడం వల్ల మూడ్ బాగుకావడంతోపాటు పని తీరు, ఏకాగ్రత మెరుగుపడుతుంది.

మెదడుకు తగిన విశ్రాంతి ఇవ్వకపోతే అది అనారోగ్య సమస్యలతోపాటు దీర్ఘకాలిక ఒత్తిళ్లకు కారణమవుతుంది.

మెదడుకు విశ్రాంతి కోసం...

కేవలం నిద్రలోనే మెదడుకు రెస్ట్ దొరుకుతుందనేది కూడా పూర్తిగా శాస్త్రీయం కాదని నిపుణులు అంటున్నారు. మెదడుకు ఎక్కువగా పని కల్పించకుండా ఉంచడం కోసం వివిధ రకాల ధ్యానాలు చేయడం కూడా సరైనదేనని నిపుణులు చెబుతున్నారు. వారి సూచనల ప్రకారం...

- ✔ ప్రకృతిలో కాసేపు మమేకం కావాలి.
- ✔ మెదడు రిలాక్స్ కావడానికి స్నానం కూడా దోహదపడుతుంది.
- ✔ రాత్రిపూట 8 గంటల చొప్పున నిద్ర పోనివారు ఉదయం వేళల్లో కాసేపు కునుకు తీసినా మెదడు పనితీరు మళ్లీ చురుగ్గా మారుతుంది.
- ✔ ఏదైనా ఓ ఆట ఆడటం లేదా శారీరక శ్రమతోనూ మెదడుకు విశ్రాంతి లభిస్తుంది.
- ✔ సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా వాడకానికి రోజూ కాసేపు విరామం ఇవ్వడం ద్వారా కూడా మెదడు విశ్రాంతి పొందుతుంది.



"నిద్రలో బ్రెయిన్ వేవ్స్ నెమ్మదిస్తాయి...

డాక్టర్ నిశాంత్ వేమన, కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, సన్‌షైన్/చేతన హాస్పిటల్స్

సుఖనిద్ర సమయంలో బ్రెయిన్ వేవ్స్ (మెదడు కణాలు విద్యుత్ తరంగాల ద్వారా సమాచారం ఇచ్చిపుచ్చుకొనే ప్రక్రియ) నెమ్మదిస్తాయి. ఏదైనా విషయాన్ని 2-3 గంటలపాటు చదివాక కనీసం 15-20 నిమిషాలు నిద్రపోవడమో లేదా కళ్లు మూసుకొని మౌనంగా ఉంటే అది బాగా గుర్తుండిపోతుందని కొత్త అధ్యయనాలు చెబుతున్నాయి. నిద్రలో ర్యాపిడ్ ఐ మూవ్‌మెంట్ (ఆర్‌ఈఎం), నాన్ ర్యాపిడ్ ఐ మూవ్‌మెంట్ (ఎన్‌ఆర్‌ఈఎం) అనే పద్ధతులుంటాయి. ఆర్‌ఈఎంలో కలలు, జ్ఞాపకశక్తి, భావోద్వేగ అంశాల వంటివి ప్రాసెస్ అవుతాయి. మనం మెలకువగా ఉన్నప్పుడు ఎలా ఉంటుందో ఆదే యాక్టివిటీ కొనసాగుతుంది. నాన్ ఆర్‌ఈఎంలో అవి సరిగ్గా ప్రాసెస్ కాక మనసు కలతచెందేలా భంగం కలిగిస్తుంటాయి. బాగా నిద్రపోయినప్పుడు ఆయా అంశాలను క్రమపద్ధతిలో పెట్టేందుకు మెదడు పనిచేస్తుంటుంది. నాన్ ఆర్‌ఈఎంలో నిద్ర సరిగ్గా పట్టక జ్ఞాపకశక్తి తగ్గడం, భావోద్వేగాలను సరిగ్గా విశ్లేషించకపోవడం వల్ల కలత చెందడానికి కారణమవుతుంది.

కాంగ్రెస్‌లో మరో 'యాత్ర'!

▶ మొదటి పేజీ తరువాయి

రాయ్‌పూర్‌లో జరగనున్న ఏఐసీసీ ప్లీనరీ తర్వాత ఈ యాత్రను ప్రారంభించాలని నిర్ణయించారు.

బాసర టు ఖమ్మం

రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో రెండు నెలల వ్యవధిలో హాథ్‌సే హాథ్ జోడో యాత్రలను పూర్తి చేయాలని ఏఐసీసీ ఇంతకుముందే ఆదేశించింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈనెల ఆరో తేదీన ములుగు నియోజకవర్గం నుంచి యాత్రను ప్రారంభించారు. దీనిలో తెలంగాణ కాంగ్రెస్ కీలక నేతలు పాల్గొని తామంతా కలిసే ఉన్నామని పార్టీ శ్రేణులకు సంకేతాలు ఇస్తున్నారు. అయితే అసెంబ్లీ సమావేశాల కారణంగా రేవంత్ యాత్రలో సీఎల్పీ నేత భట్టి తొలుత పాల్గొనలేకపోయారు. సమావేశాలు ముగిశాక భద్రాచలం నియోజకవర్గంలో జరిగిన యాత్రలో పాల్గొన్నారు. ఈ క్రమంలోనే తాను కూడా రాష్ట్రంలో మరోవైపు నుంచి యాత్ర చేపట్టాలని నిర్ణయించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు హాథ్‌సే హాథ్ జోడో యాత్రలను రెండు నెలల్లో పూర్తి చేయాల్సి ఉందని.. అందువల్ల ఓ వైపు రేవంత్, మరోవైపు భట్టి ఆధ్వర్యంలో యాత్రలు చేయడం ద్వారా త్వరగా ముగించవచ్చన్నదే పార్టీ యోచన అని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. ఇందులో వివాదమేమీ లేదని అంటున్నాయి. భట్టి నిర్వహించే యాత్రలో ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మధుయాష్కీగౌడ్, శ్రీధర్‌బాబు, వి.హనుమంతరావు వంటి ముఖ్య నేతలతోపాటు రేవంత్‌రెడ్డి కూడా పాల్గొంటారని చెప్తున్నాయి.

ప్రగతిభవన్‌ను బద్దలు కొట్టి సోనియారాజ్యం తెద్దాం

- దళితుల ఆత్మగౌరవాన్ని మంటగలిపిన కేసీఆర్
- మరోసారి కేసీఆర్ వస్తే పేట్రేగనున్న రాచరికపు పాలన
- స్టేషన్‌ఘన్‌పూర్ సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

జనగామ/స్టేషన్‌ఘన్‌పూర్: సబ్బండ వర్గాల ఉద్యమకారుల ఆత్మబలిదానాలతో సిద్ధించిన తెలంగాణ ప్రగతిభవన్ గేట్లను బద్దలు గొట్టి అమరులు కన్న కలలు సాకారం దిశలో సోనియాగాంధీ రాజ్యం తీసుకొద్దామని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జనగామ జిల్లా జఫర్‌ఘడ్ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ వరకు హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రలో ప్రజాసమస్యలను తెలుసుకున్న ఆయన స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో ఊళ్లలో తప్పును తప్పు.. అనే స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. ఈసారి కేసీఆర్‌ను ఇంటికి పంపిస్తేనే.. బతుకులు బాగుపడతాయని పిలుపునిచ్చారు. మరోసారి వస్తే రాచరిక పాలన పేట్రేగిపోతుందన్నారు.

కడియం, రాజయ్యలు ఏమి ఒరగబెట్టారు..

కడియం శ్రీహరి, తాటికొండ రాజయ్యలకు అదృష్టం కలిసి వచ్చి విద్యాశాఖ, ఆరోగ్య శాఖల మంత్రులతోపాటు ఉపముఖ్యమంత్రులుగా అవకాశం వచ్చినా.. ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. గురువులుగా పనిచేసిన వీరు సొంత నియోజకవర్గానికి డిగ్రీ కళాశాల ఎందుకు తెచ్చుకోలేదని ప్రశ్నించారు. దొరల గడీలో చేరాక చచ్చిన పాములా, బానిసలా బతుకుతున్న కడియంసార్‌ను... పిల్చుటోడు.. కూర్చోబెట్టేటోడు లేడు.. ఆఖరికి రాజయ్య తరిమికొట్టేందుకు పురమాయించే పరిస్థితిలో ఉన్నాడు'అని వ్యాఖ్యానించారు. ఘనుడు రాజయ్య గురించి పాదయాత్రలో ఆడబిడ్డలు చెబుతుంటే తలకాయ ఎక్కడ పెట్టుకోవాలో అర్థం కాలేదని అన్నారు. నడ్డి మీద తన్ని అవినీతి ఆరోపణలు పెట్టి కేబినెట్‌నుంచి ఇంటికి పంపించేలా రాజయ్య చేయించుకున్నాడని ఎద్దేవా చేశారు. రాజీనామా పత్రం తీసుకోకుండా ఏకంగా బర్తరఫ్ చేయడంతో దళితులపట్ల సీఎం కేసీఆర్ వైఖరి వెల్లడైందని విమర్శించారు. ఈ విషయంలో రాజయ్యకు సిగ్గులేకుండా పోవచ్చుగానీ, మాదిగ బిడ్డలకు పౌరుషం ఉందని, త్వరలో కేసీఆర్‌కు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాజయ్యపై చేసిన ఆరోపణలపై నేటికి విచారణ జరగలేదని, ఇందులో కేసీఆర్‌కు వాటా ఉందని అర్థమవుతుందన్నారు. వరంగల్‌కు వైద్య విధాన పరిషత్ తెస్తానని రాజయ్య ప్రకటించడంతో చిర్రెత్తుకుపోయిన సీఎం కక్రు కాల్చి వాత పెట్టాడన్నారు.

శ్రీహరితో పోల్చితే ఎర్రబెల్లి ఎందుకూ పనికిరాడు

శ్రీహరితో పోల్చితే... ఎందుకు పనికిరాని ఎర్రబెల్లిని మంత్రి వర్గంలో తీసుకోవడంపై ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ఉద్యమ వారసులుగా అడుగుతున్నాము.. సోనియాగాంధీకి ఇప్పటికైనా కృతజ్ఞతగా కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని ప్రజలను కోరారు. త్వరలో డ్వాక్రా మహిళలకు నేరుగా ప్రియాంకాగాంధీ వరాలు ప్రకటిస్తారని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు షబ్బీర్ అలీ, అంజన్‌కుమార్‌యాదవ్, మల్లు రవి, సిరిసిల్ల రాజయ్య, సుదర్శన్ రెడ్డి, దొమ్మాటి సాంబయ్య, దయాసాగర్, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర, అమృతరావు పాల్గొన్నారు.



గీత కార్మికుడితో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

బాన్సువాడ ఎంసీహెచ్‌కు జాతీయ గుర్తింపు

బీఎఫ్‌హెచ్‌ఐ అందించే గ్రేడ్ -1 అక్రెడిటేషన్ సాధన

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి (ఎంసీహెచ్) జాతీయ గుర్తింపు దక్కింది. 'బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ హాస్పిటల్ ఇనిషియేటివ్ (బీఎఫ్‌హెచ్‌ఐ)' అందించే 'బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ అక్రెడిటేషన్ (గ్రేడ్ -1)'లభించింది. ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం బాన్సువాడ ఎంసీహెచ్‌ను పలుమార్లు సందర్శించింది. అన్ని ప్రమాణాలు పాటిస్తున్నట్టు నిర్ధారించుకొని అక్రెడిటేషన్ మంజూరు చేసింది. దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ కలిపి నాలుగు ఆసుపత్రులకే బీఎఫ్‌హెచ్‌ఐ అక్రెడిటేషన్ ఉంది. దీంతో భారత దేశ స్థాయిలో ఘనత సాధించిన ప్రభుత్వ దవాఖానగా బాన్సువాడ ఎంసీహెచ్ రికార్డ్ సాధించింది. ఈ సర్టిఫికెట్ మూడేళ్ల పాటు అమల్లో ఉంటుంది.

సీఎం ఆదేశాలతో ..

సీఎం కేసీఆర్ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం బ్రెస్ట్ ఫీడింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టింది. వైద్య సిబ్బంది, ఆశాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా సహకారంతో 35 మంది మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇచ్చింది. ప్రత్యేకంగా దేశంలోనే మొదటిసారిగా 'వాలంటరీ లాక్టేషన్ వర్కర్స్'ను నియమించింది. వీరు హాస్పిటల్లో గర్భిణులకు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించడంతోపాటు ప్రసవమైన అరగంటలోనే పిల్లలకు ముర్రుపాలు పట్టిస్తున్నారు. ప్రస్తుతం బాన్సువాడ ఎంసీహెచ్‌లో ముగ్గురు వాలంటీర్లు ఉన్నారు.



వైద్య సిబ్బందికి అభినందనలు: హరీశ్‌రావు

బాన్సువాడ ఎంసీహెచ్‌కు బీఎఫ్‌హెచ్‌ఐ అక్రెడిటేషన్ రావడం హర్షణీయమని హరీశ్‌రావు పేర్కొన్నారు. హాస్పిటల్ వైద్య సిబ్బందికి అభినందనలు తెలిపారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు.

వరి సాగు ఖర్చు రూ. 1,360... మద్దతు ధర రూ. 2,060

ఖర్చుకు తగినట్లు మద్దతు ధరలు.. కేంద్ర వ్యవసాయ శాఖ తాజా నివేదిక వెల్లడి

- పత్తి ఖర్చు రూ. 4,050... మద్దతు ధర రూ. 6,080
- రైతులకు 50% ఆదాయం వస్తుందన్న కేంద్రం.. 23 రకాల పంటలపై విశ్లేషణ
- ఆ ధరలు సరిపోవంటున్న రాష్ట్ర ప్రభుత్వం... మద్దతు ధర పెంచాలని స్పష్టీకరణ
- స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు వరికి మద్దతు ధర రూ. 2,499 ఇవ్వాలని డిమాండ్
- పత్తికి రూ. 8,574, మొక్కజొన్నకి రూ.3,199 ఇవ్వాలంటున్న తెలంగాణ సర్కారు



సాక్షి, హైదరాబాద్: దేశంలో సాగు ఖర్చుకు మించి మద్దతు ధరలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 23 రకాల పంటల సాగుకు అయ్యే ఖర్చు ఎంత? వాటికి అందుతున్న మద్దతు ధర ఎంత అనే దానిపై తాజాగా ఒక అధ్యయన నివేదిక విడుదల చేసింది. వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్ (సీఏసీపీ) మేరకు సాగు ఖర్చులను దేశవ్యాప్తంగా లెక్కలోకి తీసుకొని వీటి సరాసరిని నివేదికలో పొందుపరిచింది. 2022-23లో వరి ఉత్పత్తి ఖర్చు క్వింటాల్‌కు రూ. 1,360 ఉండగా, కనీస మద్దతు ధర రూ. 2,060గా కేంద్రం నిర్ధారించిన సంగతి తెలిసిందే. పత్తి ఉత్పత్తి ఖర్చు రూ. 4,053 ఉండగా, దాని మద్దతు ధర రూ. 6,080గా ఉంది. అలాగే మొక్కజొన్న సాగు, ఉత్పత్తి ఖర్చు రూ. 1,308 ఉండగా, దాని మద్దతు ధర రూ. 1,962గా ఉంది. కంది ఉత్పత్తి ఖర్చు రూ. 4,131 కాగా, మద్దతు ధర రూ. 6,600 ఉంది. ఇక సోయాబీన్ ఉత్పత్తి ఖర్చు ధర రూ. 2,805 కాగా, మద్దతు ధర రూ. 4,300 ఉంది. వేరుశనగ సాగు ఖర్చు రూ. 3,873 కాగా, 5,850గా ఉంది. ఉత్పత్తి వ్యయంపై కనీసం 50% లాభం కలిగించేలా కనీస మద్దతు ధరలు నిర్ధారించినట్లు కేంద్రం తన నివేదికలో స్పష్టం చేసింది. ఇలా మూడేళ్ల సాగు ఖర్చు, వాటికిచ్చిన మద్దతు ధరల వివరాలను పొందుపరిచింది.

కేంద్రం వర్సెస్ రాష్ట్రం...

అయితే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సాగు ఖర్చు వివరాలు, మద్దతు ధరలు శాస్త్రీయంగా లేవని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్‌కు పలుమార్లు రాష్ట్రంలోని పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం విన్నవించింది. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధరలు ఉండాలని కేంద్రాన్ని కోరింది. సాగు ఖర్చుకు మరో 50 శాతం అదనంగా కలిపి ఎంఎస్‌పీ ఇవ్వాలని సీఏసీపీకి ప్రతిపాదించింది. అందులో వివిధ పంటలకు ఎంతెంత ఖర్చు అవుతుందో వివరించింది. పంటల వారీగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పంటకోత, రవాణా, కూలీ, రైతు కుటుంబ శ్రమకు ప్రతిఫలం అన్నీ కలిపి ఎంత ఖర్చు అవుతుందో సవివరంగా కేంద్రానికి నివేదించింది. ఒక వ్యాపారి తన వస్తువును అమ్ముకునేప్పుడు ధర ఎలా నిర్ణయిస్తారో, ఆ ప్రకారమే పెట్టిన పెట్టుబడి, దానికి అయ్యే వడ్డీలను లెక్కలోకి తీసుకొని సాగు ఖర్చును నిర్ధారించారు. ప్రతీ ఏడాది ఇలాగే శాస్త్రీయంగా సాగు ఖర్చు, ఎంఎస్‌పీ ఎలా ఉండాలో తెలంగాణ వ్యవసాయశాఖ ఇస్తూనే ఉంది. కానీ కేంద్రం తన పద్ధతిలో తాను ఎంఎస్‌పీని నిర్ధారిస్తూ పోతోందని వ్యవసాయ అధికారులు అంటున్నారు.

వరి సాగు ఖర్చు ఎకరానికి రూ. 40 వేలు...

సాధారణ వరి రకం పండించేందుకు నారుమడి సిద్ధం చేయడం మొదలు విత్తనాలు, నాట్లు, ఎరువులు, కలుపుతీత, చివరకు పంట కోత, కూలీల ఖర్చు, కుటుంబ సభ్యుల శ్రమ మొత్తం కలుపుకుంటే ఎకరానికి రూ. 40 వేలు ఖర్చు (24 క్వింటాళ్లు) అవుతున్నట్లు లెక్కగట్టింది. ఆ ప్రకారమే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఖరారు చేసింది. ఎకరా ఖర్చు ప్రకారం క్వింటా వరి పండించాలంటే రూ. 1,666 ఖర్చు అవుతుందని నిర్ధారణ చేసింది. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం సాగు ఖర్చుకు 50 శాతం అదనంగా కలిపి ఎంఎస్‌పీ రూ. 2,499 ఇవ్వాలని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వరి ఎంఎస్‌పీ రూ. 2,060గా ఉండగా, అధికంగా పెంచాలని కోరుతున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా సాగు చేసే పత్తికి కూడా ఎకరాకు రూ.40 వేలు ఖర్చుకానుంది. ఎకరాకు పత్తి ఏడు క్వింటాళ్లు పండుతాయి. కాబట్టి క్వింటాకు రూ. 5,714 ఖర్చు కానుంది. ఆ లెక్కన స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం రూ. 8,574 పెంచాలని వ్యవసాయశాఖ వర్గాలు అంటున్నాయి. ప్రస్తుతం పత్తి మద్దతు ధర రూ. 6,080 మాత్రమే ఉండగా, మరో రూ. 2,491 వరకు పెంచాల్సి ఉంటుంది. జిల్లా.. జిల్లాకు సాగు ఖర్చులో తేడా ఉంటున్నందున దేశీయంగా ఒకే విధమైన ఉత్పత్తి ఖర్చును అంచనా వేయలేమని, కాబట్టి సరాసరిని లెక్కలోకి తీసుకోవడం తగదని పలువురు అంటున్నారు. మొక్కజొన్నకు ఎకరాకు రూ. 32 వేల వరకు ఖర్చుకానుంది. ఎకరాకు 15 క్వింటాళ్లు పండిస్తారు. క్వింటాకు రూ. 2,133 ఖర్చు కానుంది. ఆ ప్రకారం మద్దతు ధర రూ. 3,199 ఇవ్వాలని అంటున్నారు. కందికి రూ. 21 వేల వరకు ఖర్చుకానుంది. ఎకరాకు 4 క్వింటాళ్లు పండుతుంది. క్వింటాలుకు రూ. 5,250 ఖర్చు వస్తుంది. ఆ ప్రకారం మద్దతు ధర రూ. 7,875 పెంచాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం దీనికి రూ. 6,600 మద్దతు ధర ఉంది. సోయాబీన్‌కు రూ. 32 వేల వరకు ఖర్చు అవుతుంది. ప్రస్తుతం ఎకరాకు 5 క్వింటాళ్లు పండుతుంది. దీనికి క్వింటాలుకు రూ. 6,400 ఖర్చు కానుంది. ఆ ప్రకారం మద్దతు ధర రూ. 9,600 చేయాల్సి ఉంటుందని అంటున్నారు.



సాగు ఖర్చు నిర్ధారణలో శాస్త్రీయత లేదు

సాగు ఖర్చును అంచనా వేయడంలో కేంద్రానికి శాస్త్రీయమైన పద్ధతి లేదు. దేశంలో జిల్లాకో రకంగా సాగు ఖర్చు ఉంటుంది. దీంతో ఒకచోట ఎక్కువ ఒకచోట తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం వేసిన సాగు ఖర్చు, దాని ప్రకారం మద్దతు ధర నిర్ధారణ సరిగా లేదు. దీంతో రాష్ట్రంలో ఉన్న రైతులు నష్టపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఏసీపీకి పంపే నివేదికలకు విలువ ఉండటం లేదు. – డి.నర్సింహారెడ్డి, జాతీయ వ్యవసాయ నిపుణులు

అభ్యంతరాలను సీబీఐ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు

ఓఎంసీ కేసులో మంత్రి సబితా ఇంద్రారెడ్డి వాదనలు



సాక్షి, హైదరాబాద్: తన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండానే సీబీఐకోర్టు పిటిషన్‌ను కొట్టివేసిందని మంత్రి సబితా ఇంద్రారెడ్డి హైకోర్టు వాదనలు వినిపించారు. ఓబుళాపురం మైనింగ్ కేసులో ఎలాంటి కొత్త అంశాలు లేకుండా అదనపు అభియోగ పత్రం దాఖలు చేస్తూ నిందితురాలిగా చేర్చారని సబితా ఇంద్రారెడ్డి నివేదించారు. తన డిశ్చార్జి పిటిషన్‌ను సీబీఐ కోర్టు కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ మరోసారి విచారణ చేపట్టారు.

ఆ అంశాలకు సమాధానం చెప్పలేదు

డిశ్చార్జి పిటిషన్‌లో తాను లేవనెత్తిన అభ్యంతరాలకు సీబీఐ కోర్టు సమాధానం చెప్పలేదని సబిత పేర్కొన్నారు. డిశ్చార్జి పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు పేర్కొందని, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోలేదని చెప్పారు. గనుల శాఖ ప్రతిపాదనల ఆధారంగా మంత్రి ఆమోదం ఉంటుందని, ఆ శాఖ మంత్రిగా ఏం బాధ్యతలు ఉంటాయో కూడా సీబీఐ కోర్టు గుర్తించలేదని వివరించారు. వాదనలు విన్న సీజే...సీబీఐ వాదనల కోసం తదుపరి విచారణను వచ్చే ఈనెల 24కు వాయిదా వేశారు.

● నేడు మహాశివరాత్రి

పాహి పాహి పరమేశ్వరా

సృష్టి, స్థితి, లయకారులలో శివుడికి లయకారుడని పేరు. అయితేనేం, ఆయన పరమ బోళావాడు. భక్తజన రక్షకుడు. సనాతనుడు, భూతనాథుడు, వైద్యనాథుడు, పశుపతి నాథుడు, చరాచర జగత్తుకు ఆయనే విశ్వనాథుడు, చంద్రశేఖరుడు. భక్తితో కొలిచే తన భక్తులతో పాటు క్రిమికీటకాదులకు కూడా మోక్షమిచ్చి సాక్షాత్కరించే శివయ్య దర్శనం సర్వ పాపహరణం. నేడు మహాశివరాత్రి పర్వదినం. ఈ పర్వదినాన ఆ శుభకరుడి గురించి చెప్పుకోవడం ఎంతో మంగళప్రదం. మనం ప్రతి నెలలోనూ తెలుగు క్యాలెండర్లలోనూ, పంచాంగాల్లోనూ పండుగలు– పర్వదినాలలో మాస శివరాత్రి అని ఉండటాన్ని చూస్తుంటాం. ఇంతకీ మాస శివరాత్రి అంటే ఏమిటి, మహాశివరాత్రికీ, మాస శివరాత్రికీ గల వ్యత్యాసం ఏమిటో చూద్దాం.

ప్రతిమాసంలోనూ బహుళ పక్షం వచ్చే చతుర్దశికి మాస శివరాత్రి అని పేరు. అలా సంవత్సరంలో పన్నెండు మాస శివరాత్రులు వస్తాయి. వాటన్నింటిలోనూ తలమానికమైనది, మహిమాన్వితమైనది మహాశివరాత్రి. తిథి ద్వయం వున్నప్పుడు అమావాస్యకు ముందురోజు – రాత్రి చతుర్దశి కలిగి ఉన్న రోజుని జరుపుకోవాలని నిర్ణయ సింధు చెబుతోంది. 'మహా' అని ఎక్కడ అనిపించినా అన్నింటికంటే గొప్పదని అర్థం చేసుకోవాలి. శివ పార్వతులిరువురికి సంబంధించిన రాత్రి శివరాత్రి అనేది మరో అర్థం. అందుకే శివరాత్రి నాడు అయ్యకి – అమ్మకి కూడా ఉత్సవం జరుగుతుంది. శివ అంటే మంగళకరమైన అని. శివరాత్రి అంటే మంగళకరమైన లేదా శుభప్రదమైన రాత్రి అని అర్థం.

ఇంతకీ శివరాత్రి ఎందుకని అంతటి పర్వదినమైందో చూద్దాం.

క్షీరసాగర మథనంలో అమృతంకంటే ముందు హాలాహలం పుట్టిన విషయం తెలిసిందే. అది ముల్లోకాలను దహించివేస్తుందన్న ప్రమాదం ఉండడంతో దేవదానవులందరు భీతావహులై తమను రక్షించాలంటూ పరమేశ్వరుణ్ణి వేడుకోవడంతో లోక రక్షణార్థం ఆ గరళాన్ని తానే మింగి, గొంతులో బంధించి గరళ కంఠుడుగా పేరుపొందాడు. ఈ హాలాహల ప్రభావానికి ఆయన కంఠం నీలంగా మారడంతో నీలకంఠుడయ్యాడు. లోకాలన్నీ ఆ లోకనాయకుడి మూలాన స్థిమితపడిన రోజు పర్వదినం గాక మరేమిటి?

అయితే... సంప్రదాయ ప్రియులు జరుపుకునే ప్రతి పండుగకూ ఏదో ఒక పురాణగాథ ఉన్నట్లే మహాశివరాత్రికీ ఒకటి రెండు ఐతిహ్యాలున్నాయి.

ఆది మధ్యాంత రహితుడు

పరమేశ్వరుడు ఆది మధ్యాంత రహితుడన దానికి సంబంధించిన ఈ గాథని చూద్దాం:

పూర్వం బ్రహ్మ విష్ణువులు తమలో తాము 'నేను గొప్ప అంటే నేను గొప్ప ' అని వాదించుకున్నారు. ఈ వాదులాట కాస్తా వివాదంగా మారింది. రానురానూ అది మరింతగా పెరిగి భయంకరమైన యుద్ధానికి దారితీసింది. అరివీర భయంకరమైన ఆ యుద్ధానికి త్రిలోకాలూ తల్లడిల్లాయి. దాంతో పరమేశ్వరుడే స్వయంగా రంగంలోకి దిగాలనుకున్నాడు. ఈశ్వర సంకల్పంతో ఒక పెద్ద జ్యోతిర్లింగం బ్రహ్మవిష్ణువుల మధ్య వెలసింది. ఆ మహాలింగాన్ని చూసిన బ్రహ్మ, విష్ణువులిరువురూ లింగాన్ని సమీపించారు. అప్పటివరకు వారి మధ్య ఉన్న ఆధిపత్య పోరు కాస్తా తాత్కాలికంగా సద్దుమణిగి ఆ మహాలింగం మొదలు, తుది తెలుసుకోవాలన్న ఆసక్తిగా మారింది. దాంతో బ్రహ్మ హంస రూపం ధరించి లింగం అగ్రభాగాన్ని చూడటానికి, విష్ణువు శ్వేత వరాహరూపంలో లింగం ఆదిని కనుక్కోవడానికీ బయల్దేరారు.

ఎంతదూరం ఎగిరినా బ్రహ్మకు లింగం అంత్యభాగం కనపడలేదు. వరాహరూపంలో ఉన్న విష్ణువు పాతాళం దాటి వెళ్లినా లింగం మొదలు కనిపించ లేదు. ఇంతలో లింగం పక్కనుంచి ఒక కేతకపుష్పం (మొగలిపువ్వు) జారి కిందకు రావడం చూసి బ్రహ్మ మొగలిపువ్వును ఆపి తనకు, విష్ణువుకు నడుమ జరిగిన సంవాదాన్ని వివరించి, తనకు సహాయం చేయమని అడిగాడు. ఆ లింగం అగ్రభాగాన్ని చూసినట్లుగా విష్ణువుతో చెప్పేటప్పుడు అది నిజ మేనని సాక్ష్యం ఇవ్వమని ప్రాధేయపడ్డాడు బ్రహ్మ. సాక్షాత్తూ సృష్టికర్తయే తనని బతిమాలేసరికి కాదనలేకపోయింది మొగలిపువ్వు. వారిద్దరూ కిందికి దిగి వచ్చేసరికి విష్ణువు తాను ఆ లింగం మొదలు చూడలేకపోయానని ఒప్పుకున్నాడు. బ్రహ్మ తాను లింగం అగ్రభాగాన్ని చూశానని, కావాలంటే మొగలిపువ్వును అడగమని చెప్పాడు. 'నిజమే'నంది మొగలిపువ్వు.దాంతో తాను ఓడిపోయానని విష్ణువు ఒప్పుకున్నాడు. అయితే బ్రహ్మదేవుడి అసత్య ప్రచారాన్ని చూడలేక ఈశ్వరుడు వారి ముందు ప్రత్యక్షమయ్యాడు. బ్రహ్మ చెప్పిన ప్రకారం అబద్ధపు సాక్ష్యం చెప్పిన కేతక పుష్పం అంటే మొగలిపువ్వు నాటినుంచి తనను అర్చించడానికి అవకాశం లేదన్నాడు. అంతేకాదు భక్తులెవ్వరూ మొగలిపువ్వులతో తనను పూజించరాదని శాసించాడు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండీ అల్పవిషయంలో అసత్యం చెప్పిన బ్రహ్మకు భూలోకంలో ఎవరూ పూజ చేయరాదని, ఆలయాలు కట్టకూడదని శాసించాడు. సత్యం చెప్పిన విష్ణువును మెచ్చుకుని, భూలోకంలో తనతో సమానంగా పూజలందుకునే విధంగా ఆశీర్వదించాడు.

అనంతరం బ్రహ్మ, విష్ణువులిద్దరూ ఈశ్వరుణ్ణి శ్రేష్ఠమైన ఆసనం మీద కూర్చుండబెట్టారు. హారాలు, నూపురాలు, కిరీటం, మణికుండలాలు, యజ్ఞోపవీతం, ఉత్తరీయం, పట్టువస్త్రాలు, పూలమాలలు, పువ్వులు, తాంబూలం, కర్పూరం, గంధం, అగరు, ధూపం, శ్వేతఛత్రం, వింజామరలు వంటి దివ్యమైన వస్తువులను సమర్పించి షోడశోపచారంగా పూజించారు. ఆ పూజకు ఈశ్వరుడు ఎంతగానో సంతోషించాడు. జ్యోతిర్లింగరూపంలో బ్రహ్మకు, విష్ణువుకు తాను కనిపించిన సమయాన్ని లింగోద్భవకాలంగా పరిగణించాలని, ఇకనుంచి మాఘ బహుళ చతుర్దశి శివరాత్రి అనే పేరుతో తన పూజలకు శ్రేష్ఠమైనదిగా వర్థిల్లుతుందని చెప్పాడు. అంతేకాదు, ఆ తిథినాడు తన మూర్తిని, లింగాన్ని పూజించే వారికి మోక్షం లభిస్తుందన్నాడు. శివరాత్రినాడు పార్వతీసమేతంగా తనను అర్చించే వారు మహోన్నత ఫలాలు పొందేవిధంగా అనుగ్రహించాడు.

మహాశివరాత్రి పండుగను జరుపుకోవడంలో మూడు ప్రధానమైన విషయాలు ఉన్నాయి. శివార్చన, ఉపవాసం, జాగరణం. శివరాత్రి రోజున సూర్యోదయానికి ముందుగానే నిద్రలేచి, స్నానాది కార్యక్రమాలు పూర్తి చేసుకుని, శివలింగాన్ని షోడశోపచారాలతో పూజించాలి. శివభక్తులను పూజించి వారికి భోజనం పెట్టాలి. శివాలయానికి వెళ్లి, శివదర్శనం చేసుకోవాలి ఇది శివార్చన. ఇక రెండోది ఉపవాసం. ఉపవాసమంటే శివరూపాన్ని ధ్యానిస్తూ, శివ నామస్మరణం చేయడం.

మూడోది జాగారం. శివరాత్రి నాటి సూర్యాస్తమయం మొదలు మర్నాడు సూర్యోదయం వరకు.. నాలుగు జాములు నిద్రపోకుండా మేల్కొని ఉండటం. ఈ విధంగా జాగారం చేసిన వారికి పునర్జన్మ ఉండదని స్కాంధ పురాణం చెబుతోంది. శివరాత్రి రోజున భగవన్నామ స్మరణం సమస్త పాపాలను నశింపజేస్తుంది. శివరాత్రి నాడు చేసే జాగారాన్ని వ్యర్థ ప్రసంగాలతోనో, ఎలాంటి ప్రయోజనం లేని వాటిని చూస్తూనో కాకుండా శివనామాన్ని స్మరిస్తూ, శివ గాథలను చదువుకుంటూ శివలీలలను చూస్తూ చేసినట్టైతే కాలాన్ని సద్వినియోగం చేసుకున్నట్లవుతుంది. ఇంకా పుణ్యమూ, పురుషార్థమూ రెండూ లభిస్తాయని శాస్త్రం చెబుతోంది.

శివరాత్రే యోగరాత్రి. శివరాత్రి రోజుకి ప్రకృతిలో ఉండే తరంగాలు, అంతరిక్షం నుంచి వెలువడే కాస్మిక్ కిరణాలు విశ్వ మానవ వికాసానికి, మనిషి తన పరిపూర్ణమైన రూపాన్ని తెలుసుకోవడానికి, ఆత్మ సాక్షాత్కారానికి తోడ్పడతాయి. అందుకే శివరాత్రి కి కొన్ని ప్రత్యేక నియమాలు విధించారు.

ఉపవాసం ఎలా?

శివరాత్రికి చేసే ఉపవాసానికి, జాగరణకు విశేష ప్రాధాన్యం ఉంది. శివరాత్రి నాడు అందరూ ఉపవాసం చేయాలని శాస్త్రం చెబుతుంది. చిన్నపిల్లలకు, ముసలివాళ్ళకు, అనారోగ్యంతో బాధపడేవాళ్ళకు, గర్భవతులకు, ఔషధ సేవనం చేయాల్సిన వాళ్ళకు మినహాయింపు ఇచ్చింది శాస్త్రం.

ఉపవాసం మరుసటి రోజు మాంసాహారం, గుడ్లు మొదలైనవి తినకూడదు, మద్యపానం చేయకూడదు. ఎలాగూ ఉపవాసం చేస్తున్నాం కదా, ఉదయం లేస్తే ఆకలి తట్టుకోవడం కష్టమని, ఆలస్యంగా లేస్తారు కొందరు. అలా చేయకూడదు. ఉపవాసం ఉండేరోజు ఉదయం సూర్యోదయానికి ముందే నిద్రలేచి, తలపై నుంచి స్నానం చేసి, ఈ రోజు నేను శివునకు ప్రీతికరంగా, శివరాత్రి ఉపవాసం చేస్తున్నాను అని సంకల్పం చెప్పుకోవాలి.

ఉపవాసం అనే పదానికి అర్థం 'దగ్గరగా ఉండడం' అని! భగవంతునికి మనసును, ఇంద్రియాలను దగ్గరగా జరపడమే ఉపవాసం. ఆరోగ్య పరంగా చూసినప్పుడు, ఉపవాసం శరీరంలో ఉన్న విషపదార్థాలను తొలగించడంతో పాటు శరీరంలో ప్రాణశక్తిని, ఇంద్రియ నిగ్రహాన్ని పెంచుతుంది. మరీ నీళ్ళు కూడా తాగకుండా ఉపవసించమని ఎవరూ చెప్పలేదు. అలా చేయకూడదు కూడా. ఎందుకంటే శరీరాన్ని కష్టపెడుతూ, భగవంతుని వైపు మనసును మళ్లించడం కష్టం.

శివరాత్రి నాడు శివలింగానికి రుద్రాభిషేకం చేయించడం మంచిది. అంతేకాదు జాగారం వుండి శివ పంచాక్షరి మంత్రంతో ధ్యానం చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని నమ్ముతారాయన భక్తులు. కనుకనే మహాశివరాత్రి నాడు నమశ్శివాయ అంటూ మారుమోగుతాయి శివాలయాలన్నీ.

'త్రయంబకం యజామహే...' అంటూ మృత్యుంజయ మంత్రం జపిస్తే సకల రోగబాధలూ తగ్గి, పూర్ణాయుష్షు లభిస్తుందని ప్రతీతి. శివరాత్రి నాడు కలిగినంతలో దానాలు చేయడం వల్ల సత్ఫలితాలు లభిస్తాయి. అందుకే చేసిన వాడికి చేసుకున్నంత మహాదేవా అన్నారు. ఇవేవీ చేయ(లే)కపోయినా నిర్మలమైన మనస్సు తో వీలైనన్ని సార్లు ఓం నమశ్శివాయ అనే పంచాక్షరీ మంత్ర జపం చేసినా చాలు, ఆ బోళాశంకరుడు పొంగిపోయి వరాలిస్తాడు.

– డి.వి.ఆర్.

ఆయన రూపం అపురూపం

శివుడు నిరాకారుడు. సాకారుడు కూడా. అదే ఆయన ప్రత్యేకత. పరమ శివుని ఆకృతిలో ఒక్కొక్క దానికి ఒక్కొక్క అర్థం ఉంది. శివుని త్రిశూలం సత్వ, రజ, తమో గుణాలకు ప్రతిరూపాలు. డమరుకం శబ్ద బ్రహ్మ స్వరూపం. ఆయన శిరస్సును అలంకరించిన చంద్రవంక మనోనిగ్రహానికి, గంగాదేవి శాశ్వతత్వానికి ప్రతీక. శివుడి దేహంపై గల సర్పాలు భగవంతుని జీవాత్మలుగాను, ధరించిన ఏనుగు చర్మం అహంకారాన్ని త్యజించమని, ఆసీనంపైన పులిచర్మం కోరికలకు దూరంగా ఉండమని, భస్మం పరిశుద్ధతనూ సూచిస్తాయి. ఆయన పట్టుకున్న నాలుగు జింక కాళ్ళు చతుర్వేదాలకు, నంది ధర్మదేవతకు, మూడవ నేత్రం జ్ఞానానికి సూచిక.

రెండు స్వరూపాలు

శివుడు కేవలం రుద్ర స్వరూపుడే కాక ప్రేమ స్వరూపుడు కూడా. రుద్రస్వరూపంగా అయితే శివుడు, మహంకాళి, వీరభద్రుడు, కాలభైరవుడు, ఉగ్ర గణపతి, పిశాచగణాలుగా దర్శనం ఇస్తే శాంతస్వభావునిగా ఉన్నప్పుడు పరమేశ్వరుడు, పార్వతీదేవి, కుమారస్వామి, వినాయకుడు, నందీశ్వరుడు, గురునాథ స్వామి, వేద వేదాంగ భూషణులు మనకు కనిపిస్తారు.

జగతః మాతా పితరౌ

శివపార్వతులు తమ కల్యాణ మహోత్సవానికి చక్కగా చిగిర్చే పూచే వసంతకాలాన్ని మనకిచ్చి, ఆకులు రాలే శిశిరాన్ని ఎంచుకున్నారు ఆ దంపతులు. వెన్నెల మెండుగా కాసే పున్నమిని మనకిచ్చి, కన్ను పొడుచుకున్నా కానరాని బహుళ చతుర్దశిని తాము తీసుకున్నారు. రాత్రి వేళ అయితే అది మనకి ఇచ్చింది అని భావించి తెల్లవారుజామున మంచిదనుకున్నారు ఆ తలిదండ్రులు. మల్లెల్నీ మొల్లల్నీ మనకి విడిచి వాసన, రూపసౌందర్యం లేని తుమ్మిపూవుల్ని సిద్ధం చేసుకున్నారు. చందనాన్ని మన పరం చేసి విభూతిని పులుముకున్నారు. ఊరేగింపునకి ఎద్దునీ, అలంకారాలుగా పాముల్నీ... ఇలా జగత్తుకోసం ఇన్ని త్యాగాలు చేసిన ఆ ఆది దంపతుల కల్యాణ మహోత్సవానికి పిల్లలమైన మనం తప్పక హాజరు కావాలి. ఆశీస్సులు అందుకోవాలి. అందుకే ఈ జాగరణం.



చిగురించే శుభలేఖ

ఒకప్పుడు శుభలేఖ అంటే...
పసుపు సుగంధాలతో అందే ఆహ్వానం.
డిజిటల్ యుగంలో వాట్సాప్‌లోనే ఆహ్వానం.
పెళ్లయ్యాక డిలీట్ చేయకపోతే మెమరీ చాలదు.
ఆ తర్వాత ఆ పత్రిక మన మెమరీలోనూ ఉండదు.
కానీ... ఈ శుభలేఖ ఎప్పటికీ నిలిచి ఉండే ఓ జ్ఞాపకం.


మంచాల వారి పరిణయ ఆహ్వానం... ఏటా మనింటికి ఎన్నో పెళ్లిపత్రికలు వస్తూ ఉంటాయి. 'అరె! నా పెళ్లిలో పట్టుపరికిణితో బుట్టబొమ్మలా తిరిగిన ఆ చిన్నమ్మాయికి పెళ్లా! కాలం ఎంత వేగంగా పరుగులు తీస్తోందో? అనుకుంటూ పెళ్లి కార్డును మురిపెంగా చూస్తాం. పెళ్లయిన తర్వాత ఆ కార్డును పాత పేపర్లలో వేసేయడానికి మనసొప్పదు. శుభలేఖను గౌరవించాలి, ఆ జంట వైవాహిక జీవితం కలకాలం లక్షణంగా సాగాలంటే పెళ్లికార్డును అగౌరవపరచకూడదనే సెంటిమెంట్ మనది. ఈ సెంటిమెంట్‌కు కొత్త నిర్వచనం చెప్తోంది డాక్టర్ శరణ్య. ఆహ్వానపత్రిక ముద్రించిన పేపర్‌ను తులసి గింజలను కలిపి తయారు చేయించింది. ''నా పెళ్లి తర్వాత ఈ కార్డును మట్టి కుండీలో వేసి నీరు పోయండి. నాలుగు రోజుల్లో కార్డు కరిగిపోతుంది, మరో నాలుగు రోజులకు పచ్చగా జీవం పోసుకున్న తులసి మొక్క మనల్ని పలకరిస్తుంది. మీ ఇంటికి వచ్చిన తులసి, మీ ఇంటి ఆరోగ్యదాయిని. భూమాతకు కొత్త ఊపిరినిచ్చే ఆరోగ్యలక్ష్మిని చూస్తూ మీ ముఖంలో విరిసే చిరునవ్వే మాకు మీరిచ్చే ఆశీర్వాదం'' అంటోంది.

శుక్రవారమే పెళ్లి!

డాక్టర్ శరణ్యది తెలంగాణ రాష్ట్రం, నిజామాబాద్. ఎంఎస్ ఆఫ్తాల్మాలజీ చేస్తోంది. ఈ నెల 24వ తేదీన పెళ్లి పీటల మీద కూర్చోనున్న శరణ్య తన వివాహాన్ని ఇలా పర్యావరణహితంగా మార్చేసింది. ఆ వివరాలను సాక్షితో పంచుకుంది. ''నేచర్ ఫ్రెండ్లీ లైఫ్ స్టయిల్ నాకిష్టం. నా పెళ్లి కూడా అలాగే జరిగితే బావుణ్ణనిపించి అదే మాట నాన్నతో చెప్పాను. పెళ్లి వేదిక అలంకరణ నుంచి భోజనాల వరకు మొత్తం ప్లాస్టిక్ రహితంగా ఉండాలని కూడా అనుకున్నాం. అది పెద్ద కష్టం కాలేదు. ప్రతిదానికీ ప్రత్యామ్నాయం దొరికింది. కార్డుల కోసం చాలా ప్రయత్నం చేయాల్సి వచ్చింది. 'ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీ కార్డ్స్' కోసం నేను ఇంటర్నెట్‌లో, నాన్న తన బిజినెస్ కాంటాక్ట్స్‌తో ప్రయత్నించాం. నాన్నకు తెలిసిన వాళ్ల ద్వారా అహ్మదాబాద్‌లో హ్యాండ్‌మేడ్ పేపర్ తయారీతో పాటు మనం కోరిన స్పెసిఫికేషన్‌లన్నీ వచ్చేటట్లు కస్టమైజ్‌డ్‌గా ప్రింట్ చేసిస్తారని తెలిసింది. మూడు నెలల ముందుగా ఆర్డర్ చేయాలి, ఈ ఎకో ఫ్రెండ్లీ ఆహ్వానపత్రికల ఆలోచన తెలిసి మా అత్తగారింట్లో కూడా అందరూ సంతోషించారు. భూమాత పరిరక్షణ కోసం చేస్తున్న ప్రయత్నాలు నా పెళ్లికార్డుతో ఇంతమందికి తెలిశాయి. దీనికి మూలకారణం మా నాన్నే. ప్లాస్టిక్ ఫ్రీ సొసైటీ కోసం చైతన్య సదస్సులు నిర్వహిస్తారు. మా చెల్లికి పక్షులంటే ఇష్టం. వేసవిలో పక్షుల కోసం ఒక పాత్రలో నీరు, గింజలు పెడుతుండేది. పక్షుల సంరక్షణలో అందరూ భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో రెండు వేల బర్డ్ ఫీడర్ బాక్సులు పంచింది. మా ముత్తాత రాజేశం గారు ఫ్రీడమ్ ఫైటర్. మా తాత శంకరయ్య కూడా సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా ఉండేవారు. అదే వారసత్వంతో నాన్న కూడా వేసవిలో నగరంలో వాటర్ ట్యాంకులతో నీటి పంపిణీ వంటి అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. బతుకమ్మ వేడుక కోసం గునుగుపువ్వు సేకరించి శుద్ధి చేసి పంచడం కూడా చాలా ఇష్టంగా చేస్తాం. మనం మన సంస్కృతికి వారసులం మాత్రమే కాదు వారధులం కూడా. ప్రతి సంప్రదాయాన్నీ ఇలా సృజనాత్మకంగా మలుచుకోగలిగితే మనం చేసిన పని మనకు ప్రత్యేకతను ఇస్తుంది. సాంస్కృతిక వారధులుగా సంతోషమూ కలుగుతుంది. పెళ్లి పత్రిక మీద దేవుడి బొమ్మలు, వధూవరుల ఫొటోలు ఉంటాయి. వాటిని పారేయలేక ఇంట్లోనే పెట్టుకుంటే దొంతర పెరిగిపోతూ ఉంటుంది. మా పెళ్లి పత్రిక మాత్రం తులసి మొక్కగా మీ కళ్ల ముందు ఉంటుంది, మీకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది '' అని సంతోషంగా వివరించింది డాక్టర్ శరణ్య.

– వాకా మంజులారెడ్డి


డాక్టర్ శరణ్య


కాబోయే భర్త వినయ్‌సాయితో డాక్టర్ శరణ్య

● కృషి

సేద్య కళ

చదువుకుంటూ పార్ట్‌టైమ్ జాబ్స్ చేసే యువత గురించి మనకు తెలుసు. అలాగే, చదువుకుంటూనే తమ అభిరుచులకు పదును పెట్టుకునేవారినీ మనం చూస్తుంటాం. అయితే, నెల్లూరు జిల్లా కలువాయి మండలం, పెన్న బద్వేల్‌వాసి అయిన చాట్ల అఖిల మాత్రం హాస్టల్‌లో ఉండి బయోటెక్నాలజీలో డిగ్రీ చేస్తూనే, ఖాళీ సమయంలో సేంద్రీయ వ్యవసాయం చేస్తోంది. తనకున్న ఇష్టం వల్ల సేద్యంలో రకరకాల ప్రయోగాలు సొంతంగా చేయగలుగుతున్నాను అని చెబుతున్న అఖిల తన కలనే కాదు కళను కూడా పండిస్తోంది.

''మాది వ్యవసాయ కుటుంబం అవడంతో చిన్నప్పటి నుంచి ఇంటి పనులతో పాటు పొలం పనులు కూడా తెలుసు. అమ్మ పద్మ, నాన్న గురువయ్య. అమ్మానాన్నలకు అన్న, నేను సంతానం. డిగ్రీ మూడవ సంవత్సరం నెల్లూరు టౌన్‌లోనే హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాను. డిగ్రీ పూర్తయిన తర్వాత నాకు నేనుగా స్థిరపడాలంటే ఏది ఎంచుకుంటే బాగుంటుంది అని చాలా ఆలోచించాను. కరోనా కాలంలో రెండేళ్లు ఇంటి వద్దే ఉన్నప్పుడు ఎక్కువ సమయం పొలంలోనే గడిపేదాన్ని. అలా వ్యవసాయంలోని కష్టం, ఇష్టం రెండూ అలవాటయ్యాయి. అయితే, ఊళ్లో వ్యవసాయం చేస్తూ, కాలేజీకి వెళ్లి చదువుకోలేను. ఇంటి వద్దే ఉండి నాకు నచ్చిన రీతిలో వ్యవసాయం చేయాలంటే అందుకు అమ్మానాన్నలను ఒప్పించడం కష్టమనుకున్నాను. 'చదువుకుంటున్నావు కదా ఎందుకింత కష్టం' అంటారు. అందుకే అమ్మానాన్నలకు చెప్పకుండానే ఎక్కడైనా కొంత భూమి కౌలుకు తీసుకోవాలని వ్యవసాయం చేయాలని, కరోనా టైమ్‌లోనే తెలిసి వారి ద్వారా చాలా వెతికాను.

సాగులో లేని భూమి..

నేనున్న హాస్టల్‌కి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లిపాడులో ఒక ఎన్ఆర్‌ఐ భూమి ఉందని తెలిసింది. వారి వివరాలు కనుక్కొని, ఫోన్‌లో సంప్రదించి, రెండెకరాల భూమి కౌలుకు తీసుకున్నాను. అది ఏ మాత్రం సాగులో లేని భూమి. అందుకు చాలా కష్టపడాలి. మొదట కష్టమవుతుందేమో అనుకున్నాను. కానీ, ఇష్టమైన పని కావడంతో సాగు చేయాలనే నిశ్చయించుకున్నాను.

మట్టితో పిచికారి

భూమిని చదును చేయించాను. ఆకు కూరలు, కూరగాయల సాగు చేస్తున్నాను. సాగులో వచ్చే ఇబ్బందులు స్వయంగా తెలుసుకుంటూ, వాటికి పరిష్కారాలు వెదుక్కుంటూ నా ఎఫర్ట్‌ను పెడుతున్నాను. ఓ వయసుపైబడిన వ్యక్తి ఉంటే, అతనికి అవసరాలకు డబ్బు ఇచ్చి పొలానికి కాపలాకు పెట్టాను. శని, ఆదివారాలు, ఇతర సెలవు రోజులు ఈ పనికి ఎంచుకున్నాను. ఉదయం ఫార్మ్ దగ్గరకు వెళతాను. సాయంత్రం వరకు అక్కడే ఉంటాను. మొక్కల ఏపుగా పెరగడానికి మట్టి ద్రావకంతో సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నాను. పెన్నానది పక్కన ఉండటంతో అక్కణ్ణుంచి మోటార్ ద్వారా నీటి సదుపాయాన్ని ఏర్పాటు చేసుకున్నాను.

తక్కువ పెట్టుబడితో..

ఇప్పుడు పాలకూర, చుక్కకూర, తోటకూర, గోంగూర, బెండ, చిక్కుడు, స్వీట్‌కార్న్, వంగ, దోస, సొరకాయ వంటివి సాగుచేస్తున్నాను. ఆకు కూరలు 15 రోజులకొకసారి కోతకు వస్తాయి. వీటన్నింటిని వాతావరణం బట్టి నా పనిలో మార్పులు చేసుకుంటాను. తెలిసినవాళ్లే వాటిని స్వయంగా వచ్చి తీసుకెళుతుంటారు. భూమిని చదును చేయించడానికి రూ.5 వేల వరకు పెట్టుబడి పెట్టాను. అన్ని ఖర్చులు పోను రూ. 15 వేల వరకు ఆదాయం వచ్చింది. అయితే, ఈ మొత్తాన్ని కూడా భూమిలో సేంద్రీయ పద్ధతులను అమలు చేయడానికి ఖర్చు పెడుతున్నాను.

మా ఫ్రెండ్స్ కూడా అప్పుడప్పుడు వచ్చి సరదాగా వర్క్ చేస్తుంటారు. సొంతంగా వ్యవసాయం చేస్తున్నానని ఎవరికైనా చెబితే 'చదువుకుంటున్నావు కదా, ఆడపిల్లవు కదా! ఎందుకంత కష్టం, ఇంకేం పని దొరకలేదా' అని నవ్వుతున్నారు. అందుకే ఎవరికీ చెప్పడం లేదు. ఇంకొంత భూమి తీసుకుని సాగు చేయాలనేది తర్వాతి ప్లాన్. 'మా భూమిలో కూడా ఇలా మట్టిని కాపాడుతూ సేద్యం చేయండి..' అని అడిగేవాళ్లున్నారు. ఏషియన్, మిల్లెట్ ఫార్మింగ్‌ను పెద్ద ఎత్తున చేయాలనే ఆలోచన ఉంది'' అని వివరించింది అఖిల.

– నిర్మలారెడ్డి


చాట్ల అఖిల


పొలంలో అఖిల

● స్త్రీ శక్తి

ఆకాశమంత అవకాశం

రేయనా బర్నావీ సౌదీ అరేబియా ఫస్ట్ ఉమెన్ ఆస్ట్రోనాట్‌గా చరిత్ర సృష్టించనుంది.
మహిళాసాధికారత విషయంలో సౌదీ మరో అడుగు ముందుకు వేసింది..

గత వైఖరికి భిన్నంగా సౌదీ అరేబియా మహిళా సాధికారత, హక్కులకు పెద్ద పీట వేస్తోంది. తనను తాను కొత్తగా నిర్వచించుకునే ప్రయత్నం చేస్తోంది. ఒకప్పుడు... మేల్ గార్డియన్ లేకుండా మహిళలు డ్రైవింగ్ చేయకూడదు, విదేశాలకు వెళ్లకూడదు అనే ఆంక్షలు ఉన్న దేశంలో ఎంతో మార్పు వచ్చింది. దీనికి బలమైన ఉదాహరణ... సౌదీ అరేబియా తొలిసారిగా రేయనా బర్నావీ అనే మహిళను స్పేస్ మిషన్ ఎఎక్స్–2కు ఎంపిక చేయడం. సౌదీ హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ ప్రోగ్రాం, ప్రైవెట్ స్పేస్ కంపెనీ ఆక్సియం స్పేస్ (యూఎస్) భాగస్వామ్యంతో చేపట్టిన స్పేస్ మిషన్‌లో 33 సంవత్సరాల బర్నావీ సౌదీ అరేబియా ఫస్ట్ ఉమెన్ ఆస్ట్రోనాట్‌గా చరిత్ర సృష్టించబోతోంది.

న్యూజిలాండ్‌లోని ఒటాగో యూనివర్శిటీ నుంచి బయోమెడికల్ సైన్స్‌లో పట్టాపుచ్చుకున్న బర్నావీ రియాద్‌లోని అల్‌ఫైసల్ యూనివర్శిటీలో బయోమెడికల్ సైన్స్‌లో మాస్టర్స్ చేసింది. క్యాన్సర్ స్టెమ్ సెల్ రిసెర్చ్‌లో తొమ్మిది సంవత్సరాల అనుభవం ఉంది.

కొన్ని నెలల్లో ప్రారంభం కానున్న తమ స్పేస్‌మిషన్‌ను దృష్టిలో పెట్టుకొని సౌదీ స్పేస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ఒక వీడియో విడుదల చేసింది. భావుకత నిండిన ఆ వీడియోలో కొన్ని వాక్యాలు ఇలా ఉంటాయి...

సగర్వంగా తల పైకెత్తి చూడు/ ఆకాశంలో అసంఖ్యాకమైన నక్షత్రాలు కనిపిస్తాయి
వాటిని పలకరించాలి/ పరిచయం చేసుకోవాలి/ పేరు పెట్టాలి/ నక్షత్రాలు నీ స్నేహితులు కావాలి
అంతరిక్షం అనేది నీ అపురూపమైన ఇష్టం కావాలి/ ఆకాశ మార్గంలో నీదైన దారి వెదుక్కో
అధ్యయనం చేయాలి/పరిశోధించాలి/ కొత్త విషయాలను ఆవిష్కరించాలి/నీ తరానికి స్ఫూర్తిగా నిలవాలి
నీ మార్గంలో నువ్వు ఒంటరివి కావు/ నీ పూర్వీకులెందరో ఆ బాటలో నడిచారు/ గొప్ప విజయాలు సాధించారు/ నీ కలను ఆవిష్కరించే సమయం వచ్చింది
ఆ కలకు రెక్కలు ఇచ్చే సమయం వచ్చింది... లెట్ ఇట్ ఫ్లై!

వీడియో తొలి దృశ్యంలో ఒక మహిళ కనిపించడం యాదృచ్ఛికం కాకపోవచ్చు. అంతరిక్ష విషయాల్లో, విజయాల్లో మహిళలు ముందుండబోతున్నారు అని ప్రతీకాత్మకంగా చెప్పడం కావచ్చు!


రేయనా బర్నావీ

లైఫ్@360





మీ కన్నయ్య మన్ను తింటున్నాడా?

కొందరు పిల్లలు తల్లిదండ్రుల కళ్లు కప్పి మట్టి, బలపాలు, గోడకు ఉండే సున్నపు బెత్తికలు తింటూ ఉంటారు. మరి కొందరు పెద్దవాళ్లు కూడా బియ్యంలో మట్టిగడ్డలు తినడం చూస్తుంటాం. మొక్కై వంగనిది మానై వంగునా? అన్నట్లు చిన్నప్పుడే పిల్లల్లో ఉండే మట్టి తినే అలవాటును మాన్పించకుంటే వారి ఆరోగ్యానికి పెను ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. మట్టితినే అలవాటు మాన్పించడం ఎలాగో చూద్దామా?

ఎందుకు తింటారంటే..?

చాక్లెట్లు, బిస్కట్లు, లాలీపాప్‌లు, ఇలా రకరకాల తినుబండారాలు ఉండగా వాట న్నింటికీ బదులు లేదా వాటితోపాటు అప్పుడప్పుడు ఇలా మట్టి ఎందుకు తింటారో తెలుసా? ... విటమిన్ల లోపమే అందుకు కారణం. శరీరంలో ఉండవలసిన దానికన్నా బాగా తక్కువ పరిమాణంలో ఈ విటమిన్లు ఉండటం లేదా అసలే లేకపోవడం వల్ల పిల్లలు మట్టితింటూ ఉంటారు.

కాల్షియం, ఐరన్ తగినంత లేకపో వడం వల్ల పిల్లలు ఇలా మట్టి తినడానికి అలవాటు పడతారని పరిశోధనలు రుజువు చేస్తున్నాయి.

మట్టి తినే అలవాటు పిల్లల ఆరో గ్యానికి హాని కలిగిస్తుంది. కడుపు, జీర్ణ క్రియకు సంబంధించిన అనేక సమ స్యలు మొదలవుతాయి. వాటిని సకా లంలో ఆపకపోతే, పెరుగుదలలోనూ అనేక సమస్యలను ఎదుర్కొంటారు.

పిల్లల శరీరంలో కాల్షియం లోపం ఏర్పడినప్పుడు, వారు మట్టి రుచిని ఇష్ట పడతారు. పిల్లలు మట్టి వైపు వెళ్లకుండా నివారించడానికి, తగినంత కాల్షియం ఉన్న పదార్థాలు తినేలా చూడాలి.

పిల్లలకు మట్టి, బలపాలు తినే అల వాటు మానుకోవాలంటే లవంగం నీళ్ల ఇస్తే మేలు జరుగుతుంది. 6–7 లవంగా లను నీటిలో బాగా మరిగించి పిల్లలచేత తాగించండి. అవసరం అనుకుంటే దీనికి కొద్దిగా తేనె కలిపినా మంచిదే.

అరటి పండులో ఎక్కువ మొత్తంలో కాల్షియం ఉంటుంది కాబట్టి పిల్లలకు రోజూ అరటిపండు తినిపిం చాలి. కావాలంటే అరటిపండుకు తేనె కలిపి మెత్తగా చేసి తినిపించవచ్చు.

• మీకు తెలుసా?



పాలు అనగానే సాధారణంగా గేదెపాలు లేదా ఆవుపాలే అంద రికీ తెలుసు. అయితే ఇటీవల గాడిదపాలు, మేకపాలు కూడా కొందరు తాగుతున్నారు. ఇవే కాదు, కొబ్బరిపాలు కూడా ఉన్నాయి. పచ్చికొబ్బరిని కోరి లేదా ముక్కలు చేసి తగినన్ని నీళ్ల చేర్చి రుబ్బి, వడ పోయడం ద్వారా కొబ్బరిపాలను తయారు చేయవచ్చు. కొబ్బరి పాలను తాగడం ద్వారా చాల ప్రయో జనాలున్నాయి. అవేమిటో తెలుసుకుందాం...
• ఆవు పాలకు సమానమైన పోషకాలను కలిగి ఉంటాయి. • యాంటీ వైరల్ గుణాలు సమృద్ధిగా ఉండటంతో రోగ నిరోధక వ్యవస్థను పటిష్ఠం చేస్తాయి. • శరీరంలో ఏర్పడే ఒత్తిడి తగ్గించడంతో పాటు కీళ్ల నొప్పులకు మందులా పనిచేస్తాయి.
• ఫాస్ఫరస్, కాల్షియం వంటి పోషకాలు ఉండడంతో దంతాలు, ఎముకలు బలంగా మారతాయి. మీ పిల్లలు మామూలు పాలు తాగడానికి మొగ్గు చూపనప్పుడు ఒకసారి కొబ్బరిపాలను పట్టించడానికి ప్రయత్నిం చండి. మంచి ఫలితం ఉంటుంది.

• హెల్త్ టిప్స్



• ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండు మూడు వెల్లుల్లి రేకులు తింటే రక్త పోటు, కడుపులో మంట, నులిపురుగుల నుంచి ఉపశమనం లభిస్తుంది. • కొన్ని స్పాంజి ముక్కలను నీళ్ళలో తడిపి ఫ్రీజర్లో ఉంచండి. చెయ్యి కాలినా లేదా ఏ తలుపు సందులోనో పడి నలిగినా ఒక స్పాంజి ముక్కను తీసి బాధ ఉన్న ప్రదేశంలో కొద్దిసేపు ఉంచితే నొప్పి, వాపు వెంటనే తగ్గుతాయి. • పళ్ళు వచ్చే ముందు పిల్లలు ప్రతిదాన్నీ కొరుకుతూ చిగుళ్ళు నొప్పి పుట్టి ఏడుస్తూ ఉంటారు. అటువంటప్పుడు సారింజ తొనలలోని విత్తనాలు తీసేసి, ఆ తొనలను కాసేపు ఫ్రిజ్లో ఉంచి వాటిని పిల్లలకు ఇస్తే ఆ చల్లదనం వారి బాధను పోగొట్టి రిలీఫ్ ఇస్తుంది. వారికి అవసరమైన 'సి' విటమిన్ కూడా లభిస్తుంది. • ద్రాక్ష రసాన్ని కొంచెం తేనెలో కలిపి రోజుకు మూడు సార్లు తీసుకుంటే దగ్గు, జలుబు నుంచి ఉపశమనం పొందవచ్చు. • కొబ్బరినూనె, నిమ్మరసం సమపా ళ్ళలో తీసుకుని బాగా కలిపి కొద్దిగా వేడిచేసి నొప్పిగా ఉన్న ప్రాంతంలో మర్దన చేస్తే కీళ్ళ నొప్పులు తగ్గుతాయి. • కిడ్నీ వ్యాధుల నివారణకు రెండు వంతుల దోసకాయ రసానికి, ఒక వంతు ద్రాక్ష రసాన్ని కలిపి ఉదయం, సాయంత్రం ఒక కప్పు చొప్పున తాగి చూడండి • బచ్చలి రసం, అనాసరసం సమపాళ్లలో తీసుకుని దానిలో కొంచెం నిమ్మరసం కలుపుకుని తాగితే శరీరంలో వేడి తగ్గుతుంది.





టీర్స్ ఏది బెటర్?



భారతీయ జనాభాలో 64 శాతం మంది రోజూ టీ తాగడానికి ఇష్టపడతారు, అందులో 30 శాతం మంది సాయంత్రం పూట తాగుతున్నారు. అయితే... సాయంత్రం పూట టీ తాగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వైద్య శాస్త్రం ప్రకారం మంచి నిద్ర, సరైన లివర్ డిటాక్స్, ఆరోగ్యకర మైన జీర్ణక్రియ కోసం పడుకోవడానికి కొద్దిగంటల ముందు కెఫీన్ ను నివారించడం ఉత్తమం. టీ చెడ్డది కాదు.. కానీ..., అది పాలతో తాగాలా, ఎక్కువ తాగాలా.. తక్కువ తాగాలా.. ఏ సమయంలో తాగాలి.. అనేది చూసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

విదేశాలలో చాలా మంది బ్లాక్ టీనే తాగుతారు. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, థైరోఫ్లేవిన్, థైరోబిసిన్ వంటి పాలీఫెనాల్స్ ఉంటాయి–ఇ వన్నీ ఆరోగ్యకరమైనవే. మనదేశంలో మాత్రం పాలు, చక్కెరను జోడించి టీ తయారు చేసుకొని తాగుతారు. అయితే ఇది అంత మంచిది కాదు. అందువల్ల మన టీరు తెన్నులు మార్చుకోవడం మంచిది.

• రాత్రి షిఫ్టులో పనిచేసే వ్యక్తులు • ఎసిడిటీ లేదా గ్యాస్ట్రిక్ సమస్య లేని వ్యక్తులు • ఆరోగ్యకరమైన జీర్ణక్రియ కలిగిన వారు • నిద్ర సమస్య లేని వారు • ప్రతిరోజూ సమయానికి భోజనం చేసేవారు • సగం లేదా కప్పు కంటే తక్కువ టీ తాగే వారు.. వీరంతా ఎప్పుడు తాగినా ఫరవాలేదు.

సాయంత్రం టీకి వీరు దూరంగా ఉండాలి!

- నిద్రలేమికి గురయ్యే వారు
- ఆందోళనతో బాధపడేవారు, ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడిపేవారు
- అధిక వాత సమస్యలు ఉన్న వ్యక్తులు (పొడి చర్మం, పొడి జుట్టు)
- బరువు పెరగాలనుకునే వారు
- ఆకలి సరిగా లేని వారు
- హార్మోన్ల సమస్యలతో బాధపడేవారు
- మలబద్ధకం /ఆమ్లత్వం లేదా గ్యాస్ సమస్య.
- జీవక్రియ, ఆటో ఇమ్యూన్ వ్యాధులతో బాధపడే వారు.
- తక్కువ బరువు కలవారు
- ఆరోగ్యకరమైన చర్మం, జుట్టు కోరుకునే వారు.

ఇక ఏ టీ, ఎప్పుడు తాగాలో మీరే తేల్చుకోండి.

• హెల్దీ డ్రింక్

ఆరోగ్యంగా ఫిట్‌గా ఉండేందుకు వ్యాయామంతోపాటు రోజువారి ఆహారంలో కలర్‌ఫుల్ ఆహార పదార్థాలు ఉండాలని ఆరోగ్యనిపు ణులు సూచిస్తున్నారు. పండ్లు, కూరగాయలను ఆహారంలో చేర్చు కోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెరగడమేగాక యవ్వనంగా కనిపి స్తారు. ఇందుకు యాంటీ ఏజింగ్ డ్రింక్ బాగా పనిచేస్తుంది.




యవ్వన పానీయం



బత్తాయి, ఆపిల్, క్యారెట్, బీట్ రూట్, టమోటా, కీరా, సొరకాయ, పార్స్లే ఆకులను సమపాళ్లల్లో తీసుకుని చిటి కెడు పసుపు వేసి మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇందులో తగినన్ని నీళ్లు కలుపుకోవాలి. వడగట్టి తాగాలి. ఈ జ్యూస్‌ను నిత్యం తాగడం వల్ల మంచి ఆరోగ్యంతో పాటు, మెరిసే చర్మం మీ సొంతమవుతుంది. పరగడుపున తాగితే మరిన్ని ఆరోగ్య ప్రయో జనాలున్నాయి.

సినిమా

నాన్‌స్టాప్ ఇండియన్



• కమల్‌హాసన్

హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్' చిత్రం ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లోనే 'ఇండియన్'కు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, గండికోట లొకేషన్స్‌లో షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రం నెక్ట్స్ షెడ్యూల్ చెన్నైలో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్ చాలా కీలకమైనదని తెలిసింది. ఎందుకంటే నెల రోజుల పాటు నాన్‌స్టాప్‌గా ఈ సినిమా చిత్రీకరణలో పాల్గొననున్నారు కమల్‌హాసన్. ముందుగా కమల్‌హాసన్, హీరోయిన్ ప్రియాభవానీ శంకర్ కాంబినేషన్స్ లోని సీన్స్‌ను చిత్రీకరిస్తారట. ఈ షెడ్యూల్ లోనే ఈ చిత్రకథానాయిక కాజల్ అగర్వాల్ కూడా జాయిన్ అయ్యే చాన్స్ ఉందని టాక్. ఇంకా రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, బాబీ సింహా కీ రోల్స్ చేస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.

రికార్డు స్థాయి వసూళ్లు ఖాయం
- నిర్మాత నాగవంశీ



• వెంకీ, నాగవంశీ

"గత ఏడాది మా బ్యానర్ నుంచి వచ్చిన 'భీమ్లానాయక్', 'డీజే టిల్లు' సినిమాలకు హౌస్‌ఫుల్ అంటూ నాకు ఫోన్‌కాల్స్ వచ్చాయి. ఇప్పుడు 'సార్'కు అంత మంచి రెస్పాన్స్ వస్తుండడం హ్యాపీగా ఉంది" అని అన్నారు సూర్యదేవర నాగవంశీ. ధనుష్ హీరోగా నటించిన ద్విభాషా చిత్రం 'సార్' (తమిళంలో 'వాతి'). వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదలైంది. అదే రోజు సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో నాగవంశీ మాట్లాడుతూ– "ధనుష్‌గారి 'రఘు వరన్ బీటెక్' మొత్తంగా తెలుగులో ఎంత వసూలు చేసిందో ఆ స్థాయి వసూళ్లు 'సార్' తొలి రోజునే వచ్చేలా ఉన్నాయి. ఆయన కెరీర్‌లో ఈ చిత్రం రికార్డు స్థాయి వసూళ్లను రాబ ట్టేలా ఉంది" అన్నారు. "ఇంటర్మీడియట్ చదివినప్పుడు, నేను చూసిన చుట్టుపక్కల ఘటనల ఆధారంగా ఈ చిత్రకథ రాశాను" అన్నారు వెంకీ అట్లూరి.

డేట్ ఫిక్స్

స్టూడెంట్‌గా బెల్లంకొండ గణేష్ థియేటర్స్‌కి వచ్చే సమయం ఖరారైపోయింది. బెల్లంకొండ గణేష్ హీరోగా రాఖీ ఉప్పలపాటి దర్శకత్వంలో 'నాంది' ఫేమ్ సతీష్ వర్మ నిర్మించిన చిత్రం 'నేను స్టూడెంట్ సార్..!'. ఇందులో అవంతిక దస్సాని హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమాను మార్చి 10న థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నట్లుగా శుక్ర వారం ప్రకటించారు మేకర్స్. "ఇది ఇంటెన్స్ యాక్షన్ మూవీ" అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్, కెమెరా: అనిత్ మధాడి.



• గణేష్, అవంతిక

థగ్స్‌తో మైత్రి



• హ్రిదు

ప్రముఖ కొరియోగ్రాఫర్ బృందా తెరకెక్కించిన ఇంటెన్స్ యాక్షన్ తమిళ చిత్రం 'థగ్స్'. హ్రిదు హరూన్ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో సింహా, ఆర్‌కే సురేష్, మునిష్‌కాంత్, అనస్వర రంజన్ కీ రోల్స్ చేశారు. హెచ్‌ఆర్ పిక్చర్స్ పతాకంపై జీయో స్టూడియోస్ భాగ స్వామ్యంతో రియా షిబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. కాగా 'థగ్స్' తెలుగు వెర్షన్ 'కోనసీమ థగ్స్'ను మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్‌ఎల్‌పీ పంపిణీ చేయనుంది.

ఆ పాట అప్పుడు ఫాస్టింగ్‌లోనే ఉన్నా! - పూజా హెగ్డే




• వారణాసిలో పూజా హెగ్డే

"మన కలలను నెరవేర్చుకునే విషయంలో ఆ పరమశివునిలా ఉగ్రంగా, ఇతరులను క్షమించే విషయంలో ఆయనలా దయతో ఉందాం" అంటున్నారు పూజా హెగ్డే. నేడు మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ – "శివరాత్రికి ఉపవాసం ఉండటం అనేది కొన్నేళ్లుగా పాటిస్తున్నాను. ప్రతి శివరాత్రికి మా నాన్నగారు ఉపవాసం ఉంటారు. నా చిన్నతనం నుంచి ఆయన్ను చూస్తున్నాను కాబట్టి నాన్నని ఫాలో అవ్వా లనుకున్నాను. అలా ఎప్పటినుంచో ఫాస్టింగ్ అలవాటైంది. పైగా నేను పదేళ్ల పాటు భరతనాట్యం నేర్చుకున్నాను. దాంతో నటరాజుడిని కొలిచే దాన్ని. ఆ విధంగా శివుడితో నా అనుబంధం ఎప్పటినుంచో ఉంది. స్కూల్ డేస్ నుంచే శివరాత్రికి ఉపవాసం ఉంటున్నాను. సినిమాల్లోకి వచ్చాక కూడా తప్పనిసరిగా ఆచరిస్తున్నాను. 'జిగేల్ రాణి..' ('రంగ స్థలం' సినిమా) పాట షూట్ అప్పుడు శివరాత్రి వచ్చింది. ఆ షూట్ అప్పుడు ఫాస్టింగ్ ఉన్నాను. నాకు వీలు కుదిరినప్పుడల్లా శివుడి ఆలయాలను సందర్శిస్తుంటాను. కాశీ విశ్వనాథ్ ఆలయానికి వెళ్లాను. ధర్మస్థలి (కర్నాటక), బాబుల్‌నాథ్ మందిర్ (ముంబై)లకు కూడా వెళ్లాను. ఇక నాకు శివుని పాటల్లో 'శివ్ తాండవ్ స్తోత్రం' ఇష్టం" అన్నారు పూజా హెగ్డే.

• గంగా హారతి తిలకిస్తూ...

వారణాసిలో జరిగే గంగా హారతిని మా నాన్నగారు గతంలో చూశారు. మేం కూడా చూస్తే బాగుంటుందని ఆయన అన్నారు. అలా రెండేళ్ల క్రితం నేను, అమ్మానాన్న, అన్నయ్య వెళ్లాం. హారతి చూస్తుంటే ఒక అద్భుతమైన అనుభూతి లభించింది. అది మాటల్లో చెప్పలేను. గంగా నదీ తీరాన నిలబడి తిలకించడం ఓ గొప్ప అనుభూతి అయితే, పడవలో కూర్చుని తిలకించడం మరో అనిర్వచనీయమైన అనుభూతి.

సస్పెన్స్... థ్రిల్



• సునీల్, విశ్వంత్, జయప్రకాశ్

విశ్వంత్ దుద్దుం పూడి, శ్రీజిత గొష్, శుభ శ్రీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కథ వెనుక కథ'. కృష్ణ చైతన్య దర్శకత్వంలో అవనీంద్ర కుమార్ నిర్మించారు. ఈ మూవీ టీజర్‌ను డైరెక్టర్ గోపీచంద్ మలినేని రిలీజ్ చేసి, మాట్లాడుతూ– "టీజర్ ఆసక్తిగా ఉంది. సినిమా పెద్ద హిట్ కావాలి" అన్నారు. అవనీంద్ర కుమార్ మాట్లాడుతూ– "ప్రతిభ ఉన్నవారిని ప్రోత్సహించి, కొత్త కాన్సెప్ట్ చిత్రాలను అందించాలనే ఆలోచనతో దండమూడి బాక్సాఫీస్ సంస్థని స్థాపించాను. తొలి చిత్రంగా సస్పెన్స్, థ్రిల్ నేపథ్యంలో 'కథ వెనుక కథ' తీశాం. సిటీలో జరుగుతున్న హత్యలకు ఓ వ్యక్తి కారణం కాదు, ఓ గ్యాంగ్ అని పోలీసాఫీసర్ సత్య ఎలా తెలుసు కుంటాడు? అనేది ఆసక్తిగా ఉంటుంది" అన్నారు.

అది నా అదృష్టం
- కిరణ్ అబ్బవరం



"గీతా ఆర్ట్స్‌లాంటి మంచి, పెద్ద బ్యానర్‌లో నటించా లని అందరూ అనుకుంటారు. నా కెరీర్ ప్రారంభంలోనే ఆ బ్యానర్‌లో 'వినరో భాగ్యము విష్ణు కథ' వంటి మంచి సినిమా చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పిస్తుంది" అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం, కశ్మీర జంటగా తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ– "నేను చేసిన 'ఎస్‌ఆర్ కళ్యాణ మండపం' సినిమా నచ్చడంతో అల్లు అరవింద్, వాసుగార్లు 'వినరో భాగ్యము విష్ణు కథ' చేసే అవకాశం ఇచ్చారు. ప్రేమ, వినోదం, థ్రిల్.. ఇలా కుటుంబ సమేతంగా చూడదగ్గ అన్ని అంశాలతో మురళి తెరకెక్కించారు. నా కెరీర్‌లో 'ఎస్‌ఆర్ కళ్యాణ మండపం' మంచి కమర్షియల్ హిట్. ఆ సినిమాని మించిన కమర్షియల్ హిట్‌ని 'వినరో..' సాధిస్తుంది. 'కిరణ్ ఎలాంటి పాత్రలైనా చేయగలడు' అని ప్రేక్షకులతో అనిపించుకోవా లన్నదే నా లక్ష్యం. ప్రస్తుతం నేను నటిస్తున్న 'మీటర్' షూటింగ్ పూర్తయింది. 'రూల్స్ రంజన్' 80 శాతం చిత్రీకరణ పూర్తయింది" అన్నారు.



• శ్రీలేఖ, రాజమౌళి

ఇరవైఅయిదు దేశాల్లో టూర్

సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ సినిమా రంగంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా 25 దేశాల్లో వరల్డ్ మ్యూజికల్ టూర్‌ని మార్చి 17 నుంచి ప్రారంభిస్తున్నారామె. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు రాజమౌళి రిలీజ్ చేసి, మాట్లాడుతూ– "ప్రపంచంలో 5 భాషల్లో 80 సినిమాలకు సంగీతం అందించిన ఏకైక మహిళా మ్యూజిక్ డైరెక్టర్ శ్రీలేఖ. తను ఎంతో సాధించినందుకు అభినందనలు" అన్నారు. ఎంఎం శ్రీలేఖ మాట్లా డుతూ– "రాజమౌళి అన్న చేతుల మీదగా నా వరల్డ్ మ్యూజిక్ టూర్ పోస్టర్ లాంచ్ కావడం ఆనందంగా ఉంది. ఆయన దర్శకత్వం వహించిన మొట్టమొదటి టెలీ సీరియల్ 'శాంతినివాసం'కి నేను సంగీతం అందించాను. రవి మెలోడీస్ బ్యానర్ ద్వారా ఇన్వెస్టర్ గ్రోవ్స్ సహకారంతో మిడిల్ ఈస్ట్ (ఖతార్) నుంచి మొదలయ్యే వరల్డ్ మ్యూజిక్ టూర్ 25 దేశాల్లో జరుగుతుంది. ఈ టూర్‌లో 25 మంది సింగర్స్ పాల్గొంటారు" అన్నారు.



• రితికా సింగ్

కిడ్నాపర్స్ చేతిలో...

'గురు' సినిమా ఫేమ్ రితికా సింగ్ ప్రధాన పాత్రలో నటించిన పాన్ ఇండియా చిత్రం 'ఇన్ కార్'. హర్షవర్ధన్ దర్శకత్వం వహించారు. ఇన్ బాక్స్ పిక్చర్స్‌పై అంజుమ్ ఖురేషి, సాజిద్ ఖురేషి నిర్మించిన ఈ చిత్రం మార్చి 3న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఆయా భాషల ట్రైలర్స్‌ని శుక్రవారం విడుదల చేశారు. "సర్వైవల్ క్రైమ్ థ్రిల్లర్ డ్రామా 'ఇన్ కార్'. వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందిన చిత్రమిది. కాలేజీకి వెళ్లే ఓ అమ్మాయిని గుర్తు తెలియని దుండగులు కిడ్నాప్ చేస్తారు. ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారం చేయాలనుకుంటారు. వారి బారి నుంచి తప్పించుకోవ డానికి ప్రయత్నించిన ఆమెను వారు తీవ్రంగా గాయపరుస్తారు. ఆ తర్వాత ఆమె పోరాటం చేసి, వారి నుంచి ఎలా తప్పించుకుంది? అనేది చిత్రకథ" అని యూనిట్ పేర్కొంది. సందీప్ గోయత్, మనీష్ ఝంజోలియా, జ్ఞాన్ ప్రకాష్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమెరా: మిథున్ గంగోపాధ్యాయ.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	317	61,003
నిఫ్టీ ▽	92	17,944

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,712	▽	144
డోజోన్స్	33,691	▽	5
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,004	▽	8
డాక్స్	15,482	△	52
షాంఘై	3,224	▽	25
నికాయ్	25,513	▽	183

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (24 క్యారెట్) 56,175	▽	253
బంగారం (22 క్యారెట్) 55,950	▽	252
వెండి (కేజీ) 64,500	▽	889

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.04	83.71
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	86.79	89.84
€	యూరో	ఒకటి	97.45	100.73
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	60.58	62.56
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.66	58.07
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.92	62.88
SAR	సౌదీ రియాల్	పది	21.09	22.77
UAE D	యూఏఈ దిర్హామ్	పది	21.65	23.45
¥	చైనా యువాన్	పది	10.92	12.99

గోద్రెజ్ ప్రాపర్టీస్ చేతికి రాజ్ కపూర్ భవంతి

రూ. 100 కోట్లకు కొనుగోలు



న్యూఢిల్లీ: ప్రఖ్యాత బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత దివంగత రాజ్‌కపూర్‌కి చెందిన భవంతిని గోద్రెజ్ ప్రాపర్టీస్ కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ. 100 కోట్లు వెచ్చించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రాజ్‌కపూర్ వారసుల నుంచి దీన్ని కొనుగోలు చేసినట్లు గోద్రెజ్ ప్రాపర్టీస్ వివరించింది. ముంబైలోని చెంబూర్‌లో ఉన్న ఈ ప్రాపర్టీని కంపెనీ లగ్జరీ హౌసింగ్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేయనుంది. భవంతికి సంబంధించిన స్థల పరిమాణం మొత్తం ఎకరం ఉంటుంది. ఎంతకు కొనుగోలు చేసినదీ వెల్లడించనప్పటికీ.. ఇందులో చేపట్టే ప్రాజెక్టు ద్వారా రూ. 500 కోట్ల ఆదాయం రాగలదని అంచనా వేస్తున్నట్లు గోద్రెజ్ ప్రాపర్టీస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పిరోజ్‌షా గోద్రెజ్ తెలిపారు. చెంబూర్‌లో ఎకరం స్థలం మార్కెట్ విలువ రూ. 100–110 కోట్లు ఉంటుందని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ చైర్మన్ అనుజ్ పురి చెప్పారు. 2019 మే నెలలో రాజ్‌కపూర్ కుటుంబం నుంచి ఆర్‌కే స్టూడియోస్‌ను కూడా గోద్రెజ్ ప్రాపర్టీస్ కొనుగోలు చేసింది. ఆ అనుబంధాన్ని కొనసాగిస్తూ కొనుగోలు చేసిన భవంతిని కూడా గోద్రెజ్ ప్రాపర్టీస్ దీన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దగలదని ఆశిస్తున్నట్లు రాజ్‌కపూర్ కుమారుడు రణ్‌ధీర్ కపూర్ తెలిపారు.

పీడబ్ల్యూసీలో 30,000 నియామకాలు



న్యూఢిల్లీ: రాబోయే కొన్నేళ్లలో భారత్‌లో సుమారు 30,000 మంది సిబ్బందిని తీసుకునే యోచనలో ఉన్నట్లు అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ పీడబ్ల్యూసీ చైర్మన్ బాబ్ మోరిట్జ్ తెలిపారు. ప్రస్తుతం తమ దగ్గర దాదాపు 31,000 మంది ఉద్యోగులు ఉన్నట్లు ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన పేర్కొన్నారు. మరోవైపు, భారత్‌పై అత్యంత ఆశావహంగా ఉన్నట్లు ష్నైడర్ ఎలక్ట్రిక్ చైర్మన్ జాన్–పాస్కల్ ట్రికోయిర్ తెలిపారు. ప్రస్తుతం అమెరికా, చైనా తర్వాత భారత్ తమకు అతి పెద్ద మార్కెట్‌గా ఉందని వివరించారు. స్వచ్ఛ ఇంధన రంగంలో పురోగమించేందుకు భారత్‌కు అపార అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు.

యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా దిగ్గజ సంస్థలకు సారథ్యం వహించే భారతీయుల సంఖ్య పెరుగుతోంది. తాజాగా మరో టెక్నాలజీ కంపెనీ సారథ్య బాధ్యతలను భారత సంతతికి చెందిన వ్యక్తి దక్కించుకున్నారు. వీడియో షేరింగ్ ప్లాట్‌ఫాం యూట్యూబ్‌కు సీఈవోగా నీల్ మోహన్ (47) నియమితులయ్యారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ చేసిన మోహన్.. 2008లో గూగుల్‌లో చేరారు. దాదాపు ఎనిమిదేళ్ల పాటు డిస్‌ప్లే, వీడియో అడ్వర్టైజింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వర్తించారు. 2015లో యూట్యూబ్ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. యూట్యూబ్ షార్ట్స్, మ్యూజిక్, సబ్‌స్క్రిప్షన్ సర్వీసులను తీర్చిదిద్దారు. గూగుల్‌లో చేరడానికి ముందు డబుల్‌క్లిక్ అనే సంస్థలో ఆరేళ్ల పాటు పని చేశారు. దాన్ని 2008లో గూగుల్ కొనుగోలు చేసింది.

దిగ్గజాలకు సారథ్యం వహిస్తున్న మనోళ్లు..

పేరు	కంపెనీ
సుందర్ పిచాయ్	గూగుల్, ఆల్ఫాబెట్
సత్య నాదెళ్ల	మైక్రోసాఫ్ట్
అరవింద్ కృష్ణ	ఐబీఎం గ్రూప్
శంతను నారాయణ్	అడోబ్
జయశ్రీ ఉల్లాల్	అరిస్టా నెట్‌వర్క్స్
జార్జ్ కురియన్	నెట్‌యాప్
రాజీవ్ సూరి	నోకియా
అజయ్‌పాల్ సింగ్ బంగా	మాస్టర్‌కార్డ్

త్వరలో ఎలక్ట్రిక్ వాహనాలకు బీమా పాలసీ

- జునో సీఈవో రాకేశ్ కౌల్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహనాల కోసం కూడా త్వరలోనే బీమా పాలసీని ప్రవేశపెట్టనున్నట్లు జునో జనరల్ ఇన్సూరెన్స్ (గతంలో ఎడెల్వీస్ జనరల్ ఇన్సూరెన్స్) సీఈవో రాకేశ్ కౌల్ తెలిపారు. ప్రస్తుతం రోడ్ సైడ్ అసిస్టెన్స్ వంటి అంశాలకు సంబంధించి అధ్యయనం చేస్తున్నట్లు ఆయన వివరించారు. త్వరలో మరికొన్ని హెల్త్ పాలసీలను కూడా ప్రవేశపెడుతున్నట్లు కౌల్ పేర్కొన్నారు. తమ వ్యాపారంలో దాదాపు 35 శాతం వాటా దక్షిణాది రాష్ట్రాల నుంచి ఉంటోందని ఆయన పేర్కొన్నారు. 30 లక్షల పైగా కస్టమర్లు, 1,000 పైచిలుకు కార్పొరేట్ క్లయింట్లు ఉన్నట్లు కౌల్ తెలిపారు.

వడ్డీ రేట్లు పెరిగినా.. ఇంటి కొనుగోలులో తగ్గేదేలే!

- మే నుంచి 2.5% పెరిగిన రెపో రేటు
- గృహ రుణ రేట్లూ పైపైకి..
- అయినా రూ.30–75 లక్షల శ్రేణిలో ఆగని కొనుగోళ్లు: ఐఎంజీసీ

న్యూఢిల్లీ: ఇళ్ల కొనుగోళ్ల విషయంలో 'వడ్డీరేట్ల' పెరుగుదల పెద్ద అడ్డంకిగా కనిపించడం లేదని రియల్టీ విశ్లేషకులు పేర్కొంటున్నారు. బ్యాంకులు వడ్డీరేట్లు పెంచినప్పటికీ, రూ.30–50 లక్షలు, రూ.50–75 లక్షల విభాగాల్లో ఇళ్ల రుణ డిమాండ్ పెరిగిందని ఇండియా మార్టిగేజ్ గ్యారంటీ కంపెనీ (ఐఎంజీసీ) తన తాజా నివేదికలో పేర్కొంది.

వడ్డీరేటు పెరుగుదల తీరిదీ..

కరోనా కాలంలో 4%గా ఉన్న రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు), 2022 మే 4న తొలిసారి 0.40% పెరిగింది. జూన్ 8, ఆగస్టు 5, సెప్టెంబర్ 30 తేదీల్లో 0.5% చొప్పున పెరుగుతూ, 5.9%కి చేరింది. డిసెంబర్ 7న ఈ రేటు 0.35% ఎగసి 6.25 శాతాన్ని తాకింది. వరుసగా ఆరవసారి పెంపుతో మే నుంచి 2.5% రెపో రేటు పెరిగినట్లయ్యింది. ఈ పెంపుతో ఈ రేటు 6.5%కి చేరింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అంతర్జాతీయంగా క్రూడ్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత దీనికి నేపథ్యం. దీనికి అనుగుణంగా బ్యాంకులు కూడా గృహ రుణ రేట్లను పెంచుతూ వచ్చాయి. వినియోగదారులు నెలవారీ చెల్లింపుల (ఈఎంఐ) భారమూ పెరిగింది. ఈ పరిణామాలపై ఐఎంజీసీ తాజా నివేదికను ఆవిష్కరించింది.

నివేదికలో ముఖ్యాంశాలు..

- తక్కువ రుణ అర్హత, అలాగే ఆకర్షణీయమైన లీజింగ్ (అద్దె) ఎంపిక విధానాల ఆవిర్భావం కారణంగా మిలీనియల్స్ (1981–1996 మధ్య జన్మించినవారు) గృహ కొనుగోలు నిర్ణయాలను ఎక్కువగా వాయిదా వేస్తున్నారు.
- రెపో రేట్ పెంపుదల భారం రుణ గ్రహీతలకు బదలాయించడం జరుగుతోంది. దీనివల్ల వినియోగదారుల నెలవారీ చెల్లింపుల (ఈఎంఐ) భారం 10 నుంచి 25 శాతం శ్రేణిలో గణనీయంగా పెరిగింది. వడ్డీరేట్లు వార్షికంగా ప్రస్తుతం 9 నుంచి 9.25 శాతం పెరిగాయి.
- ఉద్యోగ కోతల నేపథ్యంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో గత త్రైమాసికంలో మొండిబకాయిలు (ఎన్‌పీఏ) కొంత పెరిగాయి. సమస్య మరింత తీవ్రమైతే ఎన్‌పీఏలూ పెరగవచ్చు. ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్న వారు రుణ కాల వ్యవధిని పెంచుకోడానికి బ్యాంకర్‌తో చర్చించవచ్చు. ఈఎంఐల చెల్లింపునకు తమ పొదుపులనూ వినియోగించుకోవచ్చు. రుణ చెల్లింపుల వైఫల్యం జరక్కుండా సాధ్యమైనంతగా ప్రయత్నించాలి.



ఐఎంజీసీ కీలకపాత్ర...

ప్రైవేటు రంగంలో 2014లో ఐఎంజీసీ కార్యకలాపాలు ప్రారంభించింది. 2008లో జారీ అయిన తనఖా గ్యారెంటీ మార్గదర్శకాల ప్రకారం దీనిని ఆర్‌బీఐ నియంత్రిస్తుంది. ఈ కంపెనీ టాప్ 5 ఒరిజినేటర్స్‌సహా 17 బ్యాంకింగ్ భాగస్వాములతో పని చేస్తుంది. వీటిలో బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు, ఎన్‌బీఎఫ్‌సీలు ఉన్నాయి. బ్యాంకింగ్ దిగ్గజాలు ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎల్‌ఐసీ హౌసింగ్ వీటిలో ఉన్నాయి. ప్రత్యేకంగా గృహ రుణాలకు సంబంధించి క్రెడిట్ డిఫాల్ట్ బీమాను ఐఎంజీసీ అందిస్తుంది. క్లుప్తంగా చెప్పాలంటే, ఒక కస్టమర్ హోమ్ లోన్‌పై డిఫాల్ట్ అయినట్లయితే, ఐఎంజీసీ బ్యాంకుకు నష్టపరిహారం ఇస్తుంది. తద్వారా బ్యాంక్‌నష్టాలను తగ్గించడంలో సహాయపడుతుంది.

భారం తగ్గింపునకు ప్రయత్నం అవసరం

రుణ రేట్లు పెరిగిన ప్రస్తుత తరుణంలో రుణ గ్రహీతముందు ఇప్పుడు రెండు ఎంపికలు ఉన్నాయి. ఇందులో మొదటిది... క్రెడిట్ ప్రొఫైల్, రీపేమెంట్ చరిత్ర ప్రాతిపదికన సాధ్యమైన తక్కువకు వడ్డీని అమలుచేయించుకునేలా తమ రుణదాతతో చర్చించాలి. మీ బ్యాంకర్ అభ్యర్థనను పట్టించుకోకపోతే, తక్కువ, పోటీపూర్వక వడ్డీరేటును పొందేందుకు ఇతర బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇక రెండవ ఎంపిక విషయానికి వస్తే.. కస్టమర్లు తమ వార్షిక బోనస్‌లు, పొదుపుల నుంచి పాక్షిక ప్రీ–పేమెంట్లు చేయడం వల్ల అధిక రుణ భారం నుంచి ఊరట పొందవచ్చు. గృహ రుణాల ప్రీ–పేమెంట్లకుగాను తక్కువ వడ్డీరేట్లలో వేసిన స్థిర డిపాజిట్లను కూడా ఉపసంహరించుకోవచ్చు. వినియోగదారులు తమ కొనుగోలు నిర్ణయాలను వాయిదా వేసుకోవడం తగదు. ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా రాబోయే త్రైమాసికాల్లో మరింత రేట్లు పెరిగే అవకాశం ఉన్న విషయాన్ని గమనంలోకి తీసుకోవాలి. రుణ తిరిగి చెల్లించే సామర్థ్యం పరంగా భద్రతను పెంపొందించుకోడానికి తగిన మార్జిన్లను చేతిలో ఉంచుకోవాలి.



– అమిత్ దివాన్, ఐఎంజీసీ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్

గరిష్టాల వద్ద లాభాల స్వీకరణ

- తెరపైకి వడ్డీరేట్ల పెంపు భయాలు
- సెన్సెక్స్ నష్టం 317 పాయింట్లు
- 18వేల దిగువకు నిఫ్టీ



ముంబై: గరిష్ట స్థాయిల్లో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీల 3 రోజుల వరుస లాభాలకు విరామం పడింది. ప్రతికూల అంతర్జాతీయ సంకేతాలు, ద్రవ్యోల్బణ భయాలు, బాండ్లపై దిగుబడి, డాలర్ ఇండెక్స్ పెరుగుదల అంశాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. సూచీల మూడు రోజుల ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఉదయం సెన్సెక్స్ 326 పాయింట్ల నష్టంతో 60,994 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 60,811 – 61,303 మధ్య కదలాడింది. చివరికి 317 పాయింట్లు పతనమై 61,003 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 61 పాయింట్ల పతనంతో 17,975 వద్ద ప్రారంభమైంది. ట్రేడింగ్‌లో 17,885 – 18,034 శ్రేణిలో ఊగిసలాడింది. ఆఖరికి 92 పాయింట్లు క్షీణించి 17,950వేల స్థాయి దిగువన 17,944 వద్ద నిలిచింది. ఒక్క ఇంధన షేర్లు మినహా అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు జరిగాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.75%, స్మాల్‌క్యాప్ సూచీ 0.25 శాతం చొప్పున నష్టపోయాయి. ఫైనాన్స్, ఐటీ, ప్రభుత్వరంగ బ్యాంక్స్ షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి. సూచీలు అరశాతం నష్టంతో ఇన్వెస్టర్లకు రూ.1.4 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ 12 పైసలు నష్టపోయి 82.82 స్థాయి వద్ద స్థిరపడింది. ఫెడ్ వడ్డీరేట్ల పెంపు భయాలతో అమెరికా మార్కెట్లు గురువారం మూడువారాల్లో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి. ఫలితంగా ఆసియా, యూరప్ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

ఆంధ్రా సిమెంట్స్ వైజాగ్ స్థలం విక్రయం!

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆంధ్రా సిమెంట్స్‌కు చెందిన విశాఖపట్నం యూనిట్‌లో కార్యకలాపాలను కొనసాగించరాదని సాగర్ సిమెంట్స్ బోర్డు నిర్ణయించింది. నగర పరిధిలోకి ఈ యూనిట్ రావడమే కంపెనీ నిర్ణయానికి కారణం. విశాఖ యూనిట్ 107 ఎకరాల్లో విస్తరించింది. ఆంధ్రా సిమెంట్స్ వైజాగ్ యూనిట్ స్థలాన్ని విక్రయించే ప్రయత్నాలను చేస్తామని సాగర్ సిమెంట్స్ జేఎండీ శ్రీకాంత్ రెడ్డి ఇన్వెస్టర్లతో జరిగిన కాన్ఫరెన్స్ కాల్‌లో వెల్లడించారు. రుణ భారంతో ఉన్న ఆంధ్రా సిమెంట్స్ తాజాగా సాగర్ సిమెంట్స్ పరం అయిన సంగతి తెలిసిందే. డీల్ విలువ రూ.922 కోట్లు. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ అమరావతి బెంచ్ ఈ మేరకు ఆమోదం తెలిపింది. జేపీ గ్రూప్‌నకు చెందిన ఆంధ్రా సిమెంట్స్‌కు గుంటూరు జిల్లా దాచేపల్లిలో క్లింకర్, సిమెంట్ ప్లాంటు, విశాఖపట్నం వద్ద గ్రైండింగ్ యూనిట్ ఉంది.



తొలిసారి సెమీస్‌లో భారత్

ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు తొలిసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాన్ని ఖరారు చేసుకుంది. దుబాయ్‌లో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ 3–2తో హాంకాంగ్‌పై నెగ్గింది. 0–2తో వెనుకబడిన భారత్ ఆ తర్వాత వరుసగా మూడు మ్యాచ్‌ల్లో గెలుపొందడం విశేషం. నిర్ణాయక ఐదో మ్యాచ్‌గా జరిగిన మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం 21–13, 21–12తో ఎన్జీ సాజ్ వైయు–ఎన్జీ వింగ్ యుంగ్ జోడీపై నెగ్గి భారత్‌కు సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఇషాన్–తనీషా 24–26, 17–21తో లీ చున్ రెగినాడ్–ఎన్జీ సాజ్ వైయు చేతిలో... లక్ష్య సేన్ 22–20, 19–21, 18–21తో ఎన్జీ కా లాంగ్ అంగుస్ చేతిలో ఓడిపోయారు. మూడో మ్యాచ్‌లో ధ్రువ్ కపిల–చిరాగ్ శెట్టి జోడీ 20–22, 21–16, 21–11తో తాంగ్ చున్ మన్–యెంగ్ షింగ్ చోయ్ ద్వయంపై నెగ్గగా... నాలుగో మ్యాచ్‌లో పీవీ సింధు 16–21, 21–7, 21–9తో సలోని మెహతాను ఓడించడంతో భారత్ 2–2తో స్కోరును సమం చేసింది.

మార్చి 31 నుంచి ఐపీఎల్



న్యూఢిల్లీ: వచ్చే మూడు నెలలు భారత్‌లో 'లీగ్'ల సందడే సందడి! క్రికెట్ ప్రేక్షకులకు ప్రత్యేకించి టి20 ప్రియులకు కచ్చితంగా పండగే పండగ! వచ్చే నెల 4 నుంచి 26 వరకు మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) తొలి సీజన్‌కు రంగం సిద్ధమైంది. నాలుగు రోజుల వ్యవధిలోనే ఐపీఎల్ మొదలవుతుంది. మార్చి 31 నుంచి మే 28 వరకు పురుషుల మెగా ఈవెంట్ జరుగుతుంది. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను బీసీసీఐ శుక్రవారం విడుదల చేసింది. నాలుగుసార్లు చాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌ల మధ్య అహ్మదాబాద్‌లో జరిగే తొలి పోరుతో ఐపీఎల్–16 ప్రారంభం అవుతుంది. 12 వేదికల్లో పది ఫ్రాంచైజీల మధ్య 52 రోజుల పాటు ఈ టోర్నీ జరుగుతుంది. లీగ్ దశలో 70 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మే 21న బెంగళూరు, గుజరాత్‌ల మధ్య జరిగే పోరుతో లీగ్ దశ ముగుస్తుంది. ఇందులో 18 రోజులు (శని, ఆదివారాల్లో) రెండేసి మ్యాచ్‌లుంటాయి. ఒకే మ్యాచ్ ఉంటే రాత్రి 7.30 గంటలకు, రెండు మ్యాచ్‌లుంటే మధ్యాహ్నం 3.30 గంటలకు మ్యాచ్‌లు మొదలవుతాయి. ప్లే ఆఫ్, ఫైనల్ వేదికల వివరాలను త్వరలో ప్రకటిస్తారు. తుదిపోరు మే 28న జరుగనున్నప్పటికీ వేదిక ఇంకా ఖరారు చేయలేదు.

సౌరాష్ట్రకు ఆధిక్యం

కోల్‌కతా: బెంగాల్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్లో సౌరాష్ట్ర జట్టు 143 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోరు 81/2తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర రెండో రోజు ఆట ముగిసే సమయానికి 87 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 317 పరుగులు సాధించింది. హార్విక్ దేశాయ్ (50; 8 ఫోర్లు, 1 సిక్స్), షెల్డన్ జాక్సన్ (59; 10 ఫోర్లు), అర్పిత్ వసవాడ (81 బ్యాటింగ్; 11 ఫోర్లు), చిరాగ్ జానీ (57 బ్యాటింగ్; 10 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. 109 పరుగులకు 4 వికెట్లు కోల్పోయిన దశలో సౌరాష్ట్ర జట్టును షెల్డన్ జాక్సన్, అర్పిత్ ఐదో వికెట్‌కు 95 పరుగులు జోడించి ఆదుకున్నారు. జాక్సన్ అవుటయ్యాక అర్పిత్, చిరాగ్ జానీ ఆరో వికెట్‌కు అజేయంగా 113 పరుగులు జత చేశారు. బెంగాల్ బౌలర్లలో ముకేశ్, ఇషాన్ పోరెల్ రెండు వికెట్ల చొప్పున తీశారు.

ఆస్ట్రేలియా కాస్త మెరుగ్గా...

- తొలి ఇన్నింగ్స్‌లో 263 ఆలౌట్
- ఖాజా, హ్యాండ్స్‌కాంబ్ అర్ధ సెంచరీలు
- భారత్ 21/0
- బోర్డర్–గావస్కర్ ట్రోఫీ రెండో టెస్టు

న్యూఢిల్లీ: బోర్డర్–గావస్కర్ ట్రోఫీ రెండో టెస్టులోనూ మొదటి రోజు భారత్ ఆధిపత్యం ప్రదర్శించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా తమ తొలి ఇన్నింగ్స్‌లో 78.4 ఓవర్లలో 263 పరుగులకు ఆలౌటైంది. ఉస్మాన్ ఖాజా (125 బంతుల్లో 81; 12 ఫోర్లు, 1 సిక్స్), హ్యాండ్స్‌కాంబ్ (142 బంతుల్లో 72 నాటౌట్; 9 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. మొహమ్మద్ షమీ (4/60) ప్రత్యర్థిని పడగొట్టగా, అశ్విన్, జడేజా చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం ఎలాంటి ఇబ్బంది లేకుండా 9 ఓవర్లు ఎదుర్కొన్న భారత్ ఆట ముగిసే సమయానికి 21 పరుగులు చేసింది. రోహిత్ శర్మ (13 బ్యాటింగ్), రాహుల్ (4 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నా రు. మ్యాచ్ ప్రారంభానికి ముందు కెరీర్‌లో 100వ టెస్టు ఆడుతున్న భారత సీనియర్ క్రికెటర్ పుజారా ను దిగ్గజం సునీల్ గావస్కర్ సన్మానించారు.

స్మిత్ డకౌట్...

గత మ్యాచ్‌తో పోలిస్తే ఈసారి ఆస్ట్రేలియా ఓపెనర్లు తొలి గంట పాటు కాస్త ప్రతిఘటన కనబర్చగలిగారు. ఖాజా ఆత్మవిశ్వాసంతో ఆడగా, వార్నర్ (15; 3 ఫోర్లు)లో తడబాటు కొనసాగింది. 21వ బంతికి గానీ అతను తొలి పరుగు తీయలేకపోయాడు. ఈ క్రమంలో సిరాజ్ బౌలింగ్‌లో మోచేతికి, హెల్మెట్‌కు బంతి బలంగా తగలడంతో వార్నర్ తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. షమీ ఓవర్లో రెండు వరుస ఫోర్లు కొట్టిన వార్నర్ అతని తర్వాతి ఓవర్లోనే వెనుదిరిగాడు. మరోవైపు స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్వీప్ షాట్లతో పరుగులు రాబట్టిన ఖాజా 71 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఆసీస్‌కు అసలు దెబ్బ అశ్విన్ ఓవర్లో తగిలింది. 91/1తో మెరుగ్గా ఉన్న స్థితిలో లబుషేన్ (18)ను అశ్విన్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోగా... మరో రెండు బంతులకే భరత్ చక్కటి క్యాచ్‌తో స్మిత్ (0) డకౌట్ కావడం ఒక్కసారిగా కంగారూలు వెనక్కి తగ్గేలా చేసింది. రెన్‌షా స్థానంలో ఈ మ్యాచ్‌లోకి వచ్చిన ట్రవిస్ హెడ్ (12; 1 ఫోర్, 1 సిక్స్) కూడా ఎక్కువసేపు నిలవలేదు.

కీలక భాగస్వామ్యాలు...

ఆసీస్‌ను గట్టెక్కించే బాధ్యత ఖాజా, హ్యాండ్స్‌కాంబ్‌లపై పడింది. వీరిద్దరు క్రీజ్‌లో ఉన్నంతసేపు చకచకా పరుగులు జోడించారు. ముఖ్యంగా జడేజాను లక్ష్యంగా చేసుకొని వీరు పరుగులు రాబట్టారు. అయితే స్వీప్ షాట్లతోనే 29 పరుగులు సాధించిన ఖాజా చివరకు అదే షాట్‌కు వికెట్‌ను సమర్పించుకున్నాడు. క్యారీ (0) వెంటనే అవుట్ కాగా... ఈసారి ప్యాట్ కమిన్స్ (33; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించాడు. మరోవైపు 110 బంతుల్లో హ్యాండ్స్‌కాంబ్ అర్ధ సెంచరీ పూర్తయింది. ఆసీస్ జోరు పెంచుతున్న దశలో రవీంద్ర జడేజా ఒకే ఓవర్లో కమిన్స్, మర్ఫీ (0) వికెట్లతో దెబ్బ కొట్టాడు. చివరి రెండు వికెట్లు షమీ ఖాతాలోకి వెళ్లాయి.



షమీ

వార్నర్



13 భారత్ తరఫున 100 టెస్టులు ఆడిన 13వ క్రికెటర్‌గా పుజారా గుర్తింపు పొందాడు. గతంలో సచిన్, ద్రవిడ్, లక్ష్మణ్, అనిల్ కుంబ్లే, కపిల్‌దేవ్, సునీల్ గావస్కర్, వెంగ్ సర్కార్, గంగూలీ, కోహ్లి, ఇషాంత్ శర్మ, హర్భజన్, సెహ్వాగ్ ఈ ఘనత సాధించారు.

1 అంతర్జాతీయ టి20 ఫార్మాట్ మొదలయ్యాక ఒక్క అంతర్జాతీయ టి20 కూడా ఆడకుండానే 100 టెస్టులు పూర్తి చేసుకున్న తొలి క్రికెటర్ పుజారా.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: వార్నర్ (సి) భరత్ (బి) షమీ 15; ఖాజా (సి) రాహుల్ (బి) జడేజా 81; లబుషేన్ (ఎల్బీ) (బి) అశ్విన్ 18; స్మిత్ (సి) భరత్ (బి) అశ్విన్ 0; హెడ్ (సి) రాహుల్ (బి) షమీ 12; హ్యాండ్స్‌కాంబ్ (నాటౌట్) 72; క్యారీ (సి) కోహ్లి (బి) అశ్విన్ 0; కమిన్స్ (ఎల్బీ) (బి) జడేజా 33; మర్ఫీ (బి) జడేజా 0; లయన్ (బి) షమీ 10; కున్‌మన్ (బి) షమీ 6; ఎక్స్‌ట్రాలు 16; మొత్తం (78.4 ఓవర్లలో ఆలౌట్) 263. వికెట్ల పతనం: 1-50, 2-91, 3-91, 4-108, 5-167, 6-168, 7-227, 8-227, 9-246, 10-263. బౌలింగ్: షమీ 14.4-4-60-4, సిరాజ్ 10-2-30-0, అశ్విన్ 21-4-57-3, జడేజా 21-2-68-3, అక్షర్ 12-2-34-0. **భారత్ తొలి ఇన్నింగ్స్:** రోహిత్ (బ్యాటింగ్) 13, రాహుల్ (బ్యాటింగ్) 4; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (9 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 21. బౌలింగ్: కమిన్స్ 3-1-7-0, కున్‌మన్ 4-1-6-0, లయన్ 2-0-4-0.

చీఫ్ సెలక్టర్ చేతన్ శర్మ రాజీనామా



న్యూఢిల్లీ: ఓ టీవీ చానెల్ స్టింగ్ ఆపరేషన్‌లో అడ్డంగా బుక్కైన సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్ చేతన్ శర్మ తన పదవికి రాజీనామా చేశారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పాలసీకి విరుద్ధంగా వ్యవహరించిన ఆయనపై వేటు ఖాయమనుకుంటే... తాజాగా తనే వైదొలిగారు. 'చేతన్ రాజీనామా లేఖను బోర్డు కార్యదర్శి జైషాకు పంపారు. ఆయన ఆమోదించారు. స్టింగ్ ఆపరేషన్ ఉదంతం నేపథ్యంలో ఆయనే స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఆయన్ని తప్పుకోమని ఎవరూ కోరలేదు' అని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. ఆయన వైదొలగడంతో శివసుందర్ దాస్‌కు చీఫ్ సెలక్టర్ బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి. సెలక్షన్ కమిటీ సభ్యులతో కలిసి కోల్‌కతాలో రంజీ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించిన చేతన్ ఇరానీ కప్ కోసం జట్టును ఎంపిక చేయాల్సి ఉంది. అయితే రాజీనామా చేసిన వెంటనే ఆయన అక్కడి నుంచి నిష్క్రమించారు. మీడియాకు ముఖంచాటేసి ఢిల్లీకి బయల్దేరారు. 'జీ న్యూస్' చానెల్ జరిపిన స్టింగ్ ఆపరేషన్‌లో మాజీ పేసర్ చేతన్ శర్మ నోరు పారేసుకున్నారు. క్రికెటర్లు 80–85 శాతమే ఫిట్‌నెస్‌తో ఉంటారని, ఇంజెక్షన్ తీసుకొని 100 శాతం ఫిట్‌నెస్‌తో ఆటకు సిద్ధమవుతారని, బుమ్రా కూడా ఇదే చేస్తాడని నోటికొచ్చిందల్లా వాగారు. జట్టులో కోహ్లి, రోహిత్ శర్మల గ్రూప్‌లు ఉన్నాయని, కెప్టెన్సీ నుంచి తప్పుకునే విషయంలో కోహ్లి అబద్ధం చెప్పాడని చేతన్ శర్మ స్టింగ్ ఆపరేషన్‌లో పేర్కొన్నారు. చేతన్ తీవ్ర వ్యాఖ్యలు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.

నేడు ఇంగ్లండ్‌తో భారత్ కీలకపోరు

సాయంత్రం గం. 6:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



కెబెహ (దక్షిణాఫ్రికా): మహిళల టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో భారత్ కీలకపోరుకు సిద్ధమైంది. గ్రూప్–2లో భాగంగా తమ మూడో లీగ్ మ్యాచ్‌లో పటిష్టమైన ఇంగ్లండ్‌తో భారత్ తలపడనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలోని టీమిండియా ఈ మ్యాచ్‌లో గెలిస్తే సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంటుంది. ప్రస్తుతం గ్రూప్–2లో భారత్, ఇంగ్లండ్ తాము ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలుపొందాయి. ఇంగ్లండ్‌తో పోరులో నెగ్గాలంటే భారత అమ్మాయిలు సమష్టిగా రాణించాల్సిన అవసరం ఉంది. పాకిస్తాన్, వెస్టిండీస్‌తో మ్యాచ్‌ల్లో విజయం సాధించే క్రమంలో ఒత్తిడికిలోనైన భారత్ ఈ మ్యాచ్‌లో తడబడితే మాత్రం ప్రతికూల ఫలితం వచ్చే అవకాశముంటుంది.

సెమీస్‌లో బోపన్న జోడీ



రోటర్‌డామ్: ఏబీఎన్ ఆమ్రో ఓపెన్ ఏటీపీ– 500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)– మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–2, 6–1తో నాలుగో సీడ్ లాయిడ్ గ్లాస్‌పూల్ (బ్రిటన్)–హ్యారీ హిలియోవారా (ఫిన్‌లాండ్) జోడీపై సంచలన విజయం సాధించింది. 48 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో బోపన్న–ఎబ్డెన్ నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశారు. సెమీఫైనల్లో కెవిన్ క్రావిట్జ్–టిమ్ ప్యూయెట్జ్ (జర్మనీ)లతో బోపన్న–ఎబ్డెన్ తలపడతారు.

బ్లన్‌డెల్ సెంచరీ



మౌంట్ మాంగనుయ్: టామ్ బ్లన్‌డెల్ (138; 19 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించడంతో ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 82.5 ఓవర్లలో 306 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 37/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్‌ను డెవాన్ కాన్వే (77; 7 ఫోర్లు, 1 సిక్స్), బ్లన్‌డెల్ ఆదుకున్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో అండర్సన్ (3/36), ఓలీ రాబిన్సన్ (4/54) రాణించారు. 19 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకున్న ఇంగ్లండ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లకు 79 పరుగులు చేసింది. ప్రస్తుతం ఇంగ్లండ్ ఓవరాల్ ఆధిక్యం 98 పరుగులకు చేరుకుంది.

డ్యూటీ మీట్‌లో సత్తా చాటిన తెలంగాణ పోలీస్

డీజీపీ అంజనీకుమార్ హర్షం



సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసులు సత్తా చాటారు. ఈ నెల 13 నుంచి 17 వరకు మధ్య ప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించిన 66వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో నాలుగు విభాగాల్లో తెలంగాణ పోలీసులకు అవార్డులు దక్కాయి. రిటన్ టెస్ట్ విభాగంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ సీసీఎస్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎ.మన్మోహన్ కు బంగారు పతకం లభించింది. పోలీస్ వీడియోగ్రఫీ విభాగంలో సైబరాబాద్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఎ.అనిల్‌కుమార్‌కు రజతపతకం, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ విభాగంలో ఎస్ఐబీ (ఇంటెలిజెన్స్ విభాగంలో) ఎస్సైగా ఉన్న బి.వెంకటేశ్‌కు, ఇంటెలిజెన్స్ సీఐ సెల్‌లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న బి. విజయ్‌లకు వెండి పతకాలు లభించాయి. యాంటీ సబోటేజ్ చెకింగ్ (బాంబులను గుర్తించేది) విభాగంలో తెలంగాణ పోలీస్ శాఖకు మూడో స్థానం లభించింది. పోలీస్ డ్యూటీ మీట్‌లో రాష్ట్ర పోలీసులకు పతకాలు రావడంపై డీజీపీ అంజనీకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పతకాలు గెలిచిన అధికారులను ఆయన అభినందించారు.

ఏరోస్పేస్‌లో స్టార్టప్‌లకు ఊతం

టీ-హబ్, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ మధ్య ఒప్పందం

- ఏరోస్పేస్, డిఫెన్స్ స్టార్టప్‌లకు రెండేళ్ల పాటు సాయం
- ఈ రంగంలో ఏటా 13.1 వార్షిక వృద్ధిరేటుకు చాన్స్
- లాభాల నుంచి 2 శాతం నిధులు కేటాయించనున్న హెచ్ఏఎల్

సాక్షి, హైదరాబాద్: ఏరోస్పేస్ రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)తో కలిసి టీ-హబ్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ మేరకు ఇరు సంస్థల మధ్య శుక్రవారం పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. రెండేళ్లపాటు అమల్లో ఉండే ఈ ఒప్పందం ద్వారా వైమానిక, రక్షణ రంగాల మార్కెట్‌లో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టనున్నారు. స్టాటిస్టా సంస్థ నివేదిక ప్రకారం 2021 నుంచి 2027 మధ్య వైమానిక, రక్షణ రంగాల మార్కెట్ వార్షిక వృద్ధిరేటు (సీఏజీఆర్) 13.1శాతంగా ఉంటుందని అంచనా వేస్తున్న నేపథ్యంలో టీ-హబ్, హెచ్ఏఎల్ భాగస్వామ్యానికి ప్రాధాన్యత ఏర్పడింది. పెరుగుతున్న మార్కెట్ డిమాండ్‌ను అందుకునేదిశగా.. స్టార్టప్‌లకు అవసరమైన నైపుణ్యం, వనరులు, మార్కెట్‌తో అనుసంధానం, ఆవిష్కరణల కోసం అవసరమయ్యే సాయాన్ని టీహబ్, హెచ్ఏఎల్ సంయుక్తంగా సమకూరుస్తాయి. స్టార్టప్‌ల ఆవిష్కరణలకు రూపం ఇచ్చేందుకు ఏరోస్పేస్ రంగ నిపుణుల తోడ్పాటు ఇప్పించేందుకు హెచ్ఏఎల్ చర్యలు చేపడుతుంది. స్టార్టప్‌లకు అవసరమయ్యే మార్గదర్శనం, శిక్షణ, విజయం సాధించేందుకు అవసరమైన అన్ని వనరులను టీ-హబ్ సమకూరుస్తుంది.



ఒప్పంద పత్రాలను చూపిస్తున్న టీహబ్ సీఈవో ఎంఎస్‌రావు, హెచ్ఏఎల్ డైరెక్టర్ డీకే సునీల్

ఏరో స్పేస్ రంగంలో కొత్త అవకాశాలు: టీ-హబ్ సీఈఓ ఎంఎస్ఆర్

ఏరోస్పేస్ రంగంలో స్టార్టప్‌లకు కొత్త అవకాశాలు సృష్టించేందుకు హెచ్ఏఎల్‌తో తమ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని టీ-హబ్ సీఈఓ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. టీ-హబ్ వనరులు, హెచ్ఏఎల్ నైపుణ్యాల కలబోతతో స్టార్టప్‌ల ఆవిష్కరణలు కొత్త పుంతలు తొక్కుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్‌లో బలంగా ఉన్న ఆవిష్కరణల వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని స్టార్టప్‌లను సరైన దిశలో నడిపేందుకు టీ-హబ్‌తో తమ భాగస్వామ్యం మంచి ఉదాహరణగా నిలుస్తుందని హెచ్ఏఎల్ (ఇంజనీరింగ్, పరిశోధన అభివృద్ధి) డైరెక్టర్ డీకే సునీల్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఆత్మ నిర్భర్ ప్రణాళికలో భాగంగా పన్నులు పోగా మిగిలే హెచ్ఏఎల్ లాభాల్లో 2 శాతాన్ని సాంకేతిక రంగంలో పనిచేస్తున్న స్టార్టప్‌ల కోసం కేటాయిస్తున్నామని తెలిపారు. వివిధ రంగాలకు చెందిన సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకున్న టీ-హబ్ ఇప్పటికే అనేక విజయాలు సాధించిందని వివరించారు.

నకిలీ సర్టిఫికెట్లతో అధికారులుగా పదోన్నతులు

చీఫ్ సెక్రెటరీకి దయాకర్‌గౌడ్ లేఖ

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో నకిలీ సర్టిఫికెట్లతో పదోన్నతులు పొందిన అధికారులపై చర్యలు తీసుకోవాలని చీఫ్ సెక్రెటరీకి తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ ఫ్రంట్ చైర్మన్ చనగాని దయాకర్‌గౌడ్ లేఖరాశారు. శనివారం ఆయన ఓయూలో మాట్లాడుతూ అక్రమ మార్గాల్లో పదోన్నతులు పొందిన అధికారులపై ఐఏఎస్‌లతో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని చీఫ్ సెక్రెటరీని కోరారు. రాష్ట్ర అవతరణ అనంతరం 2014 నుంచి ప్రభుత్వ పెద్దల అండదండతో యూజీసీ అనుమతి లేని వర్సిటీల నుంచి అడ్డదారిలో డిగ్రీ పట్టాలు పొంది పదోన్నతులు పొందారని ధ్వజమెత్తారు. హెచ్ఎండీఏ, ఇరిగేషన్, ఆర్ ఎండ్ బీలో పని చేసే అధికారులకు అర్హతలు లేకున్నా.. నకిలీ సర్టిఫికెట్లతో పదోన్నతులు పొందుతున్నట్లు తెలిపారు. అందుకు లక్షలు చేతులు మారాయని ఆరోపించారు. హెచ్ఎండీఏలో ఇద్దరు డైరెక్టర్లు మన రాష్ట్రంలో చెల్లుబాటు కాని బయటి నుంచి తీసుకున్న దూరవిద్య నకిలీ సర్టిఫికెట్లతో పదోన్నతి పొందారని వెల్లడించారు.

'అణువేగ'ం.. ఆత్మనిర్భరం



రక్షణ, విమానయాన, ఆటోమొబైల్ రంగాల్లో స్వావలంబనే లక్ష్యంగా 'అణువేగ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్' సిద్ధం చేసిన అత్యాధునిక ఫ్యాక్టరీని రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జి.సతీశ్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఫ్యాక్టరీలోని సర్ఫేస్ మౌంట్ టెక్నాలజీ, పీసీబీ డిజైన్, ఫ్యాబ్రికేషన్ వ్యవస్థలు, కేబుల్ హార్నెస్ అసెంబ్లీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అణువేగ టెక్నాలజీస్ ప్రైవేట్‌లిమిటెడ్ వడ్లమాను వెంకటేశ్వర్లును అభినందిస్తూ.. ఆత్మనిర్భర భారత్ సాకారానికి ఇదో గట్టి నిదర్శనమని స్పష్టం చేశారు.

– సాక్షి, హైదరాబాద్

పోలీసు ఉద్యోగాల భర్తీలో గర్భిణులకు మరో అవకాశం

అండర్ టేకింగ్ గడువు ఈనెల 28 వరకు పొడిగించిన టీఎస్ఎల్‌పీఆర్‌బీ

సాక్షి, హైదరాబాద్: యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా దేహదారుఢ్య పరీక్షల నుంచి మినహాయింపు కోసం గర్భిణులు, బాలింతలు రాతపూర్వక అండర్ టేకింగ్ పత్రాన్ని సమర్పించే గడువును ఈనెల 28 వరకు పెంచారు. ఈ మేరకు టీఎస్ఎల్‌పీఆర్‌బీ చైర్మన్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మహిళా అభ్యర్థుల్లో గర్భిణులు, బాలింతలకు ఫిజికల్ ఈవెంట్స్‌కు హాజరుకాకుండానే నేరుగా తుది రాత పరీక్షకు హాజరయ్యే అవకాశం కల్పిస్తున్న విషయం తెలిసిందే. తుది రాత పరీక్ష ఫలితాలు వెల్లడైన నెల రోజుల్లోపు దేహదారుఢ్య పరీక్షలను పూర్తి చేస్తామని రాతపూర్వకంగా అండర్ టేకింగ్ ఇవ్వాల్సి ఉంటుందని బోర్డు నిర్ణయించింది. అయితే తొలుత నిర్ణయించిన ప్రకారం ఈ అండర్ టేకింగ్ ఇచ్చేందుకు గడువు జనవరి 31 వరకు మాత్రమే ఇచ్చింది. తుది గడువును ఈనెల 28కు పెంచుతూ తాజాగా నిర్ణయం తీసుకుంది. గర్భిణులు, ఇటీవలే డెలివరీ అయిన అభ్యర్థులకు ఒకసారి మినహాయింపుగా అవకాశం ఇవ్వాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ అవకాశం కల్పించినట్లు చైర్మన్ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, పార్ట్-2 దరఖాస్తును పూర్తి చేసిన అభ్యర్థులకే ఈ మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు. టీఎస్ఎల్‌పీఆర్బీ వెబ్‌సైట్‌లో సూచించిన ఫార్మాట్‌లోనే అండర్ టేకింగ్ పత్రాలను పంపాలని, అలాగే వైద్య ధ్రువీకరణ పత్రాలను జత చేసి లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయం ఇన్‌వర్డ్ సెక్షన్‌లో అందజేయాలని సూచించారు.

కొత్తగా నాలుగు కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శుక్రవారం 3,290 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో నలుగురు వైరస్ బారిన పడ్డారు. ఒక్కరోజులో కరోనా నుంచి ఐదుగురు కోలుకోగా, ప్రస్తుతం 30 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు వెల్లడించారు.

రూ.7 కోట్ల వజ్రాభరణాలతో కారు డ్రైవర్ పరారీ

అమీర్‌పేట: సేల్స్‌మెన్‌తో కలిసి డెలివరీ చేసేందుకు వచ్చిన కారు డ్రైవర్ రూ.7 కోట్లు విలువచేసే వజ్రాభరణాలతో పారిపోయాడు. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మధురానగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలిలా.. మాదాపూర్‌లోని మైహోమ్ భోజ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న రాధిక వజ్రాల ఆభరణాల వ్యాపారం చేస్తున్నారు. ఇదే అపార్ట్‌మెంట్‌లో ఉండే అనూష వజ్రాల ఆభరణాల కోసం ఆర్డర్ చేశారు. ఆభరణాలు ఇచ్చేందుకు అనూషకు ఫోన్ చేయగా తాను మధురానగర్‌లోని బంధువుల ఇంట్లో ఉన్నానని, అక్కడికే తెచ్చి ఇవ్వాలని చెప్పారు. ఆ మేరకు నగలను సేల్స్‌మెన్ అక్షయ్, డ్రైవర్ శ్రీనివాస్‌కు ఇచ్చి కారులో మధురానగర్‌కు పంపారు. సేల్స్‌మెన్ రూ.50 లక్షలు విలువ చేసే నగలు అనూషకు ఇచ్చి తిరిగి బయటకు వచ్చే సరికి కారుతో పాటు శ్రీనివాస్ కనిపించలేదు. ఫోన్ చేసినా ఎత్తక పోవడంతో రాధికకు సేల్స్‌మెన్ సమాచారం అందించాడు. ఫోర్డు కారులో మరో రూ.7 కోట్లు విలువ చేసే వజ్రాభరణాలు ఉన్నాయి. సదరు నగలు బంజారాహిల్స్‌లోని సిరిగిరి బంగారు నగల షాపులో ఇవ్వాల్సి ఉందన్నారు. రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, నగలతో పారిపోయిన శ్రీనివాస్ కోసం గాలిస్తున్నామని సీఐ సైదులు తెలిపారు.

ఎంసెట్ నోటిఫికేషన్ ఇవ్వొచ్చు

- డేటా రెడీ..ఇంటర్ బోర్డ్ స్పష్టీకరణ
- విద్యార్థుల డేటా రాలేదంటున్న ఉన్నత విద్యామండలి

సాక్షి, హైదరాబాద్:ఇంటర్ విద్యార్థుల సమగ్ర సమాచారం పంపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇంటర్ బోర్డ్ పరీక్షల విభాగం కంట్రోలర్ జయప్రదా భాయ్ తెలిపారు. ఎంసెట్ సమగ్ర నోటిఫికేషన్ ఇవ్వడానికి ఎలాంటి ఇబ్బంది లేదని ఆమె స్పష్టం చేశారు. మే 7 నుంచి ఎంసెట్ పరీక్షల నిర్వహణ తేదీలను ప్రకటించిన ఉన్నత విద్యా మండలి ఇప్పటి వరకూ దరఖాస్తు తేదీ, ఇతర వివరాలతో కూడిన సమగ్ర నోటిఫికేషన్‌ను మాత్రం ఇవ్వలేదు. ఇంటర్ సెకెండియర్ రాసే విద్యార్థులే ఎంసెట్ రాస్తారు. ఈ నేపథ్యంలో ప్రతీ సంత్సరం ఇంటర్ బోర్డ్ విద్యార్థుల డేటా, హాల్ టిక్కెట్ల వివరాలను ఎంసెట్ విభాగానికి పంపుతుంది. దీన్ని ఫీడ్ చేసిన తర్వాతే ఎంసెట్ వెబ్‌సైట్ పనిచేసేలా చేస్తారు. అయితే, ఇప్పటి వరకూ హాల్ టిక్కెట్ల వివరాలు రాలేదని, అందుకే నోటిఫికేషన్ జాప్యం అవుతోందని మండలి వర్గాలు చెబుతున్నాయి. దీన్ని బోర్డ్ వర్గాలు మాత్రం త్రోసిపుచ్చుతున్నాయి. ఇదిలా ఉంటే, ఇంటర్ బోర్డ్ హాల్ టిక్కెట్లు రాకపోయినా ఈ నెలాఖరులోగా ఎంసెట్ సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేస్తామని మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి తెలిపారు.

గజ వాహనంపై శ్రీశైల మల్లన్న



శ్రీశైలం టెంపుల్: ఇలకైలాసమైన శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు శుక్రవారం భ్రమరాంబ సమేతుడైన మల్లన్న గజ వాహనంపై విహరించాడు. తొలుత ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చారు. అనంతరం కళాకారుల కోలాహలం నడుమ గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. గజ వాహనంపై దర్శనమిచ్చిన స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించి కర్పూర నీరాజనాలు సమర్పించారు.మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజు శనివారం రాత్రి 7.00 గంటలకు ఆలయ ప్రాంగణంలో నంది వాహన సేవ, ఎదురుకోలు నిర్వహిస్తారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.